

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 330

SUNDAY Special | ఆదివారం 13-8-2023



'ఆసియా' విజేత భారత్

ఆసియా హాకీ చాంపియన్‌షిప్‌లో భారత్ నాలుగోసారి విజేతగా నిలిచింది. ఫైనల్లో మలేసియాపై 4-3 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఓటమి అంచుల్లో నుంచి గెలుపు వైపు దూసుకుపోయింది.

- వివరాలు 12లో



ఆడుతూ పాడుతూ..

నాలుగో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వెస్టిండీస్ 20 ఓవర్లలో 178 పరుగులు చేయగా.. భారత ఓపెనర్లు గిల్, యశస్వి చెలరేగి ఆడటంతో టీమిండియా 17 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

- వివరాలు 12లో


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విపక్షాలు పారిపోయాయి

అవిశ్వాస తీర్మానంపై చర్చ సమయంలో విపక్ష పార్టీలు లోక్‌సభ నుంచి పారిపోయాయని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు.

వివరాలు 6లో ▸



ఢిల్లీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

ఢిల్లీలో అధికారుల బదిలీలు, నియామకాలపై కేంద్రానికి అధికారాలు కట్టబెట్టిన ఢిల్లీ సర్వీసు బిల్లును రాష్ట్రపతి ముర్ము ఆమోదించారు.

వివరాలు 6లో ▸



కామెడీగా మార్చేస్తారా?

మణిపూర్ హింసాకాండపై చర్చను ప్రధాని మోదీ నవ్వులాటగా మార్చేశారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా అన్వరుల్

పాక్ నేషనల్ అసెంబ్లీ రద్దయినందున.. ఆపద్ధర్మ ప్రధానిగా బలూచిస్తాన్ ఆవామీ పార్టీకి చెందిన అన్వరుల్ హక్ ఎంపికయ్యారు.

వివరాలు 6లో ▸

అయ్యో.. ఆరేళ్లకే నూరేళ్లు!



- తిరుమల కొండపై బాలికను చంపేసిన వన్యమృగం
- అలిపిరి నడక మార్గంలో శుక్రవారం రాత్రి చిన్నారి లక్షిత అదృశ్యం
- లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం మృతదేహం లభ్యం
- ఘటనాస్థలిని పరిశీలించిన టీటీడీ చైర్మన్, ఈఓ
- చిన్నారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

3లో

రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు

ఇళ్ల స్థలాలపై నివేదిక ఇవ్వండి

- ముఖ్యమంత్రి ఆదేశం
- నివేదిక పరిశీలించిన తర్వాత సీఎం నిర్ణయం.. అధికారులతో సమీక్షలో సీఎస్ జవహర్‌రెడ్డి
- పట్టణాల్లో పబ్లిక్ హౌసింగ్ విధానంతో ఆక్రమణలను అరికట్టొచ్చు.. ఉద్యోగులకు మరింత పటిష్టంగా ఈహెచ్‌ఎస్
- గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకూ ఈహెచ్‌ఎస్ అమలుకు చర్యలు

2లో

'పాడి'లో మేలి మలుపు

ఎనిమిదిసార్లు పెరిగిన పాల సేకరణ ధరలు

- గేదె పాలు లీటర్‌కు గరిష్ఠంగా రూ.103.. ఆవు పాలు లీటర్ రూ.53.86
- 'జగనన్న పాల వెల్లువ'లో పాలు పోసే రైతులకు దక్కుతున్న ధర
- 31 నెలల్లో ఎనిమిదిసార్లు పాల సేకరణ ధరలు పెంచిన అమూల్
- అమూల్ పోటీతో మూడుసార్లు ప్రైవేటు డెయిరీలూ ధర పెంపు
- అయినా గేదె పాలకు రూ.80, ఆవు పాలకు రూ.36 మాత్రమే
- అమూల్ కేంద్రాలకు పాలు పోసే వారికి రికార్డు స్థాయిలో అదనపు ఆదాయం.. 3 జిల్లాలు, 400 గ్రామాలతో మొదలైన ఉద్యమం
- నేడు 18 జిల్లాలు, 3,691 గ్రామాలకు విస్తరణ
- మొత్తంగా గేదె పాలపై రూ.18.29, ఆవు పాలపై రూ.9.49 పెంపు
- 3.18 లక్షల మంది పాడి రైతులకు ఆర్థికంగా దన్ను

2లో



కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడిజాంలోని పాలకేంద్రంలో పాలు పోస్తున్న మహిళా పాడి రైతు

ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు గ్రామానికి చెందిన కరమూడి శైలజకు రెండు పాడి గేదెలున్నాయి. ఇది వరకు ప్రైవేట్ డెయిరీకి రోజూ పాలు పోసేది. ఫ్యాట్, ఎస్‌ఎన్‌ఎఫ్ (సాలిడ్స్ నాట్ ఫ్యాట్) శాతం ఎంత ఉన్నప్పటికీ లీటర్‌కు గరిష్ఠంగా రూ.80కి మించి చెల్లించే వారు కాదు. జగనన్న పాల వెల్లువ కేంద్రంలో రోజుకు 3 లీటర్ల పాలు పోస్తే ఎస్ఎన్ఎఫ్ 9 శాతం, ఫ్యాట్ 13 శాతం రావడంతో లీటర్‌కు రూ.103 చొప్పున చెల్లించారు. ఏకంగా లీటర్‌కు రూ.23 అదనంగా ఆదాయం వచ్చింది. ఈ లెక్కన రోజుకు రూ.69 చొప్పున నెలకు రూ.2,100 వరకు అదనంగా ఆదాయం వస్తుండడం పట్ల ఆమె ఆనందానికి అవధుల్లేవు.



కాకినాడ జిల్లా వేమవరానికి చెందిన యాదాల వరలక్ష్మికి రెండు ఆవులున్నాయి. ప్రైవేటు కేంద్రానికి ప్రతీ రోజూ పాలు పోసేది. ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ శాతం ఎంత ఉన్నా.. లీటర్‌కు గరిష్ఠంగా రూ.35కు మించి వచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఇటీవలే ప్రారంభించిన జగనన్న పాల కేంద్రంలో ఎస్ఎన్ఎఫ్ 9 శాతం, ఫ్యాట్ 6.6 శాతంతో తొలి రోజు 2.58 లీటర్ల పాలు పోస్తే లీటర్‌కు రూ.53.86 చొప్పున రూ.138.96 వచ్చింది. ఈమె రెండు పూటలా పాలు పోస్తోంది. ఈ లెక్కన రోజుకు 5 లీటర్లు పోస్తే.. రోజుకు అదనంగా రూ.94.30 చొప్పున నెలకు రూ.2,829 అదనపు ఆదాయం వస్తోందని ఆమె ఆనందంతో చెబుతోంది.



శ్రీవారి సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

తిరుమలలో శ్రీవారి ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుతున్న హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

- వివరాలు 5లో

ఐదుగురు పోలీసు అధికారులకు

కేంద్ర హోం మంత్రి పతకాలు

జాతీయస్థాయిలో 140 మందికి..



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు పోలీసు అధికారులు కేంద్ర హోం మంత్రి పతకానికి ఎంపికయ్యారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023 సంవత్సరానికి గాను అత్యుత్తమ నేర పరిశోధన చేసిన 140 మంది పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి పతకానికి ఎంపిక చేశారు. వీరిలో 22 మంది మహిళా పోలీసు అధికారులు ఉన్నారు. నేర పరిశోధనలో ఉన్నత వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పతకాలను 2018 నుంచి పోలీసు అధికారులకు కేంద్ర హోంశాఖ అందిస్తోంది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు, తెలంగాణ నుంచి ఐదుగురు పోలీసు అధికారులు ఎంపికవడం విశేషం. కాగా సీబీఐ నుంచి 15 మంది, ఎన్ఐఏ నుంచి 12 మంది ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి

మిగతా 14వ పేజీలో ▶

పోలీసుల మీదే దాడులు చేస్తే ఎలా?

వాళ్లు ప్రజల కోసం పనిచేస్తున్నారు: డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



రాజకీయ పార్టీలు తమ కేడర్‌ను నియంత్రించుకోవాలి

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, ఉద్రేకపరిచే స్టేట్‌మెంట్లు పెట్టొద్దు

10లో

వందకు పైగా


రైళ్ల రద్దు



- భువనేశ్వర్–మంచేశ్వర్, హరిదాస్‌పూర్–ధన్‌మండల్ సెక్షన్ పరిధిలలో మూడో లైన్ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న పనుల కోసం ఈ మార్గంలో ప్రయాణించే, విశాఖ మీదుగా రాకపోకలు సాగించే వందకు పైగా రైళ్లను ఈ నెల 14 నుంచి 30 మధ్య వివిధ రోజుల్లో రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

- వివరాలు 13లో

వలంటీర్లు దండుపాళ్యం బ్యాచ్!



- అసాంఘిక శక్తుల్లా తయారయ్యారు
- మళ్లీ నోరు పారేసుకున్న పవన్ కళ్యాణ్
- పెందుర్తిలో హత్యకు గురైన మహిళ కుటుంబానికి పరామర్శ

3లో

బోడిగుండుకు, మోకాలికి

పవన్ లంకె



- పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ విమర్శ

- వివరాలు 3లో

క్లుప్తంగా...

విశాఖ స్టీల్‌ప్లాంట్ స్లాగ్ ఈజిప్ట్‌కు ఎగుమతి



షిప్‌లో స్లాగ్ ఎగుమతి

ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన స్లాగ్‌ను ఈజిప్ట్ దేశానికి ఎగుమతి చేస్తున్నారు. బ్లాస్ట్‌ఫర్నేస్‌లో ఉత్పత్తికి అనుబంధంగా లభించే ఈ స్లాగ్‌ను సిమెంట్ పరిశ్రమలో వినియోగిస్తారు.ఈజిప్ట్ దేశంలో పోర్టు లాండ్ స్లాగ్ సిమెంట్ తయారీ కోసం స్టీల్ ప్లాంట్‌కు ఈ ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ ద్వారా 56 వేల టన్నులు ఎగుమతి చేయనున్నారు.

'ఏపీఈఆర్‌సీ' సభ్యుల ఎంపికకు కమిటీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులను ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెలక్షన్ కమిటీని నియమించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఆనందరెడ్డిని ఈ కమిటీకి చైర్మన్‌గా ఎంపిక చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) చైర్మన్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

విద్యా శాఖలో లైంగిక వేధింపుల నివారణకు కమిటీలు



సాక్షి, అమరావతి: పని ప్రదేశంలో మహిళా ఉద్యోగులు, విద్యార్థినుల రక్షణకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా లైంగిక వేధింపులపై తక్షణ చర్యలు తీసుకునేందుకు పాఠశాల స్థాయి నుంచి విద్యాశాఖ కమిషనరేట్ వరకు ఉన్న అన్ని స్థాయిల్లోనూ లైంగిక వేధింపుల పరిష్కార, ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాల్సిందిగా సీఎస్ఈ సురేష్‌కుమార్ ఆర్జేడీలు, డీఈవోలకు ఆదేశాలిచ్చారు. అన్ని స్థాయిల్లోను కమిటీలో ఒక పురుష ఉద్యోగి ఉంటాడు. విద్యాశాఖ కమిషనరేట్‌లో ఒక ఎన్జీవోతో పాటు ఐదుగురు సభ్యులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. సుప్రీంకోర్టు లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోష్) ప్రకారం అంతర్గత ఫిర్యాదు కమిటీలు అన్ని స్థాయిల్లోనూ ఉండాలని సురేష్‌కుమార్ ఆదేశించారు. ఆన్‌లైన్‌లో సైతం ఫిర్యాదులను సమర్పించేందుకు వీలుగా డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్నారు.

నైగర్‌లోని ప్రవాసాంధ్రుల కోసం హెల్ప్‌లైన్



సాక్షి, అమరావతి: సైన్యం తిరుగుబాటుతో ఆందోళనలు జరుగుతున్న పశ్చిమ ఆఫ్రికాలోని నైగర్ దేశంలో చిక్కుకున్న ప్రవాసాంధ్రుల కోసం ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ 24 గంటలు అందుబాటులో ఉండేలా హెల్ప్ లైన్ నంబర్లను ఏర్పాటు చేసింది. +91 8500027678, 0863 2340678లను అందుబాటులోకి తెచ్చింది. వీటితోపాటు భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన +227 99759975 నంబరును కూడా వినియోగించుకోవాలని సూచించింది.

ప్రభుత్వ బడుల్లో ఐబీ కరిక్యులమ్



సాక్షి, అమరావతి: పేదింటి పిల్లలను అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే దిశగా పాఠశాల విద్యాశాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటికే పలు ప్రభుత్వ స్కూళ్లలో సీబీఎస్ఈ విధానం అమలు చేస్తున్న అధికారులు.. ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ) విద్యావిధానం అమలు తీరుతెన్నులపై దృష్టి సారించింది. రెండు నెలల క్రితం జగనన్న ఆణిముత్యాలు సత్కార సభలో సీఎం జగన్.. ప్రభుత్వ బడుల్లో ఐబీ కరిక్యులమ్ ప్రవేశపెడతామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఐబీ మార్గదర్శకాలు, అమలు విధివిధానాలపై పాఠశాల విద్యాశాఖ కార్యాచరణ చేపట్టింది. తదనుగుణంగా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ నేతృత్వంలో అధికారుల బృందం శనివారం ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో ఐబీ విద్యాబోధన అందిస్తున్న పలు పాఠశాలలను పరిశీలించింది. పదో తరగతి, ఇంటర్ స్థాయిలో ఇంటర్నేషనల్ బాకలారియేట్(ఐబీ) లేదా కేంబ్రిడ్జి బోర్డు స్థాయిలో భాగస్వామ్యాన్ని, పాఠ్యాంశాలు, బోధనా పద్ధతి, మూల్యాంకన పద్ధతిని పరిశీలించారు.

ఆస్తి మీ హక్కు.. తనఖా పెట్టుకోవచ్చు

- బ్యాంకు రుణాలకూ పనికొచ్చేలా గ్రామీణ ఆస్తి సర్టిఫికెట్లు
- యాజమాన్య హక్కు పత్రాలను తాకట్టు పెట్టుకునేందుకు బ్యాంకర్ల సమాఖ్య సుముఖత
- వైఎస్సార్ జగనన్న భూ హక్కు–భూ రక్షలో యాజమాన్య హక్కు పత్రాలు
- గ్రామకంఠాల్లో ఇళ్లకూ తొలిసారి ఆస్తి సర్టిఫికెట్లు
- బ్యాంకులో ఆ సర్టిఫికెట్లు చెల్లుబాటు అయ్యేలా డిజైన్
- 11,150 గ్రామాల్లో ఇప్పటికే మొదలైన సర్వే
- 294 గ్రామాల్లో అన్ని దశల సర్వే పూర్తి
- ఆ గ్రామాల్లో ఇళ్లు, దొడ్లు, ఖాళీ స్థలాలకు హక్కు పత్రాలు రెడీ
- అక్టోబరు 2న సీఎంచే పంపిణీ చేయించాలని అధికారుల ఆలోచన
- 42 గ్రామాల్లో నమూనా హక్కు పత్రాలు యజమానులకు పంపిణీ



సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 లక్షలకు పైబడి విలువ చేసే ఇల్లు ఉండి కూడా పిల్లల పెద్ద చదువుల కోసమో, ఇంకే పెద్ద అవసరానికైనా ఆ ఇంటిని బ్యాంకులో తనఖా పెట్టి రుణం పొందే అవకాశం లేక ఇబ్బందులు పడే లక్షలాది మధ్య తరగతి ప్రజల కష్టాలు తీరబోతున్నాయి. వైఎస్సార్ జగనన్న భూ హక్కు – భూ రక్ష కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్ల యజమానులందరికీ వారి ఆస్తి యాజమాన్య హక్కు పత్రాల (ప్రాపర్టీ కార్డులు)ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తోంది. ఈ పత్రాలను బ్యాంకుల్లో తనఖా పెట్టుకోవడానికి బ్యాంకులను సైతం ప్రభుత్వం తాజాగా ఒప్పించింది. ఈ పత్రాల డిజైన్‌ను కూడా రుణాలు సులభంగా లభించేలా రూపొందించారు. ఈ హక్కు పత్రాలను అవసరమైన వారు నచ్చిన బ్యాంకులో తనఖా పెట్టుకొనేందుకు గతనెల 27న జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో రాష్ట్ర బ్యాంకర్ల సమాఖ్య ఆమోదం తెలిపింది. ఈ సమాచారాన్ని రాష్ట్ర బ్యాంకర్ల సమాఖ్య కోఆర్డినేటర్ నాలుగు రోజుల క్రితం రాష్ట్ర పరిధిలోని అన్ని బ్యాంకుల కంట్రోలింగ్ అథారిటీలకు, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు పంపారు.

అక్టోబరు 2న పండుగలా పంపిణీ

అక్టోబరు 2న గాంధీ జయంతి రోజున 300 – 350 గ్రామాల పరిధిలోని అన్ని ఇళ్లు, దొడ్లు, ఖాళీ స్థలాల వారీగా యజమానులకు హక్కు పత్రాల పంపిణీని పండుగలా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదగా వీటిని పంపిణీ చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నారు. ప్రాపర్టీ కార్డుల ముద్రణ టెండర్లకు కూడా ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో వారసత్వంగా వచ్చే ఈ ఇళ్లకు నిర్దిష్ట అధికారిక హక్కు పత్రాలు ఉండవు. అందువల్ల ప్రభుత్వం తాజాగా ఇచ్చే ప్రాపర్టీ కార్డులను తనఖా పెట్టుకునే సమయంలో ఆ ఆస్తి లింకు డాక్యుమెంట్ల కోసం ఒత్తిడి చేయవద్దని ఎస్ఎల్‌బీసీ కోరింది. సంబంధిత ఆస్తికి రిజిస్ట్రేషన్ శాఖ అధికారికంగా సూచించే మార్కెట్ విలువ ఆధారంగా తనఖా విలువ లెక్కగట్టుకోవచ్చని తెలిపింది.

తొలి దశలో లక్షన్నరకు పైగా హక్కు పత్రాలు

రాష్ట్రవ్యాప్తంగా 17,461 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామ కంఠాల పరిధిలోని ఇళ్లు, దొడ్లు, ఖాళీ స్థలాలన్నింటికీ వైఎస్సార్ జగనన్న భూ హక్కు– భూ రక్ష కార్యక్రమంతో ప్రభుత్వం యాజమాన్య హక్కు పత్రాలు ఇస్తోంది. దాదాపు 11,150 గ్రామాల పరిధిలోని గ్రామ కంఠాల ఇళ్ల సర్వే కూడా చేపట్టింది. 294 గ్రామాల్లో సర్వే దాదాపు పూర్తయింది. ఒక్కో ఆస్తికి (ఇల్లు లేదా దొడ్డి లేదా ఖాళీ స్థలం వారీగా) యాజమాన్య హక్కు పత్రాల నిర్ధారణ చేసే ఫైనల్ ఆర్‌వోఆర్ నోటిఫికేషన్ జారీ కూడా పూర్తయినట్టు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తెలిపారు. వీటిలో 262 గ్రామాల్లో శుక్రవారం నాటికి 1,22,943 ప్రాపర్టీ కార్డులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మిగిలిన 32 గ్రామాల్లో హక్కు పత్రాలు కూడా త్వరలో సిద్ధమవుతాయని వెల్లడించారు. మొత్తంగా 294 గ్రామాల్లో లక్షన్నర వరకు ప్రాపర్టీ కార్డులు సిద్ధమైనట్లేనని తెలిపారు. వీటిలో 42 గ్రామాల్లో యజమాన్య హక్కు పత్రం నమూనా కాపీని సంబంధిత యజమానులకు ఇప్పటికే అందజేసినట్టు చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఇళ్ల స్థలాలపై నివేదిక ఇవ్వండి

- ముఖ్యమంత్రి ఆదేశం • నివేదిక పరిశీలించిన తర్వాత సీఎం నిర్ణయం
- అధికారులతో సమీక్షలో సీఎస్ జవహర్‌రెడ్డి
- పట్టణాల్లో పబ్లిక్ హౌసింగ్ విధానంతో ఆక్రమణలను అరికట్టొచ్చు
- ఉద్యోగులకు మరింత పటిష్టంగా ఈహెచ్ఎస్
- గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకూ ఈహెచ్ఎస్ అమలుకు చర్యలు
- మెడికల్ రీయింబర్స్‌మెంట్ మరో ఏడాది పొడిగింపు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఇళ్ల స్థలాల విషయంలో పదిరోజుల్లోగా నివేదిక ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇల్లు ఉన్నవారెవరు? లేనివారెవరు? పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా సీఎం ఆదేశించారని, నివేదిక అందిన తర్వాత పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. ఈ అంశంపై విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. వివిధ ఉద్యోగ సంఘాల హౌసింగ్ సొసైటీల వారీగా ఇళ్ల స్థలాలకు ఎంతమేర భూమి అవసరమో పరిశీలించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ జి. సాయిప్రసాద్‌కు సూచించారు. దీనిపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి ఒక నివేదిక సమర్పించాలన్నారు.

పబ్లిక్ హౌసింగ్‌పైనా దృష్టి..

దీంతోపాటు పట్టణ ప్రాంతాల్లో పబ్లిక్ హౌసింగ్ విధానాన్ని తీసుకొచ్చే అంశంపైనా దృష్టిసారించాలని సీఎస్ చెప్పారు. ఇక్కడ ఇళ్లు లేనివారు, ఇళ్లున్నా రోడ్లు, ఫుట్‌పాత్‌లు, కాలువలు, డ్రెయిన్లు వంటి వివిధ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని చిన్నచిన్న గుడిసెలు, గుడారాలు వంటివి ఏర్పాటుచేసుకుని జీవనం సాగించే వారిని కట్టడిచేసి వారికి ప్రభుత్వమే పబ్లిక్ హౌసింగ్ విధానంలో నిర్మించిన ఇళ్లలో నివసించేలా చేయవచ్చని తెలిపారు. దీంతో పట్టణాలను మరింత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దవచ్చన్నారు. దీనిపై అన్ని పట్టణాల్లో పరిశీలించి సీఎం సమావేశం నాటికి ఒక నివేదికను సిద్ధంచేయాలని సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. జి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ.. ఉద్యోగుల ఇళ్ల స్థలాలపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మాట్లాడి నివేదిక సమర్పిస్తానన్నారు.

'సచివాలయ' ఉద్యోగులకు ఈహెచ్ఎస్..

మరోవైపు.. రాష్ట్రంలో ఉద్యోగులకు అమలుచేస్తున్న ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్ఎస్) మరింత పారదర్శకంగా, పటిష్టంగా అమలుచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జవహర్‌రెడ్డి స్పష్టంచేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంపైనా ఆయన వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ.. ఈహెచ్ఎస్ అమలుకు సంబంధించి వివిధ ఉద్యోగ సంఘాల నుండి వచ్చిన ప్రతిపాదనల అమలుకు చర్యలు తీసుకున్నామని మరికొన్నింటిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఈహెచ్ఎస్ అమలుకు చర్యలు తీసుకున్నామన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకాన్ని మరో ఏడాదికి పొడిగించామని సీఎస్‌కు వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగులకూ దీనిని వర్తింపజేస్తామన్నారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి అందరికీ ఈహెచ్ఎస్ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటామని కృష్ణబాబు చెప్పారు.

'పాడి'కి మేలి మలుపు

- గేదె పాలకు లీటర్ గరిష్టంగా రూ.103
- ఆవు పాలు లీటర్ రూ.53.86
- 'జగనన్న పాల వెల్లువ'లో పాలు పోసే రైతులకు దక్కుతున్న ధర

'అన్నా.. ఇది పాల బాటిల్.. నీళ్ల బాటిల్ కంటే తక్కువ ఖరీదు.. నీళ్ల కంటే పాలే చవకగా దొరుకుతున్నాయి. ఇలాగైతే ఎలా బతికేదన్నా.. అని పాడి రైతులు నాతో చెప్పకుని బాధపడ్డారు. మనందరి ప్రభుత్వం రాగానే ఈ పరిస్థితిని కచ్చితంగా మారుస్తాం' అని నాడు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు చెప్పిన మాటలివి. ఆ మాట మేరకు అక్షరాలా పరిస్థితిని మార్చేశారనేందుకు ఇప్పుడు ఊరూరా కళకళలాడుతున్న జేపీవీ కేంద్రాలే నిదర్శనం.

పంపాన వరప్రసాదరావు, సాక్షి, అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది పాడి రైతులు నేడు జగనన్న పాల వెల్లువ (జేపీవీ) పథకం కింద పాలు పోస్తూ కోట్లాది రూపాయలు అదనంగా లబ్ధి పొందుతున్నారు. ప్రైవేటు డెయిరీలు, వ్యాపారులు, దళారీలు వారిస్తున్నా, ఒత్తిళ్లు తీసుకొస్తున్నా.. తాము మాత్రం జగనన్న కేంద్రంలోనే పాలు పోస్తామంటూ ముందుకొస్తున్నారు. పాలవెల్లువ పథకం ఇటీవలే ప్రారంభమైన కాకినాడ జిల్లానే తీసుకుంటే.. హెరిటేజ్, వల్లభ, శ్రీ చక్ర, తిరుమల, జెర్సీ, దొడ్ల, విశాఖ డెయిరీలు పాలు సేకరిస్తుంటాయి. ఇప్పటి వరకు ఇవి గేదె పాలకు లీటర్‌కు **గరిష్టంగా** రూ.80, ఆవు పాలకు రూ.35కు **మించి** ఇస్తున్న దాఖలాలు లేవు. అలాంటి**ది** పాల వెల్లువ పథకం ద్వారా నేడు రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో గేదె పాల**కు** లీటర్‌కు రూ.103, ఆవు పాల**కు** రూ.53.86 చొప్పున ధర లభిస్తోంది. **ఇం**త మార్పు వస్తుందని ఊహించలేదని **తుని,** పిఠాపురం, ప్రత్తిపాడు మండలాల్లోని పాడి రైతులు చెబుతున్నారు. ప్రైవేటు కేంద్రాల కంటే కనీసం లీటర్‌కు రూ.10–30 వరకు అదనంగా వస్తుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు డెయిరీల వల్ల ఏళ్ల తరబడి తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక నుంచి జేపీవీ కేంద్రానికే పాలు పోస్తామని స్పష్టం చేస్తున్నారు.

పక్కాగా వెన్న, ఎస్ఎన్ఎఫ్ శాతం

పాలల్లో వెన్న, ఎస్ఎన్ఎఫ్ (ఘన పదార్థాలు) శాతం ఎంత ఉందో లెక్కించేందుకు ప్రైవేట్ డెయిరీలు ఒక శాస్త్రీయ పద్ధతి అంటూ పాటించే వారు కాదు. పాడి రైతుల్లో నూటికి 90 శాతం పెద్దగా చదువుకోని వారే. వారు కేంద్రానికి పాలు తీసుకురాగానే, వాటిని పూర్తిగా మిక్స్ చేయకుండా, ఎస్ఎన్ఎఫ్ శాతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మొక్కుబడిగా ఫ్యాట్ శాతాన్ని లెక్కించి ధర **నిర్ణయించి ఖాతా పుస్తకాల్లో రాసుకునే** వారు. అడిగితే ఓ కాగితం ముక్క మీద రాసిచ్చేవారు. దాణా, ఇతర అవసరాల కోసం తీసుకున్న అప్పును మినహాయించుకొని మిగిలిన మొత్తాన్ని 15 రోజులకో, నెలకో ఇచ్చేవారు. పాలు ఎక్కువ పోసే వారికి ఒక ధర, తక్కువ పోసే వారికి మరో ధర, సీజన్‌లో ఓ ధర.. అన్ సీజన్‌లో మరో ధర ఉండేది. కొందరు కొలతల్లోనూ మోసానికి పాల్పడే వారు. 'జగనన్న పాల వెల్లువ' మొదలైన తర్వాత ఈ పరిస్థితిలో స్పష్టమైన మార్పు వచ్చింది. అమూల్ రాకతో ప్రైవేటు డెయిరీల అడ్డగోలు దోపిడీకి కొంతమేర కళ్లెం పడింది. రైతుకు పాల ధర పెరగడమే కాదు.. పాలల్లో నాణ్యత, చెల్లింపుల్లో పారదర్శకత పెరిగింది. ప్రైవేటు కేంద్రాల్లో టెస్టింగ్ మిషన్ ఒకటే ఉంటుంది. అదే జేపీవీ కేంద్రంలో మాత్రం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ మిల్క్ ఎనలైజర్ (వెన్న, ఎస్ఎన్ఎఫ్ శాతం, ప్రొటీన్, వాటర్ శాతాన్ని లెక్కించేందుకు), స్టిరర్ (పాలు మిక్స్ చేయడానికి) సాఫ్ట్‌వేర్ సిస్టమ్ ద్వారా పాల సేకరణ జరిగేందుకు వీలుగా ప్రత్యేకంగా కంప్యూటర్, ప్రింటర్, వేయింగ్ స్కేల్ వంటి పరికరాలను ఏర్పాటు చేశారు. కేంద్రానికి పాలు రాగానే మిక్స్ చేసిన పాలను స్టిరర్‌పై పెట్టి, ఆ శాంపిల్‌ను మళ్లీ ఎనలైజర్‌లో ఉంచి వెన్న, ఘన పదార్థాల శాతాన్ని ఖచ్చితంగా లెక్కించి.. తూకం వేసి తీసుకొని ధరను నిర్ధారిస్తారు. వెన్న శాతం లెక్కింపు లేదా ధర నిర్ణయంలో ఎలాంటి దళారీ, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.



కాకినాడ జిల్లా విరవాడ-1లోని జగనన్న పాలవెల్లువ కేంద్రంలో పాలు పోస్తున్న మహిళారైతులు

అమూల్‌కు, హెరిటేజ్‌కు మధ్య ఎంత తేడా!

2020 డిసెంబర్‌లో 3 జిల్లాలతో ప్రారంభమైన జేపీవీ పథకం నేడు 18 జిల్లాలకు విస్తరించింది. 400 గ్రామాలలో 14,845 మందితో మొదలైన ఈ ఉద్యమం నేడు 3,691 గ్రామాలకు విస్తరించగా, 3.18 లక్షల మంది భాగస్వాములయ్యారు. 31 నెలల్లో 9.58 కోట్ల లీటర్ల పాలు సేకరించారు. ప్రస్తుతం 85 వేల మంది పాడి రైతులు ప్రతి రోజూ 1.86 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారు. 2020 అక్టోబర్ వరకు 11 శాతం వెన్న, 9 శాతం ఎస్ఎన్ఎఫ్‌తో లీటర్‌కు హెరిటేజ్ కంపెనీ గేదె పాలకు రూ.58.43, ఆవు పాలకు రూ.31.58 చెల్లించింది. సంగం డెయిరీ గేదె పాలకు రూ.58.90, ఆవు పాలకు రూ.32.87 చొప్పున చెల్లించేవారు. అమూల్ ప్రారంభంలోనే లీటర్ గేదె పాలకు 11 శాతం వెన్న, 9 శాతం ఎస్ఎన్ఎఫ్‌తో రూ.71.47, ఆవు పాలకు 5.4 శాతం వెన్న, 8.7 శాతం ఎస్ఎన్ఎఫ్‌తో రూ.34.20 చొప్పున చెల్లించారు. ఆ తర్వాత గడిచిన 31 నెలల్లో అమూల్ ఎనిమిదిసార్లు పాల సేకరణ ధరలు పెంచగా, ప్రైవేటు డెయిరీలు కేవలం మూడు సార్లు మాత్రమే పెంచాయి. హెరిటేజ్ ప్రస్తుతం గేదె పాలకు లీటర్ రూ.77కు పెంచామని చెబుతున్నప్పటికీ, రైతులకు వివిధ కారణాలు చెబుతూ వాస్తవంగా చెల్లిస్తున్నది రూ.66.50 మాత్రమే. అదే సంగం డెయిరీ లీటర్‌కు రూ.80.30కు పెంచామని చెబుతున్నా, వాస్తవంగా రైతులకు చెల్లిస్తున్నది మాత్రం రూ.69.35 మాత్రమే. అమూల్ మాత్రం ఖచ్చితంగా 11 శాతం ఫ్యాట్, 9 శాతం ఎస్ఎన్ఎఫ్‌తో గేదె పాలకు లీటర్‌కు రూ.89.76, ఆవు పాలకు రూ.43.69 చొప్పున చెల్లిస్తోంది. ప్రైవేటు డెయిరీలు గరిష్టంగా గేదె పాలకు 11 శాతం, ఆవు పాలకు 5 శాతం ఫ్యాట్‌కు లాక్ చేసి ఆ తర్వాత ఎంత ఫ్యాట్ ఉన్నా సరే 11 శాతం కిందే పరిగణించి సొమ్ములు చెల్లిస్తున్నాయి. అమూల్ మాత్రం ఎలాంటి లాక్ సిస్టమ్ లేకుండా పాలల్లో ఉండే ఫ్యాట్ శాతం లెక్కగట్టి అణాపైసలతో సహా చెల్లిస్తోంది. ఫలితంగా గేదె పాలకు గరిష్ట ధర 103, ఆవు పాలకు రూ.53.86 ధర రైతులకు లభిస్తోంది.

అమూల్ 8సార్లు ధరల పెంపు ఇలా

తేదీ	గేదె పాలు	ఆవు పాలు
	(లీ.రూ.ల్లో)	
20-11-20	71.47	34.20
01-09-21	74.78	35.78
01-05-22	79.20	37.90
01-11-22	82.50	39.48
16-12-22	84.51	40.73
11-02-23	85.80	42.56
21-05-23	88.00	43.69
15-06-23	89.76	43.69

పాడి రైతులకు అన్ని విధాలా భరోసా

గతంలో కనీస నాణ్యత లేని దాణా (16 శాతం ప్రొటీన్)ను కేవలం ఎనిమిది నెలలు మాత్రమే రైతులకు సరఫరా చేసే వారు. అమూల్ మాత్రం 20–22 శాతం ప్రొటీన్ కల్గిన దాణా 50 కేజీల బస్తా రూ.1100 చొప్పున ఏడాది పాటు ఇస్తోంది. పైగా ఏడాదిలో కనీసం 180 రోజులు పాలు పోసే ఆదర్శ రైతులకు లీటర్‌కు 50 పైసల చొప్పున ఇన్సెంటివ్ వారి ఖాతాల్లో జమ చేస్తోంది. వార్షిక ఆదాయాన్ని బట్టి ఏటా లీటర్‌కు 5 శాతం చొప్పున బోనస్ చెల్లిస్తోంది. పాడి రైతులకే కాకుండా సొసైటీల నిర్వహణ ఖర్చు కింద లీటర్‌కు రూపాయి చొప్పున చెల్లిస్తోంది. హెరిటేజ్, సంగం లాంటి ప్రైవేటు డెయిరీలు ఏజెంట్లకు కమిషన్ ఇస్తాయే తప్ప పాలుపోసే రైతులకు ఎలాంటి ఇన్సెంటివ్ ఇవ్వవు. మరొక పక్క గేదెలపై రూ.30 వేలు, ఆవులపై రూ.25 వేలు చొప్పున వర్కింగ్ క్యాపిటల్‌గా అందిస్తోన్న ప్రభుత్వం.. కొత్త పాడి పశువుల కొనుగోలుకు గేదెకు రూ.93 వేలు, ఆవుకు రూ.76 వేలు చొప్పున రుణాలందిస్తోంది. ఇలా ఇప్పటి వరకు 321 పాడి రైతులకు గేదెల కొనుగోలుకు రూ.3.69 కోట్ల రుణాలిచ్చింది. వర్కింగ్ క్యాపిటల్ కింద 7,517 మందికి రూ.36.61 కోట్ల ఆర్థిక చేయూతనిచ్చింది.

ప్రైవేట్ డెయిరీలకు పాలు పోసే వారికీ రూ.4,283 కోట్ల లబ్ధి

కల్తీకి అడ్డుకట్ట వేసి, నాణ్యత పెంచేందుకు ఎస్ఎన్ఎఫ్ కనీసం 8.7 శాతం ఉంటేనే గేదె పాలు, 8.5 శాతం ఉంటేనే ఆవుపాలు కొనుగోలు చేస్తామన్న నిబంధన అమూల్ పెట్టడంతో విధిలేని పరిస్థితుల్లో హెరిటేజ్, సంగం వంటి ప్రైవేటు డెయిరీలు సైతం ఎస్ఎన్ఎఫ్ శాతాన్ని పెంచి 2021 మార్చి నుంచి పాల సేకరణకు శ్రీకారం చుట్టాయి. 'ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్' వంటి ఆధునిక యంత్ర పరికరాలను ప్రభుత్వం సొసైటీలకు అందించడంతో కొన్ని ప్రైవేటు డెయిరీలు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జేపీవి అమలు కాని ప్రాంతాల్లో ప్రైవేటు డెయిరీలకు పాలు పోసే రైతులకు ఆదాయం పెరిగింది. ఫలితంగా రూ.4,283 కోట్ల మేర రాష్ట్ర వ్యాప్తంగా పాడి రైతులు లబ్ధి పొందారు.

పాడి రైతులకు దక్కుతున్న ధరలిలా (గేదె పాలకు లీటర్‌కు రూపాయల్లో)

	అమూల్ రాక ముందు		ప్రస్తుతం	
డెయిరీ	ప్రకటించిన ధర	చెల్లించిన ధర	ప్రకటించిన ధర	చెల్లిస్తున్న ధర
హెరిటేజ్	67.65	58.43	77.00	66.50
సంగం	68.20	58.90	80.30	69.35
కృష్ణ మిల్క్ యూనియన్	71.94	62.13	80.30	69.50
శ్రీజ	71.50	61.75	80.30	69.35
విశాఖ	72.60	62.70	79.20	68.40
అమూల్	---	---	89.76	89.76

పాడి రైతులకు దక్కుతున్న ధరలిలా (ఆవు పాలకు లీటర్‌కు రూపాయల్లో)

హెరిటేజ్	32.68	31.58	32.98	31.96
సంగం	33.37	31.96	35.58	34.05
కృష్ణ మిల్క్ యూనియన్	32.68	32.20	35.17	33.65
శ్రీజ	31.98	31.27	37.53	35.91
విశాఖ	33.37	32.87	37.88	36.18
అమూల్	---	---	43.69	43.69

అదనపు ఆదాయం నిజం



మా ఊళ్లో ఏర్పాటు చేసిన జగనన్న పాల వెల్లువ కేంద్రంలో శుక్రవారం 1.32 లీటర్ల పాలు పోశాను. వెన్న 14 శాతం, ఎస్ఎన్ఎఫ్ 10.1 శాతం ఉందని లెక్కించారు. ఆ మేరకు **లీటర్‌కు రూ.97.92** చొప్పున రూ.129.25 చెల్లించారు. అదే ప్రైవేటు డెయిరీకి పోస్తే రూ.80కి మించి వచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఇక్కడ పాలు పోయడం వల్ల రూ.30కి పైగా అదనంగా ఆదాయం వచ్చింది.

– కాళ్ల మంగ, చిత్రాడ–2, కాకినాడ జిల్లా

నెలకు రూ.3,600 అదనపు ఆదాయం



మాకు మూడు గేదెలున్నాయి. ప్రైవేటు కేంద్రానికి రోజుకు 6–8 లీటర్ల పాలు పోసేవాళ్లం. ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ శాతం ఎంత ఉన్నా లీటర్‌కు రూ.70–80 మధ్య వచ్చేది. మా గ్రామంలో ఏర్పాటు చేసిన జేపీవి కేంద్రంలో ఎస్ఎన్ఎఫ్ 9.2 శాతం, ఫ్యాట్ 12.3 శాతంతో పాలు పోస్తే లీటర్‌కు **ఏకంగా రూ.97.92** వచ్చింది. లీటర్‌పై సగటున రూ.20కి పైగా అదనంగా వచ్చింది. ఈ లెక్కన ఐదు లీటర్లకు రూ.120 చొప్పున నెలకు రూ.3,600కు పైగా అదనపు ఆదాయం వచ్చే పరిస్థితి కన్పిస్తోంది. ప్రైవేటు డెయిరీల్లో ఎప్పుడూ ఈ స్థాయిలో ధర రాలేదు.

– పరసా వెంకటసుధ, విరవాడ, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా

గతంలో రూ.30కి మించి వచ్చేది కాదు



మాకు రెండు ఆవులున్నాయి. ప్రతి రోజూ 8 లీటర్ల పాలు కేంద్రానికి పోసేవాళ్లం. లీటర్‌కు రూ.30 రావడం గగనంగా ఉండేది. అలాంటిది ఇప్పుడు అమూల్ కేంద్రంలో పోస్తే ఎస్ఎన్ఎఫ్ 8.5 శాతం, ఫ్యాట్ 4.1 శాతంతో లీటర్‌కు 39.33 వచ్చింది. ఈ లెక్కన లీటర్‌కు అదనంగా రూ.9.33 చొప్పున నెలకు రూ.2,239కు పైగా అదనపు ఆదాయం వస్తోంది. ఇక నుంచి ఈ కేంద్రానికే పాలు పోస్తాం.

– చిట్నీడి వెంకటలక్ష్మి, విరవాడ, పిఠాపురం మండలం కాకినాడ జిల్లా

రైతుల నుంచి మంచి స్పందన



జగనన్న పాల వెల్లువ పథకాన్ని కాకినాడ జిల్లాలో ఈ నెల 3వ తేదీన ప్రారంభించాం. పాడి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రైవేటు డెయిరీలు, పాల వ్యాపారుల ఒత్తిడి ఎక్కువగా ఉంది. అయినా సరే 96 గ్రామాల్లో ప్రతి రోజూ 200 మందికి పైగా రైతులు 4,500 లీటర్ల పాలు పోస్తున్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో అత్యధిక మంది పాడి రైతులకు లీటర్ గేదె పాలకు రూ.95, ఆవు పాలకు రూ.53 వరకు ఆదాయం లభిస్తోంది.

– డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు, జాయింట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ

క్లుప్తంగా...

దుష్ప్రచారం దారుణం


- కొన్ని పత్రికలు, చానల్స్ పనిగట్టుకుని తప్పుడు కథనాలు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్



అమలాపురం రూరల్: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలతో ఫొటో తీయించుకుంటున్నప్పుడు నేను కింద కూర్చున్నానని, నాకు అవమానం జరిగిందని కొందరు ప్రచారం చేస్తున్నారు. అది తప్పు. సీఎం వెనుక నేను నిలబడి ఉంటే వెనక ఉన్న మహిళలు కనిపించరనే ఉద్దేశంతో కొంచెం వంగాను. ఆ వెంటనే కుర్చీపై ఒక వైపున కూర్చున్నా. కూర్చున్న ఫొటోను వదిలేసి.. ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తుండటం దారుణం' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మండిపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శివారులోని భట్నవిల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం సభలో దళిత మంత్రికి అవమానం జరిగిందని కొందరు విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. 'నా కంటే చిన్న వారిని కూడా సీఎం జగన్.. అన్నా అని పిలుస్తారు. ఆయనది గొప్ప సంస్కారం. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ కింద కూర్చోవడం గానీ, ఎవరూ నన్ను అవమానించడం గానీ చేయలేదు. నిజంగా నా గౌరవానికి భంగం కలిగితే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటాను. ఫ్లెక్సీల విషయంలో కూడా దుష్ప్రచారం చేశారు. వాటిని నేనే అలా రూపొందించమని చెప్పాను. మొత్తం 15 ఫ్లెక్సీలు వేశాం. నా పేరు, నా కుమారులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్ పేరుపై 5 చొప్పున వేశాం. వారిద్దరూ చురుగ్గా ఉన్నారు. అమలాపురంలో సీఎం పర్యటన విజయవంతం కావడంతో జీర్ణించుకోలేకే ఇలా దుష్ప్రచారం చేస్తున్నారు' అని తెలిపారు.

బీసీల ద్రోహి చంద్రబాబు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



ఆమదాలవలస: మాజీ సీఎం చంద్రబాబు బీసీల ద్రోహి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రారంభోత్సవానికి శనివారం హాజరైన ఆయన మాట్లాడారు. 14 ఏళ్లపాటు బీసీలను తన కాళ్లకింద తొక్కిపెట్టిన ఘనత చంద్రబాబుదేనని మంత్రి అన్నారు. ప్రస్తుతం ప్రజలకు అబద్ధాలు చెబుతూ మళ్లీ వస్తున్నారని, ఆయన మాటలు నమ్మితే బీసీ సంక్షేమాన్ని తాకట్టు పెట్టినట్లవుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో కొనసాగుతూ పేదల చదువుకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని కోరారు.

వ్యూహంలో అబద్ధాలు చూపితే దుస్తులూడదీసి కొడతాం..

వర్మకు టీడీపీ నేత బండారు హెచ్చరిక

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వ్యూహం సినిమాలో అబద్ధాలు చూపించే ప్రయత్నం చేస్తే రాంగోపాల్‌వర్మను దుస్తులూడదీసి కొడతామని టీడీపీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి హెచ్చరించారు. శనివారం విశాఖ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సినిమాలో టీడీపీని తూలనాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. రాంగోపాల్‌వర్మ బరితెగించిన ఒక మృగం లాంటి వారని, వర్మను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. సినిమాను సెన్సార్ బోర్డు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. థియేటర్లలో విడుదల చేస్తే ధర్నాలకు దిగుతామన్నారు.

అయ్యో.. ఆరేళ్లకే నూరేళ్లు!

- తిరుమల కొండపై బాలికను చంపేసిన వన్యమృగం
- సత్వరమే స్పందించి బాలిక కోసం గాలించిన అధికార యంత్రాంగం
- బాలిక కుటుంబానికి రూ.10 లక్షలు ఇస్తాం: టీటీడీ ఈవో



చిన్నారి లక్షిత మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



కుమార్తె లక్షిత మృతితో విలపిస్తున్న తల్లి శశికళ

తిరుమల/కోవూరు: తిరుమల కొండపై తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అలిపిరి నడకదారిలో శుక్రవారం రాత్రి ఆరేళ్ల చిన్నారి నడుస్తుండగా అకస్మాత్తుగా ఓ వన్యమృగం చేసిన దాడిలో మృత్యువాత పడింది. నరసింహస్వామి ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం, పోతిరెడ్డిపాళెంకి చెందిన దినేష్‌కుమార్, తన భార్య శశికళ, కుమార్తె లక్షిత (6), కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు వారంతా అలిపిరి నడకమార్గం ద్వారా తిరుమలకు బయల్దేరారు. రాత్రి 7.30 గంటల సమయంలో నరసింహస్వామి ఆలయం సమీపంలో బాలిక అదృశ్యమైంది. తల్లిదండ్రుల కంటే ముందుగానే ఆ చిన్నారి నడుస్తుండడంతో వేరే భక్తుల గుంపులో కలిసి వెళ్లి ఉంటుందని తల్లిదండ్రులు తొలుత భావించి వెతకడం ప్రారంభించారు. ఎంతకూ కనపడకపోవడంతో చివరికి భద్రతా సిబ్బందికి తెలిపారు. రాత్రి 10.30కు తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్మోహన్‌రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. రాత్రి నుంచి 70 మంది టీటీడీ, అటవీశాఖ సిబ్బంది, పోలీసులు గాలింపు చేపట్టారు. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో నరసింహస్వామి ఆలయం సమీపంలోని నడకదారి నుంచి 150 మీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. పూర్తిగా ముఖాన్ని జంతువు తినడంతోపాటు కాలిని తీవ్రంగా గాయపర్చింది. దీంతో బాలిక అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. చిరుత లేదా ఎలుగుబంటి దాడిచేసి ఉండవచ్చని భావిస్తున్నారు. తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్య, వీజీఓ బాలిరెడ్డి, టూ టౌన్ ఎస్ఐ సాయినాథ్ చౌదరి బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రుయా ఆస్పత్రికి తరలించారు.



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

తీవ్రంగా కలిచివేసింది: ఈఓ ధర్మారెడ్డి

చిన్నారి మృతి తమను తీవ్రంగా కలిచివేసిందని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. ఘటనాస్థలాన్ని ఆయన పరిశీలించారు. మృతురాలి కుటుంబానికి టీటీడీ నుంచి రూ.5 లక్షలు, అటవీ శాఖ నుంచి రూ.5 లక్షలు అందిస్తామని చెప్పారు. బాలిక ఒంటరిగా వెళ్లడాన్ని సీసీ కెమెరాల్లో గుర్తించామన్నారు. బాలిక నరసింహస్వామి ఆలయానికి సమీపంలో నడకదారి నుంచి పక్కకు అటవీ ప్రాంతంలోకి ఆడుకుంటూ వెళ్లినట్లు అనుమానిస్తున్నామన్నారు. ఎందుకంటే.. బాలిక ఆటవస్తువులు అటవీ ప్రాంతంలోనే దొరికాయని తెలిపారు. ఈ సమయంలో వన్యమృగం దాడిచేసి తీసుకెళ్లినట్లు తెలుస్తోందన్నారు.

భద్రత విషయంలో రాజీలేదు: భూమన

తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్పష్టంచేశారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆయన అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం బాలిక లక్షిత మృతదేహం లభించిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ఘటనలో ఎవరి నిర్లక్ష్యంలేదని చెప్పారు.

పోతిరెడ్డిపాళెంలో విషాదఛాయలు

ఆడుతూ పాడుతూ ఉన్న చిన్నారి వన్యమృగం దాడిలో మృతిచెందిందన్న విషయం తెలుసుకున్న పోతిరెడ్డిపాళెం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాలిక మృతి వార్త కుటుంబ సభ్యులకు తెలియడంతో గ్రామంలో రోదనలు మిన్నంటాయి. దినేష్ ఇంటి వద్దకు గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వెంటనే టీటీడీ బోర్డు చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డికి ఫోన్‌చేసి బాధిత కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

అధికారులతో అత్యవసర సమావేశం

అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో మరింత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ, అటవీ పోలీస్ అధికారులతో జరిపిన అత్యవసర సమావేశంలో ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ నడకమార్గంలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. నడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటుకు సమగ్ర నివేదిక అందించాలని డీఎఫ్‌ఓను ఆదేశించామన్నారు. వన్యమృగాన్ని బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ 100 మంది భక్తుల గుంపునకు సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటుకు అనుమతిస్తామని చెప్పారు. నడకదారుల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. చిన్నపిల్లలతో నడకమార్గాల్లో వచ్చే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని ఈఓ విజ్ఞప్తి చేశారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ బోన్ల ద్వారా నడక మార్గాల్లో సంచరించే వన్యమృగాలను బంధిస్తామన్నారు.

అన్ని అనుమతులతోనే రుషికొండ వద్ద నిర్మాణాలు

- కోర్టుల కంటే పవన్ ఏమైనా గొప్ప వ్యక్తా?
- విశాఖను పరిపాలన రాజధాని చేయడం పవన్‌కు, చంద్రబాబుకు ఇష్టం లేదు
- అందుకే అసత్య ప్రచారాలతో విషం చిమ్ముతున్నారు
- మంత్రి ఆర్కే రోజా ధ్వజం



తిరుచానూరు(తిరుపతి జిల్లా): అన్ని అనుమతులతోనే విశాఖపట్నంలోని రుషికొండ వద్ద నిర్మాణాలు జరుగుతున్నాయని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. విశాఖను పరిపాలన రాజధాని చేయడం పవన్‌కళ్యాణ్‌కు, చంద్రబాబుకు ఇష్టం లేదని.. అందుకే అసత్య ప్రచారాలతో విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం మీడియాతో మాట్లాడుతూ రుషికొండపై ఏం అక్రమాలు జరిగాయో చెప్పాలని పవన్‌ను డిమాండ్ చేశారు. రుషికొండ వద్ద ప్రభుత్వ భవనాల నిర్మాణాలను అడ్డుకోవడానికి గతంలో పవన్, చంద్రబాబు పార్టీలతో పాటు రఘురామకృష్ణంరాజు కోర్టులను ఆశ్రయించారని గుర్తు చేశారు. ఏ కోర్టు అయినా.. ఈ నిర్మాణాలు ఆపేయాలంటూ తీర్పులిచ్చాయా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు కూడా ఈ నిర్మాణాలకు అనుమతులిచ్చిందని చెప్పారు. సుప్రీంకోర్టు కంటే పవన్ ఏమైనా గొప్ప వ్యక్తా అని మండిపడ్డారు. రుషికొండ వద్ద నిర్మాణాలను హైకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ పర్యవేక్షిస్తోందని చెప్పారు.

కొండలపై ఇవి కనిపించలేదా పవన్?

'కొండపై కట్టడమే పవన్‌కు సమస్య అయితే.. మరి విశాఖలో రామానాయుడు స్టూడియో ఎక్కడ ఉంది? ఐటీ టవర్స్ ఎక్కడ ఉన్నాయి.. వేంకటేశ్వరుని ఆలయం ఎక్కడ ఉంది?' అని పవన్‌ను మంత్రి రోజా ప్రశ్నించారు. 'హైదరాబాద్‌లో మీ ఇల్లు, మీ అన్న ఇల్లు కొండలపైనే ఉన్నాయి కదా? రామోజీ ఫిలిం సిటీ కూడా కొండలు, గుట్టలపైనే కదా ఉంది. అప్పుడు పర్యావరణ విధ్వంసం గుర్తుకు రాలేదా?' అని నిలదీశారు. టీడీపీ నేత బాలకృష్ణ అల్లుడు, నారా లోకేశ్ తోడల్లుడు శ్రీభరత్ విశాఖలో రుషికొండ సమీపంలోనే గీతం యూనివర్సిటీ పేరుతో 40 ఎకరాలు కబ్జా చేస్తే ఎందుకు మాట్లాడలేదని పవన్‌ను మంత్రి రోజా ప్రశ్నించారు. ఏడాదికి మూడు పంటలు పండే 33 వేల ఎకరాలను రైతుల నుంచి చంద్రబాబు లాక్కున్నప్పుడు.. మాట్లాడకుండా హెరిటేజ్ ఐస్‌క్రీం తింటున్నారా అని పవన్‌పై మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే తమ నాయకుడు వైఎస్ జగన్ తన సొంత డబ్బుతో తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నారని.. ఇప్పుడు కూడా అక్కడి నుంచే పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. కానీ కృష్ణా నది కరకట్టలో టీడీపీ అధినేత చంద్రబాబు నివసించిన అక్రమ నిర్మాణం గురించి ఏనాడైనా ప్రశ్నించావా అని పవన్‌ను రోజా నిలదీశారు. చంద్రబాబు తన అధికార, అనధికార, సొంత నివాసాలకు మరమ్మతుల పేరుతో రూ.184.58 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినప్పుడు ఎందుకు మాట్లాడలేదని పవన్‌ను మంత్రి రోజా ప్రశ్నించారు.

వలంటీర్లు దండుపాళ్యం బ్యాచ్!

మళ్లీ నోరు పారేసుకున్న పవన్ కళ్యాణ్

సాక్షి, విశాఖపట్నం: వలంటీర్లపై కత్తి కట్టిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మరోసారి నోరు పారేసుకున్నారు. ఈసారి వలంటీర్లను దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చారు. ఇటీవల ఆయన మహిళల కిడ్నాప్‌లకు సహకరించే సంఘ విద్రోహశక్తులంటూ అభివర్ణించిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు ఆగ్రహోదగ్రులయ్యారు. రోడ్లెక్కి నిరసన తెలియజేశారు. పవన్ దిష్టిబొమ్మలను దహనం చేసి ఆయన వైఖరిని దుమ్మెత్తిపోశారు. ఊహించని ఈ పరిణామానికి దిగివచ్చిన పవన్.. తాను వలంటీర్లందరినీ అలా అనలేదని, కొందరిని ఉద్దేశించే అలా అన్నానని ఆ తర్వాత వివరణ ఇచ్చుకున్నారు. పవన్ గత వ్యాఖ్యల దుమారం ఇంకా చల్లారకముందే తాజాగా మరోసారి వలంటీర్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గత నెలలో విశాఖ జిల్లా పెందుర్తి మండలం సుజాతనగర్‌లో బంగారం కోసం ఓ వృద్ధురాలిని వెంకటేష్ అనే వ్యక్తి హత్య చేశాడు. గతంలో ఇతను వలంటీర్‌గా పని చేస్తున్నప్పుడు ఫిర్యాదులు రావడంతో అధికారులు తొలగించారు. ఇది వృద్ధురాలి హత్యకు ముందే జరిగింది. ఈ నేపథ్యంలో విశాఖలో ఉన్న పవన్ శనివారం వరలక్ష్మి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతటితో ఆగకుండా అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'వలంటీర్లు దండుపాళ్యం బ్యాచ్‌లా తయారయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాల కోసం నియమించిన వలంటరీ వ్యవస్థ ఈ రోజు ప్రజల ప్రాణాలు తీస్తోంది. వీరు అసాంఘిక శక్తుల్లా మారి నేరాలకు తెగబడుతున్నారు. పోలీస్ వెరిఫికేషన్ లేకుండా వలంటీరు ఉద్యోగాలిస్తున్నారు' అని ధ్వజమెత్తారు.

జనసేన అద్భుతాలు చేయదు..

జనసేన అధికారంలోకి వస్తే అద్భుతాలు చేస్తుందని తాను చెప్పడం లేదని, వ్యవస్థలను బలోపేతం చేసి, శాంతిభద్రతలను కాపాడతామని పవన్ చెప్పారు. విశాఖ ఎంపీ కుటుంబాన్ని రౌడీషీటర్లు కిడ్నాప్ చేస్తే.. అదే ఎంపీ వారినే వెనకేసుకొస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

బోడి గుండుకు, మోకాలికి పవన్ లంకె

పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఫైర్

దొండపర్తి: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బోడి గుండుకు, మోకాళ్లకు ముడి పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నపురెడ్డి అదీప్ రాజ్ ఎద్దేవా చేశారు. సుజాతనగర్‌లో వృద్ధురాలు వరలక్ష్మిని హత్య చేసింది వలంటీర్ అని చెప్పడం చూస్తుంటే పవన్ ఉద్దేశం అర్థమవుతోందన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వలంటీర్‌గా విధులను సక్రమంగా నిర్వహించకపోవడం వల్లే వెంకటేష్‌ను తొలగించారన్నారు. ఆ తర్వాత అతను వరలక్ష్మి కుటుంబం నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో హెల్పర్‌గా చేరిన విషయం అందరికీ తెలుసన్నారు. ఈ విషయం పవన్‌కు కూడా తెలిసినా.. వలంటీర్లపై దుర్మార్గపు వ్యాఖ్యలు చేయడం దారుణమని మండిపడ్డారు. విధుల నుంచి తొలగించిన వ్యక్తిని ఇంకా వలంటీర్‌గా పేర్కొంటూ ఆ వ్యవస్థను సంఘ విద్రోహశక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం పవన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. టీడీపీ హయాంలో జరిగిన ఘటనపై గానీ, బాధితులను గానీ పవన్ ఎందుకు పరామర్శించడం లేదని ప్రశ్నించారు.

తీరంలో పరిశ్రమలకు సముద్రపు నీరు

- డీశాలినేషన్ ప్లాంట్లకు ప్రభుత్వ ప్రోత్సాహం
- కాకినాడ కేసెజ్‌లో పూర్తికావచ్చిన ప్లాంట్
- డిసెంబర్‌లో లైఫజ్ ఫార్మా ప్రారంభం నాటికి అందుబాటులోకి..
- పైడి భీమవరం వద్ద ఫార్మా కంపెనీల కోసం మరొకటి..
- త్వరలో టెండర్లు పిలవనున్న ఏపీఐఐసీ
- రామాయపట్నం, కృష్ణపట్నం వద్ద కూడా ఏర్పాటు?



సాక్షి, అమరావతి: కోస్తా తీరంలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు శుద్ధిచేసిన సముద్రపు నీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. ప్రాజెక్టులు, కాలువల కంటే చౌకగా సముద్రపు నీటిని డీశాలినేషన్ (శుద్ధిచేసి మంచినీటిగా మార్చడం) చేసే అవకాశం ఉండటంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విధానానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. 2019లో ఇజ్రాయెల్ పర్యటనలో డీశాలినేషన్ ప్లాంట్లను సందర్శించిన ఆయన రాష్ట్రంలో కూడా ఆ విధానం ద్వారా పరిశ్రమలకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా కోస్తాతీరంలో ఉన్న పారిశ్రామిక వాడల్లో డీశాలినేషన్ ప్లాంట్ల ఏర్పాటు అంశాన్ని ఏపీఐఐసీ పరిశీలిస్తోంది. శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరంతో పాటు రామాయపట్నం, కృష్ణపట్నం వద్ద ఏర్పాటయ్యే పరిశ్రమలకు డీశాలినేషన్ ద్వారా నీటిని అందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఏపీఐఐసీ వీసీఎండీ ప్రవీణ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

పైడి భీమవరం వద్ద రంగం సిద్ధం..

పైడి భీమవరం వద్ద సుమారు 26కు పైగా ఫార్మా కంపెనీలుండగా ప్రస్తుతం అవి అత్యధికంగా భూగర్భ జలాలపైనే ఆధారపడుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తొలుత పైడి భీమవరం వద్ద డీశాలినేషన్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయడానికి ఏపీఐఐసీ రంగం సిద్ధంచేసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన అధ్యయనం పూర్తయ్యిందని, త్వరలోనే ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలవనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, కాకినాడ వద్ద అరబిందో గ్రూపు అభివృద్ధి చేస్తున్న కేసెజ్, లైఫజ్ ఫార్మాలకు అవసరమైన నీటిని కూడా డీశాలినేషన్ ద్వారా సరఫరా చేయడానికి అవసరమైన పనులు వేగంగా జరుగుతున్నాయి.

డిసెంబర్ కల్లా లైఫజ్ సంస్థకూ..

ఇక సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడితో ఆసియాలోనే అతిపెద్ద పెన్సులిన్ తయారీ సంస్థ లైఫజ్ డిసెంబర్ నాటికి వాణిజ్యపరంగా ఉత్పత్తి మొదలు పెట్టనుంది. ఆ సమయానికి ప్లాంట్‌కు అవసరమైన నీటిని డీశాలినేషన్ ద్వారా అందించడానికి కేసెజ్‌లో పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ డీశాలినేషన్ ప్లాంట్‌కు సంబంధించి ఇప్పటికే పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తికాగా, యంత్రాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. డీశాలినేషన్ విధానంలో కేవలం లీటరు నీటిని నాలుగు పైసలకే ఉత్పత్తి చేయడం ద్వారా తక్కువ రేటుకే నీటిని సరఫరా చేసే అవకాశం ఉండటంతో ఏపీఐఐసీ డీశాలినేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తోంది.

ఉద్యోగాల పేరిట టీడీపీ నేత తనయుడి టోకరా

శ్రీకాకుళం క్రైమ్/గార: శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముద్దాడ గుణేశ్వరరావు కుమారుడు ముద్దాడ వెంకట రామ్‌ప్రసాద్ విదేశాల్లో ఉద్యోగాల పేరిట కొందరి నుంచి రూ.70 లక్షల వరకు తీసుకుని ఉడాయించాడు. ఇతను టర్కీ సమీపంలోని అజర్ బైజాన్‌లో గెట్ డైరెక్షన్ గ్లోబల్ యూనివర్సిటీలో పనిచేస్తున్నాడు. అక్కడే ఓ హాస్టల్ కూడా నడుపుతున్నాడు. అతను విజయవాడలో ఓ ఫ్రాంచైజీ ఏర్పాటు చేసి ఏజెంట్ ద్వారా విదేశాల్లో ఉద్యోగాలంటూ 29 మందిని స్టూడెంట్ వీసాపై అజర్ బైజాన్ పంపాడు. వారంతా అక్కడ మార్చి 14న రామ్‌ప్రసాద్‌ను కలిసి డబ్బు చెల్లించారు. అయితే, వారికి ఉద్యోగాలు ఇవ్వలేదు. బాధితులు రాజన్ మగర్ (హైదరాబాద్), సుంకరసాయి, ఉదయ్ (నిజామాబాద్), ముంబైకు చెందిన జాకబ్, అలెగ్జాండర్, కరంసింగ్, మనీందర్‌సింగ్ (పంజాబ్) అక్కడి పోలీసులను ఆశ్రయించారు. దీంతో అతడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. రామ్‌ప్రసాద్ తండ్రి తన కుమారుడిని బాధితులు కిడ్నాప్ చేశారని ఇంటర్ పోల్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు విచారించిన సీఐ సన్యాసప్పలనాయుడు బాధితులను గారకు రప్పించి నిజానిజాలు తెలుసుకుని రామ్‌ప్రసాద్‌ను అక్కడ అరెస్ట్ చేసినట్టు ధ్రువీకరించారు.

ఎస్సీ కాలనీవాసులపై టీడీపీ శ్రేణుల బరితెగింపు

- లోకేశ్ పాదయాత్ర సందర్భంగా తెలుగు తమ్ముళ్ల అతి
- ఇళ్లల్లోంచి సీఎం జగన్ ఫొటోలు తెచ్చి జై జగన్.. అంటూ నినదించిన ఎస్సీ కాలనీ మహిళలు



నిరసన తెలుపుతున్న ఎస్సీ మహిళలు

పెదకూరపాడు: టీడీపీ నేత నారా లోకేశ్ పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలో శనివారం నిర్వహించిన యువగళం పాదయాత్రలో ఆ పార్టీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. పాదయాత్ర లగడపాడు గ్రామంలోకి ప్రవేశించిన వెంటనే.. రోడ్డు పక్కన ఉన్న ఎస్సీ కాలనీ వాసులు ఎప్పుడో ఏర్పాటు చేసుకున్న వైఎస్సార్‌సీపీ జెండాలను తొలగించాలంటూ ఆందోళనకు దిగారు. కొందరు టీడీపీ శ్రేణులు ముందుకొచ్చి ఆ జెండాలను తొలగించడంతో ఎస్సీ కాలనీ వాసులు, మహిళలు పెద్ద ఎత్తున తిరగబడ్డారు. తాము ఏర్పాటు చేసుకున్న జెండాలను ఎందుకు తొలగించారంటూ టీడీపీ కార్యకర్తలను నిలదీశారు. ఒక దశలో ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. పోలీసులు జోక్యం చేసుకుని నచ్చజెప్పారు. అయినా టీడీపీ శ్రేణులు రెచ్చగొట్టే ప్రయత్నం చేయడంతో ఎస్సీ కాలనీ మహిళలు తమ ఇళ్లలో ఉన్న సీఎం వైఎస్ జగన్ ఫొటోలు తెచ్చి.. జై జగన్.. అంటూ నినాదాలు చేశారు. మా ఎస్సీలకు టీడీపీ ఏం చేసిందని ప్రశ్నించారు. దీంతో కొందరు టీడీపీ కార్యకర్తలు వాటర్ బాటిళ్లను మహిళలపైకి విసిరారు. ఆగ్రహించిన ఎస్సీ మహిళలు తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారు. రెండు వర్గాలకు మధ్య పోలీసులు నిలబడి సర్దిచెప్పారు. అటుగా వెళుతున్న లోకేశ్‌ను చూసి.. జై జగన్ అంటూ ఎస్సీ కాలనీ మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

టీడీపీకి ఇక భవిష్యత్తు లేదు

అరకు పార్లమెంటరీ టీడీపీ ఎస్సీ అధికార ప్రతినిధి గర్భాపు ఉదయభాను



పార్వతీపురం టౌన్: టీడీపీ అధినేత చంద్రబాబుకు దళితులంటే చులకనభావం, చిన్నచూపని, డబ్బులిచ్చేవారికే టికెట్లు ఇస్తే పార్టీ కోసం కష్టపడినవారి సంగతేంటని ఆ పార్టీ అరకు పార్లమెంటరీ ఎస్సీ అధికార ప్రతినిధి గర్భాపు ఉదయభాను ప్రశ్నించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే.. టీడీపీకి ఇక భవిష్యత్తు లేదని నిర్ధారణ అవుతోందన్నారు. పార్వతీపురం నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జిగా విజయచంద్రను ఏ ప్రాతిపదికన నియమించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఏ భరోసా ఇవ్వలేని లోకేశ్ చేస్తున్న పాదయాత్ర వల్ల ఒరిగేదేమీ లేదన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలు లోకేశ్‌ను వెంటాడుతాయని ఉదయభాను స్పష్టం చేశారు.

మా'స్టార్'లుగా.. మార్చాలని..

పాఠశాల నిర్వహణలో హెచ్‌ఎం పాత్ర కీలకం

- సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలపై శిక్షణ
- మూడు జిల్లాల పరిధిలోని 1,468 మందికి ట్రైనింగ్
- నాలుగు బ్యాచ్‌ల్లో 800 మందికి పూర్తి
- నెలాఖరు వరకు కొనసాగనున్న లీడర్‌షిప్ ప్రోగ్రాం

నూజివీడు: రాష్ట్రంలో విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలతో పాటు నాడు–నేడు కింద ప్రభుత్వ బడుల రూపురేఖలు దశల వారీగా మారుస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పిస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం చదువులను చేరువ చేశారు. అలాగే వేలాది మంది ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి యూపీ, ఉన్నత పాఠశాలల్లో 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ ఉపాధ్యాయులను నియమించారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులను నూరు శాతం భర్తీ చేశారు.

నాయకత్వ సాధికారతకు..

పాఠశాలలను దిశానిర్దేశం చేసే ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు అవశ్యం. పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించే మంచి నాయకుడిగా హెచ్‌ఎంలను తీర్చిదిద్దే లక్ష్యంతో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల నాయకత్వంపై వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్లో గతనెల 6వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శిక్షణ షెడ్యూల్, కోర్సును ఏపీ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (ఏపీ సీమాట్) సంస్థ రూపొందించింది. ఏలూరు రీజియన్ పరిధిలోని ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాలకు చెందిన 1,468 మంది హెచ్‌ఎంలకు రెసిడెన్షియల్ విధానంలో ప్రత్యేక వృత్యంతర శిక్షణ కార్యక్రమం జాయింట్ డైరెక్టర్, శిక్షణా తరగతుల కోర్సు డైరెక్టర్ బి.విజయ భాస్కర్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకూ బ్యాచ్‌కు 6 రోజుల చొప్పున నాలుగు బ్యాచ్‌ల్లో 800 మంది హెచ్‌ఎంలకు శిక్షణ పూర్తిచేసినట్టు విజయభాస్కర్ తెలిపారు.

సమగ్రంగా.. సంపూర్ణంగా..

ప్రభుత్వ పాఠశాలలు సమర్థవంతంగా నిర్వహించాలంటే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు తప్పనసరిగా దృఢమైన నాయకత్వ లక్షణాలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలోంచి రూపొందిందే పాఠశాల నాయకత్వంపై శిక్షణ. దీనిని సమగ్రంగా, సంపూర్ణంగా ప్రధానోపాధ్యాయులకు అందించాలనే లక్ష్యంతో తొలిసారిగా రెసిడెన్షియల్ విధానంలో శిక్షణను నిర్వహిస్తున్నట్టు ఏలూరు డీఈఓ పి.శ్యామ్ సుందర్ తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం శిక్షణ నిర్వహిస్తున్నారు.

సామర్థ్యాలకు సానబెడుతూ..



హెచ్‌ఎంలలో సహజ సామర్థ్యాలకు అనుగుణంగా వారిలోని నాయకత్వాన్ని మరింత పెంపొందించేలా సానబెడుతున్నాం. తద్వారా పాఠశాల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు వారే స్వతహాగా పరిష్కరించుకోగలరు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా ఈ శిక్షణను హెచ్‌ఎంలకు అందిస్తున్నాం.

– డాక్టర్ ఆర్ అరుణ, రాష్ట్ర పరిశీలకురాలు, సమగ్ర శిక్ష

రెసిడెన్షియల్ విధానంలో..



ఏలూరు రీజియన్‌లోని మూడు జిల్లాలకు సంబంధించిన హైస్కూల్, యూపీ, ఎల్ఎఫ్ఎల్, మోడల్, కేజీబీవీ, మున్సిపల్, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలోని హెచ్‌ఎంలకు పూర్తిస్థాయి రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ అందిస్తున్నాం. వసతి, భోజనం సదుపాయాలు కల్పించి సమగ్ర శిక్ష ద్వారా ఆహ్లాదకర వాతావరణంలో శిక్షణ ఇస్తున్నాం.

–ఏవీ ఎస్ఎన్ భాస్కర్‌కుమార్, కోర్సు ఇన్‌చార్జ్, లీడర్‌షిప్ ప్రోగ్రాం

మరింత పరిజ్ఞానం



పాఠశాల నిర్వహణలో నాయకత్వంపై మరింత పరిజ్ఞానం పొందాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తోటి ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని మంచి ఫలితాలు సాధించేందుకు శిక్షణ దోహదపడుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

–ఎ.అనురాధ, హెచ్‌ఎం, యూపీ స్కూల్, చొప్పరమెట్ల

సమాజ భాగస్వామ్యంపై..



పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ఎలా వినియోగించుకోవాలి, వారి నుంచి వచ్చే మంచి, చెడు ఫలితాలను ఎలా ఎదుర్కోవాలో తెలుసుకున్నాం. సమస్యలను సమర్థంగా ఎదుర్కోగలమనే నమ్మకం కలిగింది. ఉదయం 5 గంటల నుంచి మాకు నేర్పిన యోగాసానాలు విద్యార్థులకు నేర్పుతాం.

–ఎస్‌కే మస్తాన్, హెచ్‌ఎం, యూపీ స్కూల్, అన్నేవారిగుడెం

శిక్షణలో అంశాలు

- ఉపాధ్యాయులకు తరగతుల కేటాయింపు
- నిధుల వినియోగం
- విద్యార్థుల నమోదు
- హాజరు పెంపుదల
- మధ్యాహ్న భోజనం
- జేవీకే కిట్స్ పంపిణీ
- విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధి
- డిజిటల్ విద్యా విధానం అమలు
- నాడు–నేడు పనుల పర్యవేక్షణ
- టోఫెల్
- రోజుకో ఆంగ్ల పదం నేర్చుకోవడం
- ఓఎంఆర్ ద్వారా సీబీఏ పరీక్షలు
- విద్యాసంబంధిత యాప్‌ల నిర్వహణ
- స్వీయ అవగాహనతోపాటు టీమ్‌వర్క్‌తో పాఠశాలను అభివృద్ధి చేయడం.
- సహ ఉపాధ్యాయుల సమన్వయంతో లక్ష్యాన్ని పూర్తిచేయడం.
- విద్యావ్యవస్థలోని మార్పులను ఆకళింపు చేసుకోవడం.



జ్ఞానముగలవానికి ఉపదేశము చేయగా వాడు మరింత జ్ఞానము నొందును. నీతిగలవానికి బోధచేయగా వాడు జ్ఞానాభివృద్ధి నొందును.
– క్రైస్తవ ధర్మం



శ్రీగిరి సాక్షిగా అతనే ద్రోహి!



'తలాపునే పారుతోంది గోదారీ, నీ చేనూ, నీ చెలకా ఎడారీ' అనే పాట మలిదశ తెలంగాణ ఉద్యమంలో బాగా వినిపించేది. భౌగోళికంగా తెలంగాణకు పైభాగాన తలపాగ చుట్టినట్టు గోదావరి ప్రవహిస్తున్నది. అయినా సరే తమకు గోదావరి నీళ్లు అందడం లేదని ఉద్యమకారులు సెంటిమెంట్‌ను పండించారు. కృష్ణా నదితో రాయలసీమకు అటువంటి సెంటిమెంటే ఉన్నది. 'సీమ'కు తలాపునే కృష్ణమ్మ పారుతున్నది. సెంటిమెంటును పక్కకు పెట్టినా కృష్ణా జలాలే రాయలసీమకు ప్రాణాధారం. ఈ సీమకు ఇంకో ప్రత్యామ్నాయాన్ని ప్రకృతి ప్రసాదించలేదు. దూరచరిత్రలో ఒకప్పుడు పెన్నా నది కూడా జలరాశులతో తులతూగేదని చెపుతారు. నది అంటూ ఏర్పడిందంటేనే నీటి ఆదరవు ఉండేదని అర్థం కదా!

పెన్నానది ఎందుకు ఇలా పేదరాలయిందోనన్న ఆవేదనను విద్వాన్ విశ్వం కూడా వ్యక్తం చేశారు. పెన్నా తీరంలోని రైతుల వ్యధాభరిత గాధలపై ఆయన 'పెన్నేటి పాట' పేరుతో రాసిన కావ్యం గురించి తెలిసిందే. 'ఇంతమంది కన్న తల్లి ఎందుకిట్లు మారెనో, ఇంత మంచి పెన్న తల్లి ఎందుకెండిపోయెనో?' అరవయ్యేళ్ల కింద ఆయన వేసిన ఈ ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం దొరకలేదు. రుతుపవనాల శీతకన్ను కారణమంటారు శాస్త్రవేత్తలు. నైరుతి రుతుపవనాలు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో చురుగ్గా కదులుతూ పడమటి కనుమల అడ్డగింత కారణంగా తేమను కోల్పోయి పొడిగాలులుగా ప్రవేశిస్తాయని అంటున్నారు. శేషాచలం, నల్లమల శ్రేణుల ఫలితంగా ఈశాన్య రుతుపవనాలు కూడా ఈ ప్రాంతంపై పూర్తి ప్రభావాన్ని చూపలేకపోతున్నాయి. ఫలితంగా అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో, వైఎస్ఆర్ కడప జిల్లాలోని కొంతప్రాంతంలో వర్షఛాయా ప్రాంతం ఏర్పడింది. నది పుట్టిన చిక్‌బళ్లాపూర్ జిల్లా, నుంచి ప్రవహించే ఉమ్మడి అనంతపురం జిల్లా కడప జిల్లాలు కూడా ఈ వర్షఛాయ ప్రాంతంలో ఉన్న కారణంగా పెన్నా తిన్నెలపై నీటికి బదులు నిట్టూర్పులు ప్రవహించసాగాయి.

పెన్నానది దైన్యాన్ని, రాయలసీమ అవసరాలను 150 ఏళ్ల క్రితమే బ్రిటీష్ అధికారి సర్ ఆర్థర్ కాటన్ గుర్తించారు. అప్పటికే బ్రిటీష్ వాళ్లు ఈ ప్రాంతంలో కేసీ కెనాల్ (కర్నూలు–కడప కాలువ)ను తవ్వించారు. కృష్ణ ప్రధాన ఉపనది తుంగభద్ర నుంచి పెన్నాలో కలిసే విధంగా జలరవాణా మార్గంగా ఈ కాలువను వాళ్లు తవ్వించారు. రాయలసీమ రైతులకు సాగునీటి వనరుగా కూడా ఈ కాలువను ఉపయోగించాలని కాటన్ దొర అధికారులకు సూచించారు. ఆయన సూచన అమల్లోకి రావడానికి మరికొంత కాలం పట్టింది. కాటన్ దొర ఇంకొంత కాలం భారత్‌లో ఉండి ఉంటే రాయలసీమ అవసరాల కోసం కృష్ణాజలాల తరలింపుపై ఆలోచన చేసి ఉండే వారేమో. ఆ తరువాత ఒక శతాబ్ద కాలం గడిచిన తర్వాత కూడా మన స్వతంత్ర భారత పాలకులకు అటువంటి ఆలోచన రాకపోవడం ఒక విషాదం. 1960లో శ్రీశైలం ప్రాజెక్టును ప్రారంభించినప్పటికీ నాటి ప్రధాన ఉద్దేశ్యం జలవిద్యుత్ ఉత్పత్తి మాత్రమే!

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం లక్షమందికిపైగా రైతులు తమ ఇళ్లను, వాకిళ్లను, చేనూ చెలకనూ వదిలేసుకొని చెట్టుకొకరూ పుట్టకొకరూ వలస పోయారు. అసలు సిసలైన త్యాగధనులు వారు. కానీ మనం వాళ్లకు ఆ బిరుదుల్ని ఇవ్వలేదు. వారు ఆశించలేదు. కానీ రాజధాని భూ సమీకరణ కోసం భాగస్వామ్య వ్యాపార ఒప్పందం చేసుకున్న రైతుల 'త్యాగాలను' మాత్రం నిత్యపారాయణం చేసుకుంటున్నాము. నాటి నిజమైన త్యాగధనుల్లో అత్యధికులు కర్నూలు జిల్లా వారు. మిగిలిన వారు పాలమూరు జిల్లా వారు. రాయలసీమకు కృష్ణా నీటిని తరలించే చిరకాల స్వప్నావిష్కరణలో తొలి కదలిక శ్రీశైలం కుడిగట్టు కాలువ(ఎస్ఆర్‌బీసీ)తో మొదలైంది. బచావత్ ట్రిబ్యునల్ పునరుత్పత్తి కింద కేటాయించిన 11 టీఎంసీలకు, కేసీ కెనాల్ ఆధునికీకరణ వల్ల మిగిలే 8 టీఎంసీలను జత చేసి. 19 టీఎంసీలతో ఉమ్మడి కర్నూల్, వైఎస్సార్ జిల్లాల్లో 1.90 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా ఆ ప్రాజెక్టును 1981లో చేపట్టారు. శ్రీశైలం ప్రాజెక్టులో 5,150 క్యూసెక్కుల సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మించి.. కుడి కాలువ ద్వారా నీటిని తరలించి.. గోరకల్లు రిజర్వాయర్(12.44 టీఎంసీలు), అవుకు రిజర్వాయర్(4.15 టీఎంసీలు)లలో నిల్వ చేసి, ఆయకట్టుకు నీళ్లందించేలా పనులు చేపట్టారు.

మద్రాసు నగరానికి మంచి నీటి అవసరాల కోసం కృష్ణా జలాలను తరలించే అంశంపై పరివాహక రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లతో తమిళనాడు ప్రభుత్వం 1976లోనే చర్చలు ప్రారంభించింది. ఇందుకు కేంద్ర సర్కారు మధ్యవర్తిత్వం వహించింది. 1983 నాటికి చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. సరిగ్గా అదే సమయానికి ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు వచ్చారు. అప్పటికే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో రాయలసీమ సాగునీటి ఉద్యమం సాగుతున్నది. ఈ ప్రభావంతో మద్రాసుకు మంచినీటి కాలువ కాస్త తెలుగుగంగగా రూపాంతరం చెందింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 5,150 నుంచి 11,150 క్యూసెక్కులకు పెంచి.. ఆ మేరకు ప్రధాన కాలువ సామర్థ్యం పెంచి.. బనకచర్లకు తరలించే ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి వెలుగోడు రిజర్వాయర్ (16.95 టీఎంసీల సామర్థ్యం)కు, ఆ తరువాత తెలుగుగంగ ప్రధాన కాలువ ప్రారంభమవుతుంది. దీనిద్వారా బ్రహ్మంసాగర్ (17.74 టీఎంసీల సామర్థ్యం)కు తీసుకొని పోవాలి. అందులోంచి మళ్లీ తెలుగుగంగ ప్రధాన కాలువ నీళ్లను తీసుకొని పెన్నా నదిపై నిర్మించిన సోమశిలలో పోస్తుంది. అక్కడ నుండి మళ్లీ ప్రధాన కాలువ ద్వారా కండలేరు రిజర్వాయర్‌కు, అక్కడ నుంచి మద్రాస్‌లోని పూండి రిజర్వాయర్ వరకు తెలుగుగంగ కాలువ ప్రయాణం సాగుతుంది. ఇదీ డిజైన్.

ఒకపక్క రాయలసీమ సాగునీటి ఉద్యమ ప్రభావం, ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ ప్రారంభ సంబరం, సాగునీటి శాఖలోని కొందరి ఇంజనీర్ల చొరవ, మేధావుల సూచనలతో కృష్ణాజలాలను సీమకు తరలించడం కోసం మరికొన్ని పథకాలు పురుడుపోసుకున్నాయి. అవే గాలేరు–నగరి సుజల స్రవంతి, హంద్రీ–నీవా. ఈ రెండు ప్రాజెక్టులను కూడా ఎన్టీ రామారావు ప్రకటించారు. ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగతో కలిపి ఈ నాలుగు ప్రాజెక్టులు కృష్ణా జలాలతో నిండితేనే రాయలసీమ సాగునీటి కష్టాలకు ఉపశమనం కలుగుతుంది. అందుకోసమే ప్రాజెక్టులను ప్రకటించారు. మూడున్నర దశాబ్దాలుగా అవి సాగుతూనే ఉన్నాయి. ఈ కాలంలో ఏ ప్రభుత్వ హయంలో ఎంత పని జరిగిందనే అంశంపై సత్యశోధన చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇందుకు కారణం చంద్రబాబునాయుడు. ప్రతి ప్రాజెక్టు దగ్గరకు వెళ్లి ఇది నాదే, అది నాదే అంటూ ఆయన సెల్ఫీలు దిగడం ప్రారంభించారు. 'మా వూరి మిరియాలు గుమ్మడికాయంత' అని కోసేవాడికి చంద్రబాబుకు పెద్ద తేడా ఉండదని చాలా మందికి తెలుసు. తెలియని వాళ్లు కూడా ఎక్కడైనా ఉండవచ్చు. అందువల్ల సర్కారు రికార్డుల్లో ఉన్న యథార్థాలను, క్షేత్రస్థాయి పరిశీలనను మదింపు చేసి, మరోసారి సత్యాన్ని పునః ప్రకాశింపజేయాల్సి వస్తున్నది.

సీమ నీటి కోసం జరిగిన ఉద్యమాల దగ్గర్నుంచి లెక్కవేసి, జరిగిన ప్రాజెక్టు పనులను కూడా కలిపితే దాని పరిమాణం ఒక గున్న ఏనుగంత అనుకుందాం. అప్పుడు చంద్రబాబు చేసిన పనుల వాటాను చిన్న చీమతో పోల్చవచ్చు. పెట్టిన ఖర్చులు మాత్రం చీమ సైజుకంటే అనేక రెట్లు ఎక్కువుంటాయి. ఇందుకు కారణం కాంట్రాక్టర్లకు పాత బిల్లుల చెల్లింపుల్లో ఆయన చూపే ఔదార్యం. పెరిగిన ధరవరలకు అనుగుణంగా బిల్లులను పెంచే పేరుతో ఒక జీవోనే (22) ఆయన తీసుకొచ్చారు. సదరు కాంట్రాక్టరు అధినేతకు ఇచ్చే కమీషన్‌ను బట్టి ఆ బిల్లు 'సర్దుబాటు' ఉంటుంది. గట్టిగా చెప్పాలంటే రాయలసీమ నీటిపారుదలకు సంబంధించి చంద్రబాబులో ఏనాడూ ఎటువంటి తపనా లేదు. ఆయన ఆలోచించి డిజైన్ చేయించిన ఒక్క ప్రాజెక్టుగానీ, ఒక్క రిజర్వాయర్‌గానీ లేదు. ఉన్న కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని, ప్రాజెక్టుల నిల్వ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. నిర్వాసితులకు పరిహారం చెల్లించి రిజర్వాయర్లు నింపుకోవాలన్న స్పృహ ఎప్పుడూ లేదు. రెయిన్ గన్స్‌తో కరువును జయించిన పద్ధతే ఇక్కడ కూడా! 27 టీఎంసీల సామర్థ్యం ఉన్న గండికోటలో అయిదు టీఎంసీలు చల్లి, పండుగ చేసుకోమని చెప్పడం చూశాం.

జనతంత్రం



వర్ధెల్లి మురళి

చంద్రబాబు వ్యవసాయ రంగ వ్యతిరేకి. తెలుగునాట వ్యవసాయ సంక్షోభానికి ప్రధాన కారకుడు. వ్యవసాయం దండుగ అనేది ఆయన మనసులోని మాట. అందుకే ఉచిత విద్యుత్‌ను వ్యతిరేకించారు. అందుకే వ్యవసాయానికి అవసరమైన సాగునీటిపై నిర్లక్ష్యం వహించారు. 1981లోనే ఎస్ఆర్‌బీసీ పనులు.. రామారావు హయాంలోనే తెలుగుగంగ కాలువ పనులు ప్రారంభమయ్యాయి. గాలేరు–నగరి, హంద్రీ–నీవాలకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కానీ తొమ్మిదేళ్ల(ఉమ్మడి రాష్ట్రంలో) ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఈ ప్రాజెక్టుల్లో తట్టెడు మట్టి ఎత్తలేదు. పొలాలకు బిందెడు సాగునీరు ఇవ్వలేదు. ఎన్నికలప్పుడు ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతాల్లో పునాదిరాళ్లు వేయడం ఎప్పుడూ మర్చిపోలేదు.

ఈ నాలుగు సీమ ప్రాజెక్టుల పురోగతిపై ఒక్క చిన్న ఆడిట్ చాలు, చంద్రబాబు బండారం బట్టబయలు కావడానికి! నాలుగు ప్రాజెక్టుల్లో మొదటిది ఎస్ఆర్‌బీసీ... రెండోది తెలుగుగంగ. మూడోది గాలేరు–నగరి సుజల స్రవంతి. నాలుగోది హంద్రీ–నీవా. తుంగభద్ర–పెన్నాలను కలిపే కేసీ కెనాల్ బ్రిటీష్ కాలం నాటిది. మనకున్న సమాచారం మేరకు చంద్రబాబు ఇంకా దీన్ని తన ఖాతాలో వేసుకోలేదు. పోతిరెడ్డిపాడు దిగువ నుంచి వరద నీటిని తీసుకువెళ్లి వెలిగొండ ప్రాజెక్టును రాజశేఖర్ రెడ్డి చేపట్టారు. దీనివల్ల ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని రైతులకు మేలు జరుగుతుంది.


1983లో తెలుగుగంగ పనులు ప్రారంభించినప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులు పెంచి.. కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని కూడా ఆ మేరకు పెంచారు. అక్కడ నుంచి బనకచర్ల క్రాస్‌కు చేర్చారు. బనకచర్ల నుంచి కాలువను పూండి వరకు చేర్చాలి. మధ్యలో వెలిగోడు, బ్రహ్మంసాగర్, సోమశిల, కండలేరు రిజర్వాయర్లను నింపి మద్రాసుకు మంచినీరు ఇవ్వాలి. 1983 నుంచి 2004 వరకు, అంటే 20 ఏళ్లల్లో 97,000 ఎకరాలకు నీరు ఇవ్వగలిగారు. ఇరవై ఏళ్లలో తొమ్మిదేండ్లు చంద్రబాబు, ఆరేండ్లు ఎన్టీఆర్, అయిదేండ్లు కాంగ్రెస్ వాళ్లు పాలించారు. జరిగిన ఈ కొద్దిపాటి పనులు చంద్రబాబుకంటే ముందే జరిగాయి.

తెలుగుగంగకు ముందే పోతిరెడ్డిపాడు వద్ద 5,150 క్యూసెక్కుల సామర్థ్యంలో హెడ్ రెగ్యులేటర్ ఏర్పాటు చేసి, శ్రీశైలం కుడి ప్రధాన కాలువను అంతే ప్రవాహ సామర్థ్యంతో తవ్వారు. బనకచర్ల క్రాస్ వరకు తెలుగుగంగకూ, కుడి గట్టు కాలువకూ ఈ కాలువే ఆధారం. బనకచర్ల నుంచి తెలుగుగంగ ప్రధాన కాలువ ఎడమవైపు నుంచి, కుడిగట్టు కాలువ కుడివైపు నుంచి వెళ్తాయి. ఈ కాలువ గోరకల్లు, అవుకు రిజర్వాయర్లను నింపి గండికోటకు చేరుకుంటుంది. అవుకు రిజర్వాయర్‌కు చేరే వరకు గాలేరు-నగరి కుడిగట్టు కాలువ ఒకే ప్రవాహంగా వెళ్తాయి. అక్కడ నుంచి గాలేరు-నగరి వరద ప్రవాహం మొదలవుతుంది. ఇక నాలుగో ప్రాజెక్టు అయిన హంద్రీ-నీవా, పోతిరెడ్డిపాడు పాయింట్ కంటే ఎగువన ప్రారంభమవుతుంది. రెండు దశల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని సంకల్పించారు. మొదటి దశలో కృష్ణగిరి, పత్తికొండ, జీడిపల్లి రిజర్వాయర్లను నింపుతారు. అక్కడ నుంచి రెండో దశలో గొల్లపల్లి, చెర్లోపల్లి, మారాల, శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లకు ఎత్తిపోస్తారు. కృష్ణ ఉపనది హంద్రీని, కుప్పం సమీపంలో నీవా నదితో అనుసంధానం చేసేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఇది నాలుగు ప్రాజెక్టుల స్వరూపం.

నిజానికి ఇంత పరిశీలన కూడా అవసరం లేదు. రెండు మూడు మౌలిక విషయాలను గమనిస్తే చాలు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ మీదనే తెలుగుగంగ, కుడిగట్టు కాలువ, గాలేరు–నగరి ప్రాజెక్టులు ఆధారపడి ఉన్నాయి. వరద ఉండే 35 రోజుల్లో ఈ ప్రాజెక్టులను నింపుకోవాలి. 11,150 క్యూసెక్కుల సామర్థ్యం ఏ మూలకూ సరిపోదు. తొమ్మిది సంవత్సరాలు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడుపై ఆయన ఎందుకు దృష్టి పెట్టలేదు? రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి సామర్థ్యాన్ని 44,000 క్యూసెక్కులకు పెంచినప్పుడు తెలంగాణ, కోస్తాంధ్రలో ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టడానికి ఎందుకు ప్రయత్నించారు? శ్రీశైలం రిజర్వాయర్ నుంచి తక్కువ ఎత్తులోనే నీళ్లను గ్రహించే విధంగా పాలమూరు–రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను ప్రారంభిస్తుంటే ఇది మా రాష్ట్రానికి నష్టమని ఎందుకు చెప్పలేదు? ఎందుకు కిమ్మనలేదు? తెలంగాణ ఎత్తులకు ధీటుగా రాయలసీమ ఎత్తిపోతలను డిజైన్ చేసిన జగన్ మోహన్ రెడ్డిని రాయలసీమ ద్రోహిగా ఎలా చిత్రించారు? ఓటుకు నోటు కేసుకు భయపడి సీమకు ద్రోహం చేసిన మీకు అలా విమర్శించే నైతిక హక్కు ఎక్కడిది? అన్నం ఉడికిందో లేదో చెప్పడానికి ఒక్క మెతుకు చాలంటారు. ఇక్కడ నాలుగు మెతుకులున్నాయి. చూసి చెప్పండి. ద్రోహం చేసిందెవరో! ఇంకా వివరంగా కావాలంటే ఇక్కడ బాక్సుల్లో ప్రాజెక్టుల వారీగా ఎవరి పద్దు ఏమిటో వివరంగా ఉన్నది. పరిశీలించండి.


సత్య శోధన

శ్రీశైలం పుణ్యక్షేత్రం సమీపంలో సున్నిపెంట దగ్గర కృష్ణా నదిపై డ్యామ్‌ను నిర్మించారు. ఇక్కడ నదీ గర్భం సముద్ర మట్టం కంటే 535 అడుగుల ఎత్తున ఉన్నది. అక్కడి నుంచి డ్యామ్‌ను కట్టుకొచ్చి గేట్లు బిగించారు. 885 అడుగుల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఈ రిజర్వాయర్‌కు ఉన్నది. ఇక్కడే చాలా మంది పొరబడుతుంటారు. అన్ని అడుగుల లోతు వరకు నీళ్లున్నాయని అనుకుంటారు. అడుగుల లెక్కల్లో చెప్పినా, మీటర్ల లెక్కల్లో చెప్పినా ఆ నీటి మట్టం సముద్ర మట్టం నుంచి లెక్కేసి చెప్పేదిగా భావించాలి. ప్రాజెక్టు స్పిల్ వేకు 830 అడుగుల స్థాయి నుంచి 890 అడుగుల వరకు అంటే అరవై అడుగుల ఎత్తున అమర్చిన 12 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయానికి నీటిని విడుదల చేయడానికి 854 అడుగులు కనీసం ఎత్తుగా నిర్ణయించారు. నైసర్గిక స్వరూపం వల్ల శ్రీశైలం రిజర్వాయర్ మిగిలిన వాటికి భిన్నంగా కనిపిస్తుంది. శ్రీశైలం దగ్గరి నుంచి ఎగువన తుంగభద్ర–కృష్ణల సంగమం వరకు కిలోమీటర్ల పొడవున రిజర్వాయర్ వ్యాపించి ఉన్నది. సంగమం నుంచి మైదాన ప్రాంతంలో చెరువులను తలపిస్తూ కొండల నడుమకు చేరి నిండుగా కనిపిస్తుంది. డ్యామ్ కనిష్ట మట్టం కంటే దిగువ నుంచి 796 అడుగుల ఎత్తు నుంచే ఎడమ గట్టు జలవిద్యుత్కేంద్రం రోజుకు 44 వేల క్యూసెక్కులను తరలించే సదుపాయం తెలంగాణాకు ఉన్నది. దానికి దిగువన కుడివైపున నందికొట్కూరు ప్రాంతంలో 840 అడుగుల ఎత్తు నుంచి నీటిని తరలించడానికి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను శ్రీశైలం కుడి గట్టు కాలువ(ఎస్ఆర్‌బీసీ) కోసం మొదట ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి ప్రధాన కాలువ ద్వారా నీటిని తరలించి బనకచర్ల క్రాస్‌కు తరలిస్తారు. ఇదో జల జంక్షన్ వంటిది. అక్కడ్నుంచి ఎడమవైపు నుంచి తెలుగుగంగ కాలువ, కుడివైపు నుంచి ఎస్ఆర్‌బీసీ, గాలేరు–నగరి ప్రాజెక్టులకు సంబంధించిన నీటిని, మధ్య నుంచి కేసీ కెనాల్ స్థిరీకరణ కోసం తరలిస్తారు. తెలంగాణ వైపున 802 అడుగుల నుంచి కల్వకుర్తి, 800 అడుగుల నుంచి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలు ప్రారంభించడంతో వాటా జలాలను దక్కించుకోవడం కోసం జగన్ ప్రభుత్వం 800 అడుగుల నుంచే తరలించేలా రాయలసీమ ఎత్తిపోతలను ప్లాన్ చేసింది. హంద్రీ–నీవా సుజల స్రవంతికి అంతకంటే దిగువ నుంచి నీటిని డ్రా చేస్తున్నారు.



శ్రీశైలం కుడి గట్టు కాలువ(ఎస్సార్బీసీ)

- **ఎన్టీఆర్ హయాంలో:** 1981లో కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, ప్రధాన కాలువ, రిజర్వాయర్ల పనులను కొనసాగించారు.
- **కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో:** పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌తోపాటు ప్రధాన కాలువ పనులు పూర్తయ్యాయి. గోరకల్లు, అవుకు రిజర్వాయర్ల పనులు ప్రారంభమయ్యాయి.
- **చంద్రబాబు హయాంలో(1995–2004):** గతంలో చేసిన పనులకే ధరల సర్దుబాటు కింద కాంట్రాక్టర్లకు అదనంగా బిల్లు ఇచ్చి కమీషన్లు వసూలు చేసుకున్నారు. గోరకల్లు, అవుకు రిజర్వాయర్ల పనులు నత్తనడకన సాగాయి.
- **వైఎస్ హయాంలో:** పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచి... ప్రధాన కాలువ సామర్థ్యాన్ని ఆ మేరకు పెంచి... శ్రీశైలం కుడి గట్టు కాలువ సామర్థ్యాన్ని 25 వేల క్యూసెక్కులకు పెంచే పనులు చేపట్టారు. అవుకు రిజర్వాయర్, గోరకల్లు రిజర్వాయర్ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించారు.
- **చంద్రబాబు హయాం(2014–19)లో:** అవుకు, గోరకల్లు రిజర్వాయర్లలో మిగిలిన పనులు పూర్తి చేయలేకపోయారు. ఆ రెండు రిజర్వాయర్లలోనూ పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయలేకపోయారు. ఒక్క ఎకరాకూ అదనంగా నీళ్లందించలేదు.
- **వైఎస్ జగన్ హయాంలో:** అవుకు, గోరకల్లు రిజర్వాయర్లలో మిగిలిన పనులు పూర్తి చేశారు. 2019 నుంచి ఏటా రెండు రిజర్వాయర్లలో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేస్తూ.. పూర్తి ఆయకట్టు అంటే **1.90 లక్షల ఎకరాలకు నీళ్లందిస్తున్నారు.**




గాలేరు-నగరి సుజల స్రవంతి

- **ఎన్టీఆర్ హయాంలో:** సర్వే పనులు ప్రారంభం.
- **కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో:** సర్వే పనులు పూర్తి.
- **చంద్రబాబు హయాంలో:** ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. 1996 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఓట్ల కోసం గండికోట వద్ద శంకుస్థాపన చేశారు. 1999 ఎన్నికలకు ముందు మరోసారి ఓట్ల కోసం వామికొండ వద్ద శంకుస్థాపన చేశారు. తొమ్మిదేళ్లలో రెండుసార్లు శంకుస్థాపన చేశారుగానీ తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు.
- **వైఎస్ హయాంలో:** ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టి.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచి... బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి శ్రీశైలం కుడిగట్టు కాలువ సామర్థ్యాన్ని 25 వేల క్యూసెక్కులకు పెంచి.. అవుకు రిజర్వాయర్ నుంచి 20 వేల క్యూసెక్కులను తరలించేలా గాలేరు–నగరి వరద కాలువతోపాటు గండికోట, వామికొండ, సర్వారాయసాగర్ సహా రిజర్వాయర్ల పనులు చేపట్టారు. సింహభాగం పూర్తి చేశారు. గండికోట–చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లను అనుసంధానం చేస్తూ, అదనంగా ఆయకట్టుకు నీళ్లందించడం కోసం గండికోట ఎత్తిపోతలను చేపట్టి.. చాలా వరకు పూర్తి చేశారు.
- **చంద్రబాబు హయాం(2014–19)లో:** ధరల సర్దుబాటు(జీవో 22), పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు(జీవో 63)లను వర్తింపజేసి.. కాంట్రాక్టర్లకు ప్రజాధనాన్ని దోచిపెట్టి కమీషన్లు వసూలు చేసుకున్నారు. అరకొరగా మిగిలిన పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై 60–సీ నిబంధన కింద వేటు వేసి.. అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసి అస్మదీయ కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు వసూలు చేసుకున్నారు. కమీషన్లు రావనే నెపంతో నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా గండికోట రిజర్వాయర్‌లో ఐదారు టీఎంసీలను నిల్వ చేసి.. ఆ ప్రాజెక్టును తానే పూర్తి చేసినట్లు ప్రకటించుకున్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా రెండు మూడు టీఎంసీలను నిల్వ చేసి.. ఆయకట్టుకు అరకొరగా నీళ్లందించి రైతుల నోళ్లు కొట్టారు.
- **వైఎస్ జగన్ హయాంలో:** గండికోట నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లతో పునరావాసం కల్పించి.. **2020 నుంచి ప్రతి ఏటా ఆ ప్రాజెక్టులో పూర్తి స్థాయి మేరకు అంటే 26.85 టీఎంసీలు నిల్వ చేస్తున్నారు.** వామికొండ, సర్వారాయసాగర్‌లోనూ గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేశారు. గండికోట–చిత్రావతి ఎత్తిపోతల్లో మిగిలిన పనులు పూర్తి చేశారు. **రూ.600 కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పించి.. 2020 నుంచి ప్రతి ఏటా చిత్రావతి రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో పది టీఎంసీలను నిల్వ చేస్తూ ఆయకట్టుకు నీళ్లందిస్తున్నారు.** గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు రెండో సొరంగంలో మిగిలిన పనులను చంద్రబాబు పూర్తి చేయలేదు. ఆ పనులను సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసి.. ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులను తరలించడానికి మార్గం సుగమం చేశారు. **శ్రీశైలానికి వరద వచ్చే 30 నుంచి 40 రోజుల్లో గాలేరు–నగరిపై ఆధారపడ్డ ప్రాజెక్టులను నింపేలా.. వరద కాలువ సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు పెంచే పనులను చేపట్టారు.**


తెలుగుగంగ ప్రాజెక్టు

- **ఎన్టీఆర్ హయాంలో:** పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 11,150 క్యూసెక్కులకు పెంచే పనులతోపాటు వెలిగోడు, బ్రహ్మంసాగర్, కండలేరు రిజర్వాయర్ల నిర్మాణాన్ని చేపట్టారు.



- **కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో:** ప్రధాన కాలువ, రిజర్వాయర్ల పనులు చాలా వరకు పూర్తయ్యాయి.
- **చంద్రబాబు హయాంలో:** కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిన మేరకు ఆ కాలువ ద్వారానే 1996లో మద్రాసుకు నీటిని సరఫరా చేశారు. 2004 నాటికి ప్రాజెక్టు పరిధిలో కేవలం 97 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లందించగలిగారు.
- **వైఎస్ హయాంలో:** పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచిన నేపథ్యంలో.. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలిగోడు రిజర్వాయర్ వరకూ లింక్ కెనాల్ సామర్థ్యాన్ని 15 వేల క్యూసెక్కులకు పెంచే పనులు చేపట్టి, పూర్తి చేశారు. తద్వారా వెలిగోడు రిజర్వాయర్‌ను 15 రోజుల్లోనే నింపుతూ.. మిగతా రిజర్వాయర్లను నింపడానికి మార్గం సుగమం చేశారు. రిజర్వాయర్లలో మిగిలిన పనులను పూర్తి చేశారు. బ్రహ్మంసాగర్‌లో 2004లో మొదటిసారిగా నీటిని నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి.. 2006లో గరిష్ఠంగా 12 టీఎంసీలను పెట్టారు. డిస్ట్రిబ్యూటరీలలో సింహభాగం పూర్తి చేసి.. ప్రాజెక్టు కింద ఏటా నాలుగు లక్షల ఎకరాలకు నీళ్లందించారు.
- **చంద్రబాబు హయాం(2014–19)లో:** ప్రధాన కాలువలు, బ్రహ్మంసాగర్ నిర్వహణను గాలికొదిలేశారు. దాంతో బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలిగోడు రిజర్వాయర్‌కు నీటిని తరలించే లింక్ కెనాల్ సామర్థ్యం 15 వేల నుంచి ఆరేడు వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది. తెలుగుగంగ ప్రధాన కాలువ సామర్థ్యం 5 వేల నుంచి 2–2,500 క్యూసెక్కులకు తగ్గిపోయింది. మట్టికట్ట లీకేజీలకు అడ్డుకట్ట వేయకుండా ఏటా బ్రహ్మంసాగర్‌లో సగటున 4.69 టీఎంసీలను మాత్రమే నిల్వ చేయగలిగారు. ఫలితంగా వైఎస్ హయాంలో ఇచ్చిన నాలుగు లక్షల ఎకరాలకు కూడా నీళ్లందించలేకపోయారు.
- **వైఎస్ జగన్ హయాంలో:** లింక్ కెనాల్‌తోపాటు తెలుగుగంగ ప్రధాన కాలువలకు రూ.600 కోట్లు వెచ్చించి, యుద్ధప్రాతిపదికన లైనింగ్ చేయించారు. తద్వారా పూర్తి సామర్థ్యం మేరకు నీటిని తరలించి వెలిగోడు రిజర్వాయర్‌ను సకాలంలో నింపడానికి మార్గం సుగమం చేశారు. బ్రహ్మంసాగర్ మట్టికట్టకు రూ.వంద కోట్లతో డయాఫ్రమ్‌వాల్ వేసి.. లీకేజీలకు అడ్డకట్ట వేసి.. పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయడానికి లైన్ క్లియర్ చేశారు. సోమశిల, కండలేరు రిజర్వాయర్లలో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేశారు. **నాలుగేళ్లుగా ప్రతి ఏటా ఐదు లక్షల ఎకరాలకు నీళ్లందిస్తున్నారు. శ్రీశైలానికి వరద వచ్చే 30 నుంచి 40 రోజుల్లోనే.. ఆ ప్రాజెక్టుపై ఆధారపడ్డ రిజర్వాయర్లను నింపేలా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచేలా ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఆ మేరకు ప్రవాహ సామర్థ్యం పెంచేలా ప్రధాన కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టారు.**

హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం



- **ఎన్టీఆర్ హయాంలో:** సర్వే పనులు ప్రారంభం.
- **కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో:** సర్వే పనులు పూర్తి.
- **చంద్రబాబు హయాంలో:** ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు.. 1996 లోక్‌సభ ఎన్నికల సమయంలో అనంతపురం జిల్లా ఉరవకొండ వద్ద శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 1999 ఎన్నికల నేపథ్యంలో 1998లో అనంతపురం జిల్లాలోనే ఆత్మకూరు వద్ద 40 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టాల్సిన సాగునీటి ప్రాజెక్టును 5.5 టీఎంసీలకు కుదించి, తాగునీటి పథకంగా చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. కానీ తొమ్మిదేళ్లలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు.
- **వైఎస్ హయాంలో:** శ్రీశైలం ప్రాజెక్టులో సముద్రమట్టానికి 834 అడుగుల ఎత్తు నుంచి 3,850 క్యూసెక్కులను ఎత్తిపోసి.. తొలి దశలో 216 కి.మీ.ల ప్రధాన కాలువ పనులు.. ఎనిమిది దశల్లో ఎత్తిపోతల పనులు.. కృష్ణగిరి, పత్తికొండ, జీడిపల్లి రిజర్వాయర్ పనులను చేపట్టి, పూర్తి చేశారు. దాంతో 2012 నాటికే కృష్ణగిరి, పత్తికొండ, జీడిపల్లి రిజర్వాయర్‌ను నింపారు. రెండో దశలో ప్రధాన కాలువతోపాటు తొమ్మిది దశల్లో ఎత్తిపోతలు.. గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి, శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లు చేపట్టి పనులను ఓ కొలిక్కి తెచ్చారు. శ్రీశైలంలో నీటి మట్టం 800 మీటర్లకు తగ్గినా.. హంద్రీ–నీవాకు నీటి కొరత లేకుండా చేయాలనే లక్ష్యంతో ముచ్చుమర్రి ఎత్తిపోతలను చేపట్టి సింహభాగం పూర్తి చేశారు.
- **చంద్రబాబు హయాంలో(2014–19):** కాంట్రాక్టర్లకు జీవో 22, జీవో 63లను వర్తింపజేసి.. అదనంగా బిల్లులు చెల్లించి.. కమీషన్లు వసూలు చేసుకున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో అరకొరగా మిగిలిన పనులను చేసి.. ఆ రిజర్వాయర్‌కు నీటిని తీసుకెళ్లడం వల్లే పెనుకొండకు సమీపంలో కియా కార్ల పరిశ్రమ వచ్చిందని చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారు. వైఎస్ హయాంలో పూర్తయిన ముచ్చుమర్రి ఎత్తిపోతలను జాతికి అంకితం చేసి.. దాన్ని తానే పూర్తి చేసినట్లు చంద్రబాబు కోటలు దాటేలా మాట్లాడారు. ఐదేళ్లలో సగటున ఏడాదికి 26.62 టీఎంసీలను మాత్రమే తరలించి.. రైతులకు అన్యాయం చేశారు. చివరకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి నీటిని తరలించే కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల్లోనూ కమీషన్లకు కక్కుర్తి పడ్డారు. అంచనా వ్యయాన్ని రూ.200 కోట్ల నుంచి రూ.440 కోట్లకు పెంచి.. సీఎం రమేష్‌కు కట్టబెట్టి.. మట్టి పనులను చేయించి.. కమీషన్లు వసూలు చేసుకున్నారుగానీ కుప్పం నియోజకవర్గానికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వలేకపోయారు.
- **వైఎస్ జగన్ హయాంలో:** అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల శ్రీశైలానికి వరద వచ్చే రోజులు తగ్గిన నేపథ్యంలో.. వరద రోజుల్లోనే 40 టీఎంసీలను తరలించేలా హంద్రీ–నీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు దానికి అనుబంధంగా ఉన్న ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టారు. రెండో దశలో మిగిలిన పనులు పూర్తి చేయడంతోపాటు.. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను ఈ ఏడాదే పూర్తి చేసి, కుప్పం నియోజకవర్గ ప్రజలకు కృష్ణా జలాలను అందించే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. **గత నాలుగేళ్లలో ఏటా సగటున 39.50 టీఎంసీలు.. అంటే ప్రస్తుత డిజైన్ సామర్థ్యం మేరకు నీటిని తరలించి రైతులకు న్యాయం చేశారు.**

టీటీడీ ధార్మిక కార్యక్రమాలు అద్భుతం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఏపీ హైకోర్టు సీజే కితాబు
- ధర్మగిరి వేద విజ్ఞాన పీఠాన్ని సందర్శించిన న్యాయమూర్తులు


మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్

తిరుమల: సనాతన హైందవ ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ, వేద విద్యను ప్రోత్సహిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రశంసించారు. టీటీడీ చేస్తున్న ధార్మిక కార్యక్రమాలు అద్భుతమని చెప్పారు. శనివారం సాయంత్రం వారు టీటీడీ ఈవో ధర్మారెడ్డితో కలిసి టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ధర్మగిరి వేద విజ్ఞాన పీఠాన్ని సందర్శించారు. 1884లో విజ్ఞాన పీఠం ఆవిర్భవించిందని, దాదాపు 140 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులకు వేద విద్యను అందిస్తోందని న్యాయమూర్తులకు ఈవో తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 33 విద్యా సంస్థలలో ఆరు వేద విద్యా సంస్థలు, ఒక వేద విశ్వవిద్యాలయం ఉన్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి న్యాయమూర్తులు ప్రసంగించారు. వేద విద్యను భావితరాలకు అందించాలనే ఉన్నతమైన లక్ష్యంతో టీటీడీ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం అతిథులను వేద అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. అంతకు ముందు పద్మావతి అతిథి గృహం వద్ద టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.

శ్రీవారి సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి


జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం ఉదయం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయం వద్దకు వచ్చిన జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్‌కు పండితులు వేద ఆశీర్వాదం చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, శ్రీవారి చిత్ర పటం, నమామి గోవిందం కిట్, అగరుబత్తీలు, డ్రై ఫ్లవర్ టెక్నాలజీతో తయారు చేసిన దేవతామూర్తి ఫొటోలను ఈవో అందజేశారు. పద్మావతి అతిథిగృహం వద్ద రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కాగా, తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంగస్వామి నటరాజ్ శనివారం దర్శించుకున్నారు.


ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత

నకిలీ కరెన్సీ కేసులో ఇద్దరి అరెస్ట్

- కారు, రెండు సెల్‌ఫోన్లు,రసాయనాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ధనుంజయుడు

జంగారెడ్డిగూడెం: ఒకటికి మూడు రెట్లు అధికంగా నకిలీ కరెన్సీ ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్న ముఠాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం.ధనుంజయుడు తెలిపారు. శనివారం రాత్రి డీఎస్పీ వివరాలు వెల్లడించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా జంగారెడ్డిగూడెం ఎస్‌ఐ ఎం.సాగర్‌బాబు, సిబ్బంది ఏపీ05సీఈ1818 నంబరు గల కారును తనిఖీ చేశారు. అందులో అసలు, నకిలీ కరెన్సీని గుర్తించారు. కారులో ఉన్న ద్వారకాతిరుమల మండలం టి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోడూరి రవితేజ, స్థానిక బుట్టాయగూడెం రోడ్‌కు చెందిన షేక్ నాగుల్ మీరా వల్లీ కలిసి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని నల్లమందు సందులోని శ్రీరామ ఫ్యాన్సీ షాపులో అసలు కరెన్సీ నోట్లను పోలి ఉండే రూ.10 లక్షల విలువజేసే నకిలీ రూ.500 నోట్లు కొనుగోలు చేశారు. ఈ నకిలీ నోట్లపై 'మనోరంజన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అని ముద్రించి ఉంది. అడబాల విజయ్‌కుమార్ అనే వ్యక్తిని సంప్రదించి లక్ష రూపాయలకు రూ.3 లక్షలు చొప్పున ఇస్తామని చెప్పారు. దీంతో అడబాల విజయ్‌కుమార్ ఈ నెల 11వ తేదీ సాయంత్రం జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామానికి అసలు డబ్బుతో వచ్చారు. రవితేజ, నాగుల్‌మీరా అతని నుంచి అసలు నగదు రూ.39,36,300 తీసుకుని కర్రతో కొట్టి.. చంపుతానని బెదిరించి.. ఇద్దరూ కారులో పారిపోతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. అసలు నగదు రూ.39,36,300తో పాటు, రూ.10 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు, రసాయనాలు, ఫోక్స్ వ్యాగన్ కారు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, రవితేజ ద్వారకాతిరుమల మండలం కొత్తపల్లిలో జరిగిన ఓ హత్య కేసులోనూ నిందితుడని డీఎస్పీ చెప్పారు.

ఇక ఆటోమేటెడ్ డ్రైవింగ్ పరీక్షలు

- మరింత సమర్థంగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియ
- రాష్ట్రంలో 9 ఏడీటీసీలను ఏర్పాటు చేస్తున్న రవాణా శాఖ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డ్రైవింగ్ లైసెన్సుల జారీ విధానం మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు రవాణా శాఖ సిద్ధమవుతోంది. అందుకోసం రాష్ట్రంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాకులను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణను వేగవంతం చేసింది. రవాణా శాఖ సిబ్బంది ప్రమేయం లేకుండా ఆటోమేటిక్‌గా డ్రైవింగ్ నైపుణ్యాన్ని పరీక్షించి లైసెన్స్ మంజూరు చేసే సాంకేతికతను రవాణా శాఖ సమకూర్చుకుంటోంది. కేంద్ర రవాణా శాఖ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)తో కలిసి రాష్ట్రంలో తొలిదశలో తొమ్మిది ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లు (ఏడీటీసీలు) ఏర్పాటు చేస్తోంది. అనంతరం దశలవారీగా అన్ని జిల్లా కేంద్రాల్లోను ఏర్పాటు చేయనుంది.

సెన్సార్ల ద్వారా డ్రైవింగ్ నైపుణ్య పరీక్షలు

మొదటిదశలో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, అనంతపురం ఏడీటీసీల ఏర్పాటు ప్రక్రియ చేపట్టారు. ఒక్కో ఏడీటీసీ కేంద్రాన్ని రూ.కోటి చొప్పున మొత్తం రూ.9 కోట్లతో వాటిని ఏర్పాటు చేస్తున్నారు. ఆ కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాలతోపాటు ట్రాక్ అండర్‌గ్రౌండ్‌లో సెన్సార్లను నెలకొల్పుతారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసినవారు చేసే టెస్ట్ డ్రైవింగ్ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్ చేస్తారు. ట్రాక్ వద్ద రవాణా శాఖ సిబ్బంది ఉండాల్సిన అవసరం లేదు. ఆ సమీపంలోని ఆఫీసు నుంచే వీడియోద్వారా డ్రైవింగ్‌ను పర్యవేక్షిస్తారు. ఇప్పటివరకు డ్రైవింగ్ నైపుణ్యాన్ని పరిశీలించేందుకు నాలుగు రకాల డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించేవారు. వాటిస్థానంలో సమీకృతంగా ఒకే ఆటోమేటెడ్ టెస్ట్ డ్రైవింగ్ మాడ్యూల్ రూపొందించారు. డ్రైవింగ్‌లో లోపాలుంటే సెన్సార్లు వెంటనే బీప్ శబ్దాన్ని చేస్తాయి. దీంతో అధికారులు ఆ వీడియోను పరిశీలిస్తారు. టెస్ట్ డ్రైవింగ్‌ను బట్టి ఆటోమెటిక్‌గా మార్కులు నిర్ణయిస్తారు. అర్హ త మార్కులు సాధిస్తేనే డ్రైవింగ్ లైసెన్స్ మంజూరుకు కంప్యూటర్ అనుమతిస్తుంది. లేకపోతే మరోసారి టెస్ట్ డ్రైవింగ్‌కు హాజరుకావా లని మెస్సేజ్ వస్తుంది. ఇప్పటికే ఆ తొమ్మిది కేంద్రాల్లో ఆటోమేటెడ్ టెస్ట్ డ్రైవింగ్ వ్యవస్థను ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నా రు. త్వరలో ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. రెండోదశలో రాష్ట్రంలో మిగిలిన 17 జిల్లా కేంద్రాల్లోను ఏడీటీసీలను ఏర్పాటు చేయాలని రవాణా శాఖ భావిస్తోంది.

వలలెన్ని వేసినా.. పులస జాడ లేదు

సీజన్ మొదలై నెల గడుస్తున్నా కానరాని క్వీన్ ఫిష్

గతంలో జూలైలోనే గోదావరిలో పులసల సందడి	లబోదిబోమంటోన్న మత్స్యకారులు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: గోదావరిలో సీజనల్‌గా దొరికే పులసలు ఈ ఏడాది జాడ లేకుండా పోయాయి. గోదావరికి వరదలు రావడంతోనే వలస వచ్చే పులసల సీజన్ ప్రారంభమవుతుంది. ఏటా గోదావరికి జూలై నుంచి సెప్టెంబర్ వరకు వరద ప్రవాహం వస్తుంది. సాధారణంగా ఆగస్టు నెలలో వరదలు ఎక్కువ వస్తాయి. ఈ ఏడాది జూలైలోనే వరదలు వచ్చి వెళ్లిపోయాయి. వరదల సమయంలో సముద్రం నుంచి గోదావరిలోకి ఎదురీదుతూ పునరుత్పత్తి కోసం గుంపులు గుంపులుగా పులసలు వస్తుంటాయి. కానీ.. ఈ సీజన్‌లో పులసలు మొహం చాటేశాయి. గోదావరి తీరంలో అక్కడక్కడా ఒకటి, రెండు పులసలు వలలో పడ్డా వేలకు వేలు పెట్టి పులస ప్రియులు ఎగరేసుకుపోతున్నారు.

'క్వీన్ ఆఫ్ ఫిష్'గా పేరు

గోదావరిలో లభించే పులస 'క్వీన్ ఆఫ్ ఫిష్'గా ప్రపంచంలోనే పేరుంది. 2015 గణాంకాల ప్రకారం ప్రపంచంలో హిల్సా ఉత్పత్తిలో 50–60 శాతంతో బంగ్లాదేశ్ మొదటి స్థానంలో ఉండగా.. మయన్మార్ 20–25 శాతంతో రెండో స్థానంలోను, 15–20 శాతంతో మన దేశం మూడో స్థానంలో ఉన్నాయి. గోదావరిలో పుట్టిన పులస పిల్లలే సముద్రంలోకి వెళ్లి ఇలసలుగా వృద్ధి చెందుతాయి. సముద్రంలో ఉండే ఇలస రుచిగా ఉండకపోవడానికి అవి కొవ్వుతో ఉండటమే కారణం. ఏటా వరదల సమయంలో సముద్రంలోని ఇలసలు పునరుత్పత్తి కోసం సముద్రంలో 11వేల నాటికల్స్ ప్రయాణించి గోదావరిలోకి ఎదురీదుతాయి. ఇలా ఎదురీత ప్రయాణం వల్ల పులసలో ఉండే కొవ్వు కరిగిపోయి ఎరుపు, గోధుమ రంగులోకి మారి పోషకాలు కలిగిన కొత్త శక్తితో స్మార్ట్‌గా మారుతుంది. కొన్ని రోజులు గోదావరిలోనే ఉండి గుడ్లు పెట్టి తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతుంటుంది. ఇలా గోదావరిలోకి వచ్చిన పులసల్ని ఇష్టపడని మాంసాహార ప్రియులు ఉండరు.

అర కేజీ దొరకడమే గగనం

పులస గతంలో కేజీ నుంచి మూడు కేజీలు వరకు లభించేవి. మూడు కేజీల బరువున్న పులసలు నాలుగైదు చిక్కాయంటే వేటకు వెళ్లిన మత్స్యకారుల పంట పండినట్టే. మూడు కేజీల తూకం ఉండే పులస రూ.20 వేల నుంచి రూ.25 వేలు పలికేది. ప్రస్తుత సీజన్‌లో అర కిలో పులస దొరకడమే గగనమైపోతోంది. ఆ అరకిలో పులసే ఐదారువేలు పలుకుతోంది. గోదావరి జిల్లాల్లో యానాం, ఎదుర్లంక, ధవళేశ్వరం, రావులపాలెం, సిద్ధాంతం, నరసాపురం తదితర తీర ప్రాంతాల్లో ఒకప్పుడు విరివిగా దొరికే పులసలు అరకొరగానే పడుతున్నాయి. సముద్ర ముఖద్వారాల వద్ద ఇసుక తిప్పలు పెరగడం, గోదావరిలోకి సల్ఫర్, అమ్మోనియా, లెడ్ తదితర కర్బనాలు కలిసిపోతుండటం, విచక్షణా రహితంగా సాగే వేట ఈ జాతి రాక తగ్గడానికి కారణంగా పేర్కొంటున్నారు. పులసలు సంతానోత్పత్తి జరిగే సమయంలో వేట సాగడం తగ్గిపోవడానికి మరో కారణం.

పులసల మనుగడకు 'సిఫ్రీ' కృషి



పులస చేప జాతిని పరిరక్షించే దిశగా కోల్‌కతాలోని సిఫ్రీ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) కృషి చేస్తోంది. పులస సీడ్‌ను వృద్ధి చేసి బంగాళాఖాతంలో విడిచిపెడుతోంది. ఈ ప్రయత్నం వల్లే ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరంలో పులసలు లభిస్తున్నాయంటున్నారు. కానీ.. గోదావరిలో లభించే పులసలకున్నంత రుచి ఆ ప్రాంతంలో పులసలకు ఉండదు.
– చిట్టూరి గోపాలకృష్ణ, మత్స్య శాస్త్రవేత్త

పులసల రాక తగ్గిపోతోంది



పులసలు రాక క్రమంగా తగ్గిపోతోంది. గతంలో జూలై, ఆగస్టు నెలల్లో మాకు పండగలా ఉండేది. వందలాది పులసలు మా వలల్లో చిక్కేవి. అటువంటిది ఈ సీజన్‌లో పులసలు జాడ కనిపించడం లేదు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.
– ముదే హరిచంద్ర, మత్స్యకారుడు, యానాం

సీఎం జగన్ చిత్రపటాలకు సెర్ప్ ఉద్యోగుల క్షీరాభిషేకం


నంద్యాల జిల్లా బొమ్మల సత్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

సాక్షి, అమరావతి: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు శనివారం రాష్ట్రంలోని పలుచోట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. సెర్ప్ పరిధిలో పనిచేసే 4,569 మంది ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్(ఎఫ్‌టీఈ)ల వేతనాలను ప్రస్తుత మూల వేతనానికి 23 శాతం అదనంగా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం సెలవు అయినప్పటికీ పలుచోట్ల డీఆర్‌డీఏ, మండల సమాఖ్య కార్యాలయాల వద్ద సెర్ప్ ఉద్యోగులు సమావేశమై సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. కాగా, సెర్ప్ ఉద్యోగుల జీతాలను పెంచడంపై సెర్ప్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కొమ్ము నాగరాజు, సెక్రటరీ జనరల్ ధనుంజయ్‌రెడ్డి, కన్వీనర్ శోభన్‌బాబు, కో–కన్వీనర్లు జగన్, పద్మ ఒక ప్రకటనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

భూదాన్ భూములపై కసరత్తు

- ఆ భూముల ప్రస్తుత పరిస్థితిపై కలెక్టర్లకు లేఖలు
- జిల్లాల వారీ వివరాలు సేకరిస్తున్న భూదాన్ బోర్డు
- భూముల సమస్యలపై ప్రత్యేకదృష్టిలో భాగంగా సర్కారు కసరత్తు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని భూదాన్ భూముల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకునేందుకు భూదాన్ యజ్ఞ బోర్డు కసరత్తు చేస్తోంది. ఎక్కడెక్కడ ఆ భూములున్నాయి, ఎవరి ఆధీనంలో ఉన్నాయి, ఆక్రమణలు జరిగాయా, ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూదాన్ భూములు.. వంటి విషయాల గురించి పూర్తివివరాలు సేకరిస్తోంది. ఇందుకోసం బోర్డు ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు లేఖలు రాసింది. కొన్ని జిల్లాల నుంచి సమాచారం వచ్చింది. అన్ని జిల్లాల సమాచారం అందిన తర్వాత వాటిని క్రోడీకరించి విశ్లేషించనున్నారు. అనంతరం రాష్ట్రంలో భూదాన్ భూముల వాస్తవ పరిస్థితి తెలిసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

భూదాన్ బోర్డు, భూములను పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం

ధనికులు తమ భూమిలో కొంతభూమిని పేదలకు దానమిచ్చే ఉద్దేశంతో 1951లో దేశంలో భూదాన్ ఉద్యమం ప్రారంభమైంది. మన రాష్ట్రంలోను చాలామంది తమ భూములను భూదాన్ బోర్డుకు ఇచ్చారు. అందులో చాలావరకు భూమిని పేదలకు పంచారు. కాలక్రమేణా మిగిలిన భూములు, పంపిణీ చేసిన భూములపై వివాదాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం ఏపీలో భూదాన్ యజ్ఞ బోర్డును ఏర్పాటు చేయలేదు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కే భూదాన్ బోర్డు బాధ్యతలు అదనంగా అప్పగించడం, ఆ భూముల వ్యవహారాలను గాలికి వదిలేయడంతో భూదాన్ భూముల వ్యవహారాలన్నీ మరుగున పడిపోయాయి. తెలంగాణ భూదాన్ బోర్డే ఇక్కడి వ్యవహారాలు పర్యవేక్షించింది.

భూదాన్ బోర్డు ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

ఈ నేపథ్యంలో భూదాన్ భూములపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కొద్దినెలల కిందట రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూదాన్ బోర్డును తిరిగి ఉనికిలోకి తీసుకొచ్చింది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన తాడి విజయభాస్కర్‌రెడ్డి చైర్మన్‌గా బోర్డును ఏర్పాటు చేసింది. సీసీ ఎల్ఏ కార్యాలయంలోనే బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. భూదాన్ బోర్డు రికార్డులను చైర్మన్ డిజిటలీకరణ చేయిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితి తెలుసుకునేందుకు జిల్లాల నుంచి భూదాన్ భూముల వివరాలను కలెక్టర్ల ద్వారా తెప్పించుకుంటున్నారు. త్వరలో భూదాన్ భూములపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

పూర్తివివరాలు సేకరిస్తున్నాం



రాష్ట్రంలో భూదాన్ భూముల వివరాలను పూర్తిగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం. కలెక్టర్ల నుంచి వివరాలు తెప్పించుకుంటున్నాం. త్వరలో వీటిపై స్పష్టత వస్తుంది. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలకు అనుగుణంగా భూదాన్ భూముల వ్యవహారాలను కొలిక్కి తీసుకొస్తాం.
– తాడి విజయభాస్కర్‌రెడ్డి, చైర్మన్, భూదాన్ యజ్ఞ బోర్డు

అంతర్జాతీయ క్రికెటర్లను చేయడమే లక్ష్యం

- 16 నుంచి ఏపీఎల్ సీజన్–2 ప్రారంభం
- ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి
- విజయవాడలో ఉత్సాహంగా 3కే రన్


3కే రన్‌ను ప్రారంభిస్తున్న గోపీనాథ్‌రెడ్డి, గోకరాజు గంగరాజు తదితరులు

విజయవాడ స్పోర్ట్స్: 'మన ఆంధ్రా–మన ఏపీఎల్' సీజన్–2ను పురస్కరించుకుని ఏసీఏ ఆధ్వర్యాన శనివారం విజయవాడలో నిర్వహించిన 3కే రన్ ఉత్సాహంగా సాగింది. వందలాది మంది క్రికెట్ అభిమానులతో పాటు ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎ.రాకేష్, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఎన్.గీత, కేవీ పురుషోత్తం, జితేంద్రనాథ్‌శర్మ, బీసీసీఐ మాజీ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, ఏసీఏ మాజీ కార్యదర్శులు అరుణ్‌కుమార్, దుర్గాప్రసాద్, కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథరాజు, కన్వీనర్ రవిశంకర్, పలువురు కోచ్‌లు పాల్గొన్నారు. గోపీనాథ్‌రెడ్డి టార్చ్ వెలిగించి ఈ రన్‌ను ప్రారంభించారు. అనంతరం టార్చ్‌ను అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారిణి ఎండీ షబనం, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యురాలు గీతకు అందజేశారు. ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బందరు రోడ్డు, టిక్కిల్ రోడ్డు మీదుగా సిద్ధార్థ జంక్షన్ వరకు వెళ్లి, తిరిగి స్టేడియం వద్దకు ఈ రన్ చేరుకుంది. గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారులను తయారు చేయడమే ఏసీఏ ప్రధాన లక్ష్యమని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో విశాఖలో ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్–2 నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పంద్రాగస్టు సందడి



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం స్వాతంత్య్ర దిన వేడుకలకు ముస్తాబవుతోంది. పరేడ్ కోసం సాధన చేస్తున్న పోలీసులు, వివిధ రకాల శకటాలు తయారు చేస్తున్న కార్మికులతో స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

తమిళనాడు వేళాంగిణి పండుగకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): తమిళనాడు రాష్ట్రంలోని వేళాంగిణి పండుగను పురస్కరించుకుని విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్–వేలంగిణి (07161) రైలు ఈ నెల 27, 29 తేదీల్లో ఉదయం ఎనిమిది గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకు వేళాంగిణి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07162) ఈ నెల 29, 31 తేదీల్లో వేళాంగిణిలో మధ్య రాత్రి 12.30 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారు జామున 3.35 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అలాగే ముంబై ఎల్‌టీటీ– వేళాంగిణి (01161) రైలు ఈ నెల 26న మధ్యాహ్నం ఒంటి గంటకు ముంబై ఎల్‌టీటీలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 8.30 గంటలకు వేళాంగిణి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (01162) ఈ నెల 29న ఉదయం 6.00 గంటలకు వేళాంగిణిలో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు ముంబై ఎల్‌టీటీ చేరుకుంటుంది. అదే విధంగా ముంబై ఎల్‌టీటీ– వేళాంగిణి (01163) సెప్టెంబర్ 6న మధ్యాహ్నం 1.40 గంటలకు ముంబై ఎల్‌టీటీలో బయలుదేరి, మరుసటి రోజు మధ్య రాత్రి 12.30 గంటలకు వేళాంగిణి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (01164) సెప్టెంబర్ 8న రాత్రి 11.50 గంటలకు వేళాంగిణిలో బయలుదేరి, రెండవ రోజు ఉదయం 7.00 గంటలకు ముంబై ఎల్‌టీటీ చేరుతుంది.

ఎస్సీ రైతులకు ఉచితంగా విత్తనాలు

- ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం
- రాష్ట్రంలో 29,272 మంది ఎస్సీ రైతులకు మేలు


బాపట్ల జిల్లా వేమూరులో ఎస్సీ రైతులకు విత్తన కిట్లు అందిస్తున్న మంత్రి మేరుగు(ఫైల్)

సాక్షి, అమరావతి: ప్రకృతి సాగు చేపట్టిన 29,272 మంది ఎస్సీ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సాయమందిస్తోంది. ఒక్కొక్కరికీ రూ.10 వేల విలువైన విత్తనాలు, పరికరాలు(సాగు సామగ్రి) అందిస్తోంది. ప్రస్తుత సీజన్‌లో 26 జిల్లాల్లోనూ అవసరమైన విత్తనాల పంపిణీని ఇప్పటికే పూర్తి చేసింది. రాష్ట్రంలో ఆయా ప్రాంతాలకు అనువైన విధంగా పచ్చిరొట్ట ఎరువు, ప్రధాన పంటతోపాటు అంతర్ పంటలు, కూరగాయ రకాలకు చెందిన విత్తనాలను మూడు విభాగాలుగా చేసి అందిస్తున్నారు. రైతుకు అందిస్తున్న విత్తన కిట్‌లో భూసారం పెంచేందుకు దోహదం చేసే జొన్న, కందులు, పెసర, మినుము వంటి దాదాపు 13 రకాలు, వరితోపాటు పలు అంతర పంటలకు చెందినవి ఐదు రకాలు, పొలం గట్లు, దిబ్బలు, ఇంటి పెరటిలో సాగు చేసేలా మిర్చి, బొప్పాయి, టమాటా, బీర, బెండ, మునగ వంటి కూరగాయ విత్తనాలను అందిస్తోంది. దీంతోపాటు ప్రకృతి సాగు చేపట్టిన రైతులకు ప్రత్యేకంగా నైపుణ్యాభివృద్ధి శాఖ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కోసం విత్తన శుద్ధి నుంచి సాగు పద్ధతులు, సహజ సిద్ధమైన ద్రావణాల తయారీ వంటి అనేక పద్ధతులపై శిక్షణ ఇస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల విచ్చలవిడి వినియోగంతో కలుషితమైన నేలను తిరిగి ఆరోగ్యవంతంగా మార్చేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. భూసారాన్ని పెంపొందించేందుకు అవసరమైన ఎరువు, సహజ ద్రవ ఎరువులు జీవామృతం తయారీని నేర్పుతున్నారన్నారు.

రూ.6.93 కోట్ల విలువైన విత్తనాలు అందించాం

రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. కేంద్ర సహకారంతో ఎస్సీ రైతులకు జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్ఎఫ్)పై రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున అవగాహన కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలు శాఖల సమన్వయంతో విత్తనాలు, వ్యవసాయ ఉపకరణాల పంపిణీ, శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాం.
– ఎస్.చినరాముడు, ఎండీ, ఎస్సీ కార్పొరేషన్

ఏపీ రైతుకు జాతీయ అవార్డు

నందం రఘువీర్‌కు మొక్కల జన్యురక్షకుని అవార్డు


వ్యవసాయ క్షేత్రంలో నందం రఘువీర్

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన యువ అభ్యుదయ రైతు నందం రఘువీర్‌ను జాతీయ స్థాయి అవార్డు వరించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధీనంలోని ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీ సంస్థ రెండేళ్లకు ఒకసారి ఈ రంగంలో విశేష సేవలందిస్తున్న రైతులు, సంస్థలకు వివిధ కేటగిరీల్లో అవార్డులను ప్రదానం చేస్తుంది. ఇందులో భాగంగా 2023–25 సంవత్సరానికి గాను అత్యంత అరుదైన విత్తనాలను సంరక్షిస్తున్న కేటగిరీలో రఘువీర్‌ను జాతీయ మొక్కల జన్యురక్షకుని అవార్డుకు ఎంపిక చేసింది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన కార్యక్రమంలో రఘువీర్ అవార్డు, ప్రశంసాపత్రంతోపాటు రూ.1.50లక్షల నగదు బహుమతిని అందుకున్నారు.

257 రకాలు సేకరించిన రఘువీర్

అత్యంత పురాతన ధాన్యపు సిరులను సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో రఘువీర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి వ్యవసాయం వైపు వచ్చారు. దేశవ్యాప్తంగా తిరిగి ఇప్పటి వరకు 257 రకాల అత్యంత పురాతన వరి వంగడాలను సేకరించారు. వీటిలో 10కి పైగా జీఐ ట్యాగ్ కలిగిన వంగడాలు ఉన్నాయి. తాను సేకరించిన పురాతన విత్తనాలను పెనమలూరులోని సొంత పొలం 1.3 ఎకరాల్లో సంరక్షిస్తున్నారు. వీటిని భవిష్యత్ తరాల కోసం భద్రపరిచేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలులో దేశీయ విత్తన నిధి(సీడ్ బ్యాంక్)ను ఏర్పాటు చేశారు. మరో 8 జిల్లాల్లో 'విత్తన నిధి'ల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు. పురాతన వరి విత్తనాలను అందించడమే కాదు... వాటి సాగులో మెళకువలపై అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నారు. ఆయన ప్రోత్సాహంతో విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు నాలుగు రకాల పురాతన వరి వంగడాలను సాగు చేస్తున్నారు.

సందడిగా ఈశా గ్రామోత్సవాలు

సాక్షి, అమరావతి: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈశా గ్రామోత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. సద్గురు జగ్గీ వాసుదేవ్ ఇచ్చిన పిలుపుతో గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించే విధంగా క్రీడా కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. విశాఖ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, అనంతపురం, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాల్లో నిర్వహించిన 15వ ఈశా గ్రామోత్సవాలకు విశేష స్పందన లభించింది. సుమారు 1,800 మంది పైగా ఆటగాళ్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బీజేపీ భారత్ వీడిపో



కోల్‌కతా: మణిపూర్ హింసాకాండ కారకులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. అందుకే ప్రస్తుతం దేశంలో ''బీజేపీ భారత్ వీడిపో'' అన్న నినాదం మారుమోగుతోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అవినీతిపై మాట్లాడే హక్కు లేదన్నారు. పెద్ద నోట్ల రద్దు, రఫేల్ ఒప్పందం, పీఎం కేర్ నిధుల అంశంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న మోదీ ప్రభుత్వం అవినీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మమత అన్నారు. కోల్‌కతాలో శనివారం జరిగిన జీ-20 అవినీతి వ్యతిరేక సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. అవిశ్వాస తీర్మానం సమయంలో లోక్‌సభ నుంచి విపక్ష పార్టీ సభ్యులు పారిపోయారని, వారు వ్యాప్తి చేసిన నెగెటివిటీని తాము సమర్థంగా ఎదుర్కొన్నామని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలకు మమత కౌంటర్ ఇచ్చారు. దేశంలో నిరుపేద ప్రజలు బతకడం బీజేపీకి ఇష్టం లేదని, అందుకే ప్రధాని మోదీ ఇష్టారాజ్యంగా నిందలు వేస్తున్నారని అన్నారు. '''ప్రధానమంత్రి జాతిని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రతిపక్షాల గురించి మాట్లాడుతున్నారు. దేశంలో నిరుపేదలు బతకడం బీజేపీకి ఇష్టం లేదు'' అని మమత తాను విడుదల చేసిన ఒక ఆడియో మెసేజ్‌లో ఆరోపించారు. బ్రిటిష్ పాలకుల్ని క్విట్ ఇండియా అంటూ అప్పట్లో మహాత్మా గాంధీ నినదించారని, ఇప్పుడు దేశ ప్రజలు బీజేపీ క్విట్ ఇండియా అంటున్నారని మమత కేంద్రంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మోదీ దేశానికి రాజు కావాలనుకుంటున్నారు

తేజస్వీ యాదవ్ వ్యాఖ్య

పట్నా: దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేసి, ప్రధాని మోదీ మహారాజు స్థానంలో ఉండాలనుకుంటున్నారని బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ వ్యాఖ్యానించారు. దర్భంగాలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలను ప్రధాని మోదీ పట్టించుకోరన్నది వాస్తవమన్నారు. ఎన్నికల్లో గెలవడం, అధికారం నిలుపుకోవడం మాత్రమే మోదీ లక్ష్యమని తేజస్వి పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించి, మహారాజుగా మారాలన్నది మోదీ కోరికని పేర్కొన్నారు. కానీ, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లో బీజేపీకి షాక్ తప్పదని ఆయన స్పష్టం చేశారు.

కార్చిచ్చు కనిపించని ఉచ్చు..!

కార్చిచ్చులు ప్రపంచ దేశాలను భయపెడుతున్నాయి. ఏడాదికేడాది కార్చిచ్చులు పెరిగిపోతున్నాయి. అడవుల్లో మంటలు చెలరేగిన క్షణాల్లోనే సమీపంలో నగరాలకు విస్తరించి దగ్ధం చేస్తున్నాయి. అమెరికాలోని హవాయి దీవుల్లో రేగిన కార్చిచ్చుతో లహైనా రిసార్ట్ నగరం ఒక బూడిద కుప్పగా మిగిలింది. అగ్ర రాజ్యం ఎదుర్కొంటున్న అతి పెద్ద విపత్తుల్లో ఒకటిగా మిగిలిపోయిన ఈ కార్చిచ్చు బీభత్సంలో 80 మందికి పైగా మరణించారు. మౌయి దీవిలో లహైనా పట్టణంలో మంగళవారం రాత్రి మొదలైన కార్చిచ్చు ఇప్పటికీ రగులుతూనే ఉంది. వాతావరణం పొడిగా ఉండడంతో పాటు హరికేన్ ఏర్పడడంతో ద్వీపంలో బలమైన గాలులు వీచాయి. దీంతో శరవేగంతో మంటలు వ్యాపించి అందాల నగరాన్ని దగ్ధం చేశాయి.



మరుభూమిలా లహైనా రిసార్ట్ నగరం

మొన్న గ్రీస్, నిన్న కెనడా, ఇవాళ హవాయి

- బూడిద కుప్పగా మారిన లహైనా నగరం
- వాతావరణ మార్పులతో పెరిగిపోతున్న కార్చిచ్చులు
- అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌కు అత్యధిక ముప్పు

మొదలైతే.. అంతే

→ పశ్చిమ అమెరికా, దక్షిణ ఆస్ట్రేలియాలో తరచూ కార్చిచ్చులు సంభవిస్తూ ఉంటాయి. చరిత్రలో అతి పెద్ద కార్చిచ్చులన్నీ అక్కడే వ్యాపించాయి. గత కొన్నేళ్లుగా బ్రిటన్ అత్యధికంగా కార్చిచ్చుల బారినపడుతోంది. 2019లో బ్రిటన్‌లో 135 కార్చిచ్చులు వ్యాపించి 113 చదరపు మైళ్ల అడవిని దగ్ధం చేశాయి. రష్యా, కెనడా, బ్రెజిల్ దేశాలకు కూడా కార్చిచ్చు ముప్పు అధికంగా ఉంది.

→ బ్రిటన్‌లో మాంచెస్టర్‌లో 2019లో సంభవించిన కార్చిచ్చు ఏకంగా మూడు వారాల పాటు కొనసాగింది. 50 లక్షల మంది వాయు కాలుష్యంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు.

2000 సంవత్సరంలో ఆస్ట్రేలియాలో వ్యాపించిన కార్చిచ్చు వేలాది ఇళ్లను దగ్ధం చేసింది. 300 కోట్ల జంతువులు మరణించడమో లేదంటే పారిపోవడం జరిగింది.

→ అమెరికాలో కాలిఫోర్నియాలో ఎక్కువగా కార్చిచ్చులు వ్యాపిస్తూ ఉంటాయి. 2020లో కార్చిచ్చు 4 లక్షల హెక్టార్ల అడవుల్ని మింగేసింది. 1200 భవనాలు దగ్ధమయ్యాయి.

→ -2021లో ప్రపంచ దేశాల్లో కార్చిచ్చుల వల్ల 176 వందల కోట్ల మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ గాల్లో కలిసింది

కార్చిచ్చులతో ఏర్పడిన కాలుష్యానికి ప్రపంచంలో ఏడాదికి దాదాపుగా 34 వేల మందికి ఆయుష్షు తగ్గి ముందుగానే మరణిస్తున్నారు.

→ 1918లో అమెరికాలో మిన్నెసోటాలో ఏర్పడిన కార్చిచ్చు చరిత్రలో అతి పెద్దది. ఈ కార్చిచ్చు వెయ్యి మంది ప్రాణాలను బలి తీసుకుంది.

→ యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ అంచనాల ప్రకారం ప్రపంచంలో ఏడాదికి 40 లక్షల చదరపు కిలో మీటర్ల అడవుల్ని కోల్పోతున్నాం.

ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం 2030 నాటికి పెరిగిపోనున్న కార్చిచ్చులు **14%**

2050 నాటికి **30%** | ఈ శతాబ్దం అంతానికి **50%**

కార్చిచ్చులు పెరుగుతాయని యూఎన్ హెచ్చరించింది.

ఎందుకీ మంటలు ?

- కార్చిచ్చులు ప్రకృతి విపత్తే అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న కార్చిచ్చుల్లో 10 నుంచి 15% మాత్రమే సహజంగా ఏర్పడుతున్నాయి. వాతావరణం పొడిగా ఉండి, కరువు పరిస్థితులు ఏర్పడి, చెట్లు ఎక్కువగా ఎండిపోయి ఉన్నప్పుడు మండే ఎండలతో పాటు ఒక మెరుపు మెరిసినా కార్చిచ్చులు ఏర్పడతాయి. బలమైన గాలులు వీస్తే అవి మరింత విస్తరిస్తాయి.
- మానవ తప్పిదాల కారణంగా 85 నుంచి 90% కార్చిచ్చులు సంభవిస్తున్నాయి. అడవుల్లో ఎంజాయ్ చేయడానికి వెళ్లి క్యాంప్‌ఫైర్ వేసుకొని దానిని ఆర్పేయకుండా వదిలేయడం, సిగరెట్లు పారేయడం, విద్యుత్ స్తంభాలు వంటివి కూడా కార్చిచ్చుకి కారణమవుతున్నాయి.
- ఇంధనం లేదంటే మరే మండే గుణం ఉన్న పదార్థాలు చెట్లు, పొదలు, గడ్డి దుబ్బులు ఉన్న అటవీ ప్రాంత సమీపాల్లో ఉంటే కార్చిచ్చులు ఏర్పడతాయి. 2021లో కాలిఫోర్నియాలో చమురు కారణంగా 7,396 కార్చిచ్చులు ఏర్పడి 26 లక్షల ఎకరాల అటవీ భూమి దగ్ధమైంది.
- ప్రస్తుతం అమెరికా హవాయి ద్వీపంలో కార్చిచ్చు మెరుపు వేగంతో వ్యాపించడానికి డ్రైౌన్ టోర్నడో వల్ల ఏర్పడిన బలమైన గాలులే కారణం. కాలిఫోర్నియాలో ఎక్కువగా కార్చిచ్చులు వ్యాపించడానికి గాలులే ప్రధాన పాత్ర పోషించాయి.



లహైనాలోని ఓ శిథిల భవనం

\- సాక్షి, నేషనల్ డెస్క్

అగ్గి మరింత రాజేస్తున్న వాతావరణ మార్పులు

సహజసిద్ధంగా ఏర్పడే కార్చిచ్చుల వల్ల అడవుల్లో ఎండిపోయిన వృక్ష సంపద దగ్ధమై భూమి తిరిగి పోషకాలతో నిండుతుంది. మానవ నిర్లక్ష్యంతో ఏర్పడే కార్చిచ్చులు ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఇవాళ రేపు వాతావరణ మార్పుల కారణంగా ఏర్పడే కార్చిచ్చులు ఎక్కువైపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ పరిస్థితులతో వాతావరణం పొడిగా ఉండడం, ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, కర్బన ఉద్గారాల విడుదల ఎక్కువైపోవడం వంటి వాటితో దావానలాలు పెరిగిపోతున్నాయి. 1760లో పారిశ్రామిక విప్లవం వచ్చిన తర్వాత భూ ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల సెల్సియస్ పెరిగిపోయాయి. దీని ప్రభావం ప్రకృతిపై తీవ్రంగా పడింది. అటవీ ప్రాంతాల్లో తేమ తగ్గిపోవడం వల్ల కార్చిచ్చులు మరింత ఎక్కువ కాలం పాటు సంభవిస్తున్నాయి. జనాభా పెరిగిపోవడం వల్ల అటవీ ప్రాంతాలకు దగ్గరగా నివాసం ఏర్పరచుకోవడంతో కార్చిచ్చులు జనావాసాలకు పాకి భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. వాతావరణ మార్పుల కారణంగా అమెరికాలోని కాలిఫోర్నియాలో అత్యధికంగా కార్చిచ్చులు సంభవిస్తున్నాయి. భవిష్యత్‌లో వీటి తీవ్రత మరింత పెరిగిపోయే ఛాన్స్ కూడా ఉంది. మొత్తానికి ఏ సమస్య అయినా భూమి గుండ్రంగా ఉంది అన్నట్టుగా గ్లోబల్ వార్మింగ్ దగ్గరకే వచ్చి ఆగుతోంది. భూతాపాన్ని అరికట్టడానికి ప్రపంచ దేశాలు చిత్తశుద్ధితో పని చేస్తే కార్చిచ్చులతో పాటు ఇతర సమస్యల్ని కూడా అధిగమించవచ్చు.

చరిత్రలో భారీ కార్చిచ్చులు

దేశం	ఏడాది	దగ్ధమైన అటవీ
రష్యా	2003	2.2 కోట్ల హెక్టార్లు
ఆస్ట్రేలియా	2020	1.7 కోట్ల హెక్టార్లు
కెనడా	2014	45 లక్షల హెక్టార్లు
అమెరికా	2004	26 లక్షల హెక్టార్లు

ఢిల్లీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఐఏఎస్‌లు సహా ప్రభుత్వ అధికారుల బదిలీలు, నియామకాలపై కేంద్రానికి అధికారాలు కట్టబెట్టిన వివాదాస్పద ఢిల్లీ సర్వీసు బిల్లు చట్టంగా మారింది. ఈసారి వర్షాకాలం సమావేశాల్లో వివాదాస్పద బిల్లులైన ఢిల్లీ సర్వీసు బిల్లు, డిజిటల్ డేటా బిల్లుల్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం ఆమోదించారు. వీటితో పాటు జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు , జన విశ్వాస్ (సవరణ) బిల్లులపై రాష్ట్రపతి సంతకం చేశారు. వీటిలో ఢిల్లీ పాలనాధికారాల బిల్లు (జాతీయ రాజధాని ప్రాంత సవరణ బిల్లు), డిజిటల్ డేటా (డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ బిల్లు) బిల్లులపై పార్లమెంటులో విపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఢిల్లీలో ప్రభుత్వ అధికారుల నియామకాలు, బదిలీలపై ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికే అధికారం ఉంటుందని సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేంద్ర ప్రభుత్వం అధికారాలన్నీ కేంద్రానికే కట్టబెడుతూ ఆర్డినెన్స్ తెచ్చింది. దీనిపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ, ఇతర విపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రతిపక్షాల నిరసనల మధ్య ఈ బిల్లుని మొదట లోక్‌సభ, ఆ తర్వాత రాజ్యసభ ఆమోదించాయి. ఇప్పుడు రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారింది. అదే విధంగా డిజిటల్ డేటా ప్రొటెక్షన్ బిల్లును మణిపూర్ అంశంపై ప్రతిపక్షాల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో ఉభయ సభలు ఆమోదించాయి. ఈ బిల్లులో విపక్ష పార్టీలు కొన్ని సవరణలు సూచించినా ప్రభుత్వం చేపట్టలేదు. బిల్లులో కేంద్ర ప్రభుత్వం సహా కొందరికి మినహాయింపులు ఇవ్వడంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురయ్యాయి.

సగం సమయం కూడా పని చెయ్యలేదు

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు షెడ్యూల్ సమయంలో సగం కూడా పని చెయ్యలేదు. అయినప్పటికీ రికార్డు స్థాయిలో 23 బిల్లులు పాసయ్యాయి. మణిపూర్‌లో జాతుల ఘర్షణ ఈసారి ఉభయసభల్ని కుదిపేసింది. లోక్‌సభ కార్యకలాపాలు 43% జరిగితే, రాజ్యసభ 55% సమయం కార్యకలాపాలు కొనసాగించింది. పాలసీ రీసెర్చ్ స్టడీస్ (పీఆర్ఎస్) అందించిన డేటా ప్రకారం లోక్‌సభ 17 రోజులు సమావేశమైంది. అవిశ్వాస తీర్మానంపై 20 గంటల సేపు చర్చ జరిగింది. ఈ చర్చలో 60 మంది సభ్యులు పాల్గొన్నారు. పార్లమెంటు ఆమోదించిన బిల్లుల్లో ఢిల్లీలో పాలనాధికార బిల్లు, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, అటవీ సంరక్షణ సవరణ బిల్లు, మైన్స్ అండ్ మినరల్స్ సవరణ బిల్లు ప్రధానమైనవి. ఈసారి సభలో ప్రవేశ పెట్టిన బిల్లుల్లో 56% కేవలం ఎనిమిది రోజుల్లో పార్లమెంటు ఆమోదాన్ని పొందాయి. మరో 17% బిల్లుల్ని కమిటీల పరిశీలనకు పంపారు.

విపక్షాలు పారిపోయాయి

- మణిపూర్ పై లోక్ సభలో చర్చించనీయలేదు
- మణిపురీలకు ద్రోహం చేశాయి
- ప్రతిపక్షాల నిజ రూపాన్ని బట్టబయలు చేయండి
- బీజేపీ శ్రేణులకు ప్రధాని పిలుపు

న్యూఢిల్లీ: విపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ పెద్దపెట్టున విరుచుకుపడ్డారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభ నుంచి పారిపోయాయని ఎద్దేవా చేశారు. దాన్ని దేశమంతా వీక్షించిందన్నారు. మణిపూర్ హింసాకాండపై చర్చ విషయంలో వాటికి చిత్తశుద్ధే లేదని ఆరోపించారు. మణిపూర్ ప్రజలకు అవి ద్రోహం చేశాయన్నారు. ప్రజా సంక్షేమం కంటే స్వార్థ రాజకీయాలకే విపక్షాలు ప్రాధాన్యమిచ్చాయని దుమ్మెత్తిపోశారు. దాంతో కీలక సమస్యలకు పార్లమెంటులో చర్చ ద్వారా పరిష్కారం సాధించే సువర్ణావకాశం చేజారిందని ఆవేదన వెలిబుచ్చారు. దేశవ్యాప్తంగా విపక్షాలు వ్యాప్తి చేస్తున్న ప్రతికూల భావజాలాన్ని తమ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. పశ్చిమ బెంగాల్లో పంచాయతీ రాజ్ పరిషత్‌ను ఉద్దేశించి శనివారం మోదీ వర్చువల్‌గా మాట్లాడారు.

వారికి రాజకీయాలే ముఖ్యం

రెండు రోజుల క్రితమే విపక్షాల అవిశ్వాస తీర్మానాన్ని 140 కోట్ల భారతీయుల ఆశీర్వాదంతో ఓడించామని మోదీ అన్నారు. 'అలాగే వారు వ్యాప్తి చేస్తున్న ప్రతికూలతనూ ఓడించాం. మణిపూర్ అంశంపై చర్చించాలని కేంద్రం భావిస్తోందంటూ పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలయ్యే ముందే విపక్షాలకు లేఖ రాశామని. కానీ ఏం జరిగిందో మీరంతా చూశారు. దానిపై చర్చను అవే అడ్డుకున్నాయి. అంతటి సున్నిత అంశంపై చర్చ జరిగి ఉంటే మణిపూర్ ప్రజలకు కాస్త ఊరట దక్కి ఉండేది. సమస్యకు కొన్నయినా పరిష్కారాలు దొరికి ఉండేవి. కానీ మణిపూర్ హింసాకాండకు మూల కారణానికి సంబంధించిన వాస్తవాలు విపక్షాలను ఎంతో బాధిస్తాయి. కనుక కావాలనే చర్చను జరగనీయలేదు. అసలు పార్లమెంటులో ఏ చర్చ జరగడమూ వారికి ఇష్టం లేదు. ప్రజల బాధ వాటికి పట్టదు. కావాల్సిందల్లా కేవలం రాజకీయాలు' అంటూ తూర్పారబట్టారు. విపక్షాల నిజ రూపాన్ని దేశ ప్రజల ముందు బట్టబయలు చేయాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'ప్రజల విశ్వాసమే నాకు స్ఫూర్తినిస్తుంది. నా ఆత్మవిశ్వాసాన్ని, ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది' అని అన్నారు.

మమతది అరాచక పాలన

గత నెల బెంగాల్‌లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విపక్షాలను భయభ్రాంతులను చేసేందుకు పాలక తృణమూల్ కాంగ్రెస్ భయోత్పాతానికి, బెదిరింపులకు దిగిందని విమర్శించారు. పైగా ప్రజాస్వామ్య పరిరక్షకుల్లా పోజులు కొడుతోందని మండిపడ్డారు.

నేరగాళ్ల ఆస్తులను జప్తు చేద్దాం
జీ 20 దేశాలకు మోదీ పిలుపు

కోల్‌కతా: అవినీతిపై ఉమ్మడిగా పోరాడదామని జీ 20 దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆర్థిక తదితర నేరాలకు పాల్పడి విదేశాల్లో తలదాచుకునే ఘరానా వ్యక్తుల ఆస్తులను జప్తు చేయాలని సూచించారు. శనివారం కోల్‌కతాలో జరిగిన జీ 20 అవినీతి నిరోధక మంత్రుల స్థాయి భేటీని ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అలాంటి నేరగాళ్లు విదేశాల్లో కూడబెట్టిన, పోగేసిన అక్రమాస్తులను, చేసిన అక్రమాలను సకాలంలో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా నేరగాళ్లను వీలైనంత త్వరగా మాతృదేశానికి అప్పగించడం కూడా సులువవుతుందని అభిప్రాయపడ్డారు. అవినీతి వల్ల అందరి కంటే ఎక్కువ నష్టపోయేది నిరుపేదలేనని మోదీ ఆవేదన వెలిబుచ్చారు.

దళితులు, గిరిజనులకు సముచిత గౌరవం

- గత ప్రభుత్వాలకు వీరు ఎన్నికలప్పుడే గుర్తొచ్చేవారు
- మధ్యప్రదేశ్ సభలో ప్రధాని మోదీ విమర్శలు



సాగర్: గత ప్రభుత్వాలకు దళితులు, ఓబీసీలు, గిరిజనులు ఎన్నికలప్పుడే గుర్తుకు వచ్చేవారని ప్రధాని మోదీ ఆరోపించారు. దళిత బస్తీలు, నిరుపేదలుండే ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో నీటి వసతి కూడా ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం మాత్రం దళితులు, ఓబీసీలు, గిరిజనులకు సముచిత గౌరవం ఇచ్చిందని, జల్ జీవన్ మిషన్ ద్వారా వారి ఇళ్లలోకే మంచినీరు అందిస్తోందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా బడ్‌తుమా గ్రామంలో శనివారం ప్రధాని సంత్ రవిదాస్ జ్ఞాపకార్థం 11 ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్లతో నిర్మించే ఆలయం-స్మారక నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బినా-కోటా డబుల్ లేన్ రైలు మార్గాన్ని జాతికి అంకితం చేయడంతోపాటు వివిధ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ధానాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు.

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా అన్వరుల్ హక్



ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా సెనేటర్ అన్వరుల్ హక్ కకర్(52) ఎంపికయ్యారు. ప్రధాని పదవి నుంచి వైదొలగనున్న షెహబాజ్ షరీఫ్, ప్రతిపక్ష నేత రజా రియాజ్ రెండు విడతలుగా చర్చలు జరిపిన మీదట కకర్ పేరుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. బలూచిస్తాన్ అవామీ పార్టీ(బీఏపీ)కి చెందిన కకర్ ఈ ఏడాది చివర్లో జరగనున్న సాధారణ ఎన్నికలు, దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాల్సిన కీలక బాధ్యతలను నెరవేర్చాల్సి ఉంటుంది. చిన్న ప్రావిన్స్ అయిన బలూచిస్తాన్‌కు చెందిన కకర్ పేరును ఆపద్ధర్మ ప్రధాని పదవికి ప్రతిపాదించినట్లు రియాజ్ మీడియాతో అన్నారు. ఈ మేరకు అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీకి ప్రతిపాదన పంపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 224(1ఏ)ను అనుసరించి అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆపద్ధర్మ ప్రధానిగా కకర్ నియామకంపై ఆమోదం తెలపడం కూడా వెంటనే జరిగిపోయింది. ప్రధాని షరీఫ్ ఈ నెల 9న దిగువ సభ నేషనల్ అసెంబ్లీని రద్దు చేసిన విషయం తెలిసిందే. రాజ్యాంగం ప్రకారం 90 రోజుల్లోగా ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. అయితే, జనగణన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నందున ఎన్నికలు మరో రెండు నెలలు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆపద్ధర్మ ప్రధానిగా అన్వరుల్ హక్ కకర్ కొనసాగుతారు.

క్రిమియాలో 20 డ్రోన్లు కూల్చివేశాం: రష్యా

కీవ్: ఆక్రమిత క్రిమియాపై డ్రోన్ల దాడిని తిప్పికొట్టినట్లు రష్యా తెలిపింది. ఉక్రెయిన్ ప్రయోగించిన సుమారు 20 డ్రోన్లను కూల్చివేసినట్లు శనివారం రష్యా రక్షణ శాఖ పేర్కొంది. ఇందులో 14 డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేయగా మరో ఆరింటిని జామర్లు నిర్వీర్యం చేశాయని వెల్లడించింది. ఎటువంటి నష్టం వాటిల్లలేదని పేర్కొంది. రష్యా ప్రకటనపై ఉక్రెయిన్ స్పందించలేదు. వరుసగా మూడు రోజులుగా రాజధాని మాస్కోపై డ్రోన్ దాడులు జరగడంతో రష్యా అప్రమత్తమైంది. ఇలా ఉండగా, ఉక్రెయిన్‌లోని లుహాన్స్క్ ప్రాంతానికి చెందిన ఉరోజీహాయిన్ అనే గ్రామాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు రష్యా శనివారం ప్రకటించుకుంది. ఖర్కివ్, జపొరిజియా ప్రాంతాలతోపాటు, అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత పట్టణం క్రివ్విరిహ్‌ల్లో జరిగిన రష్యా బాంబు దాడుల్లో ఇద్దరు చనిపోగా మరో 16 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ యంత్రాంగం తెలిపింది.

నైజీరియాలో మసీదు కూలి.. ఏడుగురు మృతి

అబుజా: నైజీరియాలో మసీదు పైకప్పు కుప్పకూలిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు. కదునా రాష్ట్రం జరియా నగరంలోని జరియా సెంట్రల్ మాస్క్‌లో వేలాది మంది శుక్రవారం ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. 1830లో నిర్మించిన ఈ మసీదు పైకప్పు కూలి పడటంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా మరో 23 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు.

భారత్-చైనా ఆర్మీ మధ్య రేపు చర్చలు

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లోని మిగిలిన ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణ వేగంగా జరగాలని భారత్ స్పష్టం చేయనుంది. భారత్- చైనా మధ్య 19వ విడత చర్చలు ఈ నెల 14న జరగనున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రెండు దేశాల కార్ప్స్ కమాండర్ స్థాయి చివరి దఫా చర్చలు నాలుగు నెలల క్రితం జరిగాయి. రేపు జరిగే చర్చల్లో మిగిలిన ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణ పూర్తిగా జరగాలని భారత ప్రతినిధి బృందం పట్టుబట్టనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. రెండు దేశాల మధ్య పలు విడతలుగా జరిగిన చర్చల ఫలితంగా తూర్పులద్దాఖ్‌లోని కొన్ని ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి ఇరు పక్షాలు బలగాలను ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. 18వ విడత చర్చల్లో ప్రధానంగా డెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకోవాలంటూ భారత్ గట్టిగా డిమాండ్ చేసింది. తాజా చర్చలు చుషుల్-మోల్డో సరిహద్దు పాయింట్‌లోని భారత భూభాగంలో జరుగుతాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. భారత బృందానికి లెఫ్టినెంట్ జనరల్ రషీమ్ బాలి, చైనా కు సౌత్ జిన్‌జియాంగ్ మిలటరీ డిస్ట్రిక్ట్ కమాండర్ నాయకత్వం వహించే అవకాశాలున్నాయి.

ప్రధానిని కించపరచలేదు

- 'నీరవ్' వ్యాఖ్యపై క్షమాపణ చెప్పను
- కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి స్పష్టీకరణ
- 'ఇండియా'పేరును ప్రధాని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్న



న్యూఢిల్లీ: మణిపూర్ హింసపై లోక్‌సభలో మాట్లాడనందుకే నీరవ్ అనే మాటను వాడాను తప్ప, ఆయన్ను కించపరచడానికి కాదని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మణిపూర్ హింసపై ప్రధానమంత్రి మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచీ డిమాండ్ చేస్తోందని చెప్పారు. ప్రధాని మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయే సరికి 'నీరవ్'అనే మాటను వాడానే తప్ప వేరే ఉద్దేశం లేదన్నారు. నీరవ్‌కు నిశ్శబ్దం అనే అర్థం ఉందన్నారు. పార్లమెంట్‌లో ఎవరినైనా అగౌరవపరచాలనే ఆలోచన తనకు లేశ మాత్రమైనా లేదని చెప్పారు. ఏదైనా మాట అన్ పార్లమెంటరీగా అనిపిస్తే తొలగించేందుకు నిబంధనల ప్రకారం స్పీకర్‌కు అధికారముందని చౌదరి తెలిపారు. ఒకరి ప్రతీకార, అహంకార వైఖరికి తానెందుకు క్షమాపణ చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షం గళం వినిపించకుండా చేసేందుకే బీజేపీ నేతలు పథకం ప్రకారం అనుచిత విధానాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. తన సస్పెన్షన్‌ను తిరోగమన చర్యగా ఆయన అభివర్ణించారు. ఉరితీసిన తర్వాత విచారణను ఎదుర్కోవాల్సిన పరిస్థితిలో తనను ఉంచారంటూ వ్యాఖ్యానించారు. సస్పెన్షన్‌పై చట్టపరంగా ముందుకెళ్లేందుకు గల అవకాశాలను పరిశీలిస్తానన్నారు. అనుచిత ప్రవర్తన కారణంతో అధిర్ రంజన్ చౌదరిని గురువారం లోకసభ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆయనపై సభా హక్కుల కమిటీ నివేదిక ఇచ్చేవరకు సస్పెన్షన్ కొనసాగనుంది. భారత్, ఇండియా ఒక్కటే అయినప్పుడు ప్రధాని మోదీ మాత్రం ప్రతిపక్ష 'ఇండియా'కూటమి పేరును ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడం లేదని అధిర్ రంజన్ చౌదరి అన్నారు. 'అంత శక్తిమంతుడైన మోదీకి ఇండియా పదంతో వచ్చిన ఇబ్బందేమిటి? భారత్, ఇండియా రెండూ ఒక్కటేనని రాజ్యాంగం కూడా చెప్పింది. అయినా బీజేపీ నేతలు రెండింటి మధ్య తేడాలు చూపిస్తున్నారు'అని అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఘర్షణలకు మణిపూర్ పరిణామాలకు పోలిక లేదని, అక్కడ మానవీయ సంక్షోభం నెలకొని ఉందని చెప్పారు. మణిపూర్‌లో పరిస్థితులు దేశంపై ప్రభావం చూపుతున్నాయని కేంద్రం భావిస్తే పరిష్కరించేందుకు మరింతగా కృషి చేయాలని సూచించారు.

మణిపూర్ సమస్యను కామెడీగా మార్చేస్తారా?

- మోదీ! నీకెంత ధైర్యం!
- ప్రధానిపై రాహుల్ ధ్వజం
- నువ్వూ, నీ మంత్రులు నవ్వుకుంటారా?
- 2 గంటల ప్రసంగంలో మణిపూర్ కు 2 నిమిషాలేనా!

వయనాడ్: మణిపూర్ హింసాకాండ వంటి అతి తీవ్రమైన సమస్యను ప్రధాని నరేంద్ర మోదీ నవ్వులాటగా మార్చేశారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. వయనాడ్ ఎంపీ అయిన ఆయన అనర్హత వేటు తొలగాక శనివారం తొలిసారి కేరళలో పర్యటించారు. కాల్పెట్టలో యూడీఎఫ్ బహిరంగ సభలో మాట్లాడారు. మణిపూర్ సమస్యను విపక్షాలు పార్లమెంటు దాకా తీసుకెళ్లి చర్చకు పెట్టినా దానిపై మాట్లాడటానికి కూడా మోదీ ఇష్టపడలేదని ఆరోపించారు. 'అవిశ్వాస తీర్మానంపై చర్చకు బదులిస్తూ మోదీ 2 గంటల 13 నిమిషాల సేపు ప్రసంగించారు. అందులో ఏకంగా 2 గంటల పాటు కాంగ్రెస్ గురించి, నా గురించి, విపక్ష ఇండియా కూటమి గురించి... ఇలా అన్నింటి గురించీ మాట్లాడారు. అంతసేపూ మోదీ, ఆయన మంత్రివర్గ సహచరులు అన్నింటి మీదా జోకులు వేశారు. నవ్వుకున్నారు. కానీ అసలు సమస్య మణిపూర్ హింసాకాండ గురించి మాట్లాడేందుకు మాత్రం మోదీ కేటాయించింది కేవలం రెండంటే రెండే నిమిషాలు! భారత్ అనే భావనకే మణిపూర్‌లో తూట్లు పొడిచారు' అని మండిపడ్డారు. భారత్ అనే భావనకే తూట్లు పొడిచే వాళ్లు జాతీయవాదులు ఎలా అవుతారని రాహుల్ ప్రశ్నించారు.



రాహుల్ గాంధీ శనివారం కేరళ వెళ్తూ మార్గమధ్యంలో తమిళనాడులోని ముత్తునాడు వద్ద 'తోడ' జాతి గిరిజనులతో ముచ్చటించారు. బరువైన గుండ్రటి బండరాయిని ఓ వ్యక్తి అవలీలగా భుజంపైకి ఎత్తుకోవడాన్ని ఆసక్తిగా గమనించారు. వారితో కలిసి నృత్యం చేశారు.

మణిపురీల దుస్థితి చూసి.. చలించిపోయా

మణిపూర్ పర్యటన సందర్భంగా అక్కడి బాధితుల దుస్థితి చూసి ఆపాదమస్తకం చలించిపోయానని రాహుల్ గుర్తు చేసుకున్నారు. తన 19 ఏళ్ల రాజకీయ జీవితంలో అంతటి దారుణ పరిస్థితులను ఎన్నడూ చూడలేదని ఆవేదన వెలిబుచ్చారు. బీజేపీయే తన స్వార్థ ప్రయోజనాల కోసం మణిపూర్ ప్రజల మధ్య నిలువునా చీలిక తెచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనాలంటే కనీసం ఐదేళ్లయినా పడుతుందని అభిప్రాయపడ్డారు. ' పునరావాస కేంద్రాల్లో ఒక మహిళ చెప్పింది విని కన్నీరు పెట్టా. కొడుకును ఆమె కళ్ల ముందే చంపారు. మిగతా అందరూ కుటుంబాలతో ఉంటే ఆమె మాత్రం ఒంటరిగా పడుకుని కనిపించింది. మీ వాళ్లెక్కడ అని అడిగితే ఎవరూ మిగల్లేదంటూ ఏడ్చేసింది. తన పక్కన పడుకున్న కొడుకును కళ్ల ముందే కాల్చేస్తే రాత్రంతా శవం పక్కనే గడిపానని గుర్తు చేసుకుంది. తనెలాగూ తిరిగి రాడని గుండె రాయి చేసుకుని పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నానని చెప్పింది. ఆ ఘోర కలి గురించి చెప్తూ కూడా వణికిపోయింది. ఇంకో బాధిత మహిళ తనకు జరిగిన దారుణాలను తలచుకున్నంత మాత్రాన్నే స్పృహ తప్పి పడిపోయింది. మణిపూర్‌లో ఇలాంటి దారుణ గాథలు వేలాదిగా ఉన్నాయి. నా తల్లికి, చెల్లికి ఇలా జరిగితే ఎలా ఉంటుందని ఊహించుకున్నా' అన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

ఆదివారం । 13 । ఆగస్టు । 2023

ఓంశక్తి పాహిమాం

చింతామణి: దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చింతామణిలో ఓంశక్తి మాల ధరించిన మహిళలు అమ్మవారికి ఘనంగా గంజి పూజలు నిర్వహించారు. శనివారం జ్యోతులు ఎత్తుకుని ఊరేగింపుగా ప్రముఖ వీధుల గుండా ఓంశక్తి అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు.


మహిళలు జ్యోతులు మోస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

ప్రాణం తీసిన సెల్ఫీ పిచ్చి?

- నదిలో పడి యువకుడు గల్లంతు


గాలింపు జరుపుతున్న దృశ్యం

శివమొగ్గ: సెల్ఫీ పిచ్చి ప్రాణాలు తీసేస్తున్నా యువతలో మార్పు రావడం లేదు. తాజాగా శివమొగ్గ తాలూకా గాజనూరులోని తుంగా జలాశయం పవర్ హౌజ్ వద్ద సెల్ఫీ తీసుకుంటూ ఓ యువకుడు జారి నీటిలో పడిగల్లంతయ్యాడు. ఈ ఘటన శనివారం వెలుగుచూసింది. వివరాలు...మిళఘట్ట లేఔట్‌కు చెందిన హరీష్ (26) శుక్రవారం సాయంత్రం సెల్ఫీ తీసుకోవడానికి పవర్‌హౌజ్ వద్దకు వెళ్లాడు. అంచుకు వెళ్లి తీసుకుందామని అనుకున్నాడు. అంతలోనే కాలు జారి నదిలో పడిపోయాడు. తుంగా నగర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అతని కోసం అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు.

కాంట్రాక్టు టీచరుకు హెచ్‌ఎం వేధింపులు


పాఠశాల ముందు దళిత సంఘం ధర్నా

గౌరిబిదనూరు: తాలూకాలోని దారినాయకన పాళ్య (డి పాళ్య) గ్రామంలోని ప్రభుత్వ కర్ణాటక పబ్లిక్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడైన రాజేశ్ కాంట్రాక్టు టీచర్‌ను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని, అతని మాటలు వినకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తానని బెదిరిస్తున్నాడని దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఆమెను వేధించడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని సమితి నేతలు ఆరోపించారు. ఇది తెలిసి తాలూకా విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి అక్కడకు చేరుకుని నిరసనకారులతో చర్చించారు. హెచ్‌ఎం పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు వినతి పత్రమిచ్చారు. సర్వశిక్షా అభియాన్ అధికారి గంగారెడ్డి పాల్గొన్నారు.

ఏదైనా జరిగితే ఎవరిది బాధ్యత?


ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న మహిళ

యశవంతపుర: బిడ్డను ఒళ్లో కూర్చొ బెట్టుకుని ఓ మహిళ ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డుపై వెళ్తున్న వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. శుక్రవారం గదగ నుంచి నగరంలోని జిల్లా ఆస్పత్రికి తిరిగే బస్సులో ఈ దృశ్యం కనిపించింది. బస్సు పూర్తిగా ప్రయాణికులతో నిండిపోయిన కారణంగా తన బిడ్డను తీసుకుని ఆస్పత్రికి వెళ్లవలసి ఉండగా ధైర్యంగా ఆమె ఫుట్‌బోర్డుపై కూర్చుంది. చంటిబిడ్డ ఉన్న ఆమెకు ఎవరూ సీటు ఇవ్వలేదు. బస్సు పక్కన వెళ్తున్న వ్యక్తులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.

నిప్పు వెనుక నిజాలేమిటి?

- దర్యాప్తునకు 3 బృందాల ఏర్పాటు
- మిస్టరీగా బెంగళూరు పాలికె క్వాలిటీ కంట్రోల్‌లో అగ్నిప్రమాదం

శివాజీనగర: బెంగళూరులో అనేక పనుల నాణ్యతపై ఆరోపణలు సాగుతుండగా, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు విచారణల మీద విచారణలు జరిపిస్తోంది. కాంట్రాక్టర్లు ఏమో తమకు బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పనులు చేయకుండానే అందరూ కుమ్మక్కై నిధులు మింగేశారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో బీబీఎంపీ ప్రధాన కార్యాలయం ఆవరణలోని క్వాలిటీ కంట్రోల్‌లో ఎన్నడూ లేని రీతిలో శుక్రవారం భారీఎత్తున జరిగిన అగ్ని ప్రమాదం తీవ్ర చర్చకు కారణమైంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం మూడు బృందాల ద్వారా ప్రత్యేక విచారణ జరిపించాలని నిర్ణయించింది. శనివారం ఉదయమే ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి విచారణకు తరలించారు.

ఇద్దరు ఇంజినీర్లు, ఉద్యోగి అరెస్టు

ముఖ్యంగా నకిలీ బిల్లుల ద్వారా బీబీఎంపీ నిధులు స్వాహా చేసిన అధికారులు, ఉద్యోగులే క్వాలిటీ కంట్రోల్ ప్రయోగాలయంలో సంభవించిన అగ్ని ప్రమాదం వెనుక ఉన్నారనే అనుమానం సర్వత్రా వినిపిస్తోంది. పూర్తి వాస్తవాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీబీఎంపీ అధికారులు, పోలీసులతో కలిసి మూడు బృందాలతో విచారణకు ఆదేశించింది. అగ్ని ప్రమాదంపై బీబీఎంపీ చీఫ్ ఇంజినీర్ కే.ప్రహ్లాద్ హలసూరు గేట్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా ఐపీసీ సెక్షన్ 337, 338 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఉన్న ఇద్దరు పాలికె ఇంజినీర్లు, ఒక డీ గ్రూప్ ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ ముగ్గురు ల్యాబ్‌కు ఎందుకు వెళ్లారు, ప్రమాదం జరిగిన వెంటనే ఎందుకు పరిగెత్తి వచ్చారు అనేది అనుమానాస్పదంగా మారింది.


ఘటనాస్థలిలో పోలీసుల తనిఖీలు

దుండగులకు శిక్ష తప్పదన్న హస్తం

బీబీఎంపీ కార్యాయంలో అగ్ని ప్రమాదంపై అధికార కాంగ్రెస్ బీజేపీ మీద మండిపడింది. బీబీఎంపీ పనుల నాణ్యతను తనిఖీ చేసే ల్యాబ్‌లో అగ్గి పడడం ఆకస్మికం కాదు, కుట్ర అని రాష్ట్ర కాంగ్రెస్ ట్వీట్ చేసింది. దీని వెనుక ఉన్న దుండగులను కనిపెట్టి సంకెళ్లు వేయడం తప్పదని హెచ్చరించింది. బీజేపీ ప్రభుత్వ అవధిలో జరిగిన 40 శాతం కమీషన్ అక్రమాలపై విచారణ జరుగుతున్నప్పుడే ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి, దీనివెనుక బీజేపీ వారు ఉండవచ్చనే అనుమానాన్ని పరోక్షంగా కాంగ్రెస్ వ్యక్తం చేసింది. గతంలో బీజేపీ హయాంలో పాలికెలో జరిగిన అగ్నిప్రమాదానికి కారణమైన వారే ఈ సాహసం చేసి ఉండవచ్చని కాంగ్రెస్ ఆరోపించింది. నిప్పు పెట్టిన దుండగులను, 40 శాతం కమీషన్‌దారులను జైలుకు పంపడం తథ్యమని పేర్కొంది.




కాలిన గాయాలతో ఓ ఇంజినీరు

ఏఇఇ ఆడియో లీక్

అగ్ని ప్రమాదం పలు సంశయాలకు కారణమవుతున్న నేపథ్యంలో కార్పొరేషన్ ఏఇఇ ఆనంద్ మాట్లాడిన ఆడియో ఒకటి కుతూహలానికి కారణమైంది. ఆయన మరో అధికారి అమృత్‌రాజ్‌తో మాట్లాడిన కొన్ని వివరాలు వైరల్‌గా మారాయి.

ఆస్పత్రిలో బాధితులు

ప్రమాదంలో కాలిన గాయాలైన చీఫ్ ఇంజినీర్ శివకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కిరణ్, సంతోష్, విజయమాల, అసిస్టెంట్ ఈఈ శ్రీధర్, క్లర్కు సిరాజ్, కంప్యూటర్ ఆపరేటర్‌లు జ్యోతి, మనోజ్, కన్సల్టెంట్ శ్రీనివాస్‌లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మహిళా ఉద్యోగులు త్వరగా బయటకు పరిగెత్తలేకపోవటంతో వారికి ఎక్కువగా గాయాలయ్యాయి.

ట్రాక్టర్- బొలెరో ఢీ, ఆరుగురికి గాయాలు


బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

కృష్ణరాజపురం: బెంగళూరు రూరల్‌లోని హోసకోటెలోని హోసకోటె-కోలారు జాతీయ రహదారిపై తావరెకెరె వంతెన మీద ట్రాక్టర్, బొలెరో జీప్ ఢీకొన్న ప్రమాదంలో పలువురు రైతులు గాయపడ్డారు. స్థానిక రైతులు పొలాలకు ఎరువులు తీసుకురావడం కోసం ట్రాక్టర్‌లో వెళుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన బొలెరో జీపు ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ పల్టీ కొట్టగా అందులో కూర్చున్న ఆరు మంది రైతులకు తీవ్ర గాయాలు తగిలాయి. స్థానికులు వారిని హోసకోటెలోని ఒక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గంటలకొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

మేల్ నర్స్ దుర్మరణం


క్యాంటర్‌ను ఢీకొన్న అంబులెన్సు, మృతి చెందిన విశ్వనాథ్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: అంబులెన్స్, క్యాంటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో మేల్‌నర్సు మృతి చెందిన సంఘటన దావణగెరె జిల్లా న్యామతి తాలూకాలో చోటుచేసుకుంది. జమఖండికి చెందిన మేల్‌నర్స్ విశ్వనాథ్ (30) మృతి చెందాడు. మృతుడు మూడు సంవత్సరాలుగా శికారిపుర ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి శివమొగ్గలోని ఆస్పత్రిలో రోగిని అడ్మిట్ చేసి అంబులెన్స్‌లో తిరిగి వస్తుండగా న్యామతి తాలూకా సవళంగ-శికారిపుర మార్గంలో ముందు వెళ్తున్న క్యాంటర్‌ను అంబులెన్స్ వెనుక నుండి వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విశ్వనాథ్‌ను ఆస్పత్రిలో చేర్చినప్పటికీ చికిత్స ఫలించక మృతి చెందాడు. ప్రమాదంలో క్యాంటర్, అంబులెన్స్ డ్రైవర్లు ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను శివమొగ్గ మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు.

తల్లి చిరుత పట్టివేత

మైసూరు: మైసూరు జిల్లాలోని టి.నరిసిపుర తాలూకాలోని గుడ్డదకొప్పలు గ్రామంలో చిరుతపులి బోనులోకి చిక్కింది. గ్రామ శివార్లలో దొరెస్వామి అనే రైతు చెరుకుతోటలో ఉంచిన బోనులో చిరుత పడింది. శుక్రవారం ఉదయం ఇదే తోటలో రెండు చిరుత పిల్లలు కనిపించడంతో అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. తల్లి కోసం బోను పెట్టారు. శనివారం ఉదయం తల్లి చిరుత అందులోకి పడింది. అటవీ సిబ్బంది వచ్చి తల్లీ, పిల్ల చిరుతలను అడవిలోకి తరలించారు.

జూదగాడు కిడ్నాప్, రూ.15 లక్షలు బదిలీ

దొడ్డబళ్లాపురం: అతనికి జూదంలో లక్షల రూపాయలు గెలుచుకున్న ఆనందం ఎంతోకాలం నిలవలేదు. గోవాలో క్యాసినోలో ఆడి రూ. 25 లక్షలు గెలిచిన టీకొట్టు వ్యాపారిని కిడ్నాప్ చేసిన పరిచయస్తులు అతని నుంచి రూ.15 లక్షలు లాక్కున్న సంఘటన బెంగళూరు హనుమంతనగర పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. శ్రీనగర్ నివాసి తిలక్ మణికంఠ (32)బాధితుడు. టీ షాపు నడిపే తిలక్ ఎలాగైనా గోవాలో జూదమాడి భారీగా సంపాదించాలని జూలై 30న రూ.4 లక్షలు తీసుకుని స్నేహితులతో కలిసి వెళ్లాడు. అక్కడ క్యాసినోలో ఆడి అదృష్టం కొద్దీ రూ.25 లక్షలు గెలుచుకుని వచ్చాడు. స్థానికంగా కుటుంబ సభ్యులకు, పరిచయస్తులకు చెప్పుకుని సంబరపడ్డాడు.

కారులో ఎత్తుకెళ్లి..

ఇలా ఉండగా ఆగస్టు 5వ తేదీన కారులో వచ్చిన 5 మంది పరిచయస్తులు తిలక్‌ను కిడ్నాప్ చేసారు. జ్ఞానభారతి యూనివర్సిటీ వద్ద నిర్జన ప్రదేశానికి తీసికెళ్లి అతని బ్యాంకు అకౌంట్ నుంచి రూ.15 లక్షలు తమ బ్యాంకు అకౌంట్లలోకి మార్చుకున్నారు. నెలమంగల దగ్గర ఒక రిసార్ట్‌కు తీసికెళ్లి అక్కడ ఒక గదిలో నిర్బంధించి తమతో పేకాటలో ఓడిపోయినందుకు రూ.15 లక్షలు బదిలీ చేసినట్టు వీడియో తీసుకుని బెంగళూరులో వదిలి పరారయ్యారు. బాధితుడు హనుమంతనగర పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.



న్యాయవాదుల భద్రతకు చట్టం


మైసూరులో వకీళ్ల సమ్మేళనంలో సీఎం తదితరులు


పాల్గొన్న న్యాయవాదుల

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే: సీఎం సిద్దు హామీ

మైసూరు: వచ్చే శాసనసభ సమావేశాల్లో న్యాయవాదుల భద్రతకు చట్టం చేసి ఆమోదిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. శనివారం మైసూరు నగరంలో కర్ణాటక రాష్ట్ర న్యాయవాదుల పరిషత్ ఏర్పాటుచేసిన 2 రోజుల న్యాయవాదుల సమ్మేళనాన్ని సీఎం ప్రారంభించారు. సీఎం ప్రసంగిస్తూ ఇంతకుముందు అధికారంలో ఉన్న ప్రభుత్వం న్యాయవాదుల చట్టం ముసాయిదాను సిద్ధం చేసిందని, న్యాయవాదుల సంరక్షణ చట్టం కోసం తాను గతంలో బెళగావి అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడానని చెప్పారు. ఈ బిల్లును మొదట శాసనసభలో పాస్ చేసి అమలులోకి తెస్తామని హామీ ఇచ్చారు. నేను కూడా లాయర్‌గా పనిచేశానని, మీ ఇబ్బందులు ఏమిటో తెలుసని అన్నారు.

చిన్నకులాలవారు లాయర్లు కారాదనేవారు

మా ఊరుకు చెందిన అగ్రవర్ణాలవారు కురుబలు లాయర్ కాకుడదని మా నాన్నకు చెప్పారు, మా నాన్న నాకు చెప్పారు, వారి మాట విని ఉంటే తాను వకీల్ అయ్యేవాడిని కాదని సిద్దరామయ్య అన్నారు. వెనుకటికాలంలో కింది కులాలవారు న్యాయవాదులు కాకూడదని చెప్పేవారన్నారు. మా ఊరిలో చిన్నప్పయ్య అనే శాన్‌భోగ్ కూడా మా నాన్నకు ఇదే నూరిపోశారు, నేను మాత్రం లెక్కచేయకుండా న్యాయశాస్త్రం చదివి లాయరయ్యాను అని తెలిపారు. నా పుట్టినరోజు ఏమిటో నాకే తెలియదు, అందుకే పుట్టినరోజును జరుపుకొనే ఆసక్తి లేదని సీఎం అన్నారు. నా పుట్టినరోజు ఆగస్టు 3 అని పాఠశాలలో ఉపాధ్యాయుడు, 12 అని మా నాన్న రాయించారు. ఈ రెండింటిలో ఏది కరెక్టో నాకు తెలియదు అని చమత్కరించారు. ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి న్యాయవాదులు తరలివచ్చారు.

మదిదోచే జ్యువెల్స్ షో


పలు రకాల ఆభరణాలతో మహిళలు



సాక్షి, బెంగళూరు: వర మహాలక్ష్మి పండుగను పురస్కరించుకుని ఉద్యాననగరి వాసుల కోసం ఏర్పాటు చేసిన ప్రముఖ ఆభరణాల ప్రదర్శన ఏసియా జ్యువెల్స్ షో ఆదివారం సాయంత్రంతో ముగియనుంది. బెంగళూరులోని ది రిట్జ్ కార్ల్‌టన్ హోటల్‌లో శుక్రవారం నుంచి 48వ ఎడిషన్ ప్రదర్శన ప్రారంభమైంది. దేశంలోని నలుమూలల లభించే ఆభరణాల వ్యాపారులు ఈ ప్రదర్శనలో తమ స్టాళ్లను ఏర్పాటు చేశారు. వైవిధ్యభరితమైన స్వర్ణాభరణాలను మహిళలను అలరిస్తున్నాయి. ప్రత్యేక డిస్కౌంట్లు, ఆఫర్లతో ఆభరణాలను ఈ షోలో విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొందరు వ్యాపారులు మేకింగ్ చార్జీలను కూడా వసూలు చేయడం లేదని చెప్పారు.

గూండాచట్టం కింద క్రిమినల్ అరెస్ట్

శివాజీనగర: అక్రమాలు, బెదిరింపులు తదితర కారణాలతో పునీత్ కుమార్ అనే యువకుడిని సీసీబీ పోలీసులు గుండాచట్టం కింద అరెస్ట్ చేశారు. హాసన్‌కు చెందిన పునీత్ బెంగళూరు, మండ్య జిల్లాల్లో నేర కార్యకలాపాలకు పాల్పడ్డాడు. జాతీయ రక్షణ దళం అనే అనధికారిక సంస్థ పేరుతో మత ఘర్షణలు, చట్ట విరుద్ధ కార్యకలాపాలు సాగిస్తున్నాడు. సీసీబీ పోలీసులు గత పదేళ్లల్లో ఇతనిపై ఉన్న అన్ని క్రిమినల్ కేసుల రికార్డులను సేకరించి గుండాయాక్ట్ కింద అరెస్ట్ చేయాలని ప్రతిపాదనలు చేశారు. సీసీబీ ప్రతిపాదనలపై సమీక్షించిన పోలీసు ఉన్నతాధికారులు వెంటనే పునీత్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశించారు. దీంతో వెంటనే అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

వాట్సాప్ స్టేటస్‌తో నిరసన

- మహిళా పోలీస్ సస్పెండ్



దొడ్డబళ్లాపురం: అధికార పార్టీ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వాట్సాప్‌లో స్టేటస్ పెట్టిన మహిళా కానిస్టేబుల్ సస్పెండ్ అయిన సంఘటన చిక్కమగళూరు జిల్లా కడూరులో జరిగింది. కడూరు ఎమ్మెల్యే ఆనంద్‌కు వ్యతిరేకంగా కానిస్టేబుల్ లత.. నాకు ఏం జరిగినా ఎమ్మెల్యేదే బాధ్యత. ఎమ్మెల్యేకు నా ధిక్కారం.. అంటూ స్టేటస్ పెట్టింది. కొందరు స్క్రీన్ షాట్లు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో చిక్కమగళూరు ఎస్పీ ఉమా ప్రశాంత్ దృష్టికెళ్లింది. క్రమశిక్షణ చర్యల కింద లతను సస్పెండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు హెల్మెట్ లేకుండా బైక్ ర్యాలీ చేస్తుండగా లత వారికి జరిమానా విధించింది. దీనిపై ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ ఆమెతో వాగ్వాదానికి దిగారు. తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే ఆనంద్ కానిస్టేబుల్ లతను కడూరు నుంచి తరీకెరెకు బదిలీ చేయించారు. ఇలా ఇద్దరి మధ్య విభేదాలున్నాయి. తన బదిలీకి సంబంధించి లత ఎస్సైతో కూడా గొడవపడింది.

పెళ్లికి పెద్దలు నో.. ప్రేమజంట ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: ప్రేమ వివాహానికి పెద్దలు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ప్రేమికులు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామనగర తాలూకా కుంబాపుర గేట్ వద్ద చోటుచేసుకుంది. రామనగర పట్టణానికి చెందిన నవ్య (19), హర్షవర్ధన్ (20)ఆత్మహత్య చేసుకున్న ప్రేమికులు. ఇరువురూ కొంత కాలంగా ప్రేమలో పడ్డారు. అయితే వీరి వివాహానికి పెద్దలు ససేమిరా అనడంతో ఆవేదనకు లోనయ్యారు. ఇద్దరూ కలిసే చనిపోవాలని నిర్ణయించుకుని బైక్‌పై కుంబాపుర గేట్ వద్ద ఉన్న రైలు పట్టాల వద్దకు వచ్చి ఇరువురూ రైలుకింద పడ్డారు. స్థానికులు కొందరు మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారమివ్వగా వారు వచ్చి పరిశీలించి శవాలను ఆస్పత్రికి తరలించారు. చెన్నపట్టణ రైల్వే పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు. ఈ ఘోరంతో రెండు కుటుంబాల్లో విషాదం అలముకొంది.

మృత్యుపాశమైన వాటర్ హీటర్

- షాక్ కొట్టి అవ్వాతాత, మనవరాలు మృతి


దంపతులు ఈరప్ప, శాంతవ్వ (ఫైల్)


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి బళ్లారి: హీటర్‌తో బకెట్లో వేడి నీళ్లు పెట్టుకోగా విద్యుదాఘాతంతో అవ్వ, తాత, మనవరాలు మృతి చెందిన ఘటన బెళగావిలో జరిగింది. శనివారం బెళగావిలోని సాహు కాలనీ 7వ క్రాస్‌లో నివాసం ఉంటున్న రామదుర్గ తాలూకా అరబెంచి తాండాకు చెందిన ఈరప్ప లామాని (52), శాంతవ్వ లామాని (50)లతో పాటు వారి మనవరాలు అన్నపూర్ణ (8) విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. హీటర్‌తో బకెట్లో వేడి నీళ్లు పెట్టుకోగా ముందుగా నీళ్లు కాగాయా లేదా అని చూడబోయి బకెట్‌లోని నీటిని తాకిన మనవరాలికి విద్యుత్ షాక్ తగిలింది. షాక్‌తో విలవిలలాడుతున్న చిన్నారిని రక్షించేందుకు అవ్వ, తాతలు ప్రయత్నించడంతో వారికీ విద్యుత్‌షాక్ తగిలి ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.

మంత్రి పరామర్శ

ఈ ఘటన బెళగావిలో తీవ్ర విషాదం నింపింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ఘటనపై బెళగావి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

15న మారథాన్ పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ సీఎం యడియూరప్ప

కంప్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 15న జమ్మూకశ్మీర్‌లోని కార్గిల్‌లో సలాం సోల్జర్ శీర్షికన కర్ణాటక హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ న్యాయవాది, కంప్లి వాసి మోహన్ కుమార్ చేపట్టనున్న జాగృతి మారథాన్ పరుగు పోస్టర్‌ను బెంగళూరులో శనివారం మాజీ ముఖ్యమంత్రి బీఎస్.యడియూరప్ప చేతుల మీదుగా ఆవిష్కరించారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి


మల్లనగౌడ (ఫైల్)

రాయచూరు రూరల్: గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన జిల్లాలోని మస్కిలో చోటు చేసుకుంది. కొప్పళ జిల్లా గంగావతి తాలూకాలోని అగోలికి చెందిన మల్లనగౌడ(34) మస్కి పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రక్తపోటు, చక్కెర వ్యాధులతో బాధపడుతున్న ఇతను శుక్రవారం రాత్రి నిద్రలో ఉండగానే మరణించినట్లు తెలిసింది.

అవినీతి మరకను తీసేయాలి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసవరాజ రాయరెడ్డి

గంగావతి: అవినీతికి మారుపేరుగా కర్ణాటక రాష్ట్రం తయారైందని యలబుర్గా ఎమ్మెల్యే బసవరాజరాయరెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం కొప్పళలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో 40 శాతం అవినీతికి పాల్పడిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గతంలో ఆ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తీవ్ర అవినీతి జరిగిందన్నారు. అలాగే గత ప్రభుత్వంలో మంత్రులు సైతం అవినీతికి అందలం వేశారన్నారు. రాష్ట్రానికి వచ్చిన అవినీతి చెడ్డపేరును తొలగించేందుకు కృషి చేయాలన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తనకు పోటీ చేసే ప్రసక్తే లేదని అన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ వృద్ధి


మొక్కలు నాటుతున్న దృశ్యం

రాయచూరు రూరల్: విద్యార్థులు మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపి పర్యావరణాన్ని కాపాడాలని ఉడుంగల్ ఖానాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరేష్ అన్నారు. శనివారం ఉడుంగల్ ఖానాపూర్ ప్రభుత్వ హైస్కూలులో గ్రామ పంచాయతీ, అటవీ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృక్షమహోత్సవంలో మొక్కలు నాటి మాట్లాడారు. భవిష్యత్తులో ఎండల నుంచి రక్షణకు ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్కలను పెంచి పరిసరాలను సంరక్షించాలన్నారు. డబ్బుల కోసం చెట్లను నరికివేయకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి వీరేష్, అధ్యాపకుడు దండెప్ప, అధికారులు శాంతప్ప, ఇమ్మాన్యుయేల్, అరుణ, మహేష్, పరశురాంలున్నారు.

ఫ్యాషన్ వీక్ లోగో ఆవిష్కారం

బొమ్మనహళ్లి: ఐటీ సిటీలో అక్టోబర్ నెలలో జరగబోయే ది బెంగళూరు ఫ్యాషన్ వీక్ లోగోను శనివారం ప్రముఖ మోడల్స్ కవిత, సన్ని కాంబ్లే, జాకీ ఆవిష్కరించారు. ఓ హోటల్లో ఈ వేడుక జరిగింది. వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో జరగడం విశేషమన్నారు. ఫ్యాషన్ రంగంలో రాణించాలి అంటే ముంబైకి వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు బెంగళూరు కేంద్రస్థానమైందని అన్నారు. ప్రతిభావంతులకు బెంగళూరు ఒక మంచి వేదిక అన్నారు.

కామ్రేడ్ గద్దర్ మృతికి సంతాపం


సంతాపం వ్యక్తం చేస్తున్న సభ్యులు

రాయచూరు రూరల్: విప్లవ నాయకుడు కామ్రేడ్ గద్దర్ మృతికి జిల్లాలోని సిరవారలో సంతాపం వ్యక్తం చేశారు. శనివారం సిరవారలోని అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత మహిళా విమోచన సంఘం అధ్యక్షురాలు విజయరాణి మాట్లాడుతూ గద్దర్ మృతి దేశానికి తీరని లోటని అన్నారు.

వరుణుడి దాగుడు మూతలు

- కానరాని వాన జాడ, కరువు కోరల్లో జిల్లా
- సకాలంలో వానలు కురవక రైతన్న దిగాలు
- కేవలం 11.43 శాతం భూముల్లో మాత్రమే విత్తనం వేసిన రైతులు


వానలు కురవకపోవడంతో దిక్కుతోచని స్థితిలో దిగాలుగా ఉన్న రైతన్న

కోలారు: జిల్లాలో వరుణ దేవుడి కరుణ లేకపోవడంతో విత్తనశాతం కుంటుపడింది. ఇంతవరకు జిల్లాలో మొత్తం 1,02,590 హెక్టార్లకు గాను కేవలం 11,728 హెక్టార్లలో అంటే కేవలం 11.43 శాతం మాత్రమే విత్తనం వేశారు. ప్రతియేటా జిల్లాలో 1.01 లక్షల హెక్టార్లలో విత్తన లక్ష్యం ఉండగా కనీసం 25 శాతం కూడా విత్తనం వేయకపోవడంతో జిల్లాలో ఏర్పడిన అనావృష్టికి అద్దం పడుతోంది. జిల్లాలోని ఆరు తాలూకాల్లో ఈ యేడాది 1,02,590 హెక్టార్లలో విత్తల లక్ష్యం ఉంది. గత మూడేళ్లుగా జిల్లాలో మంచి వానలు కురుస్తున్నాయి. అయితే గత జులై నెలలో 26 శాతం వర్షం కొరత కనిపిస్తోంది. విత్తన శాతం అధికంగా వెనుకబడి ఉండడానికి ఇదే కారణం అంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు. జూలై నెల చివరివారంలో చిన్నపాటి వానలు కురిసినా అది విత్తనానికి ఎంత మాత్రం సరిపోలేదు.

అదును దాటుతుండటంతో ఆందోళన

ఇంతలో విత్తన అవధి ముగుస్తుండడంతో విత్తనాలు వేయడానికి సాధ్యం కాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు వేసే సమయంలోనే వర్షం కురవలేదు. రాగి విత్తనానికి ఇంకా కొద్ది రోజులు కాలావకాశం ఉన్నా ఇంతవరకు వానలు రాక అది సాధ్యం కాకపోవచ్చనే ఆందోళనలో రైతులు ఉన్నారు. మిగిలిన పంటల విత్తన కాలం దాటి పోయిందని, ఆగస్టు నెలలో కురిసే వర్షంపైనే విత్తన శాతం పూర్తిగా ఆధారపడి ఉందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.డి.రూపాదేవి తెలిపారు. అయితే ఆగస్టు నెలలో సగం రోజులు గడుస్తున్నా ఇంకా వర్షం ఛాయలు కనిపించకపోవడంతో ఇక ఈ యేడాది కరువు యేడాదిగా ఉండిపోవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో రాగి విత్తన లక్ష్యం 68,400 హెక్టార్లు కాగా ఇంతవరకు కేవలం 6,273 హెక్టార్లలో మాత్రం విత్తనం జరగడం ఆందోళన కలిగించే విషయం.

ఇక అనావృష్టేనని రైతుల్లో గుబులు

జిల్లాలో ఏకదళ, ద్విదళ బీజ ధాన్య పంటల్లో రాగి ప్రధాన ఆహార పంట. రాగి, అనప విత్తనానికి ఈ నెల మూడో వారం వరకు కాలావకాశం ఉంది. కందులు, అలసంద, వేరుశెనగ విత్తనం కూడా ఎంతో వెనుకబడి ఉంది. ఇది రాబోయే రోజుల్లో తీవ్ర అనావృష్టికి కారణం కాగలదని రైతులు ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో ఆహార ధాన్యాల ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. పశువులకు మేత కొరత ఏర్పడుతుందని తాలూకాలోని తొట్లి గ్రామానికి చెందిన రైతు టీవీ రమేష్ అంటున్నారు. జిల్లాలో ఈసారి అతి తక్కువగా మాలూరులో 2 శాతం విత్తనం కాగా ఎక్కువగా కేజీఎఫ్ తాలూకాలో 21.78 శాతం విత్తనం వేశారు. వర్షపాతం ఎక్కువగా కోలారులో 6.2 శాతం నమోదు కాగా, కేజీఎఫ్‌లో అతి తక్కువగా 3.9 శాతం వర్షపాతం నమోదైంది.

వైభవంగా ఆషాఢ మాస పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మాలూరు: ఆషాఢ శనివారం సందర్భంగా తాలూకాలోని లక్కూరులో పురాతన ముత్యాలమ్మ ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. ఆలయంలో తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలను చేపట్టారు. ప్రధాన అర్చకుల నేతృత్వంలో అమ్మవారి మూల విగ్రహానికి అభిషేకం, వేదమంత్ర పారాయణం, పంచామృత అభిషేకం, కలస స్థాపన, గణపతి హోమం తదితర పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉపాధి కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోండి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

రాయచూరు రూరల్: విద్యార్థులు పట్టాలు పుచ్చుకొన్న అనంతరం ఉపాధి కల్పన కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని టాగూర్ స్మారక కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాయచూరకర్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పేర్లను నమోదు చేసుకుంటే సీనియారిటీ లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్యులు తరచు అప్‌డేట్ కావాలి


జ్యోతిని వెలిగించి వైద్య సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారి రూరల్: వైద్యులు తమ వైద్యపరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని కర్ణాటక అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ చైర్మన్ డాక్టర్ గోవిందబాబు తెలిపారు. విమ్స్ వైద్యభవన్‌లో శుక్రవారం రాత్రి అసోసియేషన్ ఆఫ్ పిజీషియన్స్ ఆఫ్ ఇండియా కర్ణాటక బ్రాంచ్, విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో కాపికాన్ పేరుతో ఏర్పాటు చేసిన సదస్సు ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. అప్పుడే కొత్త, పాత వ్యాధులకు మెరుగైన వైద్యాన్ని రోగులకు అందించవచ్చన్నారు. వైద్యవిద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవచ్చన్నారు. వైద్యకళాశాల ఆసుపత్రుల్లో విరివిగా వైద్యసదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఆన్‌లైన్ ద్వారా సదస్సును ఉద్దేశించి మాట్లాడారు. తాను విమ్స్‌లో పీజీ ముగించుకొని ఈ స్థాయిలో ఉన్నానన్నారు. విమ్స్‌లో తన గురువు డాక్టర్ టేకూరు రామనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా తన మిత్రులకు, తోటి వైద్యులకు శుభాశీస్సులు తెలిపారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ, ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణస్వామి, ఏపీఐ కార్యదర్శి డాక్టర్ విశ్వనాథ కృష్ణమూర్తి సదస్సును గురించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ బి.కె.సుందర్, డాక్టర్ కొట్రేష్ తదితర వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఫన్‌ఫేర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాట్లాడుతున్న నిర్వాహకులు విజయ్‌పాల్, మహమ్మద్ రియాజ్ తదితరులు

సాక్షి,బళ్లారి: నగరంలోని తాళూరు రోడ్డులో స్నేహ కాలనీకి ఆనుకొని ఉన్న విశాలమైన మైదానంలో హ్యాండ్‌లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ ఫన్‌ఫేర్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు విజయ్‌పాల్, మహమ్మద్ రియాజ్ పేర్కొన్నారు. శనివారం ఎగ్జిబిషన్ ప్రాంగణంలో వారు విలేకరులతో మాట్లాడారు. నగరంలో ప్రప్రథమంగా వినూత్న తరహాలో ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య ఫిష్‌టన్నెల్ అండర్ వాటర్ ఆక్వేరియంను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్ 60 రోజుల పాటు ఉంటుందన్నారు. రాజ్‌భవన్ తరహాలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన మైదానంలో ఫిష్‌ల్యాండ్ గేటు, వ్యాపార అంగళ్లు, షాపింగ్ గ్యాలరీలు, ఏర్పాటు చేశామన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన సంస్కృతి విధానాలతో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. గృహోపకరణ వస్తువులు, అలంకరణ ఆభరణాలు, పలు రకాల జ్యూవెలరీస్, డ్రస్ మెటీరియల్స్‌ను, అన్ని రకాల టెక్స్‌టైల్స్‌ను, వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన దుస్తులను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మైసూరు కాండిమెంట్స్, హోంమేడ్, ఫుట్‌వేర్, ఎక్స్‌క్లూజివ్ సిమ్లా బజ్జీలు, మౌత్ వాటరింగ్ రెస్టారెంట్ తదితర రుచికరమైన ఆహార పదార్థాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు నగర వాసులకు వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచేందుకు జెయింట్‌వీల్, డ్రిస్టీ బౌన్సింగ్, చిన్నపిల్లల కోసం వివిధ రకాలైన బంపర్ బోట్, బ్రేక్ డ్యాన్స్ తదితరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పండ్ల దానంతో 'అధిక' ప్రతిఫలం


భజనల్లో పాల్గొన్న భజన మండలి సభ్యులు

చెళ్లకెరె రూరల్: అధిక శ్రావణ మాసం సందర్భంగా నగరంలో జానకీ భజన మండలి సభ్యులు విశేష భక్తి పాటలు, భజనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మిక చింతకులు డాక్టర్ మాధవాచార్ మాట్లాడుతూ మూడేళ్లకు ఒకసారి వచ్చే ఈ అధిక మాసంలో 33 పండ్లు, 33 ఖర్జూరాలు దానం చేయడం వల్ల అధిక ప్రతిఫలం లభిస్తుందన్నారు. ఈ మాసంలో దేవతా ఆరాధన వల్ల అన్నీ శుభాలే కలుగుతాయన్నారు. ఈసందర్భంగా విచ్చేసిన 33 మంది మహిళా మండలి సభ్యులకు చీరలు, గాజులు, పూజా సామగ్రిని అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. భజన మండలి అధ్యక్షురాలు మాలిని ఎల్ఎస్ రావు, కార్యదర్శి వాసుకీ, రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధిలో జిల్లాకు మొదటి స్థానం

- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి
- కేంద్రం నుంచి రూ.10 కోట్ల బహుమతి
- జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్



రాయచూరు రూరల్: మహత్తర ఆస్పిరేషన్ పథకంలో రాయచూరు జిల్లాకు సమగ్రాభివృద్ధిలో మొదటి స్థానం లభించిందని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడించిన అంశాలను వివరిస్తూ విద్య, ఆరోగ్యం, ఆర్థిక, వ్యవసాయ, ఇతర విషయాల్లో అనుకున్న లక్ష్యాన్ని సాధించినట్లు నివేదికను సమర్పించామన్నారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రూ.10 కోట్ల బహుమతిని ప్రకటించిందన్నారు. దేశంలో 112 ఆస్పిరేషన్ జిల్లాల్లో రాయచూరు ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. జూన్ నెల సమీక్షలో జిల్లా విద్య, వ్యవసాయంలో మొదటి నిలిచిందన్నారు.

రంగనాథన్‌కు నివాళి


రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసిన ఉద్యోగులు

రాయచూరు రూరల్: నగరంలో శనివారం కర్ణాటక సంఘం భవనంలో గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహించారు. గ్రంథాలయాల వ్యవస్థాపకుడు రంగనాథన్ చిత్రపటానికి సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్ పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. జ్ఞానార్జనకు గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. దేశంలో గ్రంథాలయాలకు 1892 అగస్ట్ 9న తమిళనాడులోని తంజావూరు జిల్లా శియాళిలో జన్మించిన రంగనాథన్ 1924లో గ్రంద పాలకుడిగా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. నాటి నుంచి పుస్తక భండాగారాన్ని నింపిన వ్యక్తిగా కొనియాడారు. అమెరికాలోని పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో గౌరవ డాక్టరేట్ పొందిన రంగనాథన్‌కు కేంద్ర ప్రభుత్వం 1957లో పద్మశ్రీ అవార్డును ఇచ్చిందన్నారు. నాటి నుంచి గ్రంథపాలకుల దినోత్సవం ఆచరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి అర్చన, ఉపాధ్యాయులు వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు.

చెలామణిలో రూ.10 నాణేలు

కోలారు: రిజర్వు బ్యాంకు ముద్రించిన రూ.10 నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని ఎలాంటి సంకోచం లేకుండా ఉపయోగించవచ్చని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ సభాంగణంలో జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. పలు చోట్ల రూ.10 నాణేన్ని ఆర్‌బీఐ నిషేధించిందని తప్పుడు వదంతులు సృష్టించారన్నారు. దీనిపై ప్రజల్లో గందరగోళం ఏర్పడిందన్నారు. అయితే ఈ విషయంలో ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దన్నారు. రూ.10 నాణేన్ని ఆర్‌బీఐ నిషేధించలేదన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సుధీర్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి గందరగోళానికి గురికావద్దన్నారు. బ్యాంకుల్లో కూడా డిపాజిట్ చేయవచ్చన్నారు. రూ.10 నాణేలను స్వీకరించకపోతే 2011 సెక్షన్ 6(1) ప్రకారం చట్ట ఉల్లంఘన అవుతుందన్నారు. రూ.10 నాణేలను ఉపయోగించడం వల్ల చిల్లర సమస్య పరిష్కారమవుతుందని అన్నారు.

కోలారు వార్తలు...

తపాలా బిళ్లలతో చరిత్ర పునర్దర్శనం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: పాత తపాలా బిళ్లలను చూడడం ద్వారా మనకు చరిత్ర తెలుస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసగౌడ తెలిపారు. శనివారం నగరంలోని ప్రభుత్వ కళాశాల ఆర్ట్స్ విభాగాల వేదిక, స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తపాలా బిళ్లల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చరిత్రకారులు దేశ చరిత్రపై నిర్లక్ష్యం చేశారన్నారు. చరిత్ర ఉపన్యాసకుడు సతీష్ ఎంతో కష్టపడి ఎన్నో పాత తపాలా బిళ్లలను సేకరించి మన చరిత్రను మనకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విద్యార్థులు పాత తపాలా బిళ్లల సేకరణపై ఆసక్తిని కనబర్చాలన్నారు. తపాలా బిళ్లలను సేకరించిన ఉపన్యాసకుడు సతీష్ మాట్లాడుతూ తాను సుమారు 22 ఏళ్లుగా పాత తపాలా బిళ్లలను సేకరిస్తూ వస్తున్నానన్నారు. ఇందుకోసం తన వేతనంలోని 50 శాతాన్ని కేటాయించానన్నారు. దీనికి తోడు స్వాతంత్య్రానికి ముందు ఉన్న 100కు పైగా పుస్తకాలను సేకరించానన్నారు. 1790వ సంవత్సరానికి చెందిన ముళబాగిలు ఫొటోను సంగ్రహించానన్నారు. ఇదే సమయంలో 3 వేలకు పైగా తపాలా బిళ్లలను ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు అరివు శివప్ప, నాగనాళ మునియప్ప, వాణిజ్య విభాగం ప్రముఖుడు డాక్టర్ మురళీధర్ పాల్గొన్నారు.

అక్రమ ఇసుక, మట్కాలను అరికట్టండి

- హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించకుంటే అధికారులపై కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్

హొసపేటె: జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, మట్కా రాకెట్‌ను అరికట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. శనివారం హగరిబొమ్మనహళ్లి తాలూకా కేడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాలూకాలో విస్తారంగా ఇసుక రవాణా, మట్కా వ్యాపారం జరుగుతోందనే ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వీటిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు, ఆర్టీఓ అధికారులు సంయుక్తంగా పని చేసి వీటికి అడ్డుకట్టపై దృష్టి సారించాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో పడకల కొరతపై జిల్లా కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో సమాచారం ఇవ్వని అధికారులపై మంత్రి మండిపడ్డారు. హాస్టళ్లలో కొరతలు ఉంటే వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. తాను ఆకస్మికంగా పరిశీలించినప్పుడు ఏదైనా లోపం కనిపిస్తే మీపై చర్యలు తీసుకుంటానన్నారు. రేషన్‌కార్డుల్లో పేర్లను తొలగించడంపై ఎమ్మెల్యే నేమిరాజ్‌నాయక్ నిలదీయడంతో ఆహార పౌర సరఫరాల శాఖ శిరస్తెదార్ నాగరాజును మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పేదలకు ఇబ్బంది కలిగించవద్దని, మీరు సరైన సమాచారం లేకుండా వచ్చారు. ఇక నుంచి ఇవన్నీ జరగవని తెలియజేశారు. మన ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమైన పథకాలైన అన్నభాగ్య, గృహలక్ష్మి, శక్తి, గృహజ్యోతి వంటి వాటి అమలులో ఉదాసీనత తగదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ హరిబాబు, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తా

సాక్షి బళ్లారి: వచ్చే ఏడాది జరగనున్న ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు మాజీ బుడా అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నారాప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలో ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని 41 నియోజకవర్గాల్లో ఈశాన్య పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. ఈనేపథ్యంలో తాను ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నానన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పోటీ చేసి ఓడిపోయానని గుర్తు చేశారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయాలని కేపీసీసీకి దరఖాస్తు చేసుకొన్నానన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 70 వేల ఓట్లు ఉండేవని, ఈసారి లక్ష ఓట్లు దాటాయన్నారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. పట్టుభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నారా ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా తహసీల్దార్ కార్యాలయానికి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరేయాలి


జెండాలతో ర్యాలీ నిర్వహించిన ఉద్యోగులు

రాయచూరు రూరల్: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరేయాలని తపాల ఉద్యోగులు పిలుపు ఇచ్చారు. శనివారం తపాలా కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వారు మాట్లాడారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో జెండాను ఎగుర వేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో తపాలా శాఖ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ అక్రంపాషా తదితరులు

కేజీఎఫ్: తాలూకాలోని 16 పోలింగ్ బూత్‌లను శనివారం జిల్లాధికారి అక్రం పాషా పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల్లో ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఈ పరిశీలన చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం 2024 ఎన్నికలకు పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్నామన్నారు. ఈనెల 21 వరకు ఈ సమీక్షను నిర్వహిస్తామన్నారు. తాలూకాలోని బేతమంగల ఫిర్కాలో 8 బూత్‌లను, రాబర్ట్‌సన్ పేట, నాగశెట్టిహళ్లి, ఉరిగాంపేట, బెమెల్ నగర పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించి 18 ఏళ్లు పూర్తయిన, ఓటరు జాబితాలో నమోదు కాని వారి వివరాలను అందిస్తారన్నారు. అనంతరం వారిని ఓటరు జాబితాలోకి చేరుస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో ఓటరు జాబితా సవరణ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కేడీఏ కమిషనర్ పవన్‌కుమార్, ఏఈఈ మంజునాథ్, ఆర్ఐ మునివెంకటస్వామి, రఘురాం సింగ్ తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవం


అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: తాలూకాలోని అరికుంటి గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షురాలిగా మునివెంకటమ్మ, ఉపాధ్యక్షురాలిగా మునిలక్ష్మమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిద్దరూ జేడీఎస్ పార్టీ మద్దతు అభ్యర్థులు. అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానానికి వీరొక్కరే నామినేషన్ వేయడంతో వీరు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎన్నికల అధికారిగా నారాయణస్వామి, పీడీఓ అమరనారాయణప్ప వ్యవహరించారు. ఎన్నిక అనంతరం సభ్యులు, జేడీఎస్ కార్యకర్తలు విజయోత్సవాన్ని జరిపారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను పలువురు అభినందించారు.

మిసెస్ తుమకూరుగా ఎంపిక

తుమకూరు: బెంగళూరులో శ్రీహరిఖోడె సెంటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన మిసెస్ ఇండియా కర్ణాటక - 2023 అందాల పోటీల్లో తుమకూరుకు చెందిన ఎస్. మమతాగౌడ విజేతగా నిలిచారు. ఆగస్టు 5వ తేదీ నుంచి పోటీలు జరిగాయి. ఆమె తుమకూరులో ఫిట్నెస్ సెంటర్ శిక్షకురాలిగా ఉన్నారు. ఆమెకు టైటిల్ రావడం పట్ల భర్త హనుమేగౌడ, కుమార్తె మౌల్య సంతోషం వ్యక్తంచేశారు.

నిబంధనలతో పతాకావిష్కరణ తప్పనిసరి


పాఠశాలకు పుస్తకాన్ని అందిస్తున్న దృశ్యం

కోలారు: జాతీయ పండుగల్లో నియమాలు పాటించి జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని భారత సేవా దళ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సీఎంఆర్ శ్రీనాథ్ తెలిపారు. శనివారం తాలూకాలోని అరాభికొత్తనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు భారత సేవాదళ్ ప్రకటించిన అధికృత జాతీయ పతాక నియమావళి పుస్తకాన్ని అందించి మాట్లాడారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసే ప్రతి సంస్థకు జాతీయ పతాక నిబంధనల గురించి తెలవాలన్నారు. గత సంవత్సరం స్వాతంత్య్ర అమృత మహోత్సవం సందర్భంగా ప్రతి పాఠశాలకు నియమావళికి సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందించామన్నారు. భారత సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కెఎస్ గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జాతీయ పతాక నియమావళిని అర్థం చేసుకోవాలన్నారు. దీని గురించి ఎలాంటి సమాచారమైనా సేవాదళ్ అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సేవాదళ్ ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరిధి అగర గ్రామంలో ఉన్న కర్ణాటక పబ్లిక్ స్కూల్‌లో రూ. 65 లక్షల వ్యయంతో అదనంగా నాలుగు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే సతీష్ రెడ్డి శనివారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, అగర గ్రామస్తుడు తిమ్మారెడ్డి, దినేష్, బొమ్మనహళ్లి బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక


అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

బొమ్మనహళ్లి: నగరంలోని బెంగళూరు దక్షిణ నియోజకవర్గం పరిధిలోని హెన్నాగర గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. అధ్యక్ష స్థానానికి హిన్నక్కి మహేశ్, ఉపాధ్యక్ష స్థానానికి లక్ష్మీ నామినేషన్ వేశాడు. ఇతరులు ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో వీరిద్దరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులను కేపీసీసీ కార్యదర్శి బాబురెడ్డి మాజీ అధ్యక్షుడు కేశవరెడ్డి, మరిస్వామి, ప్రకాశ్ తదితరులు అభినందించారు.

బీటెక్ చదివి బైక్ చోరీలు

- ఇద్దరు యువకుల అరెస్టు

దొడ్డబళ్లాపురం: బీటెక్ చదివిన యువకులు ఉద్యోగం లభించక బైక్ చోరీలకు అలవాటు పడి చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన హనుమంతనగర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా బాలయ్యపల్లి మండలానికి చెందిన హేమాద్రి, పవన్‌లు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం బెంగళూరుకు వచ్చారు. అయితే వారికి ఉద్యోగం దొరకలేదు. ఊర్లో మాత్రం బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నామని చెప్పుకునేవారు. యూట్యూబ్‌లో చూసి బైక్‌లు చోరీ చేయడం ఎలాగో తెలుసుకున్న ఇద్దరూ ఖరీదైన బైక్‌లు, బుల్లెట్ బండ్లను చోరీ చేసి ఊర్లో దర్జా చూపేవారు. మరోవైపు బాధితులు హనుమంతనగర పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను వారి సొంతూరికి వెళ్లి అరెస్టుచేసి తీసుకొచ్చారు.

చేలూరులో ఏడాదిలోపు అన్ని కార్యాలయాలు


గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బాగేపల్లి: బాగేపల్లి నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైన తాలూకా కేంద్రం చేలూరులో అవసరమైన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏడాదిలో ఏర్పాటు చేస్తామని, వారు ఇకపై బాగేపల్లికి రావాల్సిన అవసరం ఉండదని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం చేలూరు పట్టణంలో ఏర్పాటు చేసిన జన స్పందన కార్యక్రమంలో పాల్గొని గృహజ్యోతి పథకం ప్రారంభించి మాట్లాడుతూ... తాలూకా కొత్తగా ఏర్పాటు కావడంతో ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదని, ఏడాదిలోపు అన్ని కార్యాలయాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

గౌరిబిదనూరు: గత ఏడాది ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తామని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పాత కేఈబీ కార్యాలయం ఆవరణంలో వున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తాలూకా విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి, నగరసభ కమిషనర్ గీత, జెడ్పీ మాజీ సభ్యురాలు రామాంజినమ్మ, నగరసభ సభ్యురాలు వరలక్ష్మి రాజకుమార్, ఫరీద్, సప్తగిరి, నగరసభ మాజీ అధ్యక్షురాలు రూపా అనంతరాజు, అనంతరాజు, కృష్ణమూర్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఐ, పోలీసుల సస్పెండ్

చిక్కబళ్లాపురం: మనీ డబ్లింగ్ కేసులో ముగ్గురు బాగేపల్లి పోలీసులపై జిల్లా ఎస్పీ డీఎల్ నాగేశ్ చర్యలు తీసుకున్నారు. బాగేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుళ్లు నరసింహమూర్తి, అశోక్, అలాగే ఇన్స్‌పెక్టర్ రవికుమార్‌లను సస్పెండ్ చేశారు. మనీ డబ్లింగ్ కేసులో నిర్లక్ష్యంగా ప్రవర్తించారని ఆరోపణలు రావడంతో ఎస్పీ కొరడా విదిల్చారు.

మృత్యు శకటమైన బొలెరో

- ఇద్దరు బాలలు దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు
- పావగడ తాలూకాలో ఘోరం


రోడ్డుపై భీతావహ దృశ్యం


ప్రమాదానికి కారణమైన వాహనం

తుమకూరు/పావగడ: పావగడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కడమలకుంటె గ్రామం గేటు వద్ద శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలలు దుర్మరణం పాలయ్యారు. మరో బాలుడు అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రొద్దం మండలం చిన్నకోడిపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్ (15), జశ్వంత్ (15) అక్కడికక్కడే మృతి చెందగా మరో విద్యార్థి రాము తీవ్రంగా (15) గాయపడ్డాడు.

వివరాలు... చినకోడిపల్లి గ్రామానికి చెందిన రాము, ఈశ్వర్, జశ్వంత్ ద్విచక్ర వాహనంలో శనివారం ఉదయం వ్యక్తిగత పనిమీద పావగడకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో పావగడ నుంచి ఏపి39టీవీ2258 అనే నంబరు గల బొలెరో వాహనం రొద్దం వైపు వేగంగా వస్తూ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది.

భీతావహంగా ప్రమాదస్థలి:
బైక్‌లో ఉన్న ముగ్గురు విద్యార్థులు ఎగిరి రోడ్డుపై పడిపోయారు. ఈశ్వర్, జశ్వంత్‌లకు తల భాగం పగిలి తీవ్ర రక్త స్రావంతో అక్కడికక్కడే మృతి చెందారు. అపస్మారక స్థితిలో ఉన్న రామును అనంతపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలో మృతదేహాల తలలు పగిలి ఆ ప్రాంతం భీతావహంగా మారింది. ఇదిలా ఉంటే ఎంతో ఉత్సాహంగా బయలుదేరిన తమ కుమారులు ఈశ్వర్, యశ్వంత్ విగత జీవులుగా రావడంతో వారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో చిన్నకోడిపల్లి గ్రామం విషాదంలో మునిగిపోయింది. స్థానిక సీఐ అజయ్ సారథి ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు-లారీ ఢీ, ఇద్దరు మృతి

యశవంతపుర: కారు-లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన హావేరి జిల్లా శిగ్గాంవి తాలూకా తిమ్మాపుర గ్రామం జాతీయ రహదారి 48లో జరిగింది. మృతులు బెంగళూరుకు చెందిన మనోహర (38), ప్రియాంకా (23)లుగా గుర్తించారు. గాయపడిన మరో మహిళను మోనాలిసా (28)గా గుర్తించారు. ఈమెను హుబ్లీ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి ముంబాయి మార్గంలో వెళ్తుండగా కారును లారీ ఢీకొంది. ఘటన స్థలాన్ని తడస పోలీసులు పరిశీలించారు.

బస్సు- కారు ఢీ తల్లీకొడుకు..
కేఎస్ ఆర్టీసీ బస్సు కారును ఢీకొన్న ప్రమాదంలో తల్లి కొడుకు మృతి చెందిన ఘటన చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా ముద్రమనె వద్ద శనివారం ఉదయం జరిగింది. ధర్మస్థల నుంచి తల్లి కొడుకు మూడిగెరె మార్గంలో బెంగళూరుకు వెళ్తుండగా వీరి కారును ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తల్లి పూజ, కుమారుడు రాజశేఖర్ మృతి చెందారు. గాయపడిన మరో వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు.

తుమకూరులో బోటింగ్ సౌకర్యం



బోటింగ్ చేస్తున్న హోం మంత్రి, అధికారులు

తుమకూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 12, 13 రెండు రోజుల పాటు మహిళలకు ఉచితంగా బోటింగ్ సౌకర్యం కల్పించారు. దీంతో శనివారం హోం మంత్రి పరమేశ్వర్, జిల్లా అధికారి శ్రీనివాస్ ప్రయోగాత్మక బోటింగ్ రైడ్‌లో పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రికి సీబీసీ యంత్రం
తుమకూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మ్యాన్‌హోల్ వెల్ కంపెనీ రూ. 15 లక్షల విలువైన సీబీసీ యంత్రాన్ని కానుకగా ఇచ్చింది. ఆస్పత్రిలో ఈ యంత్రం అవసరం ఉన్న విషయాన్ని తెలుసుకుని కంపెనీ వెంటనే స్పందించి యంత్రాన్ని వితరణ చేసింది.

అధ్యక్షుడిగా మునిరెడ్డి


మాట్లాడుతున్న మునిరెడ్డి

చింతామణి: చింతామణి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మునిరెడ్డి ఎన్నికయ్యారు. మునిరెడ్డి, శివరాజ్ నామినేషన్ దాఖలు చేయగా మునిరెడ్డికి పది ఓట్లు, శివరాజ్‌కు ఆరు ఓట్లు వచ్చాయి. దీంతో మునిరెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మునిరెడ్డి మాట్లాడుతూ...ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు : సీఎం

మైసూరు: కోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. శనివారం మైసూరు నగరంలోని మండకల్లు విమానాశ్రయం ఆవరణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...తాలూకా, జిల్లా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని, తాలూకా, జిల్లా పంచాయతీ నియోజకవర్గాలకు డిలిమిటేషన్‌కు సుమారు పది వారాలు, బెంగళూరు మహా నగర పాలికెకు 12 వారాలు సమయం ఇవ్వడం జరిగిందని, కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

పొరుగింటి వ్యక్తే హంతకుడు

- యువతి హత్య కేసులో సెక్యూరిటీ గార్డు అరెస్ట్



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపురలో ఓ యువతిని హత్య చేసి ఇంటి ముందు పడేసిన కేసును పోలీసులు ఛేదించారు. ఓ యువకుడిని అరెస్ట్ చేశారు. నగరంలోని మహాదేవపుర పరిధిలో లక్ష్మీ సాగర లేఔట్‌లో గుల్బర్గాకు చెందిన మహానంద (21) అనే యువతి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. ఇదిలా ఉంటే గురువారం సాయంత్రం మహానంద బయటకు వెళ్లి ఆ తరువాత ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అనూహ్యంగా మరుసటి రోజు ఇంటి ముందే విగతజీవిగా పడి ఉంది.

యువతిని ఇంటిలోకి లాక్కెళ్లి అత్యాచార యత్నం :
ఈ యువతి ఇంటి పక్కనే ఒడిస్సాకు చెందిన కృష్ణ చంద అనే యువకుడు నివాసం ఉంటున్నాడు. ఇతను సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆ రోజు మహానంద బయటకు వచ్చిన సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో కృష్ణచంద యువతిని తన ఇంటిలోకి లాక్కెళ్లాడు. అత్యాచారం చేయడానికి యత్నించాడు. ఈ క్రమంలో ఆమె అరవకుండా చేయడానికి యత్నించగా ఊపిరి ఆగిపోయింది. దీంతో ఏమి చేయాలో తెలియక ఒక బెడ్ షీట్ చుట్టి మూలలో పెట్టాడు. సాయంత్రం భార్య విధులు ముగించుకుని ఇంటికి వచ్చింది. అర్ధరాత్రి భార్యకు తెలియకుండా మహానంద యువతి శవాన్ని బయటకు తీసుకువచ్చి వారి ఇంటి ముందే పడేశాడు. పోలీసులు అనుమానంతో కృష్ణచందను అదుపులోకి తీసుకోవడంతో అసలు విషయం వెల్లడించాడు. కేసు నమోదు చేసుకుని అరెస్ట్ చేశారు.

ఆర్థిక విభేదాలతో హత్యాయత్నం

- గాయపడిన జేడీఎస్ నేత


దాడిలో గాయపడిన అప్పుగౌడ

మండ్య: రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య డబ్బు పంపకాలపై గొడవ జరిగి ఆరుమంది కలిసి జేడీఎస్ నేత, మాజీ రౌడీషీటర్ పి. అప్పు గౌడపై హత్యాయత్నం చేశారు. మండ్య జిల్లాలోని మద్దూరు పట్టణం దగ్గర హోళె ఆంజనేయ స్వామి గుడి ఆవరణలో శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. జేడీఎస్ నాయకుడు అయిన కొణసాలె మధు, మనోజ్, అజయ్, మను, నిశ్చిత్, అనిల్ దాడి చేసి అప్పును గాయపరిచారు. బాధితున్ని చికిత్స కోసం మైసూరులోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు.

స్నేహితులే అయినా..: మధు, అప్పు మంచి స్నేహితులు కావడంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. అయితే డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవలు వచ్చి కోర్టుల్లో కూడా కేసులు వేసుకున్నారు. ఈ కేసులో మధు, ఆయన భార్య సుప్రిత కోర్టుకు హాజరు కాకపోవడంతో అరెస్టు వారంట్ జారీ అయ్యింది. ఈ నేపథ్యంలో కక్ష పెంచుకున్న మధు, ప్రముఖ రౌడీ అనుచరులతో కలిసి మాట్లాడాలని చెప్పి అప్పు కోసం పొంచి ఉండి చంపబోగా అతడు గాయాలతో తప్పించుకున్నాడు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి మొబైల్‌ఫోన్లు, కత్తులు, కొడవళ్లు, ఒక టాటా సుమోను సీజ్‌చేశారు.

కేంద్ర హోం మంత్రి పతకానికి ఐదుగురు ఎంపిక

శివాజీనగర: కేంద్ర హోం మంత్రి పతకానికి రాష్ట్రానికి చెందిన ఐదుగురు ఎంపికయ్యారు. శంకర్ ఎం.రాగి డీఎస్పీ, రామప్ప గుత్తేదార్–సూపరింటెండెంట్ తావరకెర పోలీస్ స్టేషన్ రామనగర, శివస్వామి సీ.బీ.పోలీస్ ఇన్‌స్పెక్టర్ హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్ బెంగళూరు, రుద్రేగౌడ ఆర్.పాటిల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వినోబానగర-శివమొగ్గ, పీ.సురేశ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎంసీ యార్డ్ బెంగళూరు.

పేలిన స్టీమర్, ముగ్గురికి గాయాలు

శివాజీనగర: బెంగళూరులోని హోటల్‌లో స్టీమర్ పేలి ముగ్గురు కార్మికులు గాయపడిన ఘటన చోటు చేసుకుంది. నగరంలోని నాగరబావిలో ఉన్న నమ్మూరు తిండి హోటల్‌లో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఉన్నట్టుండి వంటగదిలో ఉన్న స్టీమర్ పేలింది. అక్కడే ఉన్న ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. వారిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. జ్ఞానభారతి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హోటల్‌కు బాంబు బెదిరింపు

శివాజీనగర: స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు బెంగళూరు హోటల్‌ను టార్గెట్ చేసి బాంబు బెదిరింపు సందేశం పంపారు. ప్రతిష్టాత్మకమైన ఐశారామి హోటళ్లలో ఒకటైన శాంగ్రీలాకు బాంబు బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. ఈ సందేశం దేశంలోని అన్ని బ్రాంచీలకు పంపించారు. వెంటనే హోటల్ సిబ్బంది హైగ్రౌండ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: లివింగ్ రిలేషన్‌షిప్‌లో ఉన్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన బెంగళూరు ఉత్తర తాలూకా బైరేగౌడనహళ్లిలో చోటుచేసుకుంది. రాజు (30) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి. ఆరు నెలల క్రితం బైరేగౌడనహళ్లిలో అద్దె ఇల్లు తీసుకుని ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆమె ఇంట్లో లేని సమయంలో మద్యం తాగి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణం తెలిసిరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యార్థులకు ఉచిత ప్రయాణం

యశవంతపుర: సెకండ్ పీయూసీ సప్లిమెంటరీ పరీక్ష రాసే విద్యార్థులు ఉచితంగా ప్రయాణించవచ్చని బీఎంటీసీ, కేఎస్ ఆర్టీసీ ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 2 వరకు సప్లిమెంటరీ పరీక్ష జరుగనున్నాయి. ఇందులో భాగంగా పరీక్ష కేంద్రం వరకు హాల్ టికెట్‌ను చూపించి బీఎంటీసీ, కేఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపింది.

బ్లాక్‌మెయిల్ కేసులో నటుడు అరెస్ట్

యశవంతపుర: కన్నడ నటుడు, నిర్మాత వీరేంద్ర బాబును కొడిగేహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అత్యాచారం కేసులో ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరేంద్రబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. తనపై అత్యాచారం చేసి వీడియో పెట్టుకొని బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు బాధిత మహిళ ఆరోపిస్తోంది.

ఆమె నుంచి రూ.15 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. డబ్బులు ఇవ్వకుంటే వీడియోను వైరల్ చేస్తానని మహిళను బెదిరించినట్లు సమాచారం. అతడి వేధింపులు తట్టుకోలేక తన వద్దనున్న బంగారు అభరణాలను అమ్మి డబ్బులిచ్చింది. మళ్లీ బెదిరింపులు ఆపలేదు. గత జులై 30న మళ్లీ మహిళకు ఫోన్ చేసి బెదిరించాడు. ఒకసారి మహిళను తన కారులో ఎక్కించుకుని బెంగళూరు చుట్టు పక్కల తిప్పి ఆమె మెడలో ఉన్న బంగారం లాక్కున్నాడు. గన్‌తో కాల్చి చంపుతానని బెదిరిస్తున్నట్లు మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోలీసులు వీరేంద్రబాబుతో పాటు అతడి స్నేహితులపై కొడిగేహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు. వీటి మధ్య వీరేంద్రబాబు రూ.1.8 కోట్లు మోసం చేసిన విషయం వెలుగులోకి వచ్చింది.

సత్యసాయి ఆశ్రమంలో స్టార్టప్ ఉత్సవం

చిక్కబళ్లాపురం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానం తోడు కావాలని మంత్రి బోసురాజు అన్నారు. శనివారం చిక్కబళ్లాపురం సత్యసాయి గ్రామంలో జరిగిన ఇండియా స్టార్టప్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ... ఉత్తమ ఉత్పత్తి, సేవలు అందించడానికి కర్ణాటక రీసర్చ్ ఫౌండేషన్ ముందుకు వచ్చిందని అన్నారు. పల్లెలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రెండు రోజులు ఈ కార్యక్రమంలో బ్రిటన్, జపాన్‌తో పాటు వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. పది వేలకు పైగా స్టార్టప్‌లు, 500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సత్యసాయి ట్రస్టు మధుసూదన్‌సాయి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

మొబైల్ చూడొద్దన్నారని బాలిక ఆత్మహత్య

కెలమంగలం: చక్కగా చదువుకోక మొబైల్‌ఫోన్‌తో కాలక్షేపం చేయవద్దని కూతురిని తల్లిదండ్రులు మందలించడంతో ఆమె బాధపడి ఆత్మహత్య చేసుకొన్న ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు డెంకణీకోట పట్టణంలోని సాగర్ లేఔట్ ప్రాంతానికి చెందిన అజ్మల్ కూతురు అబిబాధాన్య (17) ప్రభుత్వ బాలికల ఉన్నతోన్నత పాఠశాలలో ప్లస్‌టూ చదువుతోంది. కొద్దిరోజులుగా చదువుకోవడం వదిలి సెల్‌ఫోన్‌లో కాలక్షేపం చేస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన బాలిక ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. డెంకణీకోట పోలీసులు చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొనిఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రెండు బైక్‌లు ఢీ, ఒకరు మృతి

హోసూరు: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందిన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని ఎస్. ఉచ్చనపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి మాదేష్ (39) శుక్రవారం సాయంత్రం డెంకణీకోట- అంచెట్టి మార్గంలో ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో బైకిస్టు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన మాదేష్‌ను స్థానికులు చికిత్స కోసం డెంకగణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చనిపోయాడు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

అలరించిన చిన్నారులు

హోసూరు: శనివారం హోసూరులోని ప్రభుత్వ ఆర్థిక సాయం పొందుతున్న జాన్ బాస్కో పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఏంజిలా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హోసూరు డీఎస్పీ బాబు ప్రశాంత్ పాల్గొన్నారు. పిల్లల నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

తిరుమలకు పాదయాత్ర


తిరుమలకు బయల్దేరిన భక్తులు

కెలమంగలం: శ్రీవేంకటేశ్వరస్వామి పాదయాత్ర కమిటీచే శనివారం తాలూకా కేంద్రం డెంకణీకోట రామాంజనేయస్వామి ఆలయం నుంచి భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని 11 ఏళ్లుగా డెంకణీకోట నుంచి ప్రతి సంవత్సరం తిరుమల తిరుపతికి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవాయిద్యాలతో స్వామి కీర్తనలను ఆలపిస్తూ పెద్దసంఖ్యలో భక్తులు పాదయాత్రకు నాంది పలికారు. సూళగిరి, వేపనపల్లి, ఆలందూర్, బైరడ్డిపల్లి, బంగారుపల్లి బ్రహ్మానందఆశ్రమం, సంజీవరాయనపల్లి, శ్రీనివాసమంగాపురం మీదుగా వెళ్లి 18వ తేదీ శనివారం తిరుమలకు చేరుకొని వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకొంటామని తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ సత్య, మాజీ ఎమ్మెల్యే కే.ఏ.మనోహర్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ కామరాజ్ కాలనీలోని ఆర్.వి. ప్రభుత్వ బాలుర పాఠశాల ఆటల మైదానంలో హోసూరుకు చెందిన ఈశా గ్రామోత్సవం స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను హోసూరు మాజీ ఎమ్మెల్యే కే.ఏ.మనోహరన్, మేయర్ ఎస్.ఏ.సత్య ప్రారంభించారు. ఈశా గ్రామోత్సవం స్వచ్ఛంద సంస్థ ద్వారా మొదటి విడత పోటీలను శనివారం ప్రారంభించింది. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టులకు మొదటి బహుమతిగా రూ. 9 వేలు, రెండవ బహుమతి రూ. 6 వేలు, మూడవ బహుమతిరూ. 3 వేలు నాల్గవ బహుమతి రూ. 2 వేలు అందజేయనున్నట్లు, సెప్టెంబర్ 23వ తేదీ జరిగే ఫైనల్స్ పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతి రూ. 5 లక్షలు, రెండవ బహుమతి, 3 లక్షలు, మూడవ బహుమతి రూ. లక్ష, నాల్గవ బహుమతి రూ. 50 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.


15న మద్యం విక్రయాలు బంద్

హోసూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న మద్యం విక్రయాలు నిలిపివేయాలని కలెక్టర్ శరయు ఒక ప్రకటనలో ఆదేశించారు. క్రిష్ణగిరి జిల్లాలో నిర్వహిస్తున్న ప్రభుత్వ టాస్‌మార్క్‌లు, ప్రభుత్వ అనుమతితో నిర్వహిస్తున్న మద్యం దుకాణాలు మూసి వేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యవసాయ పథకాలపై చైతన్యం

హోసూరు: హోసూరు తాలూకా బడుదేపల్లి గ్రామపంచాయతీలో హోసూరు వ్యవసాయ శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వ్యవసాయ పథకాలపై చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. హోసూరు వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ భువనేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధికారులు విత్తనఫాంల ఉత్పత్తి, వాటి లాభాలు, మట్టి పరిశోధన ముఖ్యత్వం, సేంద్రియ ఎరువుల తయారీ, సేంద్రియ ఎరువుల ద్వారా మట్టి సారవంతం, సేంద్రియ పద్ధతిలో చీడపీడల నివారణ, బిందుసేద్య ఉపకరణాలు, ప్రభుత్వ రాయితీలు, పంటల బీమా, ఆధునిక ఉపకరణాల వినియోగంపై రైతులకు వివరించారు. బడుదేపల్లి గ్రామపంచాయతీలోని నాలుగు గ్రామాలకు చెందిన రైతులు చైతన్య కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు రేణుక, రమ్య, చిన్నస్వామి, సుగుణ, మీనా తదితరులు పాల్గొన్నారు.

గజరాజులకు వేడుక



ఏనుగులను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

శివమొగ్గ: ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా శనివారం శివమొగ్గ తాలూకా సక్రబైలు ఏనుగుల శిబిరంలో ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శిబిరంలో ఉన్న ఏనుగులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఏనుగులను చూసి కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా గజరాజులకు ప్రత్యేక ఆహారం ఇచ్చారు. విద్యార్థులకు ఏనుగుల తెలివి తేటలను వివరించారు. అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబం మొత్తం మర్డర్ కేసులో !

- హాసన్ జేడీఎస్ నేత హత్య కేసులో దంపతులు, బంధువులు అరెస్టు

శివాజీనగర: నాలుగు రోజుల క్రితం హాసన్ గ్రామీణ పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో గురువారం జేడీఎస్ నాయకుడు కృష్ణగౌడ (53)ను దుండగులు మారణాయుధాలతో కిరాతకంగా హత్య చేశారు. ఈ కేసులో పోలీసులు 6 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈయన గ్రానైట్, రియాల్టీ వ్యాపారాలు చేయడంతో పాటు జేడీఎస్ నేత హెచ్‌డీ రేవణ్ణకు అనుచరుడు కావడంతో సంచలనం కలిగించింది.

వివరాలు.. గతంలో యోగానంద అనేవ్యక్తి కృష్ణగౌడతో పరిచయమై వాహిని సినిమాకు పెట్టుబడి పెట్టారు. ఇందులో తనను మోసగించారని యోగానందతో కృష్ణగౌడ గొడవపడ్డాడు, ఆపై 2022 నవంబర్‌లో యోగానందను కొందరు కిడ్నాప్ చేసి దాడి చేయడంతో అతడు హాసన్ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. మరోవైపు యోగానందపై కృష్ణగౌడ చీటింగ్ కేసు పెట్టారు. ఇలా ఇద్దరి మధ్య వైషమ్యాలు పెరిగాయి. అప్పటినుంచి కృష్ణగౌడను అంతమొందించాలని కుట్ర మొదలైంది.

కారులో వెళ్తుండగా నరికి చంపి
ఈ నెల 9న మధ్యాహ్నం కృష్ణగౌడ నగర శివార్లలో కారులో వెళ్తుండగా, కారులో వచ్చిన దుండగులు అడ్డుకుని నరికి చంపి పరారయ్యారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి యోగానంద కుటుంబీకుల పాత్ర ఉందని గుర్తించారు. యోగానంద, అతని భార్య సుధారాణి, అతని స్నేహితురాలు, మామ కృష్ణకుమార్, బంధువు విజయ్–చైత్ర దంపతులు, అలాగే స్థానిక టీవీ చానెల్ భాగస్వామి సురేశ్ అనేవారిని హాసన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

చింతామణి తహసీల్దార్‌గా సుదర్శన్



చింతామణి: చింతామణి తహసీల్దార్‌గా సుదర్శన్ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సహచర సిబ్బంది సహకారంతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

క్లుప్తంగా...

ఎయిమ్స్‌లో ముగిసిన 'సెరిబ్రేషన్' వేడుకలు

సెంట్రిషన్ రన్నింగ్ ట్రోఫీ విజేతగా మంగళగిరి ఎయిమ్స్



ట్రోఫీతో ఎయిమ్స్ మెడికల్ విద్యార్థులు

సాక్షి, అమరావతి: వైద్య విద్యార్థులకు వృత్తిపరమైన అంశాలపై అవగాహన పెంపొందించేందుకు మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) 'సెరిబ్రేషన్' పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకలు శనివారం ముగిశాయి. ఈ జాతీయ స్థాయి సెమినార్ పోటీలో వివిధ వైద్య సంస్థల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ జాయ్ ఘోషల్, కార్యదర్శులుగా డాక్టర్ దేశాయ్ విద్యా శ్రీపాద్, డాక్టర్ సతీష్ దీపాంకరీ వ్యవహరించారు. మంగళగిరి ఎయిమ్స్ సెంట్రిషన్ రన్నింగ్ ట్రోఫీ విజేతగా నిలిచింది.

ఎస్‌వోఎస్‌ను సందర్శించిన తెలంగాణ మంత్రి రాథోడ్

భీమునిపట్నం: భీమిలిలోని ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌ను శనివారం తెలంగాణ గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఉన్నతాధికారులు సందర్శించారు. తెలంగాణలో అనాథ పిల్లలకు అన్ని సదుపాయాలతో కూడిన శాశ్వత ఆశ్రయాన్ని కల్పించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మంత్రి సత్యవతి రాథోడ్, సీఎం కార్యదర్శి స్మిత సబర్వాల్, స్త్రీ శిశు సంక్షేమశాఖ కమిషనర్ భారతి హోళికెరి, హరితహారం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ పమేలా సత్పతి తదితరులు ఇక్కడకు వచ్చారు. ఎస్‌వోఎస్ డైరెక్టర్ కోన రవీంద్రకుమార్ వారికి ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ కార్యకలాపాలను వివరించారు.

పచ్చ చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

మంత్రి ఆదిమూలపు సురేష్



యర్రగొండపాలెం: రాష్ట్రంలో పచ్చ చెడ్డీలు వేసుకుని ఒక గ్యాంగ్ తిరుగుతున్నదని, వీరిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ హెచ్చరించారు. రాష్ట్రాన్ని దోచు కోవడమే పనిగా పెట్టుకున్న ఈ గ్యాంగ్‌కు పచ్చమీడియా మద్దతు ఇస్తున్నదని, వారి చేష్టలను గొప్పగా వర్ణిస్తూ ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలోని మొగుళ్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్టని నారా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ అధికార దాహంతో రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని విమర్శించారు. అందుకు పుంగనూరు ఘటనే నిదర్శనమన్నారు.

తెలంగాణ

వందరోజుల పాటు చట్టసభల సమావేశాలు

ఎంపీ ఆర్.కృష్ణయ్య సూచన



కాచిగూడ (హైదరాబాద్): అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు ఏటా 100 రోజులు జరిగేలా రాజ్యాంగాన్ని సవరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శనివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ కొద్దిరోజులు జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు.. ప్రజా సమస్యలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవడానికి ఏమాత్రం సరిపోవడం లేదన్నారు.

టీచర్ మందలించారని.. తండ్రి తిట్టారని..

వేర్వేరు చోట్ల ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య

తిరుమలాయపాలెం (ఖమ్మం జిల్లా)/ తాండూరు (వికారాబాద్ జిల్లా): బాగా చదువుకోవాలని టీచర్ మందలించడంతో మనస్తాపం చెందిన ఓ ఇంటర్ విద్యార్థి, చెడు సహవాసాలకు వెళ్లొద్దంటూ తండ్రి హెచ్చరించడంతో అవమానంగా భావించిన ఓ టెన్త్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఖమ్మం, వికారాబాద్ జిల్లాల్లో వేర్వేరు చోట్ల శనివారం జరిగిన ఈ ఘటనల వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని హైదర్‌సాయిపేటకు చెందిన గుగులోత్ కృష్ణ – రమి కుమారుడు విష్ణు(17) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చేరాడు. ఈనెల 7న టీసీ, ఇతర సర్టిఫికెట్ల కోసం తండ్రి కృష్ణతో కలిసి పదో తరగతి చదివిన పాఠశాలకు వచ్చాడు. ఈ క్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ పదో తరగతిలో ప్రవర్తన సరిగ్గా లేదని చెబుతూ ఇంటర్‌లోనైనా బాగా చదువుకోవాలని విష్ణును మందలించారు. దీంతో విష్ణు మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయాన గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ తరలించారు. వైద్యం చేసినా లాభం లేదని అక్కడి వైద్యులు చెప్పడంతో ఖమ్మం తీసుకురాగా శనివారం మృతిచెందాడు.

ప్రతి నియోజకవర్గంలో మెజారిటీ పెంచాలి

ఎవరెన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

- రాష్ట్ర ప్రజలంతా మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారు
- పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాలి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కోసం కృషి చెయ్యండి
- దొంగ ఓట్లు తొలగించేలా చూడండి
- కష్టపడి పనిచేసే వారికి పార్టీ అండగా ఉంటుంది.. గుర్తింపు లభిస్తుంది
- ప్రభుత్వంపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి
- 'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్' అనే అంశంపై నియోజకవర్గాల్లో సమావేశాలు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్ పారదర్శక పాలన పట్ల ప్రజల్లో అభిమానం రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ మెజారిటీ పెంచేలా, ప్రతి ఓటర్‌తో ఓటు వేయించేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, శాసన సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పరిశీలకులు, జేసీఎస్ కో–ఆర్డినేటర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు వచ్చేలా కృషి చేయాలన్నారు. చంద్రబాబు హయాంలో 60 లక్షలకు పైగా దొంగఓట్లను చేర్పించారనే ఆరోపణలు ఉన్నాయని, వాటిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి, జాబితా నుంచి తొలగించేలా చూడాలని చెప్పారు. చాలా కీలకమైన ఈ అంశంపై పూర్తిగా మనస్సు పెట్టి పనిచేయాలని పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలు ఇచ్చారని వివరించారు. పార్టీ పరిశీలకులు నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు, రీజనల్ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకొని ఐకమత్యంతో పనిచేసేలా చూడాలని చెప్పారు.

ప్రతి నియోజకవర్గంలో సమావేశం

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శాసన సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు 'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్' అనే అంశంపై సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించే సత్తా గల నాయకుడు వైఎస్ జగన్ మాత్రమే అనే? విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేలా పార్టీ శ్రేణులను మోటివేట్ చేయాలని సూచించారు. ఈ సమావేశాలలో మండల, పట్టణ స్థాయి నేతలు, సచివాలయ, మండల కన్వీనర్లు, గృహ సారథులు, పరిశీలకులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా 9 నెలల్లో ఎన్నికలు రానున్న తరుణంలో పార్టీ శ్రేణులంతా ప్రతిపక్షాల విమర్శలను ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలు, అందించిన పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తీసుకెళ్లాలని కోరారు.

గృహ సారథులు, సచివాలయ, మండల కన్వీనర్లకు బీమా

గృహ సారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లు నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో విజయవంతంఅయ్యాయని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ప్రతి ఇంటికీ వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలు, జగనన్నే మా భవిష్యత్తు, జగనన్న సురక్ష కార్యక్రమాలు ప్రజలకు మేలు చేశాయన్నారు. దేశంలోనే ఇది వినూత్నమైన కార్యక్రమం అని, దీనిపట్ల ప్రజల్లో చాలా మంచి స్పందన వచ్చిందన్నారు. ఇదే రీతిలో ఓటర్ల జాబితా సవరణలోనూ సచివాలయ, మండల కన్వీనర్లు, గృహ సారథులు ఉత్సాహంగా పనిచేయాలని చెప్పారు. ప్రతి ఓటూ కీలకమైందన్న విషయాన్ని గుర్తెరిగి పనిచేయాలని సీఎం వైఎస్ జగన్ చెప్పారని వివరించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లకు బీమా సౌకర్యం కల్పిస్తామని, దానికి సంబంధించిన సమాచారాన్ని కూడా తీసుకుంటున్నామని తెలిపారు. సమాచారం పంపని వారు కూడా త్వరగా పంపించాలని సూచించారు. అంకిత భావంతో, కష్ట పడి పనిచేసే వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి ఆరోగ్య భద్రత కల్పిస్తామని, పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామని చెప్పారు.

కింది కోర్టుల లాయర్లనూ

హైకోర్టు జడ్జిలుగా నియమించాలి

- న్యాయవ్యవస్థలో అణగారిన వర్గాలు, మహిళల సంఖ్య పెరగాలి
- న్యాయమూర్తుల నియామకాల్లో సామాజిక భిన్నత్వం లోపించింది
- ఐలూ రాష్ట్ర మహాసభల్లో న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్



సాక్షి, అమరావతి : హైకోర్టు జడ్జిలుగా కేవలం హైకోర్టు న్యాయవాదులనే కాక కింది కోర్టుల లాయర్లను సైతం పరిగణనలోకి తీసుకోవాలని మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ కోరారు. కింది కోర్టుల్లో కూడా ఎంతో మంది ప్రతిభావంతులైన న్యాయవాదులు ఉన్నారని తెలిపారు. కింది కోర్టుల్లో ఉన్న సీనియర్ లాయర్లకు సీనియర్ న్యాయవాది హోదా కల్పించాలన్నారు. శనివారం గుంటూరులో జరిగిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర మహాసభల్లో జస్టిస్ దేవానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత న్యాయవ్యవస్థలో 'సామాజిక భిన్నత్వం' లోపించిందని అన్నారు. అణగారిన వర్గాలు, మహిళల సంఖ్య పెరగాలని చెప్పారు. 2018 నుంచి 2023 వరకు హైకోర్టుల్లో 601 మంది న్యాయమూర్తుల నియామకాలు జరగ్గా, అందులో జనరల్ కోటా 457 మంది, ఎస్సీలు 18 మంది, ఎస్టీలు 9 మంది, ఓబీసీలు 72 మంది, మహిళలు 91 మంది, మైనారిటీలు 32 మంది, ఇతరులు 13 మంది ఉన్నారన్నారు. న్యాయవ్యవస్థలో రిజర్వేషన్ విధానం లేకపోయినప్పటికీ, న్యాయమూర్తుల నియామకాల్లో అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని చెప్పారు. న్యాయమూర్తుల నియామకాల్లో నాణ్యతపై లా కమిషన్, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు చేసిన సిఫార్సులను కొలీజియం పరిగణనలోకి తీసుకో వాలని కోరారు. దేశంలోని కోర్టుల్లో దాదాపు 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి భారం చాలా తీవ్రమైన అంశమని చెప్పారు. న్యాయం అందించడంలో జాప్యం జరిగితే న్యాయం అందని పరిస్థితికి దారి తీస్తుందన్నారు. జాప్యం ఇలాగే కొనసాగితే విసిగిపోయిన కక్షిదారులు రాజ్యాంగేతర, అసాంఘిక శక్తులను ఆశ్రయించి తక్కువ ఖర్చుతో వేగవంతమైన న్యాయం పొందేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. ఇది అంతిమంగా శాంతిభద్రతల సమస్యగా మారి, సమాజంలో అశాంతి, అరాచకానికి దారి తీస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత న్యాయమూర్తులు, న్యాయవాదులపై ఉందని తెలిపారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తెచ్చేలా తీర్మానం చేయాలని ఐలూ కార్యవర్గాన్ని కోరారు. ఈ సందర్భంగా జస్టిస్ దేవానంద్‌ను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

న్యాయవ్యవస్థ స్వతంత్రతకు విఘాతం

పార్లమెంట్ చేసే చట్టాలను సమీక్షించే అధికారాన్ని న్యాయవ్యవస్థకు రాజ్యాంగం ఇచ్చిందని, దీంతో న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసేందుకు కార్యనిర్వాహక వ్యవస్థ చాలా గట్టిగా ప్రయత్నిస్తోందని ఐలూ జాతీయ కార్యదర్శి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వి.సురేంద్రనాథ్ చెప్పారు. అందులో భాగంగానే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం న్యాయవ్యవస్థపై దుష్ప్రచారం మొదలు పెట్టిందన్నారు. న్యాయమూర్తుల ఎంపికలో ఆధిపత్యానికి ఆరాటపడుతోందన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత దెబ్బతింటే ప్రజాస్వామ్యం మరో విధంగా మారుతుందని, దేశం లౌకిక, సార్వభౌమ దేశంగా కొనసాగే పరిస్థితి ఉండదని చెప్పారు. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఐలు రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, ఏపీ కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల మీదే దాడులు చేస్తే ఎలా?

డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాజేంద్రనాథ్‌రెడ్డి



నరసాపురం రూరల్ : పోలీసులు ప్రజల కోసం పనిచేస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో తరతమభేదాలు ఉండవని, ఏ రాజకీయ పార్టీ అయినా తమకు ఒక్కటేనని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టంచేశారు. పోలీసుల మీదే దాడులు చేస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. దాతల సహకారంతో అధునాతన వసతులతో నరసాపురంలో నిర్మించిన డీఎస్పీ క్వార్టర్, కార్యాలయ భవన సముదాయాన్ని ఆయన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పుంగనూరు ఘటనలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు పోలీసులపై చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీలు తమ కేడర్‌ను నియంత్రించుకోవాలన్నారు. పోలీసులపై తిరుగుబాటు చేసి దాడిచేస్తే ఇక శాంతిభద్రతలను కాపాడటం ఎలా అని డీజీపీ ప్రశ్నించారు. అనుమతి తీసుకున్నచోట కాకుండా వేరే చోట సభను నిర్వహించుకుంటే పోలీసులకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికే ఈ సంఘటనలో 20 మందిని అరెస్టుచేశామని, బాధ్యులెవరినీ వదిలేదిలేదని ఆయన స్పష్టంచేశారు. అలాగే, సోషల్ మీడియాలో కావాలని చేస్తున్న దుష్ప్రచారాలు, నేర ప్రవృత్తితో పెట్టే పోస్టులపై పోలీసు వ్యవస్థలో సాఫ్ట్‌వేర్ సెల్‌ను ఏర్పాటుచేశామని డీజీపీ చెప్పారు. తప్పుడు ఆరోపణలు, ఉద్రేకపరిచే స్టేట్‌మెంట్‌లు ఇవ్వొద్దని డీజీపీ కోరారు.

గంజాయి సాగు వ్యవస్థను నేల రాసేశాం..

ఇక మూడు దశాబ్దాల నుంచి విశాఖ ప్రాంతంలో వేళ్లూనుకున్న గంజాయి సాగును నేల రాసేశామని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. మొత్తం 7,500 ఎకరాల్లో గంజాయి సాగును తుదముట్టించామని తెలిపారు. ఆ సాగు చేసిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకుని జీవించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. మరోవైపు.. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతోందని డీజీపీ చెప్పారు. మహిళల రక్షణ కోసం అందుబాటులోకి తెచ్చిన దిశ యాప్ సత్ఫలితాలిస్తోందన్నారు.

పోలీసులు, ఎస్‌ఐల నియామకానికి ఓకే..

పోలీసు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి 6,800 మంది పోలీసులు, 500 ఎస్సై పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతిచ్చిందని డీజీపీ చెప్పారు. ఎస్సై పోస్టులకు సంబంధించి ఆగస్టు మూడో వారంలో నియామకాలు జరిగే అవకాశముందని తెలిపారు. దీనికి సంబంధించి సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందన్నారు.

జేసీ ప్రభాకరరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

నాయీ బ్రాహ్మణ సంఘాల డిమాండ్



జేసీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘాల జేఏసీ

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): నాయీ బ్రాహ్మణులను కించపరిచే విధంగా ఓ టీవీ షోలో మాట్లాడిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయీ బ్రాహ్మణ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఓ టీవీషో కార్యక్రమంలో జేసీ ప్రభాకరరెడ్డి నాయీ బ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా తన అహంకారాన్ని ప్రదర్శించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ తమ కులానికి చెందిన ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌ను కించపరిచారని చెప్పారు. జేసీ ప్రభాకరరెడ్డి తన తీరు మార్చుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో హేళన చేయకూడదని, కించపరచకూడదని ప్రభుత్వం జీవో నంబరు 50లో స్పష్టం చేసిందన్నారు. జీఓను అమలు చేసి నాయీబ్రాహ్మణులను కించపరిచే విధంగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేసీ ప్రభాకరరెడ్డిపై అన్ని జిల్లాల్లో కేసులు పెట్టాలని, నేషనల్ బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానించారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య, నాయీబ్రాహ్మణ నంద యువజన రాష్ట్ర అధ్యక్షుడు ఇంటూరి బాబ్జి, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు, నవ సమాజ్ అధ్యక్షుడు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి సుందరపల్లి గోపాలకృష్ణ, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షారపు సూరిబాబు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.వి. రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సంతకాల దుర్వినియోగం.. ఐదుగురి అరెస్ట్

- సీఎంవోలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బాగోతం
- సీఐడీ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శుల డిజిటల్ సంతకాలను దుర్వినియోగం చేసిన కేసులో ఐదుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అరెస్ట్ చేసినట్టు సీఐడీ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ కేసులో కనమర్ల శ్రీను (కార్యదర్శి ముత్యాలరాజు పేషీలో ఉద్యోగి), గుత్తుల సీతారామయ్య (కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి పేషీలో అటెండర్), నలజల సాయిరామ్ (ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి పేషీలో ఉద్యోగి), భూక్యా చైతన్య నాయక్ (కార్యదర్శి ముత్యాలరాజు పేషీలో ఉద్యోగి), అబ్దుల్ రజాక్ (ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి పేషీలో అటెండర్)ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మంగళగిరిలోని సీఐడీ విభాగం ప్రధాన కార్యాలయంలో శనివారం మీడియాతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.

ఈ–ఆఫీసులోకి అక్రమంగా లాగిన్ అయి..

ప్రధాన నిందితుడు కనమర్ల శ్రీను ఈ–ఆఫీసు పరిజ్ఞానాన్ని ఉపయోగించి సీఎంవోలోని కార్యదర్శులకు తెలియకుండా ఈ–ఆఫీస్ లాగిన్ యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లను దొంగిలించి ఏ శాఖకు కావాలంటే ఆ శాఖ కార్యదర్శుల డిజిటల్ సంతకాలను కాపీ పేస్ట్ చేసేవాడు. ఆ అభ్యర్థనలను సంబంధిత శాఖలకు పంపేందుకు లాగిన్ క్రెడెన్షియల్స్, ఈ–ఆఫీసులో ప్రాసెసింగ్ కోసం ఇతర నిందితులు నలజల సాయిరామ్, గుత్తుల సీతారామయ్య, చైతన్య నాయక్, అబ్దుల్ రజాక్‌తో కలసి పథకం పన్నాడు. సీఎంవోకు వచ్చే వివిధ అభ్యర్థన లేఖలను సేకరించడం, తర్వాత ఈ–ఆఫీసులో అప్‌లోడ్ చేయడం, ప్రాసెస్ చేసేందుకు డబ్బులు తీసుకుని పంచుకోవాలని యోచించారు. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో కనమర్ల శ్రీను తయారు చేసిన హోమ్ శాఖకు చెందిన ఒక అభ్యర్థన సర్క్యులేట్ అయి కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి పేషీకి వచ్చింది. దానిపై సందేహం వచ్చి విచారించగా.. డిజిటల్ సంతకాలను కనమర్ల శ్రీను కాపీ పేస్ట్ చేసినట్లు వెల్లడైంది. దీంతో శ్రీనును ఉద్యోగం నుంచి తొలగించారు. ఉద్యోగం నుంచి తొలగించాక కూడా కార్యదర్శి ముత్యాలరాజు పేషీలో పనిచేసే చైతన్యనాయక్ సహకారంతో లాగిన్ పాస్‌వర్డ్ తీసుకుని డిజిటల్ సంతకాలను కాపీ పేస్ట్ ద్వారా వివిధ అభ్యర్థనలను సంబంధిత శాఖలకు పంపించేవారు. కార్యదర్శి పూనం మాలకొండయ్య పేషీ నుంచి ఈ–ఆఫీస్ లాగిన్, పాస్‌వర్డ్‌లను దొంగిలించారు. డిజిటల్ సంతకాలు మళ్లీ దుర్వినియోగం అయినట్టు పీఎస్ నారాయణస్వామి గుర్తించారు. ఇది కూడా కనమర్ల శ్రీను చేసిందేనని ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో సీఎంవోలోని మిగిలిన కార్యదర్శుల లాగిన్‌లను పరిశీలించగా 66 అభ్యర్థన (సీఎంపీ)లను ఆ విధంగా డిజిటల్ సంతకాలు దుర్వినియోగం చేసి పంపినట్లు గుర్తించి, వాటిని పక్కనపెట్టారు. ఆ అభ్యర్థనలన్నీ విద్య, వైద్యారోగ్య శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు సంబంధించినవే. ఒక్కో ఫైల్‌కు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు తీసుకున్నట్లు తెలిసింది.

పారదర్శకంగా స్మార్ట్ మీటర్ల టెండర్లు

- ఇందులో దాపరికం ఏం లేదు
- నిబంధనల ప్రకారం జ్యుడిషియల్ ప్రివ్యూ కమిషన్ అనుమతి
- ఆ తరువాత ఈ–ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా టెండర్లు
- ఇతర రాష్ట్రాలకంటే మన రాష్ట్రంలో ఎక్కువగా ఉందనే ప్రచారం అవాస్తవం
- స్మార్ట్ మీటర్ల ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది
- రైతులు ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు
- 'సాక్షి'తో డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు



ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు

సాక్షి, అమరావతి: వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు టెండర్ల ప్రక్రియ అంతా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగిందని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు తెలిపారు. మీటర్ల ధర ఇతర రాష్ట్రాలకంటే మన రాష్ట్రంలో ఎక్కువగా ఉందని, టెండర్లలో అవకతవకలు ఉన్నాయని, ఉద్దేశపూర్వకంగా కొందరికి టెండర్లు కట్టబెట్టారని, ఈ ఖర్చంతా ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపైనే వేస్తారని పచ్చ పత్రికలు, విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారంపై వారు స్పందించారు. వారు శనివారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. టెండర్లలో ఎటువంటి దాపరికం లేదని స్పష్టంచేశారు. నిబంధనల ప్రకారం జ్యుడిషియల్ ప్రివ్యూ కమిషన్ అనుమతి తీసుకొన్న తరువాత ఏపీ ఈ–ప్రొక్యూర్‌మెంట్ పో ర్టల్ ద్వారా టెండర్లను ఆహ్వానించామని చెప్పారు. దేశంలోని ప్రతి గుత్తేదారు పాల్గొనేలా టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించామని స్పష్టం చేశారు. వారు వెల్లడించిన వివరాలు వారి మాటల్లోనే.. స్మార్ట్ మీటర్ల టెండర్లలో షిరిడీ సాయి, అదానీ సంస్థలు పాల్గొనగా షిరిడీ సాయి ఎల్ 1 గా నిలిచింది. అనుబంధ పరికరాల టెండర్లలో షిరిడీ సాయి, జీవీఎస్, విక్రాన్ సంస్థలు పాల్గొనగా షిరిడీ సాయి ఎల్ 1 గా నిలిచింది. ఒక్కో వ్యవసాయ సర్వీసుకు, అనుబంధ పరికరాలతో కలిపి రూ.11,191.64 మాత్రమే. పన్నులతో కలిపి మొత్తం రూ.13,334.88 ఖర్చవుతుంది. స్మార్ట్ మీటర్ల ధరను మాత్రమే కేంద్రం రూ.6 వేలతో అంచనా వేసింది. ఒక్కో మీటరు వ్యయం రూ.36,700కు కొంటుందనడంలో వాస్తవం లేదు. ఆపరేషన్, మెయింటెనెన్స్, రీడింగ్స్ కోసం అయ్యే మొత్తాన్ని నెలవారీగా 93 నెలల కాంట్రాక్ట్ కాల వ్యవధిలో ప్రాజెక్టు వ్యయాన్ని చెల్లిస్తారు. వీటికి నెలకు రూ.194 చొప్పున టెండర్లను దాఖలు చేశారు.

- మీటరు బాక్స్‌తో పాటు పీవీసీ వైరు, ఎంసీబీ, కెపాసిటర్, ఎర్తింగ్ పరికరాలను ఏర్పాటు చేస్తారు. వీటి ద్వారా విద్యుత్ ప్రమాదాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్ తగ్గుతాయి.
- వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. రైతులు పైసా చెల్లించాల్సిన అవసరం లేదు. వ్యవసాయ కనెక్షన్లకు ఉచిత విద్యుత్తు యథాతథంగా కొనసాగుతుంది. ప్రజల నుంచి ఏ విధమైన ట్రూ అప్ చార్జీలు వసూలు చేయరు.
- ఉత్తరప్రదేశ్‌లోని మధ్యాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ మీటరుకు రూ.10 వేలు చొప్పున సింగిల్ ఫేజ్ మీటర్లను మాత్రమే ఏర్పాటు చేస్తోంది. వీటికి ఎటువంటి అనుబంధ పరికరాలూ లేవు. మన రాష్ట్రంలో మొత్తం అన్ని పంపుసెట్లకు త్రీ ఫేజ్ స్మార్ట్ మీటర్లతో పాటు అనుబంధ పరికరాలను ఏర్పాటు చేస్తున్నాం. మహారాష్ట్రలోని పట్టణ ప్రాంతాల్లో ఒక్కో స్మార్ట్ మీటరుకు ఏడున్నరేళ్ల పాటు నెలకు రూ.200.96గా ధర ఖరారు కాగా వాటిలో 80 శాతం సింగిల్ ఫేజ్‌వే. ఏపీలో మొత్తం త్రీ ఫేజ్ మీటర్లే. అయినప్పటికీ ఇక్కడ 93 నెలలకు నెలకు రూ.194 మాత్రమే చెల్లిస్తారు.

తెలంగాణ

బెంబేలెత్తించిన భల్లూకం

- కరీంనగర్ రేకుర్తిలో 14 గంటల పాటు సంచారం
- భయంతో స్థానికుల పరుగులు
- ఎట్టకేలకు బంధించిన ఫారెస్ట్ రెస్క్యూ టీం



భల్లూకాన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న అటవీశాఖ రెస్క్యూ టీం

కొత్తపల్లి (కరీంనగర్): కరీంనగర్ శివారు రేకుర్తి, సీతారాంపూర్ సూర్యనగర్ ప్రాంతాల్లో భల్లూకం హడలెత్తించింది. సుమారు 14 గంటల పాటు స్థానికులను బెంబేలెత్తించిన గుడ్డెలుగు.. ఎట్టకేలకు వరంగల్ నుంచి వచ్చిన రెస్క్యూ టీంకు పట్టుబడింది. సుమారు రెండు గంటల పాటు రెస్క్యూ టీంను ముప్పుతిప్పలు పెట్టింది. కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై రేకుర్తి బస్టాండ్, సీతారాంపూర్ సూర్యనగర్, రేకుర్తి ద్వారకానగర్, గౌడ్స్ కాలనీ, పాత గ్రామ పంచాయతీ ప్రాంతాల్లో భల్లూకం శుక్రవారం అర్ధరాత్రి నుంచి సంచరిస్తోంది. శనివారం వేకువజామున 4.30 గంటల ప్రాంతంలో కుక్కతో బయటకు వెళ్లిన సూర్యనగర్ వాసికి ఎలుగు కనిపించింది. కుక్క మొరగడంతో వెనక్కి తగ్గిన ఎలుగుబంటి.. అక్కడి నుంచి రేకుర్తి వైపు వెళ్లింది. ఎస్సారెస్పీ కెనాల్ మార్గం గుండా ప్రధాన రహదారిపై సంచరిస్తుండటం గమనించిన స్థానికులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం వరంగల్ నుంచి వచ్చిన ఫారెస్ట్ రెస్క్యూ టీం రేకుర్తి సబ్‌స్టేషన్ ప్రాంతంలోని సమ్మక్క గుట్ట పొదల్లో దాగిన ఎలుగుబంటిని పట్టుకునేందుకు వలలు ఏర్పాటు చేసింది. ఎలుగుబంటికి మత్తు ఇంజక్షన్ ఇచ్చే క్రమంలో టీం సభ్యుడిపైకి దూసుకొచ్చింది. ఎట్టకేలకు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వలకు చిక్కిన ఎలుగుబంటిని చికిత్స నిమిత్తం వెటర్నరీ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, మరో రెండు ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

లోదుస్తుల్లో 8 కేజీల బంగారం

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత
- నలుగురు ప్రయాణికుల నుంచి స్వాధీనం



పట్టుబడిన బంగారం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో అక్రమంగా రవాణా చేస్తున్న 8 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం తెల్లవారు జామున బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా ఓ ప్రయాణికుడు ప్యాంటులో దాచి తీసుకొచ్చిన 2 కేజీల బంగారం బిస్కెట్ ముక్కలు బయటపడ్డాయి. వీటి విలువ రూ.1.21 కోట్లు ఉంటుందని నిర్ధారించారు. అదే విమానంలో వచ్చిన మరో ప్రయాణికుడు కూడా లోదుస్తుల్లో దాచుకుని తీసుకొచ్చిన 1.75 కేజీల బంగారం బయపడింది. దీని విలువ 1.8 కోట్లుగా నిర్ధారించారు. షార్జా నుంచి వచ్చిన మరో ప్రయాణికుడి వద్ద లోదుస్తుల్లో దాచుకుని తీసుకొచ్చిన 2.17 కేజీల బంగారం పేస్టును బయటికి తీశారు. దీని విలువ 1.31 కోట్లుగా నిర్ధారించారు. దుబాయ్ నుంచి వచ్చిన మరో వ్యక్తి ధరించిన లో దుస్తుల్లో 2.05 కేజీల బంగారం బయటపడింది. దీని 1.24 కోట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు ఆ నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం పట్టుబడిన 8 కేజీలు బంగారం విలువ రూ.4.86 కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ ఏడాదిలో ఒకే రోజులో అత్యధికంగా పట్టుబడిన బంగారం ఇదేనని కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్‌కు పురస్కారం



సాక్షి, హైదరాబాద్: ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డికి అరుదైన పురస్కారం దక్కింది. ఆరోగ్య సంరక్షణలో సరికొత్త ఆవిష్కరణలు తీసుకురావడం, గ్రామీణ పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు కర్ణాటకలోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డికి జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించింది. ముద్దనహళ్లిలోని సత్యసాయి యూనివర్సిటీలో జరిగిన ఇండియా స్టార్టప్ ఫెస్టివల్ కార్యక్రమంలో సద్గురు మధుసూదన్ సాయి నుంచి నాగేశ్వర్‌రెడ్డి ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డికి లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు



సాక్షి,హైదరాబాద్: ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డికి క్యాపిటల్ ఫౌండేషన్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. ఆదివారం ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఏకే పట్నాయక్ ఈ అవార్డును అందజేస్తారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందజేయనున్నారు.

వైరల్



వదుకుమురా! వదుకుమురా!

వదుకుమురా! వదుకుమురా!
వడి వడి స్వేచ్ఛా వాయువు పీల్చి
- రాట్నగీతము
(గురజాడ రాఘవశర్మ)

స్వేచ్ఛాగీతం

స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు అంతర్జాలంలో ఆరంభం అయ్యాయి. ఆనాటి దేశభక్తి గీతాల నుంచి బ్లాక్ అండ్ వైట్ ఫోటోల వరకు రకరకాల పోస్టులు పెడుతున్నారు...

వీరభారతి సందేశం

పరదేశీయులు తొలగండి
ఈ భారతదేశం మా దేశం
వినండి! వినండి! విశ్వప్రజలు వీరభారతి సందేశం
- వానమామలై వరదాచార్యులు

చిత్రం: 1857 సిపాయి తిరుగుబాటు





ఉప్పోయమ్మ ఉప్పు

ముప్పది కోట్ల ప్రజల ముప్పు దీర్చే ఉప్పు
ఉప్పుగాదిది రత్నపు తిప్ప మన పాలిటికి
- ఉప్పపాట (గరికపాటి మల్లావధాని)

ఫోటో: దండి సత్యాగ్రహం: ఏప్రిల్6, 1930

చెప్పరా...లేకున్న ముప్పరా!

చెప్పరా! నీ కన్నులిటపై/ విప్పరా! ఆ ప్రభుత నింతట
త్రిప్పరా! లేకున్న–నీకగు ముప్పురా! మాయప్ప ఇప్పుడు
- పాంచాలము (గరిమెళ్ల)



ఫోటో: సహాయనిరాకరణ ఉద్యమ కాలంలో బాంబేలో బ్రిటిష్ వారి వస్తువులతో ఉన్న ఎడ్లబండి ముందుకు పోకుండా రోడ్డుకు అడ్డంగా పడుకున్న ఉద్యమకారుడు

చూపున్న విజయం

సంకల్పబలం ఉన్న వారికి ఏదీ అవరోధం కాదు. మహారాష్ట్రలోని మహాబలేశ్వర్‌కు చెందిన భవేష్ భాటియాకు కంటి చూపు లేదు. 'అయితే ఏంటీ' అనే పట్టుదల తప్ప 'అయ్యో!' అని నిరాశ అతడి నోటి నుంచి ఎప్పుడూ వినిపించలేదు. 'సన్‌రైజ్ క్యాండిల్స్' పేరుతో క్యాండిల్స్ కంపెనీ ప్రారంభించాడు. ప్రస్తుతం ఇది 350 కోట్ల యాన్యువల్ టర్నోవర్ ఉన్న కంపెనీగా ఎదిగింది, 9,700 మంది అంధులకు ఉపాధి ఇస్తోంది.

'నువ్వు ఈ లోకాన్ని చూడకపోతేనేం, ఒక విజయం సాధిస్తే ఈ లోకమే నిన్ను చూస్తుంది' అనే మంచి మాట భవేష్ విజయాలకు ఇంధనంగా పనిచేసింది.

భవేష్ సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ మాత్రమే కాదు మంచి ఆటగాడు కూడా. పారాలింపిక్స్ వివిధ విభాగాల్లో ఎన్నో మెడల్స్ గెలుచుకున్నాడు.

భవేష్ భాటియా స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.



పప్పుకు నిప్పెట్టాడు!



అప్పు చేసి పప్పు కూడు తినమన్నారు గానీ...పప్పుకు నిప్పెట్టమని చెప్పలేదు పెద్దలు. హరిద్వార్‌లోని జ్వాలానగర్‌కు చెందిన ఈ పెద్దాయన పప్పుకు నిప్పెట్టి 'ఫైర్‌వాలీ దాల్' పేరుతో తన హోటల్లో హాటు హాటుగా అమ్ముతుంటాడు. నెయ్యి... మొదలైన దినుసులు ఉన్న గరిటెను మండించి ప్లేట్‌లో ఉన్న పప్పుకు జస్ట్ అలా తగిలిస్తాడు...అంతే! 'ఫైర్‌వాలీ దాల్'కు రుచికరమైన సూప్‌ను ఉచితంగా ఇస్తాడు. ఈ 'ఫైర్‌వాలీ దాల్' కోసం ఎప్పుడూ వచ్చే వారితో పాటు ఎలా ఉంటుందో ఒకసారి ట్రై చేద్దాం అంటూ వచ్చే వాళ్లు కూడా ఎక్కువే. ఆనోటా ఈ నోటా ఈ 'ఫైర్‌వాలీ దాల్' గురించి విన్న ఒక యువకుడు పనిగట్టుకొని ఢిల్లీ నుంచి హరిద్వార్‌కు వచ్చాడు. 'ఇతడి చేతిలో ఏదో ఇంద్రజాలం ఉంది' అంటూ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో వేడి వేడిగా పోస్ట్ చేశాడు. 'సో టెంప్టింగ్' అంటూ స్పందించారు నెటిజనులు.

రజనీకాంత్ 'జైలర్' రిలీజ్ సందర్భంగా మన దేశంలో ఉన్న జపాన్ అంబాసిడర్ రజనీలా స్టయిల్‌గా కళ్లద్దాలు ధరించి 'బెస్ట్ విషెస్' చెప్పాడు. ఇక 'ముత్తు' నాటి నుంచి రజనీకి ఫ్యాన్స్‌గా ఉన్న ఒక జంట ఏకంగా జపాన్ నుంచి చెన్నైకి వచ్చింది సినిమా చూడటానికి! రజనీ హవా అలా ఉంది.

అర్థమైందా మచ్చా



'హుంకుమ్... టైగర్ కా హుంకుమ్' అని రజనీకాంత్ చెప్పిన డైలాగ్ సినిమా హాల్లో విజిల్స్‌ను మోతెక్కిస్తోంది. ప్రపంచాన్ని ఇప్పుడు రజనీ చుట్టుముట్టి ఉన్నాడు- జైలర్ సినిమాతో.

అసలే రజనీ అనుకుంటే అతనికి తోడు మోహన్‌లాల్, జాకీష్రాఫ్, శివ రాజ్‌కుమార్ కూడా సినిమాలో ఉండేసరికి మాస్ ఆడియెన్స్ పోటెత్తుతున్నారు. అయితే ఈ సంబరంలో ఇండియన్స్ మాత్రమే లేరు... జపనీయులు కూడా ఉన్నారు. 'ముత్తు' కాలం నుంచి ఇండియాలో రజనీ ఎంతో జపాన్‌లో కూడా అంతే. అంత ఫాలోయింగ్ ఉంది అక్కడ. అందుకే ఇండియాలో ఉన్న జపాన్ అంబాసిడర్ హిరోషి సుజుకీ ఒక వీడియో రిలీజ్ చేసి అందులో రజనీలా స్టయిల్‌గా కళ్లద్దాలు ధరించి 'రజనీ యూ ఆర్ జస్ట్ సూపర్.. విష్ యూ గ్రేట్ సక్సెస్' అని చెప్పాడు. ఇలాంటి మర్యాద ఏ స్టార్‌కూ దక్కలేదు. ఇక జపాన్‌లోని ఒకాసా నుంచి యసుదా హిదెతోషి అనే ఆసామి తన భార్యతో ఏకంగా చెన్నైలో ల్యాండ్ అయ్యాడు 'జైలర్' చూసేందుకు. అతను జపాన్‌లో ఆల్ జపాన్ రజనీ ఫ్యాన్స్ అసోసియేషన్ లీడర్ అట. నెల్సన్ డైరెక్ట్ చేసిన 'జైలర్' ప్రస్తుతం కలెక్షన్ల హవా సృష్టిస్తోంది.

హెల్త్

కొందరికి కొన్ని రకాల పిండితో చేసే కొన్ని వంటలు తిన్నప్పుడు కడుపులో ఒకింత ఇబ్బందిగా ఉండటం, కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనికి కారణం ఆ పిండిలో ఉండే గ్లూటెన్ అనే ఓ ప్రొటీన్. అది ఒంటికి సరిపడకపోవడంతో తమ సొంత వ్యాధినిరోధక వ్యవస్థ తమపైనే ప్రతికూలంగా పనిచేయడం వల్ల ఇలా జరుగుతుంది. అలా వచ్చే ఇబ్బందుల సమాహారాన్ని 'సీలియాక్ డిసీజ్' అంటారు. ఈ ఆరోగ్య సమస్యపై అవగాహన కోసమే ఈ కథనం...



సీలియాక్ డిసీజ్ తగ్గాలంటే..?

గోధుమపిండి, విదేశాలలోనైతే బార్లీ, రై వంటి ధాన్యాల పిండితో చేసే వంటల్లో... ఉదా: మన రోటీలూ, పూరీలతో పాటు పాశ్చాత్యపద్ధతుల్లో చేసే బ్రెడ్, పాస్తా, కేకులు, బిస్కెట్ల వంటివి తిన్నప్పుడు 'సీలియాక్ డిసీజ్' కారణంగా కొంతమందిలో కడుపునకు సంబంధించిన సమస్యలు కనిపిస్తాయి. ఆ ధాన్యాల పిండిలో ఉండే గ్లూటెన్ కారణంగా ఇలా జరుగుతుంది.

గ్లూటెన్ అంటే...?

పిండి కలపడానికి ముందుగా దాన్ని రాశిలా పోసి మధ్యలో గుంట చేసి అందులో కాసిన్ని నీళ్లు పోస్తాం కదా... ఆ పిండిని కలపడం మొదలుపెట్టగానే కాసేపట్లో అది ముద్దగా మారుతుంది. పిండిలో స్వాభావికంగా ఉండే జిగురులాంటి స్వభావాన్నిచ్చే ఓ ప్రొటీనే ఇలా పిండిముద్దలా మార్చేందుకు దోహదం చేస్తుంది. అదే 'గ్లూటెన్'. కొందరికి ఇది సరిపడదు. గ్లూటెన్ సరిపడని స్వభావాన్నే 'గ్లూటెన్ ఇన్‌టాలరెన్స్' అంటారు. (ఇలాంటి వారి కోసం... గ్లూటెన్‌ను వేరు చేసి పిండిని తయారు చేస్తుంటారు. దీన్ని 'గ్లూటెన్ ఫ్రీ' పిండి అని అంటుంటారు. మరికొన్ని రకాల పిండిలో స్వాభావికంగానే గ్లూటెన్ ఉండదు. దాంతో వారికి ఏ ఇబ్బందీ ఉండదు).



డాక్టర్ ధీరజ్ కుమార్ అనుప
మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్

ఆ 'పిండి'వంటలు తింటే ఏమవుతుందంటే...

గ్లూటెన్ ఉన్న పిండితో చేసిన పదార్థాలను తిన్నప్పుడు... అది సరిపడని కారణంగా చిన్నపేగుల కణాలు తీవ్రమైన రియాక్షన్‌ను చూపుతాయి. దాంతో చిన్నపేగుల్లోని 'మైక్రోవిల్లై' అనే భాగాలు దెబ్బతింటాయి. జీర్ణమైన ఆహారాన్ని పీల్చుకునే అవి దెబ్బతినడంతో... తిన్నవి ఒంటబట్టకపోవడం, దేహానికి శక్తి సమకూరకపోవడం, ఎముకలకు కావల్సినంత బలం దొరకకపోవడం, మహిళల్లో సంతానలేమి, గర్భస్రావాలు, కొన్ని నరాలకు సంబంధించిన సమస్యలు కనిపిస్తాయి. మొదట్లో సరిపడకపోయినా ఆ తర్వాత్తర్వాత నెమ్మదిగా జీర్ణవ్యవస్థ దానికి అలవాటు కావడం మొదలుపెడుతుంది. అలా జరగకపోతే చిన్నపేగులు/జీర్ణవ్యవస్థ దెబ్బతినడం మొదలై క్రమక్రమంగా అది సీలియాక్ డిసీజ్‌గా మారుతుంది. జీర్ణవ్యవస్థ గ్లూటెన్‌కు అలవాటు కాకపోవడంతో వచ్చే సమస్యను 'రిఫ్రాక్టరీ లేదా నాన్ రెస్పాన్సివ్ సీలియాక్ డిసీజ్'గా చెబుతారు.

లక్షణాలు : సీలియాక్ డిసీజ్ కూడా ఒకరకమైన ఫుడ్ అలర్జీ లాంటిదే. అయితే దీని లక్షణాలు వేర్వేరు వ్యక్తుల్లో వేర్వేరుగా ఉంటాయి. అవి... ● కడుపులో నొప్పి, గ్యాస్ నిండటంతో కడుపు ఉబ్బరం. దాంతో ఛాతీనొప్పి, ఛాతీలో / గుండెల్లో మంట ● వికారం ● తలనొప్పి, ఒంటి మీద దురదతో కూడిన ర్యాష్ (దీన్ని డాక్టర్లు డెర్మటైటిస్ హెర్పెటోఫార్మిస్ అంటారు) ● కొందరిలో నోట్లో పుండ్లు ● రక్తహీనత ● కొందరిలో నీళ్ల విరేచనాలు / మరికొందరిలో మలబద్ధకం / దుర్వాసనతో కూడిన మలవిసర్జన ● తిన్నది ఒంటబట్టకపోవడంతో బరువు తగ్గడం.

దుష్ప్రభావాలు...

ఆహారం సరిగా ఒంటబట్టకపోవడంతో మరి కొన్ని దుష్ప్రభావాలూ కనిపించవచ్చు. అవి... కొందరిలో దంతాలపై ఎనామెల్ దెబ్బతినడం ● చిన్న పిల్లల్లో (అబ్బాయిలూ, అమ్మాయిల్లో) పెరుగుదల కాస్త మందగించడం ● కొందరిలో పాలు సరిపడకపోవడం (లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్) ● ఎముకలు బలహీనంగా మారడం ● అరుదుగా కొందరిలో నరాల సమస్య రావడంతో చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, స్పర్శ సరిగా తెలియకపోవడం, కాళ్లలో సమస్య తీవ్రంగా ఉంటే సరిగ్గా నిలబడలేకపోవడం వంటి సమస్యలు.

నిర్ధారణ : ● ఆటో ఇమ్యూన్ రుగ్మతలను తెలుసుకునే కొన్ని రకాల రక్తపరీక్షల (యాంటీబాడీస్ అన్వేషించే సీరాలజీ పరీక్షల)తో పాటు ఎర్ర రక్తకణాల సంఖ్యను తెలుసుకునేందుకు చేసే రక్తపరీక్షలు ● దేహంలో ఇన్‌ఫ్లమేషన్ ఉందని తేలినప్పుడు చేసే సీ–రియాక్టివ్ ప్రొటీన్ పరీక్ష ● కాలేయం పనితీరు కోసం 'లివర్ ఫంక్షన్ టెస్ట్' ● పేగుల్లోని ఫ్యాటీ యాసిడ్స్ తెలుసుకునేందుకు కొన్ని పరీక్షలు ● విటమిన్–డి, విటమిన్ బి–12 ల మోతాదును తెలుసుకునే పరీక్షలు ● అవసరాన్ని బట్టి ఎండోస్కోపీ ● పేగుల పరిస్థితిని తెలుసుకునే కొన్ని ఇమేజింగ్ పరీక్షలతో పాటు అవసరాన్ని బట్టి కొన్ని జన్యుపరీక్షలతో సమస్యను నిర్ధారణ చేస్తారు.

నివారణ / చికిత్స :
ప్రధానంగా ఇది ఆటో ఇమ్యూన్ సమస్య కావడంతో నిర్దిష్టమైన చికిత్స ఉండదు. అయితే సమస్యను నివారించడానికి గ్లూటెన్ లేని పిండిని వాడాలని వైద్యనిపుణులు సూచిస్తారు. అలాగే ఆహారలోపం రాకుండా నివారించడం కోసం పాలు, పాల ఉత్పాదనలు, తాజా పండ్లు, పుష్టికరమైన ఆహారం వంటివి తీసుకోవాలని డాక్టర్లు చెబుతారు. సీలియాక్ డిసీజ్‌కు దారితీసే కొన్ని పానీయాలు, మద్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తారు. అలాగే సమస్య కారణంగా వచ్చే దుష్ప్రభావాలను తగ్గించడం కోసం అంటే నీళ్ల విరేచనాలు / చర్మంపై ర్యాష్ వంటివాటికి సంబంధిత మందుల్ని ఇవ్వడం లాంటివి చేస్తుంటారు. సమస్య తీవ్రతను బట్టి కొన్నిసార్లు స్టెరాయిడ్స్ కూడా ఇవ్వాల్సి రావచ్చు. పిల్లల్లో/పెద్దల్లో మున్ముందు వచ్చే దుష్ప్రభావాల నివారణ కోసం ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు తీసుకోవాలని సూచిస్తారు.

థైరాయిడ్ సమస్య అనగానే హైపర్ థైరాయిడిజమ్, హైపో థైరాయిడిజమ్‌లు గుర్తుకొస్తాయి. హషిమోటో థైరాయిడైటిస్ అనేది హైపో థైరాయిడిజమ్‌లోని ఒక సమస్య. ఇది తమ సొంత వ్యాధి నిరోధక వ్యవస్థే తమపై ప్రతికూలంగా పని చేయడం వల్ల వచ్చే ఒక రకం ఆటో ఇమ్యూన్ డిసీజ్. అందుకే దీన్ని 'ఆటోఇమ్యూన్ హైపో థైరాయిడిజమ్' అని కూడా అంటారు. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

హషిమోటో థైరాయిడైటిస్ అంటే..!

మన దేహంలో మెడ దగ్గర సీతాకోకచిలుక ఆకృతిలో ఓ కీలకమైన థైరాయిడ్ గ్రంథి ఉంటుంది. ఇది దేహంలోని అనేక రకాల జీవక్రియలకు అవసరమైన థైరాక్సిన్ అనే హార్మోన్‌ను స్రవిస్తూ ఉంటుంది. తమ సొంత వ్యాధి నిరోధక వ్యవస్థ థైరాయిడ్ గ్రంథిపై వ్యతిరేకంగా పనిచేయడం వల్ల 'థైరాక్సిన్' హార్మోన్ స్రావాలు తగ్గుతాయి. దాంతో అది హైపో థైరాయిడిజమ్‌కు దారితీస్తుంది. ఫలితంగా సరిపోయినంత థైరాక్సిన్ దొరకక దేహానికి అవసరమైన జీవక్రియలు జరగవు. ఈ హైపోథైరాయిడిజమ్‌లోని ఒకానొక కండిషన్ పేరే 'హషిమోటో థైరాయిడైటిస్'.



కారణాలు:
'హషిమోటో థైరాయిడైటిస్'కు కారణాలు ఇంకా తెలియదు. కానీ కొన్ని జన్యుపరమైన కారణాలతో, అలాగే హార్మోన్ స్రావాల లోపాలతో ఇలా జరుగుతుందని పరిశోధకులు గుర్తించారు. అదీగాక థైరాయిడ్ సమస్య వచ్చే మహిళల్లోని 20% మందిలో తర్వాత్తర్వాత ఈ సమస్య వచ్చే అవకాశాలూ ఎక్కువని కూడా తెలుసుకున్నారు. గతంలోనైతే ఆహారం లో అయోడిన్ లేని ఉప్పు కారణంగా ఈ సమస్య వచ్చేది. ఎందుకంటే థైరాయిడ్ బాగా పని చేయాలంటే అయోడిన్ అవసరం. పిండదశలోనే ఈ సమస్యతో మానసిక, శారీరక ఎదుగుదల లోపాలు కనిపిస్తాయి. దాన్ని 'క్రెటినిజమ్' అని అంటారు. అయితే ఇటీవల ఐయోడైజ్‌డ్ ఉప్పు లభ్యతతో... వ్యాధి రావడం తగ్గింది. కొన్ని రకాల రేడియేషన్‌లకు గురికావడమూ ఈ సమస్యకు దారితీస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. కొంతమందిలో థైరాయిడ్‌లో గడ్డ లేదా క్యాన్సర్ కణితి రావడంతో, దాన్ని తొలగించడంతోనూ హైపోథైరాయిడిజమ్ రావచ్చు. అయితే... 'హషిమోటో థైరాయిడైటిస్'లో థైరాయిడ్ గ్రంథి అలాగే ఉంటుందిగానీ... దాని పని తీరు తగ్గుతూపోతుంది. పురుషులతో పోలిస్తే మహిళల్లో దీని విస్తృతి ఎక్కువ.

చికిత్స:
ఒకసారి హషిమోటో థైరాయిడైటిస్ ఉందని నిర్ధారణ జరిగాక... బాధితులు ప్రతిరోజూ తగిన మోతాదులో థైరాక్సిన్ మాత్రను పరగడుపున తీసుకోవాల్సి ఉంటుంది. దాంతో దేహంలోని అన్ని రకాల జీవక్రియలకు అవసరమైన థైరాక్సిన్ హార్మోన్ లభ్యమై... అన్ని జీవక్రియలూ సజావుగా/ నార్మల్‌గా జరుగుతాయి. అయితే 'హార్మోన్'ను అందించే (హార్మోన్ రీప్లేస్‌మెంట్ ట్రీట్‌మెంట్) ఇవ్వాలి. బాధితులు దీన్ని జీవితాంతం వాడాల్సి ఉంటుంది.

లక్షణాలు:
దీని లక్షణాలు వేర్వేరు వయసు వాళ్లలో వేర్వేరుగా కనిపిస్తాయి. స్థూలంగా ఈ కింద పేర్కొన్న విధంగా ఉంటాయి. ➡ మెడదగ్గర ఉండే థైరాయిడ్ గ్రంథిలో వాపు రావడంతో మెడ ముందు భాగం ఉబ్బినట్లుగా కనిపించడం ప్రధానమైన / కీలకమైన లక్షణం ➡ హైపోథైరాయిడిజమ్‌లో థైరాయిడ్ గ్రంథి పని తీరు లోపించినప్పుడు స్థూలకాయం సాధారణం. అందువల్ల ఈ సమస్య బాధితులు బాగా బరువు పెరుగుతుంటారు ➡ నీరసం, నిస్సత్తువ, తీవ్రమైన అలసట ➡ పాలిపోయినట్లుగా కాస్త ఉబ్బినట్లుగా కనిపించే ముఖం ➡ కండరాల, కీళ్ల నొప్పులు ➡ మలబద్ధకం ➡ మహిళల్లో గర్భధారణ సమస్యలు, సంతానలేమి, యువతుల్లో ఆలస్యంగా రజస్వల కావడం, అయ్యాక నెలసరి సక్రమంగా రాకపోవడం, రుతుసమయంలో రక్తం ఎక్కువగా పోవడం వంటి ఇబ్బందులు ➡ జుట్టు రాలిపోవడం, పలచబడటం ➡ గుండె స్పందనల వేగం తగ్గడం ➡ కుంగుబాటు (డిప్రెషన్)కు గురికావడం వంటి మానసిక సమస్యలు కనిపిస్తాయి ➡ పుట్టిన పిల్లల్లో పుట్టుకతోనే (కంజెనిటల్‌గా) హైపోథైరాయిడిజమ్ ఉంటే వాళ్ల మెదడు పెరుగుదల మందగిస్తుంది. పిల్లల దశలోనే వస్తే వాళ్ల ఎదుగుదల దెబ్బతింటుంది. స్కూల్ చదువుల్లో పర్‌ఫార్మెన్స్ తక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నిర్ధారణ : టీ3, టీ4, టీఎస్‌హెచ్ పరీక్ష చేయించినప్పుడు టీ3, టీ4 మోతాదులు నార్మల్‌గా లేదా తక్కువగానే ఉన్నప్పటికీ టీఎస్‌హెచ్ మోతాదులు ఎక్కువగా ఉంటాయి. యాంటీ–టీపీవో యాంటీబాడీస్ పరీక్షలు చేసినప్పుడు టీఎస్‌హెచ్ మోతాదులతో పాటు యాంటీ–టీపీవో యాంటీబాడీస్, యాంటీ థైరోగ్లోబ్యులిన్ యాంటీబాడీస్ పరీక్షల్లో వాటి మోతాదుల్లో పెరుగుదల కనిపిస్తే దాన్ని 'హషిమోటో థైరాయిడైటిస్ / ఆటోఇమ్యూన్ హైపోథైరాయిడిజమ్'గా నిర్ధారణ చేయవచ్చు.



డా॥ శ్రీనివాస్ కందుల
కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్

మెడిటిప్



ఏ సమస్యనైనా దాచడం సాధ్యమేమోగానీ... పెదవులకు వచ్చే సమస్యలు ఇట్టే బయటకు కనిపిస్తాయి. దాంతో అనారోగ్యం బయటపడటంతో పాటు అందం కూడా తగ్గుతుంది. ఫలితంగా సెల్ఫ్ ఎస్టీమ్ కూడా తగ్గుతుంది. అందుకే పెదవుల ఆరోగ్యం కాపాడుకోవాలంటే తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలివి...

పెదవుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే...

● అన్ని పోషకాలు ఉండే సమతుల ఆహారం తీసుకోవాలి ● సిగరెట్లు తాగేవారిలో పెదవులు నల్లగా, బండగా మారవచ్చు. అందుకే స్మోకింగ్ అలవాటును వెంటనే మానేయాలి ● మహిళల్లో లిప్‌స్టిక్ వాడేవారు వాటి కొనుగోలు సమయంలో జాగ్రత్తగా ఉండాలి. అందులో ప్రొపైల్ గ్యాలేట్ అనే రసాయన పదార్థం ఉంటుంది. దాని వల్లనే ప్రధానంగా అలర్జీలు వస్తుంటాయి. లిప్‌స్టిక్ వాడే వారు అది తమకు సరిపడుతుందా లేదా అన్న విషయాన్ని తొలుత పరిశీలించుకుని, తమకు సరిపడుతుందని తేలిన తర్వాతే వాడటం మంచిది ● నిద్రకు ఉపక్రమించే ముందు లిప్‌స్టిక్ శుభ్రంగా కడుక్కోవాలి. ఆ టైమ్‌లో పెదవులపై పలుచగా నెయ్యి లేదా బాదం నూనె రాసుకోవచ్చు ● కొన్ని టూత్‌పేస్ట్‌ల వల్ల కూడా మనకు పెదవులపై దురద రావచ్చు. అలాంటప్పుడు వాటిని ఉపయోగించడం ఆపేయాలి ● నీరు ఎక్కువగా తాగుతుండాలి. పెదవులు తడి ఆరిపోకుండా చూసుకోవాలి. అయితే నాలుకతో తడపకూడదు.



ఆసియా' ప్రాబబుల్స్‌లో రాణి రాంపాల్‌కు దక్కని చోటు

భారత హాకీ సీనియర్ క్రీడాకారిణి, మాజీ కెప్టెన్ రాణి రాంపాల్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. ఆసియా క్రీడల కోసం 34 మంది ప్రాబబుల్స్‌తో ప్రకటించిన జట్టులో ఆమెకు చోటు దక్కలేదు. గత కొంత కాలంగా తనను టీమ్‌లోకి ఎంపిక చేయకపోవడంపై రాణి రెండు రోజుల క్రితమే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మెరుగైన ప్రదర్శన తర్వాత కూడా తనను ఎందుకు పక్కన పెట్టారో హెడ్ కోచ్ జేన్‌కే షాప్‌మన్‌ను ఆమె ప్రశ్నించింది. ఆమె విమర్శలను పట్టించుకోని భారత హాకీ సమాఖ్య (హెచ్ఐ) ఆమె పేరు లేకుండానే జట్టును ఎంపిక చేసింది. ఇటీవల స్పెయిన్‌లో జరిగిన టోర్నీలో చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్న ప్లేయర్లందరికీ ఇందులో అవకాశం లభించింది. ప్రాబబుల్స్ జాబితాలో నలుగురు గోల్‌కీపర్లలో ఒకరిగా ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ యతిమరపు రజని ఎంపికైంది.



‘ఆసియా’ చాంపియన్ భారత్

- ఓటమి అంచుల్లోంచి గెలుపు వైపు
- ఫైనల్లో 4–3తో మలేసియాపై గెలుపు
- నాలుగోసారి చాంపియన్స్ ట్రోఫీ కైవసం

చెన్నై: ఫైనల్ వరకు ఎదురు లేకుండా అజేయంగా నిలిచిన భారత జట్టుకు తుది పోరులో మలేసియాపై గెలుపు నల్లేరుపై నడకే అనుకున్నారంతా! అంచనాలకు తగినట్లుగా తొలి గోల్‌తో ఆధిపత్యం కూడా దక్కింది. కానీ ఆపై మూడుసార్లు ఆసియా చాంపియన్‌కు అసలు పోటీ అర్థమైంది. ఆట అర్ధ భాగం (రెండు క్వార్టర్లు) ముగిసేసరికి భారత్ 1–3తో ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఇక మిగిలింది అర గంట. గెలవాలంటే మిగిలిన 30 నిమిషాల్లో 3 గోల్స్ కావాలి. సర్వశక్తులు ఒడ్డాల్సిన స్థితి. ప్రత్యర్థి జోరు మీదుంది. భారత్ ఆటగాళ్లపైనే ఒత్తిడి. ఈ దశలో మూడో క్వార్టర్ ముగిసే నిమిషం భారత్‌కు వరంగా మారింది. మ్యాచ్‌ను మన పరం చేసింది. 45వ నిమిషంలో భారత ఆటగాళ్లు చేసి రెండు గోల్స్‌తో స్కోరు 3–3తో సమమైంది. మిగిలింది ఆఖరి క్వార్టర్ ఒక గోల్ చేస్తే భారత్ టైటిల్ దక్కుతుంది. ఆకాశ్‌దీప్ సింగ్ (56వ ని.లో) అదే మ్యాజిక్ చేశాడు. ప్రత్యర్థి డిఫెండర్లను బోల్తా కొట్టించి గోల్‌పోస్ట్‌లోకి దూసుకెళ్లాడు. అనుకున్న ఫలితాన్ని అజేయమైన భారత్ సాధించింది. 9వ నిమిషంలో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను జుగ్‌రాజ్ గోల్‌గా మలిచాడు. కానీ మలేసియా శిబిరం నుంచి నిమిషాల వ్యవధిలో అబు కమల్ (14వ ని.లో), రహీమ్ రజీ (18వ ని.లో), అమినుద్దీన్ (28వ ని.లో) చెరో గోల్ చేశారు. జట్టు ఆత్మరక్షణలో పడిన ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (45వ ని.), గుర్జాంత్ (45వ ని.) గోల్ చేసి అడుగంటిన ఆశలకు జీవం పోశారు. మిగిలిన ఆఖరి గోల్‌ను ఆకాశ్‌దీప్ (56వ ని.) సాధించడంతో భారత్ జయకేతనం ఎగరేసింది.

జపాన్‌కు కాంస్యం

సెమీస్‌లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా కనీసం కాంస్య పతకమైనా గెలుద్దామనుకుంటే జపాన్ ముందు వారి ఆటలు సాగలేదు. ఫైనల్‌కు ముందు మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో జపాన్ 5–3తో కొరియాను కంగుతినిపించింది. ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించిన జపాన్ ఆటగాళ్లే కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నారు. దీంతో కొరియా నాలుగో స్థానంతో తృప్తిపడింది. జపాన్ తరఫున ర్యోమా ఓకా (3వ ని.లో), రియోసె కటో (9వ ని.లో)కెంటరో ఫుకుదా (28వ ని.లో) షోట యమాద (53వ ని.లో), కెన్ నగయొషి (58వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. కొరియా జట్టులో జంగ్‌హ్యున్ జంగ్ (15వ, 33వ ని.లో) రెండు గోల్స్ సాధించిపెట్టగా, చెవొలియోన్ పార్క్ (26వ ని.) ఒక గోల్ చేశాడు.

ఆంధ్ర జట్టుతోనే విహారి



హైదరాబాద్: భారత టెస్టు క్రికెటర్ గాదె హనుమ విహారి వచ్చే దేశవాళీ సీజన్‌లో మధ్యప్రదేశ్ జట్టుకు ఆడాలనుకున్న తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాడు. తన సొంత జట్టు ఆంధ్ర తరఫునే కొనసాగేందుకు సిద్ధమయ్యాడు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సభ్యుల విజ్ఞప్తి మేరకు విహారి ఈ నిర్ణయం తీసుకున్నాడు. గత సీజన్‌లో విహారి నాయకత్వంలోనే ఆంధ్ర రంజీ ట్రోఫీ నాకౌట్ దశకు చేరగా... బ్యాటింగ్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయిన అతను 14 ఇన్నింగ్స్‌లలో 2 హాఫ్ సెంచరీలతో 490 పరుగులు మాత్రమే చేశాడు. అయితే మధ్యప్రదేశ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కుడి చేతికి తీవ్ర గాయం కాగా, జట్టును ఓటమినుంచి రక్షించేందుకు అతను ఎడమచేత్తో బ్యాటింగ్ చేయడం ఆకట్టుకుంది. భారత్ తరఫున చివరిసారిగా ఏడాది క్రితం బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో విహారి బరిలోకి దిగాడు.

బోపన్న ద్వయం ఓటమి

టొరంటో: నేషనల్ బ్యాంక్ ఓపెన్ ఏటీపీ- 1000 మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న జోడి క్వా ర్టర్ ఫైనల్లో పరాజయంపాలైంది. టొరంటోలో జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్స్ మ్యాచ్‌లో మార్సెల్ గ్రానో లర్స్ (స్పెయిన్) – హొరాసియో జెబలోస్ (అ ర్జెంటీనా) జంట 7–5, 6–7 (6/8), 10–8 స్కోరుతో నాలుగో సీడ్ బోపన్న – మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయంపై విజయం సాధించింది. 1 గంటా 55 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో బోపన్న–ఎబ్డెన్ జంట 6 ఏస్‌లు సంధించింది.

ఆడుతూ పాడుతూ...

- నాలుగో టి20లో భారత్ ఘన విజయం
- 9 వికెట్లతో చిత్తయిన వెస్టిండీస్
- చెలరేగిన గిల్, యశస్వి
- నేడు చివరి టి20 మ్యాచ్



లాడర్‌హిల్ (ఫ్లోరిడా): భారత్, వెస్టిండీస్ నాలుగో టి20కి ముందు ఈ రీజినల్ పార్క్ మైదానంలో జరిగిన 13 టి20ల్లో 11 మ్యాచ్‌లలో ముందుగా బ్యాటింగ్ చేసి జట్టే గెలిచింది. అత్యధిక లక్ష్య ఛేదన 95 పరుగులు మాత్రమే. అయితే శనివారం పోరులో భారత జోరు ముందు ఇవేవీ లెక్కలోకి రాలేదు. ముందుగా విండీస్ భారీ స్కోరు చేసినా, భారత్ ఓపెనర్ల జోరుతోనే అలవోక విజయం సాధించి సిరీస్‌లో 2–2తో సమంగా నిలిచింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విండీస్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. షిమ్రాన్ హెట్‌మైర్ (39 బంతుల్లో 61; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), షై హోప్ (29 బంతుల్లో 45; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అనంతరం భారత్ 17 ఓవర్లలో వికెట్ నష్టానికి 179 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ యశస్వి జైస్వాల్ (51 బంతుల్లో 84 నాటౌట్; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (47 బంతుల్లో 77; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 94 బంతుల్లోనే 165 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. సిరీస్ విజేతను తేల్చే చివరిదైన ఐదో టి20 మ్యాచ్ నేడు ఇదే వేదికపై జరుగుతుంది.

హెట్‌మైర్ మెరుపులు...

సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన హోప్, వరుస వైఫల్యాల తర్వాత తనదైన శైలిలో చెలరేగిన హెట్‌మైర్ మినహా విండీస్ బ్యాటింగ్ పూర్తిగా తడబాటుకు గురైంది. దూకుడుగా ఇన్నింగ్స్ ప్రారంభించినా... మేయర్స్ (17), ఆ తర్వాత కింగ్ (18) ఎక్కువ సేపు నిలవలేదు. హోప్ కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లేలో జట్టు స్కోరు 55 పరుగులకు చేరింది. అయితే కుల్దీప్ తన తొలి ఓవర్లోనే పూరన్ (1), పావెల్ (1)లను అవుట్ చేసి విండీస్‌ను దెబ్బ తీయడంతో స్కోరు 57/4కు చేరింది. ఈ దశలో హోప్, హెట్‌మైర్ కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు 6 ఓవర్లలో 49 పరుగులు జోడించారు. హోప్‌ను అవుట్ చేసి చహల్ ఈ భాగస్వామ్యాన్ని విడదీయగా, హెట్‌మైర్ వరుస సిక్సర్లతో తన జోరును కొనసాగించాడు. 35 బంతుల్లో అతని అర్ధసెంచరీ పూర్తయింది. ఆఖరి 5 ఓవర్లలో విండీస్ 57 పరుగులు సాధించింది.

అలవోకగా...

ఛేదనలో భారత్‌కు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. ఓపెనర్లు యశస్వి, గిల్ ధాటిగా ఆడుతూ దూసుకుపోయారు. తొలి బంతికి ఫోర్‌తో మొదలైన ఇన్నింగ్స్ అదే జోరులో గెలుపు దిశగా సాగింది. తొలి 6 ఓవర్లలోనే భారత్ 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 66 పరుగులు చేసింది. 10 ఓవర్లు ముగిసే సరికి స్కోరు సరిగ్గా 100కు చేరింది. ఆపై కూడా వీరిద్దరిని నియంత్రించడం విండీస్ వల్ల కాలేదు. 30 బంతుల్లో గిల్, 33 బంతుల్లో యశస్వి హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నారు. విజయానికి మరో 14 పరుగుల దూరంలో గిల్ అవుటైనా, తిలక్ వర్మ (7 నాటౌట్)తో కలిసి యశస్వి మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 17; కింగ్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 18; హోప్ (సి) అక్షర్ (బి) చహల్ 45; పూరన్ (సి) సూర్యకుమార్ (బి) కుల్దీప్ 1; పావెల్ (సి) గిల్ (బి) కుల్దీప్ 1; హెట్‌మైర్ (సి) తిలక్ (బి) అర్ష్‌దీప్ 61; షెఫర్డ్ (సి) సామ్సన్ (బి) అక్షర్ 9; హోల్డర్ (బి) ముకేశ్ 3; స్మిత్ (నాటౌట్) 15; హొసీన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1–19, 2–54, 3–55, 4–57, 5–106, 6–118, 7–123, 8–167. **బౌలింగ్:** అక్షర్ 4–0–39–1, అర్ష్‌దీప్ 4–0–38–3, చహల్ 4–0–36–1, కుల్దీప్ 4–0–26–2, పాండ్యా 1–0–14–0, ముకేశ్ 3–0–25–1.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (నాటౌట్) 84; గిల్ (సి) హోప్ (బి) షెఫర్డ్ 77; తిలక్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (17 ఓవర్లలో వికెట్‌నష్టానికి) 179. వికెట్ల పతనం: 1–165. బౌలింగ్:** మెకాయ్ 3–0–32–0, హొసీన్ 4–0–31–0, హోల్డర్ 4–0–33–0, షెఫర్డ్ 3–0–35–1, స్మిత్ 2–0–30–0, పావెల్ 1–0–13–0.

అర్జున్ విజయం హారిక ‘డ్రా’



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచ కప్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ ఆటగాడు ఇరిగేశి అర్జున్ కీలక విజయాన్ని అందుకున్నాడు. ఓపెన్ విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్ తొలి రౌండ్‌లో నల్ల పావులతో ఆడి అర్జున్ గెలుపు నమోదు చేయడం విశేషం. ఈ గేమ్‌లో అర్జున్ 53 ఎత్తుల్లో స్వీడన్ గ్రాండ్‌మాస్టర్ నిల్స్ గ్రాండెలియస్‌ను ఓడించాడు. నేడు జరిగే రెండో రౌండ్‌ను అతను ‘డ్రా’గా ముగించినా సరే క్వార్టర్ ఫైనల్ చేరతాడు. మహిళల విభాగం క్వార్టర్ ఫైనల్లో ద్రోణవల్లి హారిక తొలి రౌండ్‌ను నల్లపావులతో ‘డ్రా’ చేసుకుంది. అలెగ్జాండ్రా గొర్యాకినా (రష్యా)తో జరిగిన ఈ పోరును 48 ఎత్తుల్లో హారిక ముగించింది. ఓపెన్ విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్ రౌండ్ తొలి గేమ్‌లో నల్లపావులతో ఆడి డి.గుకేశ్ కూడా విజయాన్ని అందుకున్నాడు. గుకేశ్ 38 ఎత్తుల్లో వాంగ్ హావో (చైనా)పై గెలుపొందాడు. ఇతర ప్రిక్వార్టర్ మ్యాచ్‌లలో ఫెరెన్స్ బెర్క్స్ (హంగేరీ)– ప్రజ్ఞానంద (45 ఎత్తుల్లో)...ఇయాన్ నెపొమ్నియాచి (రష్యా)– విదిత్ గుజరాతీ మధ్య (31 ఎత్తుల్లో) జరిగిన తొలి గేమ్‌లు ‘డ్రా’గా ముగిశాయి.

సినిమా


● కరీనా
● టబు
● కృతీ సనన్

మల్టీస్టారర్ సినిమాలంటే ఎక్కువగా హీరోలే చేస్తుంటారు. కానీ జస్ట్ ఫర్ ఏ చేంజ్... హిందీలో ఉమెన్ మల్టీస్టారర్ ఫిలింస్ తెరకెక్కుతున్నాయి. 2018లో వచ్చిన లేడీ మల్టీస్టారర్ ఫిల్మ్ ‘వీరే ది వెడ్డింగ్’ రూ. వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఆ తర్వాత కథానాయిక ప్రాధాన్యంగా సాగే మల్టీ లేడీ స్టారర్ (ఒకే సినిమాలో ఎక్కువమంది కథానాయికలు నటించడం) చిత్రాలు పెద్దగా రాలేదు. ఇప్పుడు ఆ తరహా చిత్రాలు కొన్ని రూపొందుతున్నాయి. ఆ ‘మల్టీ లేడీ స్టారర్’ చిత్రాల గురించి తెలుసుకుందాం.

మల్టీ లేడీ స్టారర్

జర ఆలస్యంగా జీ లే జరా

బాలీవుడ్ అగ్ర తారలు ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్ కలిసి రోడ్ ట్రిప్ బ్యాక్‌డ్రాప్‌లో ‘జీ లే జరా’ అనే సినిమాలో నటించనున్నారు. 2021లోనే దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ఈ సినిమాను ప్రకటించినా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. ఈలోపు హాలీవుడ్ కమిట్‌మెంట్స్ కారణంగా ‘జీ లే జరా’ చిత్రం నుంచి ప్రియాంకా చోప్రా, కాల్షీట్స్ సర్దుబాటు చేయలేక కత్రినా కైఫ్ తప్పుకున్నారనే టాక్ వినిపించింది. ఓ దశలో ఈ సినిమా క్యాన్సిల్ అయిందనే ప్రచారం కూడా జరిగింది. అయితే ‘జీ లే జరా’ చిత్రం ఉందని, వచ్చే ఏడాది ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకుని వెళ్తామని ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన రీమా కగ్తి ఇటీవల పేర్కొన్నారు. జోయా అక్తర్ ఈ సినిమాకు మరో నిర్మాత. కాగా ఇటీవల రణ్‌వీర్ సింగ్ హీరోగా ‘డాన్ 3’ని ప్రకటించారు ఫర్హాన్ అక్తర్. సో.. ఈ సినిమా షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత జర ఆలస్యంగా ‘జీ లే జరా’ చిత్రం సెట్స్‌పైకి వెళ్తుందనే టాక్ వినిపిస్తోంది.


● ఆలియా, ప్రియాంక, కత్రినా

ఆకాశంలో...

కరీనా కపూర్, టబు, కృతీ సనన్ ఎయిర్‌లైన్ ఇండస్ట్రీలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ బ్యూటీలు ఈ డ్యూటీ చేస్తున్నది ‘ది క్రూ’ సినిమా కోసం. రాజేష్ క్రిష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముంబై, అబుదాబి లొకేషన్స్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఎయిర్ లైన్స్ ఇండస్ట్రీలో ఉద్యోగాలు చేస్తున్న ముగ్గురు మహిళల జీవితాలు ఊహించని ఘటనల కారణంగా ఏ విధంగా ప్రభావితం అయ్యాయి? అన్నదే ఈ చిత్రకథ. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చిలో రిలీజ్ కానుంది.

ఈ చిత్రానికి తాప్సీ ఓ నిర్మాత. ‘ధక్ ధక్’ వచ్చే ఏడాది విడుదల కానుంది.

రైజ్.. రెబల్.. రిపీట్

భూమి పెడ్నేకర్, షెహనాజ్ గిల్, డాలీ సింగ్, కుషా కపిల, షిబానీ బేడీ వంటి తారలు లీడ్ రోల్స్ చేసిన చిత్రం ‘థ్యాంక్యూ ఫర్ కమింగ్’.. ‘రైజ్.. రెబల్.. రిపీట్’ అనేది ఈ సినిమాకు ఉపశీర్షిక. కరణ్ బూలానీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 30 ఏళ్లు దాటిన ఓ అమ్మాయి వివాహం చేసుకోదు. దీంతో జీవితంలో ఏదో కోల్పోయిన భావన. తన ఫ్రెండ్స్‌ను కలవాలనుకుంటుంది. స్నేహితులు ఓ పార్టీని ప్లాన్ చేస్తారు. ఈ క్రమంలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకున్నాయి? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని బాలీవుడ్ టాక్. అక్టోబరులో ఈ సినిమా విడుదల కానుంది. అలాగే ‘టొరంటో ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్–2023’లో ‘థ్యాంక్యూ ఫర్ కమింగ్’ చిత్రం ప్రదర్శనకు ఎంపికైందని, టీమ్ అంతా సంతోషంగా ఉన్నామని ఈ చిత్రనిర్మాతల్లో ఒకరైన రేఖా కపూర్ పేర్కొన్నారు.


● ‘ధక్ ధక్’ పోస్టర్


● ‘థ్యాంక్యూ ఫర్ కమింగ్’ పోస్టర్

అన్వేషణ

విభిన్నమైన మనస్తత్వాలు, వయసు రీత్యా వ్యత్యాసం ఉన్న నలుగురు మహిళలు బైక్‌పై రోడ్ ట్రిప్ చేసి, ఆ అనుభవాలతో తమ జీవితాలను తాము కొత్తగా ఏ విధంగా మార్చుకున్నారు? అనే కథాంశంతో రూపొందుతున్న చిత్రం ‘ధక్ ధక్’. ఫాతిమా సనా షేక్, రత్నా పాతక్, సంజన, దియా మీర్జా లీడ్ రోల్స్ చేస్తున్నారు. తరుణ్ డుడేజా దర్శకత్వం వహిస్తున్నారు.

లేడీ మల్టీస్టారర్ ట్రెండ్ వెబ్ సిరీస్‌లోనూ కనిపిస్తోంది. బాలీవుడ్ అగ్రదర్శకుల్లో ఒకరైన సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న తాజా సిరీస్ ‘హీరా మండి’. మనీషా కోయిరాల, అదితీరావ్ హైదరి, సోనాక్షీ సిన్హా, రీచా చద్దా, షర్మిన్ సెగల్, సంజీదా షేక్‌లు లీడ్ రోల్స్ చేశారు. ప్రేమ, ద్రోహం, వారసత్వం, రాజకీయం వంటి అంశాలతో రూపొందిన ఈ సిరీస్ 1940 బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. హీరా మండి ప్రాంతంలోని వేశ్యల జీవితాల నేపథ్యంలో ఈ సిరీస్ తెరకెక్కింది. త్వరలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.

● ‘హీరా మండి’ పోస్టర్


ఛలోనా...

‘ఛలోనా..’ (పద) అంటూ షారుక్ ఖాన్, నయనతార ప్రేమ పాట పాడుకోనున్నారు. షారుక్ ఖాన్ టైటిల్ రోల్‌లో నయనతార కథానాయికగా నటించిన చిత్రం ‘జవాన్’. ఇప్పటివరకూ ఈ చిత్రం నుంచి విడుదలైన షారుక్, నయనతార లుక్స్ యాక్షన్ సీన్స్‌కి సంబంధించినవి. అలాగే పాటల విషయానికి వస్తే.. షారుక్, ప్రియమణి, డ్యాన్సర్స్‌పై చిత్రీకరించిన మాస్ సాంగ్ ‘దుమ్మే దులిపేలా..’ ఇటీవల విడుదలైంది. సోమవారం షారుక్, నయనతారల రొమాంటిక్ సాంగ్‌ని, పోస్టర్‌ని విడుదల చేయనున్నారు. ‘ఛలోనా..’ అంటూ సాగే ఈ పాట షారుక్ కెరీర్‌లోని బెస్ట్ రొమాంటిక్ సాంగ్స్‌లో ఒకటి అవుతుందని యూనిట్ పేర్కొంది. అనిరుధ్ రవిచందర్ స్వరపరచిన ఈ పాటను ఆదిత్య ఆర్.కె., ప్రియా మాలి పాడారు. ‘ఛలోనా..’ని హిందీ, తెలుగు, తమిళంలో విడుదల చేయనున్నారు. అట్లీ దర్శకత్వంలో గౌరీ ఖాన్ నిర్మించిన ‘జవాన్’ సెప్టెంబర్ 7న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది.


● షారుక్, నయనతార

తెలుగు ప్రేక్షకులు రియల్ సినిమా లవర్స్ - సంతానం


● సురభి, సంతానం

సంతానం, సురభి ప్రధాన తారాగణంగా ఎస్. ప్రేమ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం ‘డీడీ రిటర్న్స్’. ఈ చిత్రం ఈ ఏడాది జూలై 28న విడుదలై, తమిళంలో ఘన విజయం సాధించిందని చిత్ర యూనిట్ పేర్కొంది. నిర్మాతలు ఆర్బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్‌లు కలిసి ఈ చిత్రాన్ని ‘డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా’ పేరుతో తెలుగులో ఈ నెల 18న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో సంతానం మాట్లాడుతూ– ‘‘తెలుగు ప్రేక్షకులు రియల్ సినిమా లవర్స్. ‘డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా’ ఓ రోలర్ కోస్టర్ ఫన్ రైడ్. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది’’ అన్నారు. ‘‘రాజమౌళిగారి తమిళ వెర్షన్ ‘ఈగ’ సినిమాలో సంతానంగారు ఓ కీలక పాత్ర చేశారు. ఆ సినిమాకు నేను డైలాగ్స్ రాశాను. దర్శకుడిగా ‘డీడీ రిటర్న్స్’ నా తొలి చిత్రం. ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలు ఈ సినిమాను బాగా ఎంజాయ్ చేస్తారు’’ అన్నారు ప్రేమ్ ఆనంద్. ‘‘మంచి కంటెంట్ ఉన్న డబ్బింగ్ సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారు. ఈ కోవలోనే ఈ చిత్రాన్ని ఆదరించి, విజయవంతం చేస్తారనే నమ్మకం ఉంది’’ అన్నారు ఎన్వీ ప్రసాద్.

ఎమోషనల్ థ్రిల్లర్


● జేడీ చక్రవర్తి

జేడీ చక్రవర్తి నటించి, స్వీయ దర్శకత్వం వహించిన ద్విభాషా (కన్నడ, తెలుగు) చిత్రం ‘హూ’. ఇందులో శుభరక్ష, నిత్య హీరోయిన్లు. రెడ్డమ్మ కే బాలాజీ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత ప్రసన్న కుమార్, నటుడు నాగమహేశ్‌లు కలిసి విడుదల చేశారు. నిర్మాతలు ఆచంట గోపీనాథ్, శోభారాణి, చాంబర్ వైస్ ప్రెసిడెంట్ కొల్లి రామకృష్ణ ‘హూ’ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ‘‘ఎమోషనల్ థ్రిల్లర్‌గా సాగే ఈ చిత్రంలో జేడీ చక్రవర్తి నటన వైవిధ్యంగా ఉంటుంది. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం’’ అని రెడ్డమ్మ కే బాలాజీ అన్నారు.

ఉల్టా.. పల్టా


● రూపా, సోహైల్

సయ్యద్ సోహైల్ రియాన్, రూపా కొడవాయుర్ జంటగా నటించిన చిత్రం ‘మిస్టర్ ప్రెగ్నెంట్. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వంలో అప్పిరెడ్డి, రవిరెడ్డి సజ్జల నిర్మించారు. ఈ నెల 18న ఈ చిత్రం విడుదల కానుంది. నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా నుంచి ‘ఉల్టా పల్టా..’ పాటను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వింజనంపాటి మాట్లాడుతూ – ‘‘అమ్మతనం బాధ్యతను ఒక అబ్బాయి తీసుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన నుంచి ఈ కథ రాశాను. సెన్సిటివ్ సబ్జెక్ట్ కాబట్టి జాగ్రత్తగా రూపొందించాం’’ అన్నారు. ‘‘ఈ సినిమా ఒప్పుకున్నప్పుడు నా సిస్టర్స్ ఇద్దరు ప్రెగ్నెంట్. వాళ్లను చూసి ప్రెగ్నెంట్ ఉమెన్ బాడీ లాంగ్వేజ్ నేర్చుకున్నాను’’ అన్నారు సోహైల్. ‘‘పెద్ద డిస్ట్రిబ్యూటర్స్ చూసి, మంచి సినిమా చేశారని ప్రశంసించారు’’ అన్నారు అప్పిరెడ్డి. ‘‘యూఎస్‌లో 100 స్క్రీన్స్‌లో రిలీజ్ చేస్తున్నాం’’ అన్నారు వెంకట్ అన్నపరెడ్డి. ‘‘అప్పిరెడ్డి జడ్జిమెంట్ మీద నమ్మకంతో ఈ సినిమా చేశాం’’ అన్నారు రవీందర్ రెడ్డి సజ్జల.

కొత్తవాళ్లు సక్సెస్ అవ్వాలి - శ్రీ విష్ణు


● విజయ్ రాజ్‌కుమార్, శ్రీ విష్ణు

విజయ్ రాజ్‌కుమార్, నేహా పఠాని జంటగా భరత్ మిత్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘ఏం చేస్తున్నావ్?’. నవీన్ కురవ, కిరణ్ కురవ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ విష్ణు మాట్లాడుతూ – ‘‘ఇండస్ట్రీలో కొత్తవాళ్లు విజయం సాధిస్తే నాకు సంతోషంగా ఉంటుంది. దర్శకుడు భరత్‌కు మంచి విజన్ ఉంది. ఈ సినిమా విజయం సాధించాలి’’ అన్నారు. ‘‘18–30 వయసు మధ్య ఉన్న ప్రేక్షకులకు ఈ సినిమా బాగా కనెక్ట్ అవుతుంది’’ అన్నారు భరత్ మిత్ర. ‘‘ఈ సినిమా ఫస్ట్ హాఫ్ డీసెంట్‌గా, సెకండాఫ్‌లో ఆడియన్స్ తల తిప్పుకోలేని సీన్స్ ఉంటాయి’’ అన్నారు విజయ్ రాజ్‌కుమార్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



SC హిందూ మాల/B.Tech/C.Govt. డిప్యూటీ మేనేజర్/మిధాని/95000/-PM/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-13658]

పద్మశాలి/ కట్నప్రసక్తి లేదు / M.Tech/ Govt. Asst. ఇంజనీర్/ట్రాన్స్‌కో/1Lakh. PM/ 5'11"ఎత్తు /28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-13658]

రజక/కట్నప్రసక్తి లేదు/M.Tech/ Govt. ఇంజనీర్/ఇరిగేషన్ Dept/85000/-PM/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-13658]

SC హిందూ మాదిగ/కట్న ప్రసక్తి లేదు/ B.Tech/Govt.Asst.ఇంజనీర్/జెన్‌కో/14 Lakhs. P.A/6'ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-13658]

క్రిస్టియన్ మాల/28/5'10"/B.Tech, IIT, MBA, IIM/SWE/20 Lakhs. P.A/ అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8919759359 [HA-13659]

SC మాల & క్రిస్టియన్/కట్న ప్రసక్తి లేదు /B.Tech(EEE)/Govt.A.E.E/ట్రాన్స్‌కో/14 Lakhs. P.A/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-13659]

హిందూ మాదిగ/కుల ప్రసక్తి లేదు/2వ పెళ్లి/MBBS, MD/49/ 5'7"/Govt.డాక్టర్/ 2 లక్షలు. PM వరునికి తగిన అందమైన వధువు కావలెను. Ph: 9441039962 [HA-13659]

SC మాదిగ & క్రిస్టియన్/కట్న ప్రసక్తి లేదు /B.Tech/C.Govt.బ్యాంక్ మేనేజర్/యూని యన్ బ్యాంక్/85000/-PM/ 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-13659]

SC మాదిగ /B.Tech/C.Govt. ఇన్స్‌పెక్టర్/ కస్టమ్స్ Dept/80,000/-PM/5'8" ఎత్తు /29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7032058965 [HA-13660]

SC మాల /కట్నప్రసక్తి లేదు/B.Tech/ C.Govt.కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్/80,000/- PM/5'8"ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8897389698 [HA-13660]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/B.Tech/C. Govt.ఎంప్లాయి/సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/5'9"ఎత్తు/34 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9963757612 [HA-13660]

రెడ్డి/ డైవర్సీ/2nd మ్యారేజ్/ 36/5'.4"/ ECE MS(USA) కోట్ల ప్రాపర్టీ గల పిల్లలులేని వరుడికి తగిన వధువు కావలెను. 9640667754 [189380]

59/5'.5", 15 లక్షలు ఆస్తి ఉన్న వరునికి ఉద్యోగం చేస్తున్న వధువు కావలెను. కులపట్టింపు లేదు డైరెక్ట్ నో బ్రోకర్ సెల్ నెంబర్. 9392103524 [189380]

రెడ్డి/55y/ డైవర్సీ/CNB/ AP స్టేట్ Govt. లో గ్రూప్-1 ఆఫీసర్‌గా ఉంటూ, సెలవులో UK Govt.లో ఆఫీసర్‌గా జాబ్ చేస్తూ UK PR కలిగిన వరునికి ఇండియా / అబ్రాడ్‌లో సెటిల్ అయ్యేందుకు అందమైన Rich వధువు కావలెను. Ph:6303487992, నో బ్రోకర్స్. [HA-13954]

వెలమ/40/5'6"/ MCA/బిజినెస్ / మొదటి వివాహ వరుడికి వయస్సుతో నిమిత్తం లేకుండా 1/2 వ వివాహ వధువు కావలెను. నేరుగా సంప్రదించగలరు: 9848048679 [HA-13663]

రెడ్డి Male, 33 సం॥ Fair 5'-10", M.Tech, M.S (USA) 2.5 Cr ప్రాపర్టీ Rs. 3.L / PM గల వరుడుకి వధువు కావలెను. Cont: 94932 42896 [G-787556]

★

రెడ్డి: లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం Hydలో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ట్రస్ట్ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/ విడో OK కుల, కట్న ప్రసక్తి లేదు డైరెక్ట్. Ph:7989079290 [H-189373]

అమ్మాయి కావలెను. 1వ, అన్ని కులాల కోమట్ల అబ్బాయి 35 ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 22 వేలు, M.Sc, M.Ed నల్గొండ. ఆస్తి 80 లక్షలు 9121325068 [Y-772542]

★★

MCA, LLB. చదివి న్యాయవాదిగా ప్రాక్టీస్ & బిజినెస్ చేస్తున్న 50 lakh ప్రాపర్టీ 39y/5'.8" BC కట్నం ఆసక్తిలేని విలువలుగల యువకునికి చదువుకున్న 1/2వ సంబంధం వారు సంప్ర ✆ 83175 11859 [B-1165540]

34సం॥/హిందూమాల/ఎం.టెక్ /5'.8"/Asst. Manager (U.B.I), Sal: 70k, 2వ పెండ్లి వరునికి ఉద్యోగం/వ్యాపారం చేయుచున్న వధువు కావలెను. పిల్లలు లేని 2వ సంబంధమైనను OK. డైరెక్టు(నోబ్రోకర్సు) 9247150678, 9989103416 [G-787464]

మాల క్రిస్టియన్, వయస్సు: 33 సం॥లు, H:5'7, B.Tech., సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, నెలకు లక్షరూపాయల జీతం వరుడికి సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. ✆ 77949 11019 [R-113]

మాల హిందు, వయస్సు: 35 సం॥లు, H:5'5, M.Tech., సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, నెలకు 90 వేల రూపాయల జీతం వరుడికి సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్. ✆ 77298 03512 [R-114]

అగ్నికుల క్షత్రియులు, 2nd మ్యారేజ్ వ: 52 సం॥లు, H:5'7, వైజాగ్ గవర్నమెంట్ ఎంప్లాయి నెలకు లక్ష జీతం గల వరుడికి ఏ బాధ్యత లేని కాపు, రెడ్డి, బలిజ అరేంజ్ అయిన వధువు కావలెను. ✆ 96769 82230 [R-115]

డైరెక్ట్: 40/5.5/M.Com, B.Ed./ ఓన్‌షాప్ ఉన్న వరుడికి కుల, వయస్సు, ఆస్తి ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. ఇల్లరికం అయిన OK. 85199 34926 [L-787296]

వరుడు కావలెను



కుల పట్టింపు లేదు: 39yrs/ 2వ పెళ్ళి/ Govt.ఎంప్లాయ్ 2,70,000/- (PM) బాగా స్థిరపడి కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్రదించండి: Ph:7386550413 [H-788656]

కాపు: 30yr/ కులపట్టింపు లేదు/ ఫెయిర్/ Govt ఎంప్లాయ్ 50K (PM). వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 4 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం 1st & 2nd లేట్‌మ్యారేజ్ OK) సంప్ర: 9492081515 [H-788656]

విశ్వబ్రాహ్మణ/B.Tech/Govt.Jr.Asst. /ఎలక్ట్రికల్ Dept/40,000/-PM/5'4" ఎత్తు /24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-13658]

రెడ్డి: 45yr/ కులపట్టింపులేదు/ 2nd మ్యారేజ్/ ఫెయిర్/ Govt ఎంప్లాయ్ 1 లక్ష (PM). వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 3 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 8374802603 [H-788656]

2వ పెళ్ళి: 40yrs/ Govt. ఎంప్లాయ్ 3,00,000/- (PM) కుల పట్టింపు లేదు/ బాగా స్థిరపడిన & కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం Ok) సం.ప్ర: 9502046384 [H-788656]

రెడ్డి: 53Y/ రెండవ పెళ్ళి/ విడో Govt job/ పిల్లలు లేరు/ సొంత ఇల్లులు/ రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) Ph: 7799083500, 7386660643 [H-788656]

SC మాల/B.Tech/C.Govt.బ్యాంక్ P.O/SBI/50,000/-PM / 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13659]

క్రిస్టియన్ మాల/25/5'4"/B.Tech/ Govt.A.E / ఎలక్ట్రికల్ Dept/60,000/- PM అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13659]

క్రిస్టియన్/2వ పెళ్లి/కులప్రసక్తి లేదు/B.Tech/ Govt.Jr.Asst./రెవెన్యూDept/40,000/-PM/5'4" ఎత్తు/36 సం॥ల పిల్లలు లేని ఆస్తి గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [HA-13659]

యాదవ/ఏకైక కుమార్తె/B.Tech (సివిల్)/ C.Govt.బ్యాంక్ P.O/కెనరా బ్యాంక్/45000/- PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-13659]

రెడ్డి/29/5'5"/MBBS, MD/ డాక్టర్/ గైనిక్ /Fair/చాలా అందమైన వధువుకు MD/ PGడాక్టర్/హైప్రొఫైల్ 5'8" Above వరుడు కావలెను. Ph: 9391053297 [HA-13659]

వాల్మీకి బోయ/B.Tech/C.Govt. Asst. ఇంజనీర్/ఇరిగేషన్ Dept/60,000/-PM/ 5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618579861 [HA-13660]

బ్రాహ్మణ: 25/5'4"B.Tech "28/5'3"B.Sc "30/5'4"/ MBA "27/5'3" ఇంటర్. వధువులకు వరులు కావలెను. కట్నాలు ఆశించని/ మధ్యతరగతి/ పురోహితులకు ప్రత్యేకం. వాట్సప్: 7207634758 [H-13659]

కాపు: డైవర్సీ/ 28y 5'4"/V.Fair/ B.Tech/ SWE/16 Lakhs P/A గల పిల్లలు లేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9553652167 [H-189380]

CNB: 26/5'5"/Fair/ M.Tech/ SWE/ 20 Lakhs P/A కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9848226983 [H-189380]

2వపెళ్ళి: కులప్రసక్తి లేదు/ 40yrs/MA, English P.hd/Govt లెక్చరర్ 2 లక్షలు (PM) పిల్లలు లేని తెల్లని అందమైన 30 కోట్ల ఆస్తి గల వెల్ సెటిల్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్న OK ఇల్లరికం OK) సంప్ర॥ 7396213324 [H-189380]

కాపు: 34 Govt/ Emp/ 40,000/- Partial Blend తల్లిదండ్రులు లేరు. Converted Christian, No Caste bar Christian వరుడు కావలెను. సంప్ర॥ 9059035448, 8919750035 [H-189403]

SC మాల హిందూ/B.Tech/25y/ 5'4"/ సాఫ్ట్‌వేర్ ఇన్ఫోసిస్(Hyd)/60K Per month/చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-780746]

కుల పట్టింపు లేదు/విడో/45Dept. Medical Health(DCHS)Doctor/Own Hospital/3 L PM/ సొంత Villa/25Acr ల్యాండ్/కోట్ల Property వెల్ సెటిల్ వధువుకు వరుడు కావలెను. Ph: 9550453046 [H-780746]

రెండో పెళ్లి/విడో/50y/Fair/వరంగల్, Govt Job/Own House (Rents) వెల్ సెటిల్ ఏ బాదరబందీ లేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. Ph: 8519803423 [H-780746]

వైశ్య/58y/విడో/5'4"/Govt Job/ 60,000, 2 సొంత ఇళ్లు, కారం బిజినెస్/ 1,00,000 Rs/ కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. పిల్లలు లేరు. Ph: 8885428274 [H-780746]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ A:30, Qly: డిగ్రీ బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 8143011223. [HA-13663]

మాల/25/5'4" / B.Tech / IIT, PSU Grade-II Officer 20 Lakhs P/A వధువుకి తగిన వరుడు కావలెను. No brokers. 9493285326 [HA-13663]


★

రజక / 43Yrs, Study PG, Private Job, 1 పాప, సొంత ఇల్లు గల వధువుకు (ఇల్లరికం) వరుడు కావలెను. సంప్ర॥ సెల్ : 7416946953 [Y-798251]

★★

SC, హిందు 30/5'4", MSc (Ph.D) 1st మ్యారేజ్ వధువుకు Software / Ph.D / PG / Techinical Officer వరుడుగా కావలెను. కుల, మత పట్టింపు లేదు. ఫోన్: 82084 12339 [V-1199851]

వేదికలు



శ్రీ... శ్రీ...శ్రీ.. రెడ్డి, కమ్మ, కాపు, వైశ్య, గౌడ, విశ్వబ్రాహ్మణ, మాల, మాదిగ 1వ, 2వ హై, లిడ్ & మధ్య తరగతి డాక్టర్, ఇంజనీర్, Govt. మ్యాచెస్ త్వరగా సెటిల్‌మెంట్ కొరకు సంప్ర : 9247217621 [HA-13660]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690909 [H-788938]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-780945]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులముల వారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/MBBS/PG/NRI /PVT/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS/15 సం॥ Exp. Ph: 9989140444 [HA-30213]

కావ్య మ్యారేజ్ లింక్స్ : 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్, అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును (స్త్రీలకు ఫ్రీ) Ph: 8074670989 [H-780746]

వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-13663]

కుల పట్టింపు లేదు. అన్ని కులాలవారికి 20-70 సం॥ల వరకు/1st, 2nd, విడోస్ లేట్ మ్యాచెస్ చూడబడును. స్త్రీలకు ఉచితం, జెంట్స్‌కి సర్వీస్ ఛార్జ్ ఓన్లీ. సంప్ర: 9581120134 [HA-13663]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13765]

"పెళ్లి" ఫాస్ట్ సెటిల్‌మెంట్ మా ప్రత్యేకత. Software, Doctors, Abroad, Rich, Group 1,2 వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1481]

150రో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com, Cont ✆ 94418 29644, 9849058673, 9440785888 W [B-945]

మీ జీవితాంతం తోడుంటారనుకున్న మీ జీవిత భాగస్వామి దూరమయ్యారని చింతించకండి. మళ్లీ మీ జీవితంలో వెలుగులు నింపడానికై అన్ని కులాల 1వ, 2వ వివాహ సంబంధాలకై సంప్ర॥ 8341220970 [K-1185578]

★

విశ్వబ్రాహ్మణ: వధూ-వరుల స్వయంవరం (Online) 13/ August, 23, Free Registration. Bhavani Matrimony, Hyd. Ph: 9704656103/ 9533608887 [H-424]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి. Ph: 9704656103, 9533608887 (Whatsapp) [H-370]

★★

మీకు పెళ్ళి కావాలా ! మా దగ్గర అన్ని కులాలు వారికి మొదట, రెండవ, "లేటు" పెళ్ళి సంబంధలు ఉన్నాయి. మురళీనగర్, విశాఖపట్నం. ఫోన్: 94917 52662 [V-10970]

1వ, 2వ, తోడు, ఒంటరి, రిటైర్డ్ సంబంధాలు కలవు. అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. సంప్ర : 83095 25477 [V- 797272]


ఉద్యోగుల సమాఖ్య చైర్మన్‌గా వెంకట్రామిరెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



నూతన కార్యవర్గంతో వెంకట్రామిరెడ్డి

నెహ్రూ నగర్ (గుంటూరు ఈస్ట్): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య-ఏపీ జీఈఎఫ్) రాష్ట్ర చైర్మన్‌గా కాకర్ల వెంకట్రామిరెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో ఏపీ జీఈఎఫ్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా డీపీఓ జీవీ నారాయణ రెడ్డి వ్యవహరించారు. ఫెడరేషన్ లోని సభ్యులంతా వెంకట్రామిరెడ్డిని రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గా అరవపాల్, కోశాధికారిగా సోమ రౌతు రామకృష్ణ, కన్వీనర్‌గా పాలాకి శ్రీనివాసరావు, రాష్ట్ర కో-చైర్మన్లుగా ఎల్.జమాల్‌రెడ్డి, వీఎస్ దివాకర్, చల్లా చంద్రయ్య, గిరిప్రసాద్, ఆర్.చిరంజీవిరావు, అశోక్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్లుగా శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్‌బాబా, నిఖిల్ కృష్ణ, ఎ.భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌రాజా, ఎం.ప్రసాద్ ఎంపికయ్యారు. డెప్యూటీ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, ఈసీ మెంబర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'చేపలను శాఖాహారంలో చేర్చాలి'



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న తమిళి సై

సాక్షి, చెన్నై: మనిషి శరీరానికి కావాల్సిన శక్తిని ఇచ్చే చేపలను శాఖాహారంలో చేర్చాలని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై వ్యాఖ్యానించారు. చెన్నై తరమణిలోని ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ నేతృత్వంలో జరిగిన 'సముద్ర జలరాశులు-సమాచార వ్యవస' అనే సమావేశానికి తమిళిసై హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆమె ప్రసంగిస్తూ మనిషి శరీరానికి ఎక్కువ శక్తిని చేపలు ఇస్తున్నాయని, దీనిని శాఖాహారం పరిధిలోకి తీసుకురావచ్చని సూచించారు. పశ్చిమ బెంగాల్‌లో చేపలను ఫ్లవర్ ఆఫ్ సీ గా భావిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వందకుపైగా రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం/రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని ఖుర్దా రోడ్ డివిజన్‌లో భువనేశ్వర్-మంచేశ్వర్, హరిదాస్‌పూర్-ధన్‌మండల్ సెక్షన్ పరిధిలలో మూడో లైన్ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనుల కోసం ఈ మార్గంలో ప్రయాణించే, విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే వందకు పైగా రైళ్లను ఈ నెల 14 నుంచి 30వ తేదీల మధ్య వివిధ రోజుల్లో రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం త్రిపాఠి శనివారం తెలిపారు. కొన్ని రైళ్ల గమ్యాన్ని కుదించడంతోపాటు మరికొన్ని రైళ్ల దారి మళ్లించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 14 నుంచి 20 వరకు కాకినాడ-విశాఖపట్నం-కాకినాడ (17267/17268) ఎక్స్‌ప్రెస్, రాజమండ్రి-విశాఖపట్నం-రాజమండ్రి(07466/07467) స్పెషల్ పాసింజర్, విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-గుంటూరు-విశాఖపట్నం (17240/17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను రెండు వైపులా రద్దు చేసినట్లు వివరించారు.

విజయవాడ డివిజన్‌లో...

విజయవాడ డివిజన్‌లో ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లు పూర్తిగా, కొన్ని పాక్షికంగా రద్దు చేయడంతోపాటు మరికొన్ని దారిమళ్లించినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. విజయవాడ-బిట్రగుంట (07978) రైలు ఈ నెల 13 నుంచి 19 వరకు, బిట్రగుంట-విజయవాడ (07977) రైలు ఈ నెల 14 నుంచి 20 వరకు, బిట్రగుంట-చెన్నై సెంట్రల్ (17237/17238) ఈ నెల 16 నుంచి 18 వరకు, విజయవాడ-గూడూరు (07500)రైలు ఈ నెల 16 నుంచి 20 వరకు, గూడూరు-విజయవాడ (07458) రైలు ఈ నెల 17 నుంచి 20 వరకు రద్దు చేశారు. కాగా, నర్సాపూర్-గుంటూరు (17282/17281) రైలును ఈ నెల 14 నుంచి 20 వరకు విజయవాడ-గుంటూరు మధ్య పాక్షికంగా రద్దు చేశారు. యర్నాకుళం-పాట్నా (22643) రైలును ఈ నెల 14, 15 తేదీల్లో, బెంగళూరు-గౌహతి (12509) రైలును ఈ నెల 16, 17, 18 తేదీల్లో, కోయంబత్తూర్-సిల్‌చర్ (12515) రైలును ఈ నెల 13, 20 తేదీల్లో, భావనగర్ టెర్మినల్-కాకినాడ పోర్ట్ (12756) రైలును ఈ నెల 12, 19 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం, నిడదవోలు మీదుగా దారి మళ్లించారు.



ఓటు దొంగలు.. బాబు అండ్‌కో

1,049వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: ఎన్నికలు సమీపిస్తుండడంతో బహుజనుల ఓట్లు దోచుకునేందుకు రాష్ట్రంలో బాబు అండ్ కో బ్యాచ్ అడ్డగోలుగా తిరుగుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,049వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో కరోనా విలయతాండవం చేస్తున్న సమయంలో పక్క రాష్ట్రంలో దాక్కున్న పలు పార్టీల నాయకులు ఇప్పుడు ఓట్లు వేయించుకునేందుకు బహుజనులకు వల విసురుతున్నారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదలకు ఏం చేశాడో చెప్పి ప్రజల్లోకి రావాలని లేకుంటే తరిమికొట్టడం ఖాయమని హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహుజనుల కలలు సాకారం చేస్తుంటే చంద్రబాబు, పావలాకళ్యాణ్ చూడలేక కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడ్డారు. చంద్రబాబు సుపుత్రుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, బీజేపీలోని బాబు బంధువు పురందేశ్వరి.. బాబును గద్దెనెక్కించేందుకే ఎల్లో మీడియాతో కలిసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కుల మతాలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తున్న చంద్రబాబు.. అన్ని ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించేందుకు పావులు కదుపుతున్నాడని చెప్పారు. రిలే నిరాహార దీక్షలో సమితి నాయకులు కారుమూరి పుష్పరాజు, బేతపూడి సాంబయ్య, పులి దాసు, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్స్ టెక్నాలజీతో మంచి ఉద్యోగాలు

- తెలుగు రాష్ట్రాల్లో 300కు పైగా జౌళి మిల్లులు
- జౌళి పరిశ్రమలకు నిపుణుల కొరత
- సాంకేతిక నిపుణులు ఏటా 50 మంది కూడా దొరకని వైనం
- జౌళి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- గుంటూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ ద్వారా నిపుణుల తయారీ

సాక్షి, అమరావతి: దేశంలో వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్ద ఉపాధి రంగం జౌళి పరిశ్రమ. జౌళి రంగం ప్రత్యక్షంగా, పరోక్షంగా దేశంలో 10 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తూ వేగంగా పురోగమిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జౌళి పరిశ్రమను మరింతగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నప్పటికీ నిపుణుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో 300కు పైగా జౌళి మిల్లులు ఉన్నాయి. వీటికి ఏటా వందలాది మంది నిపుణులు అవసరం. అయినా ఏడాదికి 50 మంది కూడా దొరక ట్లేదు. భవిష్యత్తులో జౌళి రంగంలో విద్య, ఉద్యోగ, పారిశ్రామిక, ఎగుమతుల విభాగాల్లో అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే గుంటూరులోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ సంస్థ జౌళి రంగ నిపుణులను తయారు చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది.



మూడున్నరేళ్ల పాలిటెక్నిక్ కోర్సు

టెక్స్‌టైల్స్ డిప్లొమా కోర్సులు చదివిన వారికి మంచి జీతభత్యాలతో ఉద్యోగాలు లభిస్తున్నాయి. సాధారణ డిప్లొమా కోర్సు మూడేళ్లు ఉంటే.. టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కోర్సు మాత్రం మూడున్నరేళ్లు ఉంటుంది. ఈ కోర్సు అభ్యసించిన వారికి స్పిన్నింగ్, వీవింగ్, కెమికల్ ప్రాసెసింగ్, టెస్టింగ్, ఆధునిక టెక్నికల్ టెక్స్‌టైల్, అపారెల్ మాన్యుఫాక్చరింగ్ వంటి విభాగాల్లో మంచి ఉద్యోగాలు వస్తాయి. కోర్సు పూర్తి చేసిన వెంటనే స్థానికంగా ప్రారంభ వేతనం కనీసం రూ.20 వేలు ఉంటుంది. ఈ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ప్రభుత్వం సైతం ఇండస్ట్రీ కనెక్ట్ విధానాన్ని అమలు చేస్తూ సిలబస్‌ను ఆధునీకరించింది. ఇందులో భాగంగా ఏడాది పాటు ప్రత్యేక పారిశ్రామిక శిక్షణనిస్తూ నెలకు రూ.7 వేల వరకు స్టైపెండ్ ఇస్తోంది. 'పూర్వ విద్యార్థుల ద్వారా ప్రేరణ సదస్సులు, క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ చివరి సెమిస్టర్ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికి సగటున మూడు సంస్థల్లో రూ.20 వేలకు పైగా జీతభత్యాలతో ఉద్యోగాలు వస్తున్నాయి. 8 నుంచి 10 ఏళ్ల అనుభవంతో కెరీర్‌లో అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చు' అని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ శాఖాధిపతి కె.మహమ్మద్ తెలిపారు. గుంటూరులోని టెక్స్‌టైల్స్ టెక్నాలజీ చదువుకున్న విద్యార్థులు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాల్లోని ప్రముఖ పరిశ్రమల్లో సుమారు రూ.3 లక్షల జీతంతో జనరల్ మేనేజర్, టెక్నికల్ మేనేజర్, మిల్ మేనేజర్, గ్రూప్ మేనేజర్ హోదాల్లో రాణిస్తుండటం విశేషం.


ఇది మంచి అవకాశం

గుంటూరులో 1986లో స్థాపించిన ఈ కాలేజీ 1997కి స్వయం ప్రతిపత్తి సాధించింది. 2023 పాలిసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ కోర్సులో చేరొచ్చు. డిప్లొమా తర్వాత బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ చేసి ప్రముఖ విద్యా సంస్థల్లోనూ అధ్యాపకులుగా, పరిశోధన సంస్థల్లో శాస్త్రవేత్తలుగా రాణించవచ్చు. ఇందులో అత్యధిక ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ అవగాహన లేమితో విద్యార్థులు నష్టపోతున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన, ప్రాక్టికల్స్, ఇండస్ట్రియల్ ట్రైనింగ్, పరిశ్రమ ప్రముఖుల ద్వారా సెమినార్స్ ద్వారా సమగ్ర శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశాలు, వివరాలకు 9848372886, 8500724006 నంబర్లను సంప్రదించవచ్చు.

– కేవీ రమణ బాబు, ప్రిన్సిపాల్, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ, గుంటూరు

ప్రాజెక్టుల జాప్యానికి బాధ్యుడు చంద్రబాబే

- 14 ఏళ్ల కాలంలో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా?
- బాబువి అవగాహన లేని అబద్ధపు మాటలు
- మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం (పాత బస్టాండ్): రాష్ట్రంలో ప్రాజెక్టుల జాప్యానికి పూర్తి బాధ్యుడు చంద్రబాబునాయుడేనని మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన సాగునీరు, వ్యవసాయం, ఇతర రంగాల అభివృద్ధిని గాలికి వదిలేసి కేవలం నాలుగేళ్ల పాలన చేసిన తమ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని హితవు పలికారు. శనివారం శ్రీకాకుళంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రాజెక్టుల వద్దకు కనీస అవగాహనతో వచ్చి ఉంటే బాగుండేదన్నారు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా అని ప్రశ్నించారు. అబద్ధాలు మాట్లాడటం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. తమ ప్రభుత్వం పాలన ప్రారంభించి కేవలం నాలుగేళ్లు మాత్రమే అయిందని.. అందులో రెండేళ్లు కరోనా కష్టకాలంలోనే గడిచిపోయిందని గుర్తు చేశారు. ఇప్పటికే వంశధార ప్రాజెక్టు 77 శాతం పూర్తయిందని, డిసెంబర్ నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. టీడీపీ హయాంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు కేవలం 23 శాతం మాత్రమే చేశారన్నారు. నేరడి బ్యారేజీ సమస్యపై ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించామని.. ఇలాంటి ప్రయత్నం చంద్రబాబు ఎప్పుడైనా చేశారా అని ధర్మాన ప్రశ్నించారు. రూ.200 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును తయారు చేసి సాగునీరు అందించడం జరుగుతోందని తెలిపారు. చంద్రబాబు నిర్వాసితులను నిర్లక్ష్యం చేస్తే, ఇటీవల వారికి రూ.200 కోట్లు మంజూరు చేసి ఆదుకున్నామని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే వంశధార నిర్వాసితులకు న్యాయం చేస్తామంటున్న చంద్రబాబునాయుడు 14 ఏళ్లు నిర్వాసితులను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. 'విధ్వంసం' అనే మాటను చంద్రబాబు ఉపసంహరించుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ హయాంలో 'నీరు-చెట్టు' పేరుతో నాయకులు దోపిడీ చేశారన్నారు. వ్యవసాయం దండగ అన్న వ్యక్తి నేడు వ్యవసాయ రంగంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టులపై ఇన్వెస్ట్‌మెంట్ దండగ అని చంద్రబాబు తన 'మనసులో మాట' పుస్తకంలో రాసుకున్నారని మంత్రి ధర్మాన ప్రసాదరావు గుర్తు చేశారు.

నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌గా చంద్రకళ



సాక్షి, అమరావతి: ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్‌లో జరిగిన సీనియర్ నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023లో విజయవాడకు చెందిన ఎక్సైజ్ పోలీస్ ఎస్.చంద్రకళ బంగారు పతకం సాధించారు. మొత్తం 550 కిలోలు బరువునెత్తి చంద్రకళ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. స్క్వాడ్‌లో 227.5 కిలోలు, బెంచ్ 130 కిలోలు, డెడ్ లిఫ్ట్ 192.5 కిలోలు ఆమె ఎత్తి సత్తా చాటారు. రైల్వే జిమ్‌లో కోచ్‌గా పనిచేస్తున్న భర్త సందీప్ ఆధ్వర్యంలోనే చంద్ర కళ శిక్షణ పొందుతున్నారు.

ఐదుగురు పోలీసు అధికారులకు కేంద్ర హోం మంత్రి పతకాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపికైనవారిలో అడిషనల్ ఎస్పీ కోర్లకుంట సుప్రజ, డిప్యూటీ ఎస్పీ మల్లెల ధనుంజయుడు, డీఎస్పీ ఉప్పుటూరి రవిచంద్ర, సీఐలు గుంట్రెడ్డి అశోక్‌కుమార్, షేక్ మన్సూరుద్దీన్ ఉన్నారు. తెలంగాణ నుంచి అడిషనల్ ఎస్పీ మేకల తిరుపతన్న, డిప్యూటీ ఎస్పీలు రాజుల సత్యనారాయణరాజు, కమ్మాయిపల్లె మల్లికార్జున కిరణ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ మూల జితేందర్ రెడ్డి, అసిస్టెంట్ ఎస్పీ భూపతి శ్రీనివాసరావు ఉన్నారు.

యానాదులకు సర్కారు అండదండలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యానాదులకు ప్రభుత్వం అండదండగా నిలుస్తోంది. రాష్ట్రంలోని నెల్లూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో, ఎన్టీఆర్ జిల్లాలో అత్యధిక సంఖ్యలో యానాదులు ఉన్నారు. బతుకుదెరువు కోసం వలస జీవనానికి అలవాటు పడిన యానాదుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అయినా యానాదులను చిన్నచూపు చూస్తునారంటూ ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఖండించింది.

యానాదుల అభ్యున్నతికి ప్రభుత్వం చేపట్టిన చర్యలివీ..

వలసజీవులైన యానాదులకు ఆధార్ కార్డులు లేవని ప్రభుత్వం గుర్తించింది. దీంతో నెల్లూరు ఐటీడీఏతోపాటు ఎన్టీఆర్ జిల్లాలోనూ ప్రభుత్వం ప్రత్యేకంగా మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి ఆధార్ నమోదు చేయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తోంది. రాయితీపై వ్యవసాయ పరికరాలు, ఇన్‌పుట్ సబ్సిడీని కూడా అందిస్తోంది. ఇళ్ల స్థలాలు, ఇళ్లు కూడా మంజూరు చేసింది. యానాదులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వేలో వాస్తవం లేదని నెల్లూరు ఐటీడీఏ పీవో మందా రాణి 'సాక్షి'కి తెలిపారు. 'వాస్తవానికి నెల్లూరు ఐటీడీఏ పరిధిలో 2.5 లక్షల మంది యానాదులు ఉన్నారు. 25కు పైగా మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 31 వేల మందికిపైగా యానాదులకు ఆధార్ నమోదు చేయించాం. రేషన్ కార్డు, నవరత్నాల ద్వారా రైతు భరోసా, అమ్మ ఒడి, విద్యా దీవెన వంటి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నాం. తాగు నీరు, విద్యుత్, రహదారి సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది' అని రాణి వివరించారు.

'నయా' వంచన!

ముఖం మార్చి.. గొంతును చేర్చి.. ఏమార్చుతున్న సైబర్ కేటుగాళ్లు

- బెదిరింపులు, డబ్బు వసూళ్ల కోసం నేరగాళ్ల కొత్త ఎత్తులు
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో డీప్ ఫేక్స్ తయారీ
- మనం సోషల్ మీడియాలో పెట్టే ఫొటోలు, వీడియోలే వాడుతూ మోసాలు
- జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న నిపుణులు



సురేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గతంలో బెంగళూరులో పనిచేసిన ఆయన ఆరు నెలల క్రితమే హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యారు. ఈ మధ్య తనకు బెంగళూరు కంపెనీలో కలసి పనిచేసిన ఉద్యోగి సుభానీ నుంచి వీడియోకాల్ వచ్చింది. "సురేశ్.. మా అన్నను ఎమర్జెన్సీ ఆపరేషన్ కోసం ఆస్పత్రికి తీసుకొచ్చాం. అర్జెంట్‌గా రూ.40వేలు కావాలి. హాస్పిటల్ వాళ్ల గూగుల్‌పే ఖాతాకు పంపు. నేను రెండు రోజుల్లో తిరిగి ఎడ్జస్ట్ చేస్తా.."అని చెప్పాడు. ఎమర్జెన్సీ కదా అని సురేశ్ వెంటనే డబ్బు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశాడు. వారం తర్వాత సుభానీకి కాల్ చేస్తే.. ఎవరో సైబర్ మోసగాడు డీప్ ఫేక్ వీడియోతో మోసం చేసినట్టు తెలిసి అవాక్కయ్యాడు.

ప్రణీత్ ఓ బిజినెస్‌మన్. తన కంపెనీలో పనిచేసే ఓ మహిళతో అతను ఏకాంతంగా గడిపినట్టు సైబర్ నేరగాళ్లు నకిలీ అశ్లీల వీడియోను సృష్టించారు. క్రియేట్ చేశారు. దాన్ని ప్రణీత్‌కు వాట్సాప్‌లో పంపి.. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే కుటుంబ సభ్యులకు, ఆఫీస్ కొలీగ్స్‌కు ఆ వీడియోలు పంపుతామని బెదిరించడం మొదలుపెట్టారు. పరువు పోతుందన్న భయంతో నేరగాళ్లకు లక్షల రూపాయలు పంపించిన ప్రణీత్.. చివరికి విసిగిపోయి సైబర్ పోలీసులను ఆశ్రయించాడు.

సాక్షి, హైదరాబాద్:



వాడే విధానాన్ని బట్టి ప్రతి వస్తువు ఆయుధంగా మారుతుంది. అగ్గిపుల్లతో ఇంట్లో దీపాన్ని వెలిగించవచ్చు, ఇంటికి నిప్పు పెట్టవచ్చన్నట్టుగానే.. మానవాళి జీవితం సుఖమయం కావడానికి అందుబాటులోకి వచ్చిన కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) కొందరి స్వార్థ ప్రయోజనాలతో వినాశకారిగా మారుతోంది. ఏఐ సృష్టిస్తున్న అద్భుతాలను అడ్డదారిలో వినియోగించుకుని.. డీప్ ఫేక్స్‌ను సృష్టించి, ఎంతో మంది జీవితాలను నాశనం చేసే స్థాయికి సైబర్ ముఠాలు తెగబడ్డాయని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. కళ్లతో చూసేదంతా, చెవులతో వినేదంతా నిజం కాకపోవచ్చన్న విషయాన్ని గ్రహించాలని స్పష్టం చేస్తున్నారు.

మనమే ఇస్తున్నాం ఇన్‌పుట్స్

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్(ట్విట్టర్) వంటి సోషల్ మీడియా ఖాతాల్లో మనం సరదాగా పంచుకునే విషయాలే సైబర్ మోసగాళ్లకు పెట్టుబడిగా మారుతున్నాయి. ఫలానా ఫొటోలో ఉన్నది మా కుటుంబంలోని ఫలానా వ్యక్తి అని, బెస్ట్ ఫ్రెండ్, ఆఫీస్ కొలీగ్స్.. ఇలా మనవారి వివరాలను, మనం ఎక్కడి వెళ్లాం, ఏం చేస్తున్నామనే విషయాలను చెప్పేస్తున్నాం. సైబర్ నేరస్తులు ఈ వివరాల ఆధారంగా ఏఐని ఉపయోగించుకుని డీప్ ఫేక్స్‌ను సృష్టిస్తున్నారు. మనకు చిక్కులు తెచ్చిపెడుతున్నారు.

డీప్ ఫేక్స్‌లో ఎన్నిరకాల మోసాలకు ఆస్కారం ఉందంటే?

ఫైనాన్షియల్ ఫ్రాడ్: మన నుంచి డబ్బులు కొట్టేసేందుకు..
ఫిషింగ్ ఎటాక్స్: మన సమాచారం చోరీ చేసేందుకు..
ఐడెంటిటీ థెఫ్ట్: మన వివరాలు, ఇతర సమాచారం తీసుకునేందుకు..
సెక్స్‌టార్షన్: న్యూడ్ వీడియోలు, అసభ్య సంభాషణలు పెట్టి బెదిరించడం
ఎక్స్‌టార్షన్: ఏదో ఒక వివాదాన్ని సృష్టించి డబ్బు కోసం బెదిరించడం..
అనాథరైజ్డ్ యాక్సెస్: మనం పనిచేసే ఆఫీస్‌లో కీలక సమాచారాన్ని కొట్టేసేందుకు డీప్‌ఫేక్స్ వాడటం..

ఈ జాగ్రత్తలు మరవొద్దు..

- ▲ మనకు తెలిసిన వ్యక్తి అయినా.. అకస్మాత్తుగా కొత్త నంబర్ నుంచి సాధారణ, వీడియో కాల్ చేసి డబ్బులు పంపాలని, అదీ ఆన్‌లైన్‌లో పంపాలని కోరుతున్నారంటే వెంటనే అప్రమత్తం కావాలి. కాల్ చేసినవారి మాటల్లో తేడా, వాయిస్‌ను గమనిస్తే అసలు వారికి, డీప్ ఫేక్‌కు తేడాను గుర్తించవచ్చు. వెంటనే మన దగ్గర ఉన్న వారి నంబర్లకు నేరుగా సంప్రదించాలి.
- ▲ ఎదుటి వ్యక్తులు ఎంత నమ్మకంగా మాట్లాడినా, ఎంత ఎమర్జెన్సీ అయినా క్రెడిట్‌కార్డు వివరాలు, ఓటీపీలు, సీవీవీ నంబర్ల వంటివి షేర్ చేయవద్దు.
- ▲ ఎదుటి వ్యక్తి వీడియోకాల్ చేసినప్పుడు అందులో మనకు తెలిసిన వ్యక్తి ముఖమే ఉన్నా.. బ్యాక్‌గ్రౌండ్‌లో ఉన్న రంగులు, వస్తువులను గమనిస్తే.. డీప్‌ఫేక్‌ను కొంత వరకు గుర్తించవచ్చు.
- ▲ సోషల్ మీడియా యాప్స్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం వంటి ఖాతాల్లో మీరు షేర్ చేసే ఫొటోలు, వీడియోలు ఎవరు చూడాలన్నది కూడా మీరు నిర్ణయించుకోవచ్చు. అలాంటి సెక్యూరిటీ ఫీచర్లను వాడుకోవాలి.
- ▲ ఈ తరహా మోసాల గురించి కుటుంబ సభ్యులు, స్నేహితులకు చెప్పి అప్రమత్తం చేయాలి.
- ▲ మనకు డీప్‌ఫేక్ మోసం గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

డీప్ ఫేక్ గణాంకాలివీ..

- ➤ రాయిటర్స్ సంస్థ అధ్యయనం ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా 2023లో దాదాపు 5 లక్షల వీడియో, ఆడియో డీప్‌ఫేక్‌లను సోషల్ మీడియాలో పంచుకున్నట్టు అంచనా.
- ➤ సీఎస్ఓ ఆన్‌లైన్ ప్రకారం.. 2019–20 మధ్య డీప్ ఫేక్ క్రియేషన్ మోడల్స్ 84శాతం పెరిగాయి.
- ➤ ఐప్రూవ్ సంస్థ నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 71 శాతం మందికి డీప్‌ఫేక్ గురించి తెలియదు.
- ➤ 43శాతం మంది రియల్ ఆడియో, వీడియోలకు డీప్‌ఫేక్ ఆడియో, వీడియోలకు మధ్య తేడా గుర్తించలేమని అంగీకరించారు.
- ➤ 95శాతం డీప్‌ఫేక్ వీడియోలు డీప్ ఫేస్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి తయారు చేస్తున్నట్టు జెమిని అడ్వైజరీ సంస్థ పేర్కొంది.

మన భయమే మోసగాళ్లకు పెట్టుబడి

సోషల్ మీడియాలో ఇష్టారీతిన ఫ్యామిలీ ఫొటోలు, వీడియోలు షేర్ చేయడం, మన వ్యక్తిగత వివరాలను పెడుతుండటంతో సైబర్ నేరగాళ్లకు పని సులువు అవుతోంది. వాటితోనే సైబర్ నేరగాళ్లు డీప్‌ఫేక్స్ చేసి మనల్ని బెదిరించేందుకు ఉపయోగిస్తున్నారు. మన భయమే మోసగాళ్లకు పెట్టుబడి. డీప్‌ఫేక్ బెదిరింపులు ఎదురైతే.. పరువు పోతుందనో, ఏదైనా సమస్య వస్తుందనో ఆందోళన చెందవద్దు. కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పాలి. పోలీసులకు ఫిర్యాదు చేయాలి. తద్వారా సమస్య నుంచి సులువుగా బయటపడొచ్చు.

– డాక్టర్ చెన్నోజు వీరేందర్, సైకాలజిస్ట్

ఈ తరహా మోసాలు పెరిగాయి

డీప్‌ఫేక్స్ మోసాలు ఈ మధ్యకాలంలో పెరిగాయి. కొత్త నంబర్ల నుంచి మనకు ఆడియో, వీడియో కాల్ చేసి ఎమర్జెన్సీగా డబ్బులు పంపాలంటే అనుమానించాలి. వారి ఒరిజినల్ నంబర్‌కు కాల్ చేసి నిర్ధారించుకోవాలి. వీడియోకాల్‌లో మాట్లాడుతున్న వ్యక్తి మాటలకు పెదాల కదలికకు తేడా ఉందా? జుట్టు రంగు, దువ్విన విధానం వంటివి ఏమైనా కొత్తగా ఉన్నాయా అన్నది పరిశీలిస్తే ఫేక్ వీడియోలను గుర్తించవచ్చు.

– శివమారుతి, ఏసీపీ, సైబర్ క్రైమ్స్, హైదరాబాద్

ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి

సైబర్ నేరగాళ్లకు మన వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు అందకుండా సోషల్ మీడియా ఖాతాల్లో ప్రైవసీ సెట్టింగ్స్‌ను మార్చుకోవాలి. ఒకవేళ సైబర్ నేరగాళ్ల చేతిలో డీప్‌ఫేక్స్ టెక్నిక్ మోసానికి గురైతే.. బెదిరిపోవద్దు. కాస్త ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం చేయవద్దు.

– డాక్టర్ ప్రసాద్ పాటిబండ్ల, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఢిల్లీ

ఎవరు పొట్టి.. పొడుగు?



ఇంట్లో, బయటా, ఆఫీసులో, మరో చోట.. ఎక్కడైనా ఎవరో ఒకరిని కలుస్తూ ఉంటాం. కొందరు మన కన్నా పొడుగ్గా ఉంటే.. మరికొందరు పొట్టిగా ఉంటుంటారు. ఇది సాధారణమే. కానీ కొన్ని ప్రాంతాల్లో వారు బాగా పొట్టిగా, మరి కొన్ని ప్రాంతాల్లో వారు బాగా పొడుగ్గా ఉంటుంటారు. వారిలో తరాలుగా వస్తున్న జన్యువులకు తోడు స్థానిక వాతావరణం, ఉష్ణోగ్రతలు, జీవన విధానం, పని పరిస్థితులు, వైద్యారోగ్య సౌకర్యాలు, పోషకాహారం వంటివి మనుషుల ఎత్తులో తేడాలకు కారణమవుతుంటాయి. ఈ నేపథ్యంలోనే ఇన్‌సైడర్ సంస్థ ప్రపంచంలో ఎత్తు తక్కువ జనాభా ఉన్న 25 దేశాలతో నివేదికను రూపొందించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆయా దేశాల ఆరోగ్యశాఖలు, వివిధ సర్వేలు, అధ్యయనాలను పరిశీలించి.. దీనిని సిద్ధం చేసింది. ఆయా దేశాల్లో బాగా పొడవుగా ఉన్న వారు కూడా ఉండొచ్చని, తాము సగటు ఎత్తును ప్రామాణికంగా తీసుకున్నామని తెలిపింది.


- ➡ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను పరిశీలిస్తే.. దక్షిణాసియా, మధ్య ఆఫ్రికా దేశాల్లో జనంఎత్తు తక్కువగా ఉన్నారని నివేదిక పేర్కొంది.
- ➡ దాదాపు అన్ని దేశాల్లో కూడా మహిళల కంటే పురుషుల ఎత్తు ఎక్కువని తెలిపింది.
- ➡ ప్రపంచంలో అత్యధికంగా నెదర్లాండ్స్ దేశస్తుల సగటు ఎత్తు 175.62 సెంటీమీటర్లు కాగా.. అమెరికాలో 172.21, చైనాలో 161.45 సెంటీమీటర్లుగా ఉంది.

పొట్టి జనాభా ఉన్న 25 దేశాలివీ..

దేశం	సగటు ఎత్తు (సెంటీమీటర్లలో)	దేశం	సగటు ఎత్తు (సెంటీమీటర్లలో)
		రువాండా	158.73
టిమోర్	155.47	ఇండియా	158.76
లావోస్	155.89	వియత్నాం	159.01
మడగాస్కర్	156.36	పెరూ	159.08
గ్వాటెమాలా	156.39	పపువా న్యూగినియా	159.21
ఫిలిప్పీన్స్	156.41	సోలోమన్ ఐలాండ్స్	159.27
నేపాల్	156.58	మొజాంబిక్	159.37
యెమెన్	156.92	భూటాన్	159.46
మార్షల్ ఐలాండ్స్	157.05	బ్రూనై	159.49
బంగ్లాదేశ్	157.29	మయన్మార్	159.52
కాంబోడియా	158.11	లైబీరియా	159.66
ఇండోనేషియా	158.17	హోండూరస్	160.11
మలావి	158.31	శ్రీలంక	160.12

శ్రీశైలంలో ఆగని విద్యుత్ ఉత్పత్తి

- సీడబ్ల్యూసీ ఆదేశాలను పట్టించుకోని తెలంగాణ



శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఆంధ్రలోని కుడిగట్టులో స్వల్పంగా.. తెలంగాణ పరిధిలోని ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. శ్రీశైలం నీళ్లపై ఆధారపడి ఉన్న ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో ఉత్పాదన నిలిపివేయాలని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఆదేశించినా ఖాతరు చేయకుండా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తోంది. కాగా, శుక్రవారం నుంచి శనివారం వరకు కుడిగట్టు కేంద్రంలో 0.192 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను, ఎడమగట్టు కేంద్రంలో 7.975 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్‌కు 15,685 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 6,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయానికి గత 4 రోజులుగా వరద ప్రవాహం నిలిచి పోయింది. మరోవైపు దిగువ ప్రాంతాలకు నీరు విడుదల అవుతుండడంతో జలాశయంలో నీటిమట్టం తగ్గిపోతుంది. ప్రస్తుతం జలాశయంలో 119.7828 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. నీటిమట్టం 864.30 అడుగులకు చేరుకుంది.

విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

- షార్ శాస్త్రవేత్త ఆర్.ప్రీతా



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): ఇస్రో తొలినాళ్లలో ఎడ్లబండి, సైకిల్‌పై శాటిలైట్, రాకెట్ పరికరాలను తీసుకువెళ్లే స్థాయి నుంచి చంద్రుడు, అంగారకుడు గ్రహాల మీద పరిశోధనలు చేసేస్థాయికి చేరడానికి నాడు విక్రమ్ సారాభాయ్ వేసిన పునాదులే కారణమని షార్ శాస్త్రవేత్త ఆర్.ప్రీతా చెప్పారు. విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకుని ఇస్రోలో చేరి దేశానికి సేవ చేయాలని సూచించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా డాక్టర్ విక్రమ్ సారాభాయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని భారత అంతరిక్షయానంపై స్థానిక గోకులకృష్ణ కళాశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రీతా మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థను స్థాపించి ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లడంలో డాక్టర్ విక్రమ్ సారాభాయ్ పాత్రను చరిత్ర మరువలేనిదని చెప్పారు. నెల రోజుల్లో సూర్యుడిపై పరిశోధనల కోసం ఆదిత్య ఎల్–1 అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ శ్రీనివాసబాబు, ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దశ'దిశ'లా రక్షణ

- మహిళలు, చిన్నారుల సమస్యలు, నేరాలకు చెక్
- 'దిశ'యాప్ ద్వారా నమోదైన కేసులు
- భార్యాభర్తల మనస్పర్థలను దూరం చేస్తున్న 'కౌన్సెలింగ్'

కడప అర్బన్: దిశ పోలీస్‌స్టేషన్‌లు మహిళలు, చిన్నారులకు దశ'దిశ'లా రక్షణ కల్పిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, చిన్నారుల పట్ల నేరాల నియంత్రణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'దిశ' పోలీస్ స్టేషన్‌లను 2020 ఫిబ్రవరి 7న ప్రారంభింపచేశారు. కడపలో అదే రోజున రాష్ట్ర డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజద్‌బాషా జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో కడప 'దిశ' పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ప్రారంభ సమయంలో డీఎస్పీ, సీఐ, నలుగురు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఏడుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు విధుల్లో చేరారు. తరువాత ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆరుగురు పని చేస్తున్నారు. తరువాత క్రమంలో ప్రస్తుతం డీఎస్పీ, సీఐ, ఐదుగురు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు, ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 21 మంది కానిస్టేబుళ్లు విధులను నిర్వహించాలని పోస్టులను కడప 'దిశ'కు మంజూరు చేశారు. ఈ మేరకు సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమిస్తే మరింత ప్రయోజనం చేకూరుతుంది.

'దిశ' పోలీస్‌స్టేషన్ ద్వారా అందిస్తున్న సేవలు

- ■ జిల్లా వ్యాప్తంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు (మహిళా పోలీస్) ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో విధులను, పనితీరును, నేరాల నియంత్రణను ప్రతి రోజూ దిశ డీఎస్పీ ద్వారా 'దిశ టాస్క్ ట్రాకర్' ద్వారా తెలుసుకుంటున్నారు.
- ■ జిల్లాలో మహిళలు, చిన్నారుల నేరాల నియంత్రణ కోసం 'దిశ'యాప్‌ను 16 లక్షల మేరకు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 'దిశ'యాప్ రిజిస్ట్రేషన్‌లను 5,02,981 మంది చేసుకున్నారు.
- ■ భార్యాభర్తల మధ్య మనస్పర్థలను 'కౌన్సెలింగ్' ద్వారా దూరం చేసేందుకు కడపలో 'దిశ' పోలీస్‌స్టేషన్‌కు నేరుగా గానీ, ట్రిపుల్ సీ ద్వారా గానీ వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.
- ■ కడప 'దిశ' పోలీస్‌స్టేషన్‌లో 2021లో 1195 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని పరిష్కరించారు. 2022లో 1369 ఫిర్యాదులను పరిష్కరించారు. 2023లో జూలై చివరి వరకు 700 ఫిర్యాదులు రాగా వాటిల్లో 698 ఫిర్యాదులను పరిష్కరించారు.
- ■ జిల్లాలో మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసులను కూడా పరిష్కరిస్తున్నారు. జిల్లాలో 277 మిస్సింగ్ కేసులు ఈ ఏడాది నమోదు కాగా, వాటిలో 265 కేసులను ఛేదించారు. ఇంకా 13 కేసులను పరిష్కరించాల్సి వుంది.
- ■ ప్రతి మంగళ, శనివారాల్లో కడప 'దిశ' పోలీస్‌స్టేషన్‌లో భార్యాభర్తల మనస్పర్థలను దూరం చేసేందుకు గాను, పోలీసు సిబ్బందితోపాటు, ఒన్‌స్టాప్ (సఖి) సెంటర్ ద్వారా సిబ్బంది వచ్చి 'కౌన్సెలింగ్'ను నిర్వహిస్తారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా భార్యాభర్తలు కలవకపోతే చట్టపరిధిలో కేసులను నమోదు చేసుకోవడం, కోర్టు ద్వారా వారికి పరిష్కార మార్గాలను సూచిస్తారు.
- ■ కడపకు చెందిన ఓ జంటకు 'దిశ' పోలీస్‌స్టేషన్‌లో రెండు సార్లు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. భర్త తన తల్లికి వచ్చే పింఛన్ మీద ఆధారపడి, భార్యను మాటలతో వేధించేవాడు.

పంద్రాగస్టు వేడుకలకు వాల్తేరు కేవీ టీచర్లకు ఆహ్వానం


మిట్టపల్లి రేఖ


ద్వారం త్యాగరాజు

సాక్షి, అమరావతి: న్యూఢిల్లీలో ఈ ఏడాది జరిగే పంద్రాగస్టు వేడుకలకు విశాఖపట్నంలోని వాల్తేరు కేంద్రీయ విద్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు హాజరుకానున్నారు. సంగీతం ఉపాధ్యాయుడు ద్వారం త్యాగరాజు, మిట్టపల్లి రేఖలకు ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దిన సంబరాల్లో పాల్గొనాలని కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఆహ్వానం పంపించింది. ఈ వేడుకలతో పాటు వీరు ఇతర ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లోను పాల్గొననున్నారు. దేశ వ్యాప్తంగా అన్ని కేంద్రీయ విద్యాలయాల నుంచి 25 మంది ఉపాధ్యాయులకు మాత్రమే కేంద్రం ఈ అవకాశం కల్పించగా, రాష్ట్రం నుంచి త్యాగరాజు, రేఖ ఉండడం విశేషం.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం : 13 : ఆగస్టు : 2023

ఓంశక్తి పాహిమాం


మహిళలు జ్యోతులు మోస్తున్న దృశ్యం

చింతామణి: దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చింతామణిలో ఓంశక్తి మాల ధరించిన మహిళలు అమ్మవారికి ఘనంగా గంజి పూజలు నిర్వహించారు. శనివారం జ్యోతులు ఎత్తుకుని ఊరేగింపుగా ప్రముఖ వీధుల గుండా ఓంశక్తి అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ప్రాణం తీసిన సెల్ఫీ పిచ్చి?

- నదిలో పడి యువకుడు గల్లంతు


గాలింపు జరుపుతున్న దృశ్యం

శివమొగ్గ: సెల్ఫీ పిచ్చి ప్రాణాలు తీసేస్తున్నా యువతలో మార్పు రావడం లేదు. తాజాగా శివమొగ్గ తాలూకా గాజనూరులోని తుంగా జలాశయం పవర్ హౌజ్ వద్ద సెల్ఫీ తీసుకుంటూ ఓ యువకుడు జారి నీటిలో పడిగల్లంతయ్యాడు. ఈ ఘటన శనివారం వెలుగుచూసింది. వివరాలు...మిళఘట్ట లేఔట్‌కు చెందిన హరీష్ (26) శుక్రవారం సాయంత్రం సెల్ఫీ తీసుకోవడానికి పవర్‌హౌజ్ వద్దకు వెళ్లాడు. అంచుకు వెళ్లి తీసుకుందామని అనుకున్నాడు. అంతలోనే కాలు జారి నదిలో పడిపోయాడు. తుంగా నగర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అతని కోసం అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు.

కాంట్రాక్టు టీచరుకు హెచ్‌ఎం వేధింపులు


పాఠశాల ముందు దళిత సంఘం ధర్నా

గౌరిబిదనూరు: తాలూకాలోని దారినాయకనపాళ్య (డి పాళ్య) గ్రామంలోని ప్రభుత్వ కర్ణాటక పబ్లిక్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడైన రాజేశ్ కాంట్రాక్టు టీచర్‌ను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని, అతని మాటలు వినకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తానని బెదిరిస్తున్నాడని దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఆమెను వేధించడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని సమితి నేతలు ఆరోపించారు. ఇది తెలిసి తాలూకా విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి అక్కడకు చేరుకుని నిరసనకారులతో చర్చించారు. హెచ్‌ఎం పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు వినతి పత్రమిచ్చారు. సర్వశిక్షా అభియాన్ అధికారి గంగారెడ్డి పాల్గొన్నారు.

ఏదైనా జరిగితే ఎవరిది బాధ్యత?


ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న మహిళ

యశవంతపుర: బిడ్డను ఒళ్లో కూర్చొ బెట్టుకుని ఓ మహిళ ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డుపై వెళ్తున్న వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. శుక్రవారం గదగ నుంచి నగరంలోని జిల్లా ఆస్పత్రికి తిరిగే బస్సులో ఈ దృశ్యం కనిపించింది. బస్సు పూర్తిగా ప్రయాణికులతో నిండిపోయిన కారణంగా తన బిడ్డను తీసుకుని ఆస్పత్రికి వెళ్లవలసి ఉండగా ధైర్యంగా ఆమె ఫుట్‌బోర్డుపై కూర్చుంది. చంటిబిడ్డ ఉన్న ఆమెకు ఎవరూ సీటు ఇవ్వలేదు. బస్సు పక్కన వెళ్తున్న వ్యక్తులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.

నిప్పు వెనుక నిజాలేమిటి?

- దర్యాప్తునకు 3 బృందాల ఏర్పాటు
- మిస్టరీగా బెంగళూరు పాలికె క్వాలిటీ కంట్రోల్‌లో అగ్నిప్రమాదం

శివాజీనగర: బెంగళూరులో అనేక పనుల నాణ్యతపై ఆరోపణలు సాగుతుండగా, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు విచారణల మీద విచారణలు జరిపిస్తోంది. కాంట్రాక్టర్లు ఏమో తమకు బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పనులు చేయకుండానే అందరూ కుమ్మక్కై నిధులు మింగేశారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో బీబీఎంపీ ప్రధాన కార్యాలయం ఆవరణలోని క్వాలిటీ కంట్రోల్‌లో ఎన్నడూ లేని రీతిలో శుక్రవారం భారీఎత్తున జరిగిన అగ్ని ప్రమాదం తీవ్ర చర్చకు కారణమైంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం మూడు బృందాల ద్వారా ప్రత్యేక విచారణ జరిపించాలని నిర్ణయించింది. శనివారం ఉదయమే ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి విచారణకు తరలించారు.

ఇద్దరు ఇంజినీర్లు, ఉద్యోగి అరెస్టు

ముఖ్యంగా నకిలీ బిల్లుల ద్వారా బీబీఎంపీ నిధులు స్వాహా చేసిన అధికారులు, ఉద్యోగులే క్వాలిటీ కంట్రోల్ ప్రయోగాలయంలో సంభవించిన అగ్ని ప్రమాదం వెనుక ఉన్నారనే అనుమానం సర్వత్రా వినిపిస్తోంది. పూర్తి వాస్తవాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీబీఎంపీ అధికారులు, పోలీసులతో కలిసి మూడు బృందాలతో విచారణకు ఆదేశించింది. అగ్ని ప్రమాదంపై బీబీఎంపీ చీఫ్ ఇంజినీర్ కే.ప్రహ్లాద్ హలసూరు గేట్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా ఐపీసీ సెక్షన్ 337, 338 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఉన్న ఇద్దరు పాలికె ఇంజినీర్లు, ఒక డీ గ్రూప్ ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ ముగ్గురు ల్యాబ్‌కు ఎందుకు వెళ్లారు, ప్రమాదం జరిగిన వెంటనే ఎందుకు పరిగెత్తి వచ్చారు అనేది అనుమానాస్పదంగా మారింది.


ఘటనాస్థలిలో పోలీసుల తనిఖీలు



దుండగులకు శిక్ష తప్పదన్న హస్తం

బీబీఎంపీ కార్యాయంలో అగ్ని ప్రమాదంపై అధికార కాంగ్రెస్ బీజేపీ మీద మండిపడింది. బీబీఎంపీ పనుల నాణ్యతను తనిఖీ చేసే ల్యాబ్‌లో అగ్గి పడడం ఆకస్మికం కాదు, కుట్ర అని రాష్ట్ర కాంగ్రెస్ ట్వీట్ చేసింది. దీని వెనుక ఉన్న దుండగులను కనిపెట్టి సంకెళ్లు వేయడం తప్పదని హెచ్చరించింది. బీజేపీ ప్రభుత్వ అవధిలో జరిగిన 40 శాతం కమీషన్ అక్రమాలపై విచారణ జరుగుతున్నప్పుడే ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి, దీనివెనుక బీజేపీ వారు ఉండవచ్చనే అనుమానాన్ని పరోక్షంగా కాంగ్రెస్ వ్యక్తం చేసింది. గతంలో బీజేపీ హయాంలో పాలికెలో జరిగిన అగ్నిప్రమాదానికి కారణమైన వారే ఈ సాహసం చేసి ఉండవచ్చని కాంగ్రెస్ ఆరోపించింది. నిప్పు పెట్టిన దుండగులను, 40 శాతం కమీషన్‌దారులను జైలుకు పంపడం తథ్యమని పేర్కొంది.


కాలిన గాయాలతో ఓ ఇంజినీరు

ఏఇఇ ఆడియో లీక్

అగ్ని ప్రమాదం పలు సంశయాలకు కారణమవుతున్న నేపథ్యంలో కార్పొరేషన్ ఏఇఇ ఆనంద్ మాట్లాడిన ఆడియో ఒకటి కుతూహలానికి కారణమైంది. ఆయన మరో అధికారి అమృత్‌రాజ్‌తో మాట్లాడిన కొన్ని వివరాలు వైరల్‌గా మారాయి.

ఆస్పత్రిలో బాధితులు

ప్రమాదంలో కాలిన గాయాలైన చీఫ్ ఇంజినీర్ శివకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కిరణ్, సంతోష్, విజయమాల, అసిస్టెంట్ ఈఈ శ్రీధర్, క్లర్కు సిరాజ్, కంప్యూటర్ ఆపరేటర్లు జ్యోతి, మనోజ్, కన్సల్టెంట్ శ్రీనివాస్‌లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మహిళా ఉద్యోగులు త్వరగా బయటకు పరిగెత్తలేకపోవటంతో వారికి ఎక్కువగా గాయాలయ్యాయి.

ట్రాక్టర్- బొలెరో ఢీ, ఆరుగురికి గాయాలు



కృష్ణరాజపురం: బెంగళూరు రూరల్‌లోని హోసకోటెలోని హోసకోటె-కోలారు జాతీయ రహదారిపై తావరెకెరె వంతెన మీద ట్రాక్టర్, బొలెరో జీప్ ఢీకొన్న ప్రమాదంలో పలువురు రైతులు గాయపడ్డారు. స్థానిక రైతులు పొలాలకు ఎరువులు తీసుకు రావడం కోసం ట్రాక్టర్‌లో వెళుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన బొలెరో జీపు ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ పల్టీ కొట్టగా అందులో కూర్చున్న ఆరు మంది రైతులకు తీవ్ర గాయాలు తగిలాయి. స్థానికులు వారిని హోసకోటెలోని ఒక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గంటలకొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

మేల్ నర్స్ దుర్మరణం


క్యాంటర్‌ను ఢీకొన్న అంబులెన్సు, మృతి చెందిన విశ్వనాథ్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: అంబులెన్స్, క్యాంటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో మేల్‌నర్సు మృతి చెందిన సంఘటన దావణగెరె జిల్లా న్యామతి తాలూకాలో చోటుచేసుకుంది. జమఖండికి చెందిన మేల్‌నర్స్ విశ్వనాథ్ (30) మృతి చెందాడు. మృతుడు మూడు సంవత్సరాలుగా శికారిపుర ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి శివమొగ్గలోని ఆస్పత్రిలో రోగిని అడ్మిట్ చేసి అంబులెన్స్‌లో తిరిగి వస్తుండగా న్యామతి తాలూకా సవళంగ-శికారిపుర మార్గంలో ముందు వెళ్తున్న క్యాంటర్‌ను అంబులెన్స్ వెనుక నుండి వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విశ్వనాథ్‌ను ఆస్పత్రిలో చేర్చినప్పటికీ చికిత్స ఫలించక మృతి చెందాడు. ప్రమాదంలో క్యాంటర్, అంబులెన్స్ డ్రైవర్లు ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను శివమొగ్గ మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు.

తల్లి చిరుత పట్టివేత

మైసూరు: మైసూరు జిల్లాలోని టి.నరిసిపుర తాలూకాలోని గుడ్డదకొప్పలు గ్రామంలో చిరుతపులి బోనులోకి చిక్కింది. గ్రామ శివార్లలో దొరెస్వామి అనే రైతు చెరుకుతోటలో ఉంచిన బోనులో చిరుత పడింది. శుక్రవారం ఉదయం ఇదే తోటలో రెండు చిరుత పిల్లలు కనిపించడంతో అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. తల్లి కోసం బోను పెట్టారు. శనివారం ఉదయం తల్లి చిరుత అందులోకి పడింది. అటవీ సిబ్బంది వచ్చి తల్లీ, పిల్ల చిరుతలను అడవిలోకి తరలించారు.

జూదగాడు కిడ్నాప్, రూ.15 లక్షలు బదిలీ

దొడ్డబళ్లాపురం: అతనికి జూదంలో లక్షల రూపాయలు గెలుచుకున్న ఆనందం ఎంతోకాలం నిలవలేదు. గోవాలో క్యాసినోలో ఆడి రూ. 25 లక్షలు గెలిచిన టీకొట్టు వ్యాపారిని కిడ్నాప్ చేసిన పరిచయస్తులు అతని నుంచి రూ.15 లక్షలు లాక్కున్న సంఘటన బెంగళూరు హనుమంతనగర పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. శ్రీనగర్ నివాసి తిలక్ మణికంఠ (32)బాధితుడు. టీ షాపు నడిపే తిలక్ ఎలాగైనా గోవాలో జూదమాడి భారీగా సంపాదించాలని జూలై 30న రూ.4 లక్షలు తీసుకుని స్నేహితులతో కలిసి వెళ్లాడు. అక్కడ క్యాసినోలో ఆడి అదృష్టం కొద్దీ రూ.25 లక్షలు గెలుచుకుని వచ్చాడు. స్థానికంగా కుటుంబ సభ్యులకు, పరిచయస్తులకు చెప్పుకుని సంబరపడ్డాడు.

కారులో ఎత్తుకెళ్లి..

ఇలా ఉండగా ఆగస్టు 5వ తేదీన కారులో వచ్చిన 5 మంది పరిచయస్తులు తిలక్‌ను కిడ్నాప్ చేసారు. జ్ఞానభారతి యూనివర్సిటీ వద్ద నిర్జన ప్రదేశానికి తీసికెళ్లి అతని బ్యాంకు అకౌంట్ నుంచి రూ.15 లక్షలు తమ బ్యాంకు అకౌంట్లలోకి మార్చుకున్నారు. నెలమంగల దగ్గర ఒక రిసార్ట్‌కు తీసికెళ్లి అక్కడ ఒక గదిలో నిర్బంధించి తమతో పేకాటలో ఓడిపోయినందుకు రూ.15 లక్షలు బదిలీ చేసినట్లు వీడియో తీసుకుని బెంగళూరులో వదిలి పరారయ్యారు. బాధితుడు హనుమంతనగర పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.



న్యాయవాదుల భద్రతకు చట్టం



మైసూరులో వకీళ్ల సమ్మేళనంలో సీఎం తదితరులు


పాల్గొన్న న్యాయవాదుల

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే: సీఎం సిద్దు హామీ

మైసూరు: వచ్చే శాసనసభ సమావేశాల్లో న్యాయవాదుల భద్రతకు చట్టం చేసి ఆమోదిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. శనివారం మైసూరు నగరంలో కర్ణాటక రాష్ట్ర న్యాయవాదుల పరిషత్ ఏర్పాటుచేసిన 2 రోజుల న్యాయవాదుల సమ్మేళనాన్ని సీఎం ప్రారంభించారు. సీఎం ప్రసంగిస్తూ ఇంతకుముందు అధికారంలో ఉన్న ప్రభుత్వం న్యాయవాదుల చట్టం ముసాయిదాను సిద్ధం చేసిందని, న్యాయవాదుల సంరక్షణ చట్టం కోసం తాను గతంలో బెళగావి అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడానని చెప్పారు. ఈ బిల్లును మొదట శాసనసభలో పాస్ చేసి అమలులోకి తెస్తామని హామీ ఇచ్చారు. నేను కూడా లాయర్‌గా పనిచేశానని, మీ ఇబ్బందులు ఏమిటో తెలుసని అన్నారు.

చిన్నకులాలవారు లాయర్లు కారాదనేవారు

మా ఊరుకు చెందిన అగ్రవర్ణాలవారు కురుబలు లాయర్ కాకుడదని మా నాన్నకు చెప్పారు, మా నాన్న నాకు చెప్పారు, వారి మాట విని ఉంటే తాను వకీల్ అయ్యేవాడిని కాదని సిద్దరామయ్య అన్నారు. వెనుకటికాలంలో కింది కులాలవారు న్యాయవాదులు కాకూడదని చెప్పేవారన్నారు. మా ఊరిలో చిన్నప్పయ్య అనే శాన్‌భోగ్ కూడా మా నాన్నకు ఇదే నూరిపోశారు, నేను మాత్రం లెక్కచేయకుండా న్యాయశాస్త్రం చదివి లాయరయ్యాను అని తెలిపారు. నా పుట్టినరోజు ఏమిటో నాకే తెలియదు, అందుకే పుట్టినరోజును జరుపుకొనే ఆసక్తి లేదని సీఎం అన్నారు. నా పుట్టిన రోజు ఆగస్టు 3 అని పాఠశాలలో ఉపాధ్యాయుడు, 12 అని మా నాన్న రాయించారు. ఈ రెండింటిలో ఏది కరెక్టో నాకు తెలియదు అని చమత్కరించారు. ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి న్యాయవాదులు తరలివచ్చారు.

మదిదోచే జ్యువెల్స్ షో


పలు రకాల ఆభరణాలతో మహిళలు



సాక్షి, బెంగళూరు: వర మహాలక్ష్మి పండుగను పురస్కరించుకుని ఉద్యాననగరి వాసుల కోసం ఏర్పాటు చేసిన ప్రముఖ ఆభరణాల ప్రదర్శన ఏసియా జ్యువెల్స్ షో ఆదివారం సాయంత్రంతో ముగియనుంది. బెంగళూరులోని ది రిట్జ్ కార్లటన్ హోటల్‌లో శుక్రవారం నుంచి 48వ ఎడిషన్ ప్రదర్శన ప్రారంభమైంది. దేశంలోని నలుమూలల లభించే ఆభరణాల వ్యాపారులు ఈ ప్రదర్శనలో తమ స్టాళ్లను ఏర్పాటు చేశారు. వైవిధ్యభరితమైన స్వర్ణాభరణాలను మహిళలను అలరిస్తున్నాయి. ప్రత్యేక డిస్కౌంట్లు, ఆఫర్లతో ఆభరణాలను ఈ షోలో విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొందరు వ్యాపారులు మేకింగ్ చార్జీలను కూడా వసూలు చేయడం లేదని చెప్పారు.

వాట్సాప్ స్టేటస్‌తో నిరసన

- మహిళా పోలీస్ సస్పెండ్



దొడ్డబళ్లాపురం: అధికార పార్టీ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వాట్సాప్‌లో స్టేటస్ పెట్టిన మహిళా కానిస్టేబుల్ సస్పెండ్ అయిన సంఘటన చిక్కమగళూరు జిల్లా కడూరులో జరిగింది. కడూరు ఎమ్మెల్యే ఆనంద్‌కు వ్యతిరేకంగా కానిస్టేబుల్ లత.. నాకు ఏం జరిగినా ఎమ్మెల్యేదే బాధ్యత. ఎమ్మెల్యేకు నా ధిక్కారం.. అంటూ స్టేటస్ పెట్టింది. కొందరు స్క్రీన్ షాట్లు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో చిక్కమగళూరు ఎస్పీ ఉమా ప్రశాంత్ దృష్టికెళ్లింది. క్రమశిక్షణ చర్యల కింద లతను సస్పెండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు హెల్మెట్ లేకుండా బైక్ ర్యాలీ చేస్తుండగా లత వారికి జరిమానా విధించింది. దీనిపై ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ ఆమెతో వాగ్వాదానికి దిగారు. తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే ఆనంద్ కానిస్టేబుల్ లతను కడూరు నుంచి తరీకెరెకు బదిలీ చేయించారు. ఇలా ఇద్దరి మధ్య విభేదాలున్నాయి. తన బదిలీకి సంబంధించి లత ఎస్పైతో కూడా గొడవపడింది.

గూండాచట్టం కింద క్రిమినల్ అరెస్ట్

శివాజీనగర: అక్రమాలు, బెదిరింపులు తదితర కారణాలతో పునీత్ కుమార్ అనే యువకుడిని సీసీబీ పోలీసులు గుండాచట్టం కింద అరెస్ట్ చేశారు. హాసన్‌కు చెందిన పునీత్ బెంగళూరు, మండ్య జిల్లాల్లో నేర కార్యకలాపాలకు పాల్పడ్డాడు. జాతీయ రక్షణ దళం అనే అనధికారిక సంస్థ పేరుతో మత ఘర్షణలు, చట్ట విరుద్ధ కార్యకలాపాలు సాగిస్తున్నాడు. సీసీబీ పోలీసులు గత పదేళ్లల్లో ఇతనిపై ఉన్న అన్ని క్రిమినల్ కేసుల రికార్డులను సేకరించి గుండాయాక్ట్ కింద అరెస్ట్ చేయాలని ప్రతిపాదనలు చేశారు. సీసీబీ ప్రతిపాదనలపై సమీక్షించిన పోలీసు ఉన్నతాధికారులు వెంటనే పునీత్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశించారు. దీంతో వెంటనే అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

పెళ్లికి పెద్దలు నో.. ప్రేమజంట ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: ప్రేమ వివాహానికి పెద్దలు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ప్రేమికులు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామనగర తాలూకా కుంబాపుర గేట్ వద్ద చోటుచేసుకుంది. రామనగర పట్టణానికి చెందిన నవ్య (19), హర్షవర్ధన్ (20)ఆత్మహత్య చేసుకున్న ప్రేమికులు. ఇరువురూ కొంతకాలంగా ప్రేమలో పడ్డారు. అయితే వీరి వివాహానికి పెద్దలు ససేమిరా అనడంతో ఆవేదనకు లోనయ్యారు. ఇద్దరూ కలిసే చనిపోవాలని నిర్ణయించుకుని బైక్‌పై కుంబాపుర గేట్ వద్ద ఉన్న రైలు పట్టాల వద్దకు వచ్చి ఇరువురూ రైలుకింద పడ్డారు. స్థానికులు కొందరు మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారమివ్వగా వారు వచ్చి పరిశీలించి శవాలను ఆస్పత్రికి తరలించారు. చెన్నపట్టణ రైల్వే పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు. ఈ ఘోరంతో రెండు కుటుంబాల్లో విషాదం అలముకొంది.

నిశ్చితార్థం చేశారు.. పెళ్లి మరిచారు

- మేనమామ కుటుంబం విడ్డూరం
- తాడిపత్రి వద్ద బళ్లారి యువతి ఆత్మహత్యాయత్నం

యాడికి: తన మేనమామ కుమారునితో నిశ్చితార్థమైంది, కానీ ఏడాది గడిచినా పెళ్లిని వాయిదా వేస్తుండడంతో ఆవేదన చెందిన యువతి ఆత్మహత్య చేసుకోవాలని రైలు పట్టాలపై వెళ్తుండగా స్థానికులు అడ్డుకుని కాపాడారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా తాడిపత్రి దగ్గర రాయలచెరువు గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. రాయలచెరువుకి చెందిన నారాయణ 3వ కుమారుడు చరణ్‌కి- బళ్లారికి చెందిన మేనమామ కూతురు భవితతో ఏడాది క్రితం పెద్దలు నిశ్చితార్థం చేశారు. రెండవ కుమారుని పెళ్లయిన తర్వాతనే చరణ్ వివాహం చేస్తానని అతని తల్లిదండ్రులు చెబుతూ వచ్చారు. శనివారం ఉదయం భవిత తల్లితో కలిసి బళ్లారి నుంచి రాయలచెరువుకు వచ్చి త్వరగా పెళ్లి చేసుకోవాలని చరణ్‌ను అడిగింది. మా అన్న పెళ్లి తర్వాతనే మన పెళ్లి అని అతడు కరాఖండిగా చెప్పాడు, వీలైతే వచ్చే సంవత్సరం మాఘ మాసంలో వివాహం చేసుకుంటానని చెప్పాడు.

ఎస్‌ఐ, నేతల బాసట

దీంతో విసుగు చెందిన భవిత విలపిస్తూ వెళ్లిపోయింది. తాడిపత్రి రహదారిలో గల రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాల వద్ద సంచరిస్తుండటంతో చూసిన గ్రామస్తులు ఆమెను పట్టుకుని అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ గురు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి చరణ్ కుటుంబాన్ని పిలిపించారు. ఈ ఏడాది నవంబర్‌లో భవితను వివాహం చేసుకోవాలని గట్టిగా సూచించారు. సమస్య వస్తే పరిష్కరిస్తామని భవితకు హామీ ఇవ్వడంతో తల్లీకూతురు ఊరట చెందారు.


రాయలచెరువు రైల్వే పట్టాల వద్ద ఏడుస్తున్న భవిత



శనివారం బెంగళూరు లాల్‌బాగ్‌లో స్వాతంత్ర్య ఫల పుష్ప ప్రదర్శనకు తరలివస్తున్న నగరవాసులు. వీకెండ్ కావడంతో రద్దీ పెరిగింది. పూల రాశి వద్ద చిన్నారుల ఉత్సాహం

మృత్యుపాశమైన వాటర్ హీటర్

- షాక్ కొట్టి అవ్వాతాత, మనవరాలు మృతి


దంపతులు ఈరప్ప, శాంతవ్వ (ఫైల్)

సాక్షి బళ్లారి: హీటర్‌తో బకెట్లో వేడి నీళ్లు పెట్టుకోగా విద్యుదాఘాతంతో అవ్వ, తాత, మనవరాలు మృతి చెందిన ఘటన బెళగావిలో జరిగింది. శనివారం బెళగావిలోని సాహు కాలనీ 7వ క్రాస్‌లో నివాసం ఉంటున్న రామదుర్గ తాలూకా అరబెంచి తాండాకు చెందిన ఈరప్ప లామాని (52), శాంతవ్వ లామాని (50)లతో పాటు వారి మనవరాలు అన్నపూర్ణ (8) విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. హీటర్‌తో బకెట్లో వేడి నీళ్లు పెట్టుకోగా ముందుగా నీళ్లు కాగాయా లేదా అని చూడబోయి బకెట్‌లోని నీటిని తాకిన మనవరాలికి విద్యుత్ షాక్ తగిలింది. షాక్‌తో విలవిలలాడుతున్న చిన్నారిని రక్షించేందుకు అవ్వ, తాతలు ప్రయత్నించడంతో వారికీ విద్యుత్‌షాక్ తగిలి ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

మంత్రి పరామర్శ

ఈ ఘటన బెళగావిలో తీవ్ర విషాదం నింపింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ఘటనపై బెళగావి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వరుణుడి దాగుడు మూతలు

- కానరాని వాన జాడ, కరువు కోరల్లో జిల్లా
- సకాలంలో వానలు కురవక రైతన్న దిగాలు
- కేవలం 11.43 శాతం భూముల్లో మాత్రమే విత్తనం వేసిన రైతులు



వానలు కురవకపోవడంతో దిక్కుతోచని స్థితిలో దిగాలుగా ఉన్న రైతన్న

కోలారు: జిల్లాలో వరుణ దేవుడి కరుణ లేకపోవడంతో విత్తనశాతం కుంటుపడింది. ఇంతవరకు జిల్లాలో మొత్తం 1,02,590 హెక్టార్లకు గాను కేవలం 11,728 హెక్టార్లలో అంటే కేవలం 11.43 శాతం మాత్రమే విత్తనం వేశారు. ప్రతియేటా జిల్లాలో 1.01 లక్షల హెక్టార్లలో విత్తన లక్ష్యం ఉండగా కనీసం 25 శాతం కూడా విత్తనం వేయకపోవడంతో జిల్లాలో ఏర్పడిన అనావృష్టికి అద్దం పడుతోంది. జిల్లాలోని ఆరు తాలూకాల్లో ఈ యేడాది 1,02,590 హెక్టార్లలో విత్తల లక్ష్యం ఉంది. గత మూడేళ్లుగా జిల్లాలో మంచి వానలు కురుస్తున్నాయి. అయితే గత జులై నెలలో 26 శాతం వర్షం కొరత కనిపిస్తోంది. విత్తన శాతం అధికంగా వెనుకబడి ఉండడానికి ఇదే కారణం అంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు. జూలై నెల చివరివారంలో చిన్నపాటి వానలు కురిసినా అది విత్తనానికి ఎంత మాత్రం సరిపోలేదు.

అదును దాటుతుండటంతో ఆందోళన

ఇంతలో విత్తన అవధి ముగుస్తుండడంతో విత్తనాలు వేయడానికి సాధ్యం కాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు వేసే సమయంలోనే వర్షం కురవలేదు. రాగి విత్తనానికి ఇంకా కొద్ది రోజులు కాలావకాశం ఉన్నా ఇంతవరకు వానలు రాక అది సాధ్యం కాకపోవచ్చనే ఆందోళనలో రైతులు ఉన్నారు. మిగిలిన పంటల విత్తన కాలం దాటి పోయిందని, ఆగస్టు నెలలో కురిసే వర్షంపైనే విత్తన శాతం పూర్తిగా ఆధారపడి ఉందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.డి.రూపాదేవి తెలిపారు. అయితే ఆగస్టు నెలలో సగం రోజులు గడుస్తున్నా ఇంకా వర్షం ఛాయలు కనిపించకపోవడంతో ఇక ఈ యేడాది కరువు యేడాదిగా ఉండిపోవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో రాగి విత్తన లక్ష్యం 68,400 హెక్టార్లు కాగా ఇంతవరకు కేవలం 6,273 హెక్టార్లలో మాత్రం విత్తనం జరగడం ఆందోళన కలిగించే విషయం.

ఇక అనావృష్టేనని రైతుల్లో గుబులు

జిల్లాలో ఏకదళ, ద్విదళ బీజ ధాన్య పంటల్లో రాగి ప్రధాన ఆహార పంట. రాగి, అనప విత్తనానికి ఈ నెల మూడో వారం వరకు కాలావకాశం ఉంది. కందులు, అలసంద, వేరుశెనగ విత్తనం కూడా ఎంతో వెనుకబడి ఉంది. ఇది రాబోయే రోజుల్లో తీవ్ర అనావృష్టికి కారణం కాగలదని రైతులు ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో ఆహార ధాన్యాల ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. పశువులకు మేత కొరత ఏర్పడుతుందని తాలూకాలోని తొట్లి గ్రామానికి చెందిన రైతు టీవీ రమేష్ అంటున్నారు. జిల్లాలో ఈసారి అతి తక్కువగా మాలూరులో 2 శాతం విత్తనం కాగా ఎక్కువగా కేజీఎఫ్ తాలూకాలో 21.78 శాతం విత్తనం వేశారు. వర్షపాతం ఎక్కువగా కోలారులో 6.2 శాతం నమోదు కాగా, కేజీఎఫ్‌లో అతి తక్కువగా 3.9 శాతం వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

15న మారథాన్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ సీఎం యడియూరప్ప

కంప్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న జమ్మూకశ్మీర్‌లోని కార్గిల్‌లో సలాం సోల్జర్ శీర్షికన కర్ణాటక హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ న్యాయవాది, కంప్లి వాసి మోహన్ కుమార్ చేపట్టనున్న జాగృతి మారథాన్ పరుగు పోస్టర్‌ను బెంగళూరులో శనివారం మాజీ ముఖ్యమంత్రి బీఎస్.యడియూరప్ప చేతుల మీదుగా ఆవిష్కరించారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



మల్లనగౌడ (ఫైల్)

రాయచూరు రూరల్: గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన జిల్లాలోని మస్కిలో చోటు చేసుకుంది. కొప్పళ జిల్లా గంగావతి తాలూకాలోని అగోలికి చెందిన మల్లనగౌడ(34) మస్కి పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రక్తపోటు, చక్కెర వ్యాధులతో బాధపడుతున్న ఇతను శుక్రవారం రాత్రి నిద్రలో ఉండగానే మరణించినట్లు తెలిసింది.

అవినీతి మరకను తీసేయాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసవరాజ రాయరెడ్డి

గంగావతి: అవినీతికి మారుపేరుగా కర్ణాటక రాష్ట్రం తయారైందని యలబుర్గా ఎమ్మెల్యే బసవరాజరాయరెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం కొప్పళలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో 40 శాతం అవినీతికి పాల్పడిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గతంలో ఆ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తీవ్ర అవినీతి జరిగిందన్నారు. అలాగే గత ప్రభుత్వంలో మంత్రులు సైతం అవినీతికి అందలం వేశారన్నారు. రాష్ట్రానికి వచ్చిన అవినీతి చెడ్డపేరును తొలగించేందుకు కృషి చేయాలన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తనకు పోటీ చేసే ప్రసక్తే లేదని అన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ వృద్ధి




మొక్కలు నాటుతున్న దృశ్యం

రాయచూరు రూరల్: విద్యార్థులు మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపి పర్యావరణాన్ని కాపాడాలని ఉడుంగల్ ఖానాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరేష్ అన్నారు. శనివారం ఉడుంగల్ ఖానాపూర్ ప్రభుత్వ హైస్కూలులో గ్రామ పంచాయతీ, అటవీ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృక్షమహోత్సవంలో మొక్కలు నాటి మాట్లాడారు. భవిష్యత్తులో ఎండల నుంచి రక్షణకు ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్కలను పెంచి పరిసరాలను సంరక్షించాలన్నారు. డబ్బుల కోసం చెట్లను నరికివేయకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి వీరేష్, అధ్యాపకుడు దండెప్ప, అధికారులు శాంతప్ప, ఇమ్మాన్యుయేల్, అరుణ, మహేష్, పరశురాంలున్నారు.

విత్తనశుద్ధితో కంది సాగు మేలు

కంప్లి: కంది పంటను ముందుగా ప్రతి కేజీ విత్తనానికి 4 గ్రాముల ట్రైకోడర్మా విత్తనశుద్ధి చేసి నాటితే రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని వ్యవసాయ అధికారి ఎం.దేవరాజ్ తెలిపారు. తాలూకాలోని ముష్టగట్టిలో కంది పంట సాగుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాణిజ్య పంట కంది సాగుపై కొంత మంది రైతులు ఆసక్తి చూపుతున్నందున తాము పొలాల వద్దకు చేరుకొని రైతులకు పంటసాగులో మెలకువలను వివరిస్తున్నామన్నారు.

కామ్రేడ్ గద్దర్ మృతికి సంతాపం



సంతాపం వ్యక్తం చేస్తున్న సభ్యులు

రాయచూరు రూరల్: విప్లవ నాయకుడు కామ్రేడ్ గద్దర్ మృతికి జిల్లాలోని సిరవారలో సంతాపం వ్యక్తం చేశారు. శనివారం సిరవారలోని అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత మహిళా విమోచన సంఘం అధ్యక్షురాలు విజయరాణి మాట్లాడుతూ గద్దర్ మృతి దేశానికి తీరని లోటని అన్నారు.

వైద్యులు తరచు అప్‌డేట్ కావాలి



జ్యోతిని వెలిగించి వైద్య సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారి రూరల్: వైద్యులు తమ వైద్యపరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని కర్ణాటక అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ చైర్మన్ డాక్టర్ గోవిందబాబు తెలిపారు. విమ్స్ వైద్యభవన్‌లో శుక్రవారం రాత్రి అసోసియేషన్ ఆఫ్ పిజీషియన్స్ ఆఫ్ ఇండియా కర్ణాటక బ్రాంచ్, విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో కాపికాన్ పేరుతో ఏర్పాటు చేసిన సదస్సు ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. అప్పుడే కొత్త, పాత వ్యాధులకు మెరుగైన వైద్యాన్ని రోగులకు అందించవచ్చన్నారు. వైద్యవిద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవచ్చన్నారు. వైద్యకళాశాల ఆసుపత్రుల్లో విరివిగా వైద్యసదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఆన్‌లైన్ ద్వారా సదస్సును ఉద్దేశించి మాట్లాడారు. తాను విమ్స్‌లో పీజీ ముగించుకొని ఈ స్థాయిలో ఉన్నానన్నారు. విమ్స్‌లో తన గురువు డాక్టర్ టేకూరు రామనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా తన మిత్రులకు, తోటి వైద్యులకు శుభాశీస్సులు తెలిపారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ, ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణస్వామి, ఏపీఐ కార్యదర్శి డాక్టర్ విశ్వనాథ కృష్ణమూర్తి సదస్సును గురించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ బి.కె.సుందర్, డాక్టర్ కొట్రేష్ తదితర వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధిలో జిల్లాకు మొదటి స్థానం

- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి
- కేంద్రం నుంచి రూ.10 కోట్ల బహుమతి
- జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్



రాయచూరు రూరల్: మహత్తర ఆస్పిరేషన్ పథకంలో రాయచూరు జిల్లాకు సమగ్రాభివృద్ధిలో మొదటి స్థానం లభించిందని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడించిన అంశాలను వివరిస్తూ విద్య, ఆరోగ్యం, ఆర్థిక, వ్యవసాయ, ఇతర విషయాల్లో అనుకున్న లక్ష్యాన్ని సాధించినట్లు నివేదికను సమర్పించామన్నారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రూ.10 కోట్ల బహుమతిని ప్రకటించిందన్నారు. దేశంలో 112 ఆస్పిరేషన్ జిల్లాల్లో రాయచూరు ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. జూన్ నెల సమీక్షలో జిల్లా విద్య, వ్యవసాయంలో మొదటి నిలిచిందన్నారు.

భూ పరిహారం కోసం ఎదురుచూపులు

కంప్లి: విజయనగర జిల్లా హూవినహడగలి ప్రాంత రైతాంగానికి జీవనాడి అయిన సింగటాలూరు ఎత్తిపోతల పథకం ప్రారంభించి దశాబ్దం గడిచినా ప్రయోజనం శూన్యం. ఈ పథకానికి స్వాధీనం చేయనున్న భూములకు ఇంతవరకు భూ పరిహారం అందక పోవడంతో రైతులు పరిహారం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. రైతుల మనుసులు మార్చి వారి భూముల్లో కాలువను నిర్మించారు. కుడి కాలువకు సంబంధించి మొత్తం 7234 ఎకరాలను స్వాధీనం చేసుకోగా 5977 ఎకరాలకు పరిహారం అందగా, మిగిలిన 1257 ఎకరాలకు పరిహారం అందించాల్సి ఉంది. ఇకనైనా ప్రభుత్వ నీటిపారుదల శాఖ రైతుల ఆవేదనను అర్థం చేసుకొని పరిహారం అందించాలని భూములు కోల్పోయి పరిహారం అందని రైతులు కోరుతున్నారు.

వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తా


సాక్షి బళ్లారి: వచ్చే ఏడాది జరగనున్న ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు మాజీ బుడా అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నారాప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలో ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని 41 నియోజకవర్గాల్లో ఈశాన్య పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. ఈనేపథ్యంలో తాను ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నానన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పోటీ చేసి ఓడిపోయానని గుర్తు చేశారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయాలని కేపీసీసీకి దరఖాస్తు చేసుకొన్నానన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 70 వేల ఓట్లు ఉండేవని, ఈసారి లక్ష ఓట్లు దాటాయన్నారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నారా ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా తహసీల్దార్ కార్యాలయానికి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

చెలామణిలో రూ.10 నాణేలు

కోలారు: రిజర్వు బ్యాంకు ముద్రించిన రూ.10 నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని ఎలాంటి సంకోచం లేకుండా ఉపయోగించవచ్చని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ సభాంగణంలో జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. పలు చోట్ల రూ.10 నాణేన్ని ఆర్‌బీఐ నిషేధించిందని తప్పుడు వదంతులు సృష్టించారన్నారు. దీనిపై ప్రజల్లో గందరగోళం ఏర్పడిందన్నారు. అయితే ఈ విషయంలో ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దన్నారు. రూ.10 నాణేన్ని ఆర్‌బీఐ నిషేధించలేదన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సుధీర్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి గందరగోళానికి గురికావద్దన్నారు. బ్యాంకుల్లో కూడా డిపాజిట్ చేయవచ్చన్నారు. రూ.10 నాణేలను స్వీకరించకపోతే 2011 సెక్షన్ 6(1) ప్రకారం చట్ట ఉల్లంఘన అవుతుందన్నారు. రూ.10 నాణేలను ఉపయోగించడం వల్ల చిల్లర సమస్య పరిష్కారమవుతుందని అన్నారు.

అక్రమ ఇసుక, మట్కాలను అరికట్టండి

- హాస్టళల్లో సౌకర్యాలు కల్పించకుంటే అధికారులపై కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్

హొసపేటె: జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, మట్కా రాకెట్‌ను అరికట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. శనివారం హగరిబొమ్మనహళ్లి తాలూకా కేడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాలూకాలో విస్తారంగా ఇసుక రవాణా, మట్కా వ్యాపారం జరుగుతోందనే ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వీటిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు, ఆర్టీఓ అధికారులు సంయుక్తంగా పని చేసి వీటికి అడ్డుకట్టపై దృష్టి సారించాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో పడకల కొరతపై జిల్లా కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో సమాచారం ఇవ్వని అధికారులపై మంత్రి మండిపడ్డారు. హాస్టళ్లలో కొరతలు ఉంటే వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. తాను ఆకస్మికంగా పరిశీలించినప్పుడు ఏదైనా లోపం కనిపిస్తే మీపై చర్యలు తీసుకుంటానన్నారు. రేషన్‌కార్డులో పేర్లను తొలగించడంపై ఎమ్మెల్యే నేమిరాజ్‌నాయక్ నిలదీయడంతో ఆహార పౌర సరఫరాల శాఖ శిరస్తేదార్ నాగరాజును మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పేదలకు ఇబ్బంది కలిగించవద్దని, మీరు సరైన సమాచారం లేకుండా వచ్చారు. ఇక నుంచి ఇవన్నీ జరగవని తెలియజేశారు. మన ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమైన పథకాలైన అన్నభాగ్య, గృహలక్ష్మి, శక్తి, గృహజ్యోతి వంటి వాటి అమలులో ఉదాసీనత తగదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ హరిబాబు, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఫన్‌ఫేర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాట్లాడుతున్న నిర్వాహకులు విజయ్‌పాల్, మహమ్మద్ రియాజ్ తదితరులు

సాక్షి,బళ్లారి: నగరంలోని తాళూరు రోడ్డులో స్నేహ కాలనీకి ఆనుకొని ఉన్న విశాలమైన మైదానంలో హ్యాండ్‌లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ ఫన్‌ఫేర్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు విజయ్‌పాల్, మహమ్మద్ రియాజ్ పేర్కొన్నారు. శనివారం ఎగ్జిబిషన్ ప్రాంగణంలో వారు విలేకరులతో మాట్లాడారు. నగరంలో ప్రప్రథమంగా వినూత్న తరహాలో ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య ఫిష్‌టన్నెల్ అండర్ వాటర్ ఆక్వేరియంను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్ 60 రోజుల పాటు ఉంటుందన్నారు. రాజ్‌భవన్ తరహాలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన మైదానంలో ఫిష్‌ల్యాండ్ గేటు, వ్యాపార అంగళ్లు, షాపింగ్ గ్యాలరీలు, ఏర్పాటు చేశామన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన సంస్కృతి విధానాలతో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. గృహోపకరణ వస్తువులు, అలంకరణ ఆభరణాలు, పలు రకాల జ్యూవెలరీస్, డ్రస్ మెటీరియల్స్‌ను, అన్ని రకాల టెక్స్‌టైల్స్‌ను, వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన దుస్తులను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మైసూరు కాండిమెంట్స్, హోంమేడ్, ఫుట్‌వేర్, ఎక్స్‌క్లూజివ్ సిమ్లా బజ్జీలు, మౌత్ వాటరింగ్ రెస్టారెంట్ తదితర రుచికరమైన ఆహార పదార్థాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు నగర వాసులకు వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచేందుకు జెయింట్‌వీల్, ప్రిస్టీ బౌన్సింగ్, చిన్నపిల్లల కోసం వివిధ రకాలైన బంపర్ బోట్, బ్రేక్ డ్యాన్స్ తదితరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రంగనాథన్‌కు నివాళి



రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసిన ఉద్యోగులు

రాయచూరు రూరల్: నగరంలో శనివారం కర్ణాటక సంఘం భవనంలో గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహించారు. గ్రంథాలయాల వ్యవస్థాపకుడు రంగనాథన్ చిత్రపటానికి సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్ పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. జ్ఞానార్జనకు గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. దేశంలో గ్రంథాలయాలకు 1892 అగస్టు 9న తమిళనాడులోని తంజావూరు జిల్లా శియాళిలో జన్మించిన రంగనాథన్ 1924లో గ్రంద పాలకుడిగా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. నాటి నుంచి పుస్తక భండాగారాన్ని నింపిన వ్యక్తిగా కొనియాడారు. అమెరికాలోని పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో గౌరవ డాక్టరేట్ పొందిన రంగనాథన్‌కు కేంద్ర ప్రభుత్వం 1957లో పద్మశ్రీ అవార్డును ఇచ్చిందన్నారు. నాటి నుంచి గ్రంథపాలకుల దినోత్సవం ఆచరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి అర్చన, ఉపాధ్యాయులు వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరత ఏర్పడితే చెప్పండి



గోశాలను సందర్శించిన ఎమ్మెల్యే రఘుమూర్తి

చెళ్లకెరె రూరల్: నగరంలోని అచ్చనగుడి ఆలయం వద్దనున్న గోశాలను ఎమ్మెల్యే టీ.రఘుమూర్తి శనివారం సందర్శించారు. అక్కడ గోవుల ఆరోగ్య పరిస్థితి, వాటికి కావాల్సిన పశుగ్రాసం గురించి అడిగి తెలుసుకొన్నారు. గోశాలలో పశుగ్రాసం కొరత ఏర్పడితే వెంటనే సమాచారం అందిస్తే సకాలంలో గోశాలకు పశుగ్రాసాన్ని అందిస్తామన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరభద్రప్ప, నగరసభ సభ్యులు రాఘవేంద్ర, రమేష్‌గౌడ, కాంగ్రెస్ నాయకుడు చేతన్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో పడిన గేదెల వెలికితీత



కాలువలో పడిన గేదెలను రక్షిస్తున్న దృశ్యం

హొసపేటె: నగరంలోని బళ్లారి రోడ్డులోని హెచ్‌ఎల్‌సీ కాలువ గట్టుపై వెళ్తున్న గేదెలు ఆకస్మికంగా కాలు జారి ప్రవహిస్తున్న కాలువ నీటిలో పడిన ఘటన శనివారం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని కాలువలో కొట్టుకుపోతున్న గేదెలను స్థానికుల సహాయంతో ప్రాణాపాయం నుంచి రక్షించారు.

ఇన్‌స్టాలో అశ్లీల పోస్ట్..ముగ్గురి అరెస్ట్

హుబ్లీ: హుబ్లీలోని ప్రైవేటు కళాశాల విద్యార్థినుల ఫొటోలను అసభ్యకరంగా ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేసిన కేసుకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు హుబ్లీ ధార్వాడ పోలీసు కమిషనర్ రేణుకా సుకుమార్ తెలిపారు. నగరంలో ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ కేసులో ముగ్గురు నిందితులు అదే కళాశాలకు చెందిన వారన్నారు. మరొక యువకుడు, యువతి గుంపుపై ప్రతీకారం తీర్చుకోడానికి ఈ పని చేసినట్లు తెలిపారు. సదరు గ్రూపు వ్యక్తులు మరో ఇద్దరిని ఆ గ్రూపులో చేర్చుకోవడానికి ఇష్టపడటం లేదు. దీంతో ఈ కక్షతో ప్రత్యర్థి విద్యార్థినుల ఫొటోలను అసభ్యంగా వైరల్ చేస్తే వారికి బాగా తెలుసొస్తుందని ఈ పని చేసినట్లుగా నిందితులు తెలిపారన్నారు. వీరిలో కీలక నిందితుడు మాస్టర్ మైండ్ అని, సైబర్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నందు వల్ల ముగ్గురు కలిసి ఈ అకృత్యానికి పాల్పడ్డారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతుందని ఆమె తెలిపారు.

బీమా కంపెనీకి ఫోరం మొట్టికాయ

- రూ.5 లక్షలకు పైగా జరిమానా విధింపు

హుబ్లీ: బీమా క్లెయిమ్‌ను తిరస్కరించిన రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.5.32 లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ఫోరం ఆదేశాలిచ్చింది. వివరాలు..హుబ్లీ ధార్వాడ దత్తాత్రేయ కాలనీ నివాసి లక్ష్మికాంత కటవటి అనే బాధితుడు రిలయన్స్ బీమా కంపెనీ నుంచి తన యాజమాన్యంలోని హుండై కారుకు మొత్తం రూ.16,606 ప్రీమియం చెల్లించి ప్యాకేజీ పాలసీ కొనుగోలు చేశారు. పాలసీ గడువు 14.06.2021 నుంచి 13.06.2022 వరకు ఉండేది. 01.01.2022 ఫిర్యాదుదారుడి వాహనం హుబ్లీ–కార్వార రోడ్డులో ప్రమాదానికి గురై పూర్తిగా దెబ్బతింది. ఆమేరకు ఫిర్యాదుదారుడు బీమా కంపెనీకి అవసరమైన రికార్డులు సమర్పించి క్లైమ్ అర్జీ దాఖలు చేశారు. ప్రమాద సమయంలో కారులో అదనంగా ప్రయాణికులు ఉన్నందున సదరు ఫిర్యాదు పాలసీ నియమాలను ఉల్లంఘించినట్లుగా పేర్కొంటూ క్లైమ్ అర్జీని తిరస్కరించారు. అయితే సదరు చట్టం ప్రకారం సేవా లోపం జరిగిందని, కంపెనీకి వ్యతిరేకంగా తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కారు యజమాని ఫోరంను ఆశ్రయించారు. సదరు కేసును సమగ్రంగా విచారించిన కమిషన్ అధ్యక్షుడు ఈశప్ప భూతే, సభ్యులు విశాలాక్షి, ప్రభు హిరేమఠ సదరు బాధితుడు బీమా పాలసీ ఇంకా సజీవంగానే ఉందని, బీమా కంపెనీ నియమాల మేరకు బీమా సొమ్మును పాలసీదారుడికి చెల్లించడం వారి విధి అని అభిప్రాయ పడ్డారు. ఈ విషయంలో కంపెనీ విధి నిర్వహణలో విఫలమైంది. అందుకుగాను సేవా లోపానికి పాల్పడినట్లు తీర్పును ఇస్తూ రూ.4,72,500లను 8శాతం వడ్డీతో కలిపి తీర్పునిచ్చిన నెల రోజుల్లోపు చెల్లించాలని ఫోరం ఆదేశాలిచ్చింది. అలాగే ఫిర్యాదుదారుడికి కలిగిన మనోవేదన, అసౌకర్యానికి మరో రూ.50 వేల పరిహారం, రూ.10 వేలను కేసు కోర్టు ఖర్చుగా చెల్లించాలని ఆదేశాలలో జిల్లా ఫోరం పేర్కొంది.

ప్రతి ఇంటిపై జెండా ఎగరేయాలి



జెండాలతో ర్యాలీ నిర్వహించిన ఉద్యోగులు

రాయచూరు రూరల్: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరేయాలని తపాల ఉద్యోగులు పిలుపు ఇచ్చారు. శనివారం తపాలా కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వారు మాట్లాడారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో జెండాను ఎగుర వేయాలని కోరారు.

ఉపాధి కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాయచూరకర్

రాయచూరు రూరల్: విద్యార్థులు పట్టాలు పుచ్చుకొన్న అనంతరం ఉపాధి కల్పన కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని టాగూర్ స్మారక కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాయచూరకర్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పేర్లను నమోదు చేసుకుంటే సీనియారిటీ లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పండ్ల దానంతో 'అధిక' ప్రతిఫలం



భజనల్లో పాల్గొన్న భజన మండలి సభ్యులు

చెళ్లకెరె రూరల్: అధిక శ్రావణ మాసం సందర్భంగా నగరంలో జానకీ భజన మండలి సభ్యులు విశేష భక్తి పాటలు, భజనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మిక చింతకులు డాక్టర్ మాధవాచార్ మాట్లాడుతూ మూడేళ్లకు ఒకసారి వచ్చే ఈ అధిక మాసంలో 33 పండ్లు, 33 ఖర్జూరాలు దానం చేయడం వల్ల అధిక ప్రతిఫలం లభిస్తుందన్నారు. ఈ మాసంలో దేవతా ఆరాధన వల్ల అన్నీ శుభాలే కలుగుతాయన్నారు. ఈసందర్భంగా విచ్చేసిన 33 మంది మహిళా మండలి సభ్యులకు చీరలు, గాజులు, పూజా సామగ్రిని అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. భజన మండలి అధ్యక్షురాలు మాలిని ఎల్ఎన్ రావు, కార్యదర్శి వాసుకీ, రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ, రుక్మిణులకు ఏకాదశి పూజలు



అలంకరణలో దేవతా విగ్రహాలు

కంప్లి: కంప్లి, కమలాపురం మధ్యగల గుండ్లువద్దిగేరి గ్రామంలో వెలసిన శ్రీరామ దేవస్థానంలో ఏకాదశి సందర్భంగా ఆలయంలోని పాండురంగ, రుక్మిణి మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పాండురంగ, రుక్మిణిలను దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

లోకకల్యాణార్థం స్వామీజీల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న స్వామీజీలు

రాయచూరు రూరల్: లోకకల్యాణార్థం కోసం ఓ స్వామీజీ 48 రోజుల పాటు జలాధివాసం చేసి శుక్రవారం దీక్షను విరమించారు. తాలూకాలోని మలియబాద్ రామలింగేశ్వర ఆలయం కొండ గుహలో తాలూకాలోని ఉడుంగల్, ఖానాపూర్, మంగళవారపేట మఠాధిపతి బాల, శివయోగి వీర సంగమేశ్వర శివాచార్య మహాస్వామీజీ జలాధివాస తపస్సుకు స్వస్తి పలికారు. గత ఏడాది మౌనానుష్ఠానం, 48 రోజుల పాటు ఉపవాసంతో జలాధివాసం చేశారు. దేశ సుభిక్షం కోసం, లోకకల్యాణార్థం, రైతుల సంక్షోభ నివారణ కోసం నిత్యం తపస్సులో నిమగ్నులయ్యారు. జలాధివాసానికి బిచ్చాలి వీర తపస్వి వీరభద్ర శివాచార్యులు, సోమవారపేట హిరేమఠం మఠాధిపతి అభినవ రాచోటి వీరశివాచార్యులు, కిల్లే బృహన్మఠ శాంతమల్ల వీర శివాచార్యులు సహకరించారు.